# సందేశ తరంగిణి

పూజ్యశ్రీ స్వామి ఓంకార్

జననం :
21-1-1895



నిర్యాణం :
10-6-1982

ద మిషన్ ఆఫ్ పీస్

**శ్రీ శాంతి ఆశ్రమము**

**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**

తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్

ఫోన్ : 7382009962

email : srisanthiashram@gmail.com

website: www.srisantiashram.org.in

**సందేశ తరంగిణి**

పూజ్యశ్రీ స్వామి ఓంకార్

ప్రథమ ప్రచురణ 1977
ద్వితీయ ప్రచురణ 1994
తృతీయ ప్రచురణ 2017

ప్రతులు : 1000

ప్రకాశకులు
ద మిషన్ ఆఫ్ పీస్
**శ్రీ శాంతి ఆశ్రమము**
**తోటపల్లి కొండలు, వయా శంఖవరం-533 446**
తూ॥గో॥జిల్లా, ఆంధ్రప్రదేశ్
ఫోన్ : 7382009962
email : srisanthiashram@gmail.com
website: www.srisantiashram.org.in
సర్వహక్కులు ప్రకాశకులవి.
ముద్రణ :
**మోహన్ పబ్లికేషన్స్, కోటగుమ్మం, రాజమండ్రి.**

---

## కృతజ్ఞతాభి వందనములు

ఈ పుస్తక ముద్రణకు ఆర్థిక సహాయం అందించిన మాతృ ఆశ్రమవాసులు **శ్రీ కొల్లి ప్రసాద్‌గారు** మరియు ఓ అజ్ఞాత భక్తునకు భగవంతుని ఆశీస్సులతోపాటు, పరమ పూజ్యశ్రీ ఓంకారస్వామి, పూజ్యశ్రీ జ్ఞానేశ్వరి మాతాజీవారి ఆశీస్సులు లభించాలని ప్రార్థిస్తూ....

– ఆశ్రమ యాజమాన్యం

## తొలిపలుకు

"సందేశ తరంగిణి" అను ఈ గ్రంథము శ్రీ ఓంకార స్వాముల వారి ప్రవచనములలో కొన్నింటి యొక్క సంకలనము.

ఇది 1917లో శ్రీశాంతి ఆశ్రమస్థాపన జరిగినది మొదలు, నేటివరకు సాగిన ప్రతిక్షణ ఆధ్యాత్మిక జీవితానుభవము దాల్చిన అక్షర రూపమైన అమృత సరస్వతి. వేదాంత ప్రతిపాదితమైన నిత్యసత్య రూపణము.

జ్ఞానమునకు అనుభవమే అవసాన' మను శ్రీ ఆది శంకరులవారి నిర్వచనమునకు నేటికిని కన్పడు తార్కాణము.

వాచో విజ్ఞాపనము లేనట్టి శ్రీ స్వామివారి దినచర్య దాల్చిన స్వరూపము. 'ఏషాబ్రాహ్మీస్థితిః' అన్న స్థితి యొక్క దర్శనము ఈ సంకల నములో మనకు లభ్యమగును.

జిజ్ఞాసువులకు మార్గదీపకమై ఈ గ్రంథము వెలుగుగాక !

తెన్నేటి విశ్వనాథము

శ్రీశాంతి ఆశ్రమ అధ్యక్షుడు

17-11-1976

## కృతజ్ఞత

"సందేశతరంగిణి" యను ఈ అమూల్య వ్యాసములు పూజ్యశ్రీ ఓంకార స్వాములవారు ఆశ్రమ స్థాపన తరువాత వ్రాసినవి. ముఖ్యముగ వారు వాల్తేరు కైలాస పర్వతమునందు 6 సంవత్సరములు మౌనముగా నున్నపుడు వ్రాసినవి. తదుపరి వ్రాసిన వ్యాసములలో కొన్నింటిని పొందు పరచి శ్రీ శాంతి ఆశ్రమ, షష్ట్యబ్ది సందర్భమున (60 వ్యాసములతో) "సందేశ తరంగిణి" యను ఈ గ్రంథమును ప్రచురించితిమి.

ఓం ఓం ఓం

–కుమారి జ్ఞానేశ్వరి

# ఆధ్యాత్మిక జ్ఞానావబోధము

దివాకర్ల రామమూర్తి, ఎం.ఏ., విద్వాన్
ప్రిన్సిపాల్ & కరస్పాండెంట్
ఎ.వి.ఎన్. కాలేజి, విశాఖపట్నం.

శాంతి ఆశ్రమములో నిర్లిప్తతతో ప్రత్యక్షీకరించు ఓంకారస్వాములు మనకు భౌతిక స్వరూపులు. ఓంకారమక్షర బ్రహ్మము. తదక్షర బ్రహ్మమునకు వర్ణరూపము (అక్షర రూపము) ఓంకార 'సందేశ తరంగిణి.'

యోగాభ్యాసమున బ్రహ్మైకత్వబోధ సిద్ధింపదు. సాంఖ్యమున కలుగదు. కర్మాచరణమున కలుగదు. విద్యా వైదుష్యము వలనను కలుగదు. మరి బ్రహ్మాత్మైక్య జ్ఞానానుభవము వలననే కలుగును. అంతకుమించి సాధనాం తరములేదు.

విధి విహితములయిన కర్మలు చిత్తశుద్ధి కొరకు కాని వస్తూపలబ్ధి కొరకుకాదు. 'వస్తూపలబ్ధి' అనగా ప్రత్యగభిజ్ఞ బ్రహ్మోపలబ్ధి. అదియే అపరోక్ష జ్ఞానము. అట్టి వస్తుసిద్ధి తత్త్వ విచారము చేతనే కలుగును. ఈ సందేశ తరంగిణిలోని ఉపదేశరూపక తరంగము లన్నియు తత్త్వవిచారణమునకు సహకరించునవి. సమ్యగ్విచారణను పురస్కరించి సంసార భ్రాంతిని తొలగించునవి. 'బ్రహ్మసత్యము, లోకము మిథ్య' అను వాక్యముల యర్థము ప్రతివ్యాసమునను స్వవిషయ విమర్శచే ఆత్మావగాహనమునకు సులభము చేయబడినది.

పరతత్త్వము జీవాత్మ పరమాత్మల అద్వైత భావము. ఇది గురు ప్రసాదజనిత మయిన విచారమూలముగా మననాదికముల వలన దృఢబోధ కలిగియుండ వలయును. అట్టిది సిద్ధించినప్పుడు శాస్త్రపఠనము నిష్ఫలము, ఎంత చదివినను అట్టి పరమాత్మ తత్త్వము సిద్ధింపనినాడు తర్కశాస్త్రాధ్యయ నము వలనను ప్రయోజన ముండదు. జ్ఞానామృతము వలన తృప్తినొంది కృతకృత్యుడయిన వానికి తత్త్వజ్ఞానము కొరకు చేయదగిన ప్రయత్నము లేదు. చతుష్షష్టి లౌకిక విద్యలును తత్త్వజ్ఞానమున కుపయోగములు కావు. ఇవి భక్తి విద్యలు, ముక్తి విద్యలు కావు. ముక్తి విద్య కరతలామలకముగా నీయుపదేశముల విచారింపబడినవి. గురుడు ఆత్మాభిముఖ మయిన విచార మును దిక్ప్రదర్శనము చేయును. ఆత్మోదాహరణమున నిరూపిం చును. స్వవిచారణా దికముల ప్రతివ్యక్తియు తన్ను తానుద్ధ రించుకొనవలయును. అట్టి ఆత్మోద్ధరణ ప్రయత్నములలో నెన్నియో అవరోధములు కలుగును. కలుగునట్టి అవరోధముల నెట్లు త్రోసిపుచ్చి స్వప్రయత్నమున కృతార్థిత్వము సంపాదించు కొనవలయునో ఈ సందేశములు ప్రత్యక్షముగా నిరూపించును. ఆధ్యాత్మిక జ్ఞానావబోధములోని నిరోధ రూపక కంటకములేవియో వానినెట్లు నూడబెరుకు కొనుచు పురోగింపగలమో ఈవిమర్శలు సులభముగా బోధిం చును.

పాండిత్యము, శాస్త్రవ్యాఖ్యాన కౌశలము, సదాడంబరము, పొందబడ నట్టి ఆత్మాను భూతిని దాచుకొనుటకు సాధనములు, తెలిసి యనుభవము నకు వచ్చిన తత్త్వము నెరింగించుట కట్టి శాస్త్రపరిభాషకాని శబ్దవైఖరులు గాని అవసరములు కావు. అట్టి వాగ్వైఖరీ ప్రదర్శనము నపేక్షింపని అమల హృదయానుభవచలితమయిన పదములు శాస్త్రవైదుష్యము కంటె ప్రబోధము నకు బలీయములయినవి. అట్టి స్వచ్ఛోపదేశములీ తరంగిణిలో ప్రత్యక్ష ములు. వాగ్వైఖరీ, శబ్దఝరి, శాస్త్రవ్యాఖ్యాన కౌశలము, విద్వద్వైదుష్యము, భక్తి సముపార్జనాకాముల కవలంబములు. ముక్త్యవబోధితులకు నిరుపయోగ ములు.

ఈ తరంగిణిలో తరంగములు అరువది. వీని యన్నింటియందును ప్రవచన క్రమము, విషయ వివరణ విధానము, సల్లాప సరళి భిన్నములుగా గనిపించినను, విషయము ఆత్మావబోధ మొక్కటియే. వ్యక్తుల యొక్క భిన్న భిన్న సంస్కారముల మనస్సులో నుంచుకొని వారి వారి హృదయముల నచ్చుకొనుటకు వివిధరీతుల కధారూపమున, ప్రసంగ రూపమున, వాదోప వాదరూపమున నిరూపించబడినవి.

నిరూపించబడిన ప్రతివిషయము వేదసత్యము, శాస్త్ర నిరూపితము, అద్వైతాను భూతి నొందిన వ్యక్తి ముఖవినిశ్రుతములయి నందున శాస్త్రపదా డంబరము నాశ్రయించవలసిన పరాధీనత నపేక్షింపలేదు. అరువదియేండ్ల ఓంకారుల ఆధ్యాత్మిక తపస్సు, అక్షరరూపము నొందినది. చర్మచక్షువుల నుండి జ్ఞానచక్షూన్మీలనము నొసంగునది.

అజరామరణమయిన నిత్యవస్తు సంశోభితమయిన ఈఓంకార సందేశ తరంగిణి సత్యమయిన జిజ్ఞాసువులకు గురూపదేశ స్థానము వహించి వెలుంగును గాక !

–దివాకర్ల రామమూర్తి

## విషయ సూచిక


| | | |
|---|---|---|
| I. | తొలిపలుకు – శ్రీ తెన్నేటి విశ్వనాథము | 03 |
| II. | కృతజ్ఞత – కుమారి జ్ఞానేశ్వరి | 03 |
| III. | ఆధ్యాత్మిక జ్ఞానావబోధము – విద్వాన్ దివాకర్ల రామమూర్తి | 04 |
| 1. | ప్రార్ధన | 08 |
| 2. | నా మత దీక్ష | 12 |
| 3. | నయాగరా సందేశము | 16 |
| 4. | విశ్వపూజ | 19 |
| 5. | మనస్సే సంసారము | 21 |
| 6. | బ్రహ్మము–శక్తి | 24 |
| 7. | దైవమును పొందుట కెంతకాలము పట్టును ? | 26 |
| 8. | రెండు ప్రపంచములు | 28 |
| 9. | ‘తత్త్వమసి’ – అది నీవే | 32 |
| 10. | ఆశాపాశములనెడి ఉచ్చులలో | 34 |
| 11. | ప్రజ్ఞానం బ్రహ్మ | 37 |
| 12. | రెండు తరగతుల మానవులు | 38 |
| 13. | శాంతి | 41 |
| 14. | గడియారము ఆగిపోయెను | 44 |
| 15. | దైవోద్యానవనము | 46 |
| 16. | మరపులో మెఱుపు | 48 |
| 17. | పరిపూర్ణత | 51 |
| 18. | అణువులో బ్రహ్మాండము | 53 |
| 19. | దివ్య తేజస్సు | 55 |
| 20. | ఆత్మవిశ్వాసము–ధైర్యము | 58 |
| 21. | మహాత్ముని స్థిరాస్తి | 61 |
| 22. | స్వప్నములో సమాధి | 65 |
| 23. | ప్రాతఃకాల నివేదన | 67 |
| 24. | మానవుడు స్వతంత్రుడా? లేక అస్వతంత్రుడా ? | 68 |
| 25. | నిశ్శబ్దో బ్రహ్మ | 70 |
| 26. | ఒక్కతడవు నవ్వుము | 72 |
| 27. | రైలుబండిని ఆపుచేయుట | 74 |
| 28. | గీతా సముద్రము | 76 |

| | | |
|---|---|---|
| 29. | రోగులకు–ఆరోగ్యసందేశము | 83 |
| 30. | అహం బ్రహ్మాస్మి | 86 |
| 31. | అపరోక్షానుభవము | 90 |
| 32. | వృద్ధి – నాశములు | 93 |
| 33. | త్రివిధ గురువులు | 95 |
| 34. | అఖండమైనశక్తి | 98 |
| 35. | వెఱ్ఱి మానవుడు | 100 |
| 36. | చిరస్మరణీయమైన దినము | 102 |
| 37. | దైవమును మరచుట కెంతకాలము పట్టును? | 105 |
| 38. | జీవితముయొక్క విలువ | 108 |
| 39. | వ్రణము | 110 |
| 40. | అజాత వాదము | 113 |
| 41. | జ్ఞానాగ్ని | 115 |
| 42. | దైవానుభవము | 118 |
| 43. | ప్రాచీన ఋషులు | 121 |
| 44. | హృదయ కమలము | 124 |
| 45. | శబ్దమునుండి – నిశ్శబ్దమునకు | 128 |
| 46. | అద్భుతము | 130 |
| 47. | మతియే గతి | 132 |
| 48. | గొప్పపని ఏది? | 135 |
| 49. | నీవు దేనిని కోరుచుంటివి ? | 137 |
| 50. | మఱుపు | 139 |
| 51. | అవ్యక్తము | 141 |
| 52. | మనుజుడు–అంధుడు | 143 |
| 53. | దైవము మేల్కాంచియుండ నేనెటుల నిద్రించగలను? | 145 |
| 54. | ఆరిపోవని జ్యోతి | 147 |
| 55. | ముందుకు నడువుము | 149 |
| 56. | నాకీ యొక్క శ్వాసయే చాలును | 151 |
| 57. | దైవమును మరచుట అసాధ్యము | 153 |
| 58. | నిన్ను నీవు సంస్కరించుకొనుట | 155 |
| 59. | నేను దైవములో ఉంటిని | 157 |
| 60. | దైవము సర్వవ్యాపకుడు | 158 |

# 1. ప్రార్థన

ప్రశ్న : ప్రార్థన అనగా నేమి ?

జ : అంతర్యమున మరుగుపడియున్న శక్తిని, అఖండమైన శక్తితో దివ్య శక్తితో అనుసంధానము చేయుటకు, లేక వ్యక్తపరచుటకు చేయు ప్రయత్నమే ప్రార్థన.

ప్రశ్న : ప్రార్థన జేయు వారెవరు ?

జ : జీవుడే.

ప్రశ్న : ఎవ్వరికి ప్రార్థన జేయుచుండెను ?

జ : పరమాత్మకు, దైవమునకును.

ప్రశ్న : ప్రార్థన ఎందుకు చేయుచుండెను ?

జ : తన జన్మహక్కైన దైవములో విలీనమగుటకు.

ప్రశ్న : జీవుడు, దైవము రెండా ? ఒక్కటియా ?

జ : ఒక్కటియే, ఎన్నడును రెండుగాదు.

ప్రశ్న : అటులనైన ప్రార్థన యేల ?

జ : తాను మరచియున్న దైవమును గుర్తించుటకు, స్థిరముజేయుటకే.

ప్రశ్న : ప్రార్థన అవసరమా ? అనవసరమా ?

జ : దైవమును గుర్తించి, అనుభవించు వరకు ప్రార్థన అవసరము. దైవము ననుభవించుచున్న అనవసరము. నది దాటువరకు అవసరము,కాని నది దాటిన వెనుక గూడ పడవ నంటిపెట్టుకొన నవసరము లేదు కదా?

జీవభావన యెంతవరకు వుండునో, అంతవరకు జీవభావమును జయించుటకు ప్రార్థన ముఖ్యావసరము. జీవభావనపోయి, బ్రహ్మభావన కల్గినప్పుడు ప్రార్థన అనవసరము. అద్వితీయమైన పరిపూర్ణభావనలో ప్రార్థన జేయుటకు పెదవులు కదలవు. మాటలు వచ్చుటకు మనస్సే యుండదు. శరీరమునకే అతీతముగా నుండ, ఖండమైన మాటలు, ఆలోచనలు ఎటుల కల్గును ?

ప్రార్థన లన్నింటిలో లోకశాంతి ప్రార్థన స్మరించునంత మాత్రమున నూతనమైన శక్తిని, వికాసమును కల్గించి, దైవమును హృదయమునకు హృదయముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా, జీవనమునకు జీవనముగా, ఆత్మకు ఆత్మగా, అంతర్యమున,బాహ్యమున,సర్వము నిండి, ప్రత్యక్షమైనట్లు అనుభూతి కల్గించును.

అట్టి మహత్తరమైన ప్రార్థన గూడ కొన్ని సమయములయందు స్మరించుటకు అయిష్టముగా ఉండును. పరిపూర్ణములో ఏదియు స్మరించుటకు వీలు లేకుండును. అద్వితీయమైన అఖండమైన దివ్యతేజస్సులో ఎవరు ఎవ్వరిని దేనికై ప్రార్థించవలెను ? నేను వ్రాయుచున్న నిగూఢమైన, లోతైన సమస్యను అనుభవముగా బోధపరుచుకొనుటకు ఒక చిన్న ఉదాహరణను తీసికొందము.

అఖండమైన సముద్రమును చూడుడు. అందు ఖండమైన అతి అల్పమైన నీటి బుడగను తీసికొనుడు. ఆ నీటిబుడగ సముద్రము మధ్యను వుండియు సముద్రమును ప్రార్థించుచున్నది. ఏమని ప్రార్థించుచున్నది? "పూజనీయమైన ఓ సముద్రమా! లోపలను, వెలుపలను, నిండియున్న ఓ సముద్రమా! నా లోపల ప్రత్యణువునందు యిమిడి యుండి, నా హృదయమునకు హృదయముగా, మనస్సునకు మనస్సుగా, శ్వాసకు శ్వాసగా, జీవనమునకు జీవనముగా, వెలుగొందు ఓ మహాసముద్రమా! నిన్ను తెలిసుకొను మహాభాగ్యమిప్పుడు, ఇచ్చటనే ప్రసాదింపుము. ప్రియ పాఠకులారా ! నీటి బొట్టుయొక్క ప్రార్థన వింటిరా? అది సముద్రమునుండియే ఉద్భవించి, అందే వుండి యుండి, సముద్రము భిన్నముగా, దూరముగా, యెచ్చటనో యున్నట్లు నిన్ను తెలుసుకొను భాగ్యము ప్రసాదింపుమని కోరుచున్నది. లోపల, వెలుపల అన్నివైపులా నీటిమయమై, జలమయమై యుండి, అంతా సముద్రముగా ఉండి ఆ సముద్రమును గుర్తించుటకు బదులు నీటిబుడగ గ్రుడ్డియై, ఇంకను సముద్ర మెచ్చటనో యున్నట్లు ప్రార్థించ నేల? అది కించజ్ఞత్వము కాదా?

అటులనే మానవులు గూడ దైవముచే అన్నివైపుల అహర్నిశములు నింపబడి అంతర్యమున బాహ్యమున యున్న దివ్యతేజస్సును గుర్తించి అనుభవించుటకు బదులు తమ జన్మహక్కైన సచ్చిదానంద స్వరూపమును మరచి, అంధులై, జడులై, పొడినేల మీద వుంచబడిన మత్స్యములవలె, ప్రార్థనలు జేయుచు అశాంతితో, గిల గిల కొట్టుకొనుచుండిరి.

ఓ తేజోమయమూర్తీ! తూర్పు పడమరల, ఉత్తర దక్షిణముల ఈ విశ్వ మంతటను, అందరును, నీ దివ్యతేజస్సును గ్రహింతురుగాక! ఒక్కనీటిబుడగ యెటుల సముద్రముచే నింపబడి, ఆవరింపబడియున్నదో, అటులనే అన్నీ నీటి బుగ్గలేగాక, కెరటములు గూడ జలమయమైన సముద్రముచే నింపబడి యున్నవి. నీవు నీలోయున్న దైవత్వమును మరుగుజేసుకొని, దైవ తేజస్సును గుర్తించక–"ఓ సచ్చిదానంద స్వరూపా! ప్రతి మానవ హృదయమునందును, నానాజాతి మధ్యస్థము నను శాంతి సామరస్యములను ప్రతిష్టింపజేయుము. ఇదియే మా మనః పూర్వకమైన ప్రార్థన" అని కండ్లు మూసికొనియే ప్రార్థించు చుండుట అద్వితీయమైన పరిపూర్ణము

నుండి విమర్శించుట విచారమైన విషయముగా కానవచ్చు చున్నది. నీవు నీ కండ్లను తెరచి, నీలో పరమాత్మను గాంచిన, అప్పుడు యితరులు కూడ నీవలె వారి నేత్రములను తెరచి, తమ హృదయములలో తమకై వేచియున్న దివ్యతేజస్సును అనుభవించగలరు.

అంధుడు అంధులకు దారి చూపజాలడుకదా. కావున ప్రప్రథమమున నీవు నీకును, దైవమునకునుయున్న అవినాభావ సంబంధమును అనుభవముగా గ్రహించి, మాటలు తగ్గించి, అఖండమైన మౌనముతో బ్రహ్మభావమును కల్గియున్న నీవు లోకములో అందరితరపునను ప్రార్థించుచున్నట్లే లోకములో యున్నవారందరికి నీ అనుభవమే, ఎవ్విధమైన మాటలు, ప్రార్థనలు అవసరములేకుండగ తోడ్పడును.

ప్రశ్న : అటులైన ప్రార్థన అనవసరమా ?

జ : ముమ్మాటికి అవసరము.

ప్రశ్న : ఎవ్వరికి ?

జ : ముఖ్యముగా నదికి ఇవతల ఒడ్డునవుండి, సంసార నదీప్రవాహము నుండి అవతల ఒడ్డునకు వెళ్ళుటకు ప్రయత్నించు వారందరకును ప్రార్థన ప్రాణ తుల్యము. నదిని దాటుటకు పడవ యెంత ముఖ్యావసరమో, సంసార సముద్రమును దాటుటకు ప్రార్థన అంత ముఖ్య అవసరము.

గమ్యస్థానము చేరిన తరువాత పడవను ఎటులవిడిచెదమో, అటులనే ప్రార్థనను గూడ బ్రహ్మసాక్షాత్కారమును బడయగనే, పండు పండి దానంతట అదియే రాలిపోయినట్లు ప్రార్థన అప్రయత్నముగా వదలివేయబడును.

ప్రశ్న : ప్రార్థనలు ఎవ్వరికి అనసవరము ?

జ : ముముక్షువులకు ప్రార్థన అనవసరము.

ప్రశ్న : ప్రార్థనలన్నింటిలో గొప్ప ప్రార్థన యెద్ది ?

జ : నిశ్శబ్దములో చేయు మౌన ప్రార్థన.

బ్రహ్మ భావనతో చేయు అద్వైతానుభవము కల్గిన ప్రార్థనయే దేశవృద్ధికి లోకశాంతికి, మానవాభ్యుదయమునకు స్థిరముగా తోడ్పడుచున్నది.

ప్రశ్న : మాటలు లేకుండ ప్రార్థన జేయుట సాధ్యమా ?

జ : ముమ్మాటికి సాధ్యము. అది బ్రహ్మ భావన కల్గినవారికి సాధ్యము. అట్టి ప్రార్థనలే నిజమైన ఉత్తమమైన లోక కల్యాణమునకు తోడ్పడు ప్రార్థనలు, ముముక్షత్వము పొందువరకును ప్రార్థన అవసరము.

కాని జీవునకు, దైవమునకు ఉన్న అవినాభావ సంబంధమును గుర్తించి ప్రార్థన చేయుట చాల సహకారిగా నుండుటేగాక, జన్మరాహిత్యమునకు ముఖ్యావసరము. ఏ దివ్యశక్తి మానవులలో ప్రార్థన రూపముగా వ్యక్తమగుచున్నదో, ఆ దివ్యశక్తియే ఆదిమధ్యాంతరహితమైన, అఖండమైన కోటిసూర్యులప్రభను మీరిన మహాశక్తులతో విలీనము జేయుగాక.

వివిధ నదులన్నియు ఒకే సముద్రమును జేరుచున్నట్లు వివిధమైన దేశ, మతస్థులైన భక్తుల ప్రార్థనలన్నియు అఖండ సచ్చిదానంద స్వరూపుండైన ఒకే దైవమును జేర్చుచు లోకమంతకు శాంతి నొసంగుగాక.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 22-3-1928 )

# ౨. నా మత దీక్ష

నన్నుచూడవచ్చు ప్రతి వానియందును భగవంతుని దర్శించుట నా మతదీక్ష. రూపమును చూచుటకు పూర్వమే నిరాకార బ్రహ్మమును చూచెదను. నేనెవరిలో బ్రహ్మమును గాంచెదనో, వారెల్లను తాము భగవత్స్వరూపులని వెంటనే భావింపక తీరదు. బ్రహ్మము వినా యేమియు లేనప్పుడు వ్యర్థపువాదనలతో నవసరమేమున్నది? లోపలను వెలుపలను బ్రహ్మము నిండియుండగా ఇక ప్రశ్నలేల? సమాధానము లేల? ఈ సర్వమును బ్రహ్మమయమైయుండ, మతముపేర నెట్టి వాదనలైన నెందులకు?

ప్రేమ మతమునందు, ఏకత్వ దీక్షయందు, విశ్వజనీన శాసనమందు, బ్రహ్మ తత్త్వమునందు, సత్యపథమునందు, సమాధిమహిమయందు, కర్ణముల కందరాని గంభీర శాంతియందు, ఉపదేశములకగత్యములేదు; ఉపన్యాసములనవసరము. వాదనల కాదరముండదు. సందేహములు సహింపగారావు. ఎవని దివ్యమానస సరోవరము నందును సంకల్పములకు అవకాశముండజాలదు.

దాని మహిమను మాటలచే వర్ణింపవీలులేదు. దాని సౌందర్యమును ఇట్టిదని భావనలచే గ్రహింపలేము. దాని తేజస్సును చిత్రముల రూపమున రంగులువేసి తెలుపజాలము. ఆ తన్మయావస్థను సావధికమగు మనస్సు తెలిసికొనజాలదు. దాని విభవమును చిన్న బుద్ధిచే గ్రహింపనలవిగాదు. ఓహో ! సర్వము శాంతిమయము! బాహ్యాంతరము లందంతటను శాంతియే! భగవన్మహో విభూతియే అది! ఎచ్చోట చూచినను బ్రహ్మమే! ప్రతి అణువునందును భగవంతుడే చూపట్టును. అనగా మేఘ ములందో స్వర్గమునందో యుండు దేవుడు కాదు సుమండీ! మన హృదయసీమల నిండియుండు భగవంతుడే అతడు !

ఇట్టి బ్రహ్మభావనను, ఇట్టి విశ్వజనీన ప్రేమవహ్నిని, సర్వమును దహించి వేయు బ్రహ్మజ్ఞానమును, అపారావిచ్ఛిన్న బ్రహ్మసాగరమున మునిగి లీనమగుట స్వానుభవమునకు తెచ్చుకొనుటే నా మతదీక్ష; చైతన్యము, తేజము, ప్రేమ–వీనితో గూడిన సజీవమగు దీక్షయిది. నా మత దీక్షయందు సర్వమును బ్రహ్మమే. నామత దీక్ష యందు ప్రతినరుడును దైవమే. నా మతదీక్షలో బ్రహ్మమయము గాని దేదియు నుండజాలదు. ప్రతి దానిని దైవముగ చూచుట, ప్రతి శబ్దమును దైవముగనే వినుట, ప్రతిదానిని దైవముగ నెంచి భాషించుట, ప్రతిదానిని దైవరూపముగ రుచిచూచుట, ఇదియే స్వర్గము; ఎన్నడో మనము చేరబోవు నామరూపాత్మకమును, పరిమేయము నగు స్వర్గము కాదది; అనిర్వాచ్యమగు వర్తమాన కాలపు శాంతికైవల్యమే అది! ప్రేమచైతన్యయుతమగు సజీవ మతదీక్ష నాది.

నా దీక్షయందు మిత్రులులేరు. శత్రువులు లేరు. సన్నిహితులుగాని, దూరస్థులు గాని లేరు. పాపులుగాని సాధువులుగాని యుండరు. గురువులు లేరు. శిష్యులులేరు.

బిచ్చగాంద్రుగాని సామ్రాట్టులుగాని యుండరు. వర్ణములును, కులములు నుండవు. జాతి మత వివక్షతయునుండదు. పిన్నలు పెద్దలను భేదముగాని, స్త్రీ పురుష తార తమ్యముగాని, పశుపక్ష్యాది వివరములుగాని, చెట్లుచేమలు, పెనుశిలలు, పరమా ణువులు, తుదకు చేతనములు అచేతనములు అను వ్యత్యాసములుగాని ఉండవు. నాతోడియైక్యభావము గాంచి వేరుచేయరాని సత్యమే, బ్రహ్మమే వెలుంగును.

పతితులను దరిద్రులను ఉత్సాహవంతులచేయుట, శత్రువులుగ చూపట్టు వారిని ఆలింగన మొనర్చుకొనుట, దూషణచేయువారిని హితులని ప్రేమించుట, అన్యాయముగ నస్పృశ్యులుగ చూడబడువారిని గౌరవించుట, ప్రతిజీవితోడను ఐక్యానుసంధానమును పొందుట, ఇంతేల? జగమున గల ప్రతిపరమాణువు తోడను ఐక్యత ననుభవించుటయు నా దివ్యదీక్ష యొక్క నియమములు, పరుల క్షేమము నిమిత్తమును, జగమంతటి క్షేమము నిమిత్తమును మాత్రమే పరిమితమగు యీ శరీరములో ప్రాణమును రక్షించుటే, సుగ్రాహ్యమగు నా మతదీక్షలోని ప్రధానాంశము. సర్వనియంతయగు జగజ్జనకుని పవిత్ర సంతానమునకు, జాతిమత వ్యత్యాసముల గణింపక, సేవ యొనర్చుటలో తన్మయత నందుటే నా దీక్షయందు కేంద్రసూత్రము!

సర్వత్ర సమత్వమును, సోదరభావమున గూడ ఆత్మతత్త్వమును ప్రకటించు ఈ మతదీక్ష శాశ్వత జీవియై వర్ధిల్లుగాక! ఈయనిర్వచనీయమగు విభూతియందు క్రైస్తవులెక్కడ ? హిందువులెక్కడ ? బౌద్ధులెక్కడ ? మహమ్మదీయులెక్కడ ? జైను లెక్కడ ? జొరాష్ట్రియను లెక్కడ ? శిఖ్ఖులెక్కడ ? కాన్ఫ్యూషియనులెక్కడ ? అన్నిటిని మించి ఆస్తికులు, నాస్తికులు నను విభేదమైన నెక్కడ ? ఇందందరును ఆ జగజ్జన కుని సంతానమే; ఆ దైవ విభునియొక్క ప్రతిమలే; అందరును ఆ దివ్యప్రేమ యొక్క పుంభావమూర్తులే; అందరును ఆ నిరాకార బ్రహ్మము యొక్క సాకార ప్రతిమలే; ఆ యవ్యక్తతత్త్వము యొక్క వ్యక్తి స్వరూపములే; ఖండమునందు అఖండమును, సాకారము నందు నిరాకారమును,నామమున నామరహితమును చూచుటే తథ్యముగా నా మత దీక్షకు పరమ గమ్యము. వ్యక్తి ప్రకృతియందు అవ్యక్త బ్రహ్మతత్త్వమును సాక్షాత్కారము చేసికొనుటే ఈ దీక్షకు పరమాదర్శము.

ఓహో ! ప్రేమసాగరములను వర్షించి, ప్రపంచమును ఆనందమున స్నాన మాడించు ఈ దీక్షయెంత దివ్యమైనది. శత్రువులని ఎదిరించుటకుగాని, మిత్రులని ఆదరించుటకుగాని ఎవరునులేక, అందరిని సాక్షాత్తు దైవతములుగా ప్రేమింప చూచు ఈ దీక్ష ఎంత ఘనమైనది! కేవలము మన ఆత్మ స్వరూపులుగా నెంచి యిత రుల సేవించుటలో మైమరచు ఈ దీక్ష ఎంత పవిత్రమైనది.

క్షుద్రజీవితమును బలివెట్టి యున్నత జీవితమునకై బ్రతుకు ఈ దీక్షయెంత ఆత్మోద్ధారకమైనది. ప్రపంచము నంతటిని మన గృహముగ భావించు ఈ దీక్ష ఎంత భవ్యమైనది ! ఆహా ! ప్రేమ చూపుటే గాక, విశ్వజనీన ప్రేమరూపమేయై

జీవించు ఈ దీక్ష ఎంత ప్రభావంతమైనది ! అందరి నేత్రములలో నుండి వీక్షించుచు, ఎల్లర కర్ణములందుండి యాకర్ణించుచు, సర్వస్వాంతములందుండి సంకల్పించుచు, సకల హృదయములందు నుండు ఈ దీక్షయెంత యానందకరమైనది! ఓహో, సమస్త లోకమునకును సమాన ప్రాణవాయువగు పూర్ణశ్వాసయె 'సోఽహం' అనుచు నందరి శ్వాసమున బ్రవహించు యీదీక్ష ఎంత ముదావహమైనది! దైవజ్ఞప్తిచే నుజ్వలితులమై మేనుమరచుట ఎంతటి భవ్యదశ! ప్రాచ్య ప్రతీచ్య భేదములేకుండ, భూతభవిష్యద్వర్తమానకాలపు సమస్త సాధు సత్తములతోడను, ఋషి ప్రవరులతోడను, అభేదత్వము ననుభవించు ఈ దీక్ష ఎంత ప్రబోధకరమైనది. మన నేత్రములు వ్రాలిన చోటులనెల్ల, మన హృదయములు నెలకొను తావుల నెల్ల మన ప్రియాత్మ తప్ప వేరులేదని గ్రహించు ఈ దీక్ష ఎంత మనోహరమైనది! మన మెన్నటికిని ఈ చిన్న తనువులము కామనియు, మన మెప్పటికిని ఈ బుద్బుద ప్రాయమగు జగత్తుచే బద్ధులముకామనియు, మనము కేవలము నామరూప రహితమగు బ్రహ్మమే యనియు భావనచేయు ఈ దీక్ష యెంత యుత్సాహకరమైనది! ఇది సాక్షాత్తు నిర్వాణమే !!

ఎన్నడును మారక, వాడిపోక, నశ్వరముగాక, శాశ్వతమై వెలుగు ప్రేమయొక్క వీరు వారనక యెల్లరియెడ నొక్కరీతిగ నుండి, ప్రతిఫలము నెంతమాత్రమును గోరక, మరియు విశ్వజనీనమై సమస్తమును తనయందిముడ్చుకొను ప్రేమయొక్క దీక్షయే ఇది! ఇందుకు దక్షిణలు, కానుకలు అవసరములేదు. ఇందుపదేశములు గాని యుపన్యాసములు గాని యుండవు. ఇందు మంత్రోపదేశములుగాని, దివ్య దర్శనములుగాని ఉండవు. ఇందు పారక్రమములుగాని పట్టములు గాని యుండవు. ఇందు పరీక్షలుగాని యోగ్యతా పత్రములుగాని యుండవు. ఇందు నిగూఢసంఘములు గాని, రహస్యకూటములుగాని లేవు. ఇందెవరును వాగ్దానములు చేయుటకుగాని, ప్రమాణములు తీసికొనుటకు గాని ఆవశ్యకత లేదు.

మీరు చేయవలసిన దంతయు మీ అజ్ఞాన పటలమును తొలగించుకొనుటయే! మీరు చేయవలసినది ఆ విశ్వజనీన ప్రేమయొక్క విభూతియందు స్నానమాడుటే! మీరంతర్ముఖులై మీ హృదయకుహరములందు జొచ్చి అచ్చోట శాంతముగ నెమ్మదిగ వినవచ్చు దివ్యవాణి నాలకించుటే. నమ్మశక్యముగాని భవిష్యత్కాలము నందుగాక, యిప్పుడే ఈసజీవక్షణమునందే ఆ ప్రేమసామ్రాట్టునందు లీనమై ఐక్యసంధానమును పొందుటే మీరు చేయవలసినది.

సత్యధ్వజమును దృఢముగ బట్టుకొనుడు! స్వాతంత్ర్యభేరిని మ్రోగించుడు! శాంతి పతాకమును యెత్తుడు! దివ్య మంగళ గీతముల బాడుడు! నామ రూపముల పట్టువిడిచి వేయుడు! దివ్య ప్రభాకరులై ఆత్మసాక్షాత్కారదక్షులై, ఓ శాంతి యోధులారా! స్వర్గరాజ్యములోనికి విజయ ప్రస్థానమును సాగించుడు! మీరలు విశ్వవిభుని, ప్రేమ నాథుని నిజ శిష్యవర్గముగాన విజయ రక్షలను ధారణ చేసికొనుడు!

నిజముగా మనమతదీక్ష యెల్ల దీక్షలలోను శ్రేష్ఠమైన మతదీక్ష ! ఏలయన అది తక్కిన మతదీక్షలలో ప్రతిదానిని తనయందిముడ్చుకొనగలదు. కావున ప్రత్యేక దీక్షల నొల్లని ఈవిశ్వజనీన ప్రేమదీక్షను బూనుదము. లెండు! మనదీక్ష నామ రూప రహితమైనదనుట సత్యము. ఇది అంతులేనిది;ఎంత ఘనమైనదైనను నామ రూపములతో గూడిన యే మత దీక్షలచేతను నెన్నడును బద్ధులము గాకుందుముగాక! ఏల యందురా, అనంత ప్రేమరాశి ఏ ప్రత్యేక మతదీక్ష యొక్కడైనను సంకుచితా వరణలచేత బద్ధమగుటగాని, నిగూఢమగుట గాని పొసగదు గదా! కనుక ప్రత్యేక మత దీక్షయను పేరునే విస్మరించి ఈ విశ్వజనీన ప్రేమైక మతదీక్ష యందు ఇప్పుడే ఐక్యమగుదుము గాక ! మన హృదయములందెల్లను ఆ దివ్య ప్రేమ వినా యేమియు నెన్నడు గాని తలజూపకుండుగాక !

ఇదియే నా మత దీక్ష

ఓం తత్ సత్ ఓం

( 1929 సం॥ )

- ఆత్మసూర్యుని ఉదయము, ఆనందం, సహృదయత్వము, మాధుర్యములను పంటలను వృద్ధిచేయును.

- భౌతికమైన పరిమిత సౌఖ్యములు అపరిమితమైన ఆనందమును ఇవ్వ జాలవు. అటువంటి ఆనందమును పొందవలెనన్న దుఃఖములకు మూలకారణమైన దేహాత్మ బుద్ధిని విడిచి, శరీరమను పంజరము నుండి వెలుపలికి రావలయును.

# 3. నయాగరా సందేశము

"జగన్నాథుడు తన పవిత్ర మందిరమున నున్నాడు. ఆయన మ్రోల పృథ్వి యంతయు మౌనముగ నుండుగాక !

ఇచ్చట ప్రభువు తన బాహ్యమందిరమున నున్నాడు. అందుచే జగత్తంతయు నాయనను కర్మనిష్ఠలో గాంచుగాక ! నయాగరా జలపాతపు ఠీవికి నమోవాకములు. స్వయం ప్రకాశమును అనంతమునగు ఆ తేజః ప్రవాహమునకు ప్రణతులు.

నేనిప్పుడెచ్చట నుంటిని ? దైవసాన్నిధ్యమున – అందుచే "యతోవాచో నివర్తంతే" నా వాక్కు నిర్వాక్కు అయినది. ఇంద్రియము లంతర్ముఖము లయినవి. మనస్సు లయమగుచున్నది. శరీరము చేష్టదక్కుచున్నది. ఈ జలపాత (వాటర్‌ఫాల్) మహాత్మ్యమును గురించి యేదయినను వ్రాయుటకు నన్ను నేను బలాత్కరించుకొను చున్నాను. ఆనందబాష్పములతో గాఢమగు మౌనములో దానినేకాగ్రముగ చూచు చున్నాను. దాని సందేశము నాలించెదను.

జలపాతము అనుచున్నది.

భగవంతుని ముద్దుబిడ్డా ! నీకు నా సందేశము ఏమన – ఒలికింపుము. నీ సర్వస్వము నొలికింపుము. ఏవిధమైన ఫలాపేక్షలేక–నిరంతరము అనంతమగు సేవా ప్రవాహమున నొలికింపుము. అప్పుడప్పుడు గాక నిత్యమొలికింపుము. మరచి కాక తెలిసియే నీ ప్రేమ నాలకింపుము. దేవుడెప్పుడును నీకు ఋణపడియుండదని జ్ఞప్తి యందుంచుకొనుము.

ఇచ్చిన కొలది నీకు కలుగుచుండును – ఇంకను

ఇంకను పొందుటకు నీకు సులభమైన మార్గము –

నీకు కలిగిన దాని నిచ్చి వేయుటయే !

భగవత్స్వరూపుడవగు నీవు – అనంతమగు ప్రేమను, శాశ్వతమగు శాంతిని ఈయ సమర్థుడవు. శాంతి ప్రేమలు నీజన్మ స్వత్వములు. అమూల్యమగు నీ ఈవు లను లుబ్ధునివలె వెనుక బెట్టకుము. నశ్వరము, అనశ్వరమునగు నీయావత్సంపత్తి కిని మానవ కోటితో సహభాగివి కమ్ము.

శాంతియానందములలో జగత్తును స్నానమాడింపుము. ఆరోగ్య తేజములతో మానవలోకము నోలలాడింపుము. దాతకెపుడును గౌరవము–యాచకునకెపుడును మొగముచాటు. అందుచే దాతగ నుండుము. నావంక చూడుము; నేనిత్తును. ఎట్టిఫలమాశించకయే ఎట్టి కోరిక లేకయే నేనిత్తును – దాచుకొనలేనుగనుక, లోకమంతయు, భయముతో, ప్రశంసతో నావంక నెట్లు రెప్పవేయక చూచునో చూడుము. దాతయెంత దర్శనీయుడు! పారమార్థిక దృష్టిలో దాతవు, ప్రతిగృహీతవు నీవే.

"బిడ్డా! ఎడతెగని, తలంపులు లేని దానం–అను నా సందేశమును ఈ విశాల మైన జగత్తున కందజేయుము. నీకిదే నా యవాచకమగు సందేశము. ఇదియే ప్రేమధారారూపమగు సేవా సందేశము."

దీనిని మననము చేయుచు, బాహ్యాభ్యంతరములలో శాంతి ననుభవించుచు నిశ్చలముగ కూర్చుంటిని. జలపాతపు గంభీరగర్జనలోనే నిశ్చలతను గాంచితిని. ఈ సందేశము నన్నుక్కిరి బిక్కిరి చేసెను. అది నన్నొక నూతనోత్తేజముతో నింపెను. ఇయ్యవలెనని, ఇంకను ఇంకను ఇయ్యవలెనని నా కోరిక – వట్టి మాటలను, భావ ములను మాత్రమేగాక నా ప్రాణమును ఆత్మను కూడ సమర్పింప కోరుచున్నాను.

భౌతికముగ, మానసికముగ, ఆధ్యాత్మికముగ నాకు గల సర్వస్వము మానవకోటి కంతకును చెందియున్నది. భగవత్సంతానమా ! ఇవే నా మాంసరక్తాస్తులు. ఇవే నా మనోబుద్ధులు. ఇదే నా హృదయము, ఆత్మ ! దయతో నాయనంతమగు ప్రేమను పంచుకొనుటకు రండు. నా ప్రేమనంగీకరించి నన్ననుగ్రహింపుడు. నాపై జాలిపడకుడు. నాయీ శరీరములోని ప్రత్యణువు. ప్రతికణము మీదే.

అందుచే అనుంగు సోదరా! శాంతి ప్రేమల సమైక్యము, ఆనందము,మహత్తు అనువాని నిచ్చువాడవుకమ్ము. నీ నిజమైన గొప్పతనమును, నీ నిజమైన తేజస్సును మాత్రమే గుర్తించి – విశాలమగు నీ జగత్తును ప్రేమ మాత్రముగనే జీవించుటకు తృప్తిపడు. నీ సరళమైన ప్రేమవాహినితోనే ఈ విశాలజగత్తును స్నానమాడించి, సూర్యులకు సూర్యునివలె ప్రకాశింపుము !

ఇమ్ము ! ఇమ్ము !

నీవు దాచుకొనలేవు గనుక – ఇయ్యగలవు గనుక ఇచ్చివేయుము – ఇచ్చి వేయుము. ఎడతెగక ఇమ్ము. అనుకొనకయే ఇచ్చివేయుము ఇచ్చుటలోగల యానందము దాచుకొనుటలోలేదు. ద్రోగుచేయుట దుఃఖము.పంచుకొనుట, ఇచ్చుట ఆనందము. దాత సజీవుడైన దేవత, దాచుకొనువాడు నిర్జీవుడు.

ఇచ్చుట కితరమేమియు లేనిచో నీ చివరి రక్తబిందువును, మాంసము నర్పిం పుము. పూర్ణత్యాగమున కాదర్శుడవై ఆనందమును, ధన్యతను ప్రసాదించు వాడ వగుము. పుచ్చుకొనుటకంటె ఇచ్చుట ధన్యతరమని చెప్పబడినది. అందుచే, దాత ప్రతిగృహీత లిరువురి యొక్క యానందము నీదే! నా సర్వస్వమును మీతో పంచు కొనుటకే ఈ రూపమున ప్రాణధారణము చేయుచున్నాను.

"ఇమ్ము" అను నొక మాటలో నా విశ్వాసమును, సూక్ష్మముగ చెప్పవచ్చును. ఇదియే నయాగరా జలపాతపు సందేశము.

ప్రియతమమగు నయాగరా! నాకు నీ యెడల గల ప్రేమ నెట్లు వర్ణింతును. ప్రపంచమున కంతకును నీవిచ్చుచున్న సజీవమగు సందేశము వలన నీ కీర్తి జగద్వి ఖ్యాత మగుగాక !

వెనుకాడుచున్న పాదములతో, హృదయమున–లోకముతో కలసి యనుభవింప వలెనను సత్యమైన భావనతో వెనుకకు మరలి కదలితిని. నా పాదములిక భూమిపై నుండలేదు. నేను గాలిలో నడచుచుంటిని. కొండలను గుట్టలను ఆలింగనము చేసికొంటిని. తరుగుల్మలతాదులను ప్రేమతో లాలించితిని. మందమలయానిలముతో చెవిలో మాటలాడితిని. ప్రాణ ప్రదాతయగు సూర్యునితో నుచ్ఛ్వసించితిని, నిశ్వసించితిని. నా ప్రక్క నుండి పోవు బాలబాలికలతో మందహాసము చేసితిని. ప్రేమ సమైక్యతతో, సోదరులతో హృదయ పరివర్తనము చేసికొంటిని.

"ఓమ్" అను పవిత్ర ప్రణవ శబ్దము నుచ్చరించి పాడునప్పుడెల్లను ఏ కొలది మందితోకాక సమస్త మగు సృష్టికిని ఇచ్చుచున్నాను ఇచ్చుచున్నాను.

ఇప్పుడు నేనొక నూతన వ్యక్తిని. నయాగరా నాకొక నూతన జీవితమును, లేక పునర్జన్మ నొసంగినది. అందుండి నేను తేజస్తరంగములను, మహిమా స్రవంతులను, శాంతి నదులను జీవన మహోదధులను పారునట్లు చేయగలను.

భగవన్మహిమ ! భగవన్మహిమ ! భగవన్మహిమ !

స్తోత్ర పాఠములన్నియు నయాగరా కే !

నేను సజీవ ప్రదాత, తేజః ప్రదాత

ప్రేమ ప్రదాత యగు నయాగరా బిడ్డను.

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

( 1930 సం॥ )

# 4. విశ్వపూజ

మనము పూజల గురించి బోధపరచుకొనుటకు బాహ్యపూజ, మానసపూజ, ఆత్మపూజ అని పూజలను మూడు విధములుగా విభజింప వచ్చును.

1. బాహ్య పూజలను గురించి తెలియని వారెవ్వరు నుండరు. ఏలనన లోక ములో ప్రతి మానవుడు దుర్లభమైన మానవజన్మను పొందగల్గితినని గ్రహించినచో, దైవమును ఏదో విధమైన ఆకారములో పూజించుచు, గమ్యస్థానము చేర ప్రయత్నించు చుండును.

2. బాహ్యపూజా పురస్కారములను, బాహ్య చిహ్నములను వదలి మానసిక ముగా తమ యిష్టదైవమును, తమ హృదయస్థానమందో, భ్రూమధ్యముననో, నిరంతరము ధ్యానించుచు ఆదర్శమైన, పరమ పావనమైన జీవనములను గడిపెడి మహనీయులను గూడ అచ్చటచ్చట మనము గాంచుచునే యుంటిమి.

3. ఇంక ఆత్మపూజ చేయు మహనీయులో ! వీరు చాల అరుదు. వీరే విశ్వపూజ చేయు మహాత్ములు. ఏలనన విశ్వపూజ అనినను, ఆత్మపూజ అనినను ఒక్కటే ! ఈ పూజకు పుష్పములు, ఫలములు, ధూపదీప నైవేద్యములు అవసరములేదు. ఈ విశ్వ పూజలో హృదయస్థానమును, భ్రూమధ్యస్థానమును మీరి, ఆత్మస్థానము నందే బ్రహ్మవిదులు నిరంతరము ఆత్మపూజను అహర్నిశములు సహజముగానే జరుపు చుందురు. లోకములోనున్న పూజ లన్నిటిలో ఈ విశ్వపూజయే మహోత్కృష్ట మైనది. ఈ మహాపూజయే అద్వితీయమైన ఆత్మభావనతో కాలపరిమితి లేక నిరంతరము జరుగుచున్నది. ఈ దివ్యమైన విశ్వపూజలో నేను పూజచేయుచుంటి ననెడి భావనయే లేక, తనకు తెలియకుండ అహర్నిశలు ఆపూజ జరుగుచునేయున్నది. ఇట్టి మహా పూజను చేయు వారి జీవితములు ధన్యవంతములు.

ప్ర : ఆ దివ్యమైన, పరమ పావనమైన, సహజమైన విశ్వపూజ యెట్టిది ?

జ : అదియే ఆత్మభావనతో, శ్వాస ద్వారా నిరంతరము జరుగుచున్న అజప గాయత్రి మహాపూజ. మనుజుడు నిద్రించుచున్నను, ఎన్ని బాధలు,అవస్థలు ఎంత తొందర పనులలో నున్నను ఈ మహాపూజ నిరంతరము జరుగుచునే యున్నది. ఈ సోహం పూజలో, ఈ అజపగాయత్రి పూజలో బ్రహ్మాండములన్నియు యిమిడి యున్నవి.

ఈ విశ్వపూజ, జాగ్రత్స్వప్నసుషుప్తి అవస్థలలో గూడ, కాలనిమిత్తము లేక, మనము గమనించినను, గమనింప లేకపోయినను "సోహం" మహా మంత్రము స్వాభావికముగా, వాక్కుతోగాక, శ్వాసతో అదియే నేను అదియే నేను, ఆత్మనే నేను, సోహం సోహం–అని ప్రతిశ్వాసతో శబ్దరహితముగా అజపముగ పూజ జరిగిపోవుచున్నది.

మానవుడు కండ్లుండియు గ్రుడ్డిగా, చెవులుండియు చెమిటిగా, మనస్సుండియు జడుడుగా ప్రవర్తించుట విచారకరము. తనలో విశ్వపూజ నిరంతరము రాత్రింబగళ్లు

జరుగుచున్నను, మానవునకు ఆజ్ఞప్తి. అస్పర్శ, ఆ అనుభవమే లేకుండుట చాల విచారకరమైన అంశము. అమృతము నిరంతరము తనలో ప్రవహించుచున్నను అమృత పానముచేసి శాంతిని బడయుటకు బదులు, కేవలం ప్రవృత్తిపరుడై తన యింద్రియములను మనస్సు సహితముగ బాహ్య విషయములందు పరుగెత్తించుచు, విషమునే గ్రోలుచు తృప్తి పొందుచుండుట లజ్జాకరమైన ఏహ్యమైన దుస్థితి.

అనుభవనీయులైన యోగిపుంగవులు, వారి సాధనలచే కనిపెట్టి–ప్రతి మానవుడు ప్రతిరోజున 21,600 సార్లు ఉచ్ఛ్వాస నిశ్వాసములలో 'సోహం' మహా పూజను జరుపుచున్నట్లు వచించియుండిరి. ఎడతెరపిలేకుండ ఈ మహాపూజ నిరంతరము జరుగుచున్నను, దినమునకు ఒక్కసారి ఒక నిముషమైనను, ఒక శ్వాసనైనను గుర్తించి అనుభవింపజాలని మానవులను మనుష్య మాత్రులని చెప్పుటకు సిగ్గుపడవలసి యున్నది.

ఈ విశ్వపూజ స్నేహితులు, విరోధులు అనెడి భేదభావన లేకుండ అందరిలోను ఒకేవిధముగా జరుగుచు, అందరిని ఒకటిగా చేయుచున్నది. ఎన్నటికైనను ప్రపంచములో శాంతిస్థాపన చిరస్థాయిగా జరుగువలెనన్న ఈ మహా విశ్వపూజయే, ఈ సోహం భావనతో జరుగు శ్వాసానుసరణమే– కీలకముగా చక్కనైన, తప్పని సరియైన రాజమార్గముగా, ప్రత్యక్షముగా,బట్టబయలుగా వెలుగవలెను. బాహ్య పూజల వలన మానవుడు వైకుంఠమునకు వెళ్ల వచ్చును. మానస పూజవలన మనోశాంతి బడయ వచ్చును. కాని జన్మరాహిత్యమును బడయుటకు, లోకశాంతికి తోడ్పడుటకును మానవ కళ్యాణమునకు ఈ విశ్వపూజయే రాజమార్గము.

ఈవిశ్వపూజలో ఆధ్యాత్మిక కంపనమనెడి తరంగములు సముద్రపు కెరటముల వంటివి. ప్రణవగానముతో నిరంతరము శిరస్సులో సహస్రారచక్రములోని పరమ శివుని ఆరాధన చేయుచున్నవి. పక్షులు ఓంకారమును పాడుచున్నవి. ఓంకారశబ్ద ముతో గాలివీచుచున్నది. సూర్యుడు ఆత్మచైతన్యముతో ప్రకాశించుచున్నాడు. నక్షత్ర ములు మిణుకు మిణుకు మనుచు సోహంభావననే చాటుచున్నవి. మనుజునిలో కదలెడిది, మెదలెడిది, ఆలోచించెడిది, వ్యక్తమైనదంతయు ఈ సోహంభావనయే.

నామరూపములన్నిటిని, సృష్టినంతను ఆత్మ స్వరూపమే వ్యాపించి యున్నది. చలనమున కంతకును, ప్రతిపనికిని ఆత్మయే కారణము. పాలలో తెలుపు ఇమిడి యున్నట్లు, సృష్టిలో పరబ్రహ్మము నిండినిబిడీకృతమైయున్నదని బ్రహ్మవిదులు పలుకుచున్నారు. గాన ఈవిశ్వమంతయు, నిరంతర విశ్వపూజలోనే మునుగుచు తేలుచున్నది. కనుక ఈక్షణము నుండియైనను బ్రహ్మమును గుర్తించుచు, దానిని అనుభవించుట కిదియే సమయము.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు !

( 1931 సం॥ )

# 5. మనస్సే సంసారము

"చిత్తే చలతి సంసారో నిశ్చలే మోక్ష ఉచ్యతే"

ఈ చిన్న శ్లోకములో సర్వవేదముల సారమేగాక, అన్నిమతముల సారాంశము కూడ ఇమిడియున్నది. సంసారమనగా భార్య, భర్త, పిల్లలు, బంధువులు గారు. మనస్సే సంసారము, చిత్తము చలించుటే సంసారము. చిత్తము చలించని యెడల, సంసార సముద్రములో నున్నను, అది సంసారము కాజాలదు. చిత్తము నిశ్చలముగా నున్న వారిని, సంసార మహాసముద్రముగూడ ముంపజాలదు.

ఏకాంతములో ఏకాకిగానున్నను, చిత్తము చలించిన, మనస్సు సంకల్పించు చున్న అదియే మహాసంసార సాగరముగా నుండును. చిత్తమును స్థిరముగా చేయుట యెట్లు ? ఇదియే కఠినమైన గొప్ప సమస్య. దేనినైనను స్థిరము చేయవచ్చునుగాని, ఒక్క మనస్సును మాత్రము స్థిరము చేయుట దుర్లభమని శ్రీ సీతారామాంజనేయ సంవాదము మొదలైన గ్రంథములు చెప్పు చున్నవి. ఈ క్రింది పద్యమును మీకు నేను ఎన్నోసార్లు చెప్పి యుంటిని. ఎన్నిసార్లు చెప్పినను, వ్రాసినను చక్కనైన, సులభ మైన మాటలలో వ్రాయబడినది గాన మరల చెప్పగోరు చుంటిని.

చ. అలయక సప్తవారిథుల నావలి కీవలి కొక్కరీతిగా  
గలయంగ నీదవచ్చును నగంబుల నచ్చనగుండ్లుగా గరం  
బులం గొనియాడవచ్చు నభమున్ గబళింపంగవచ్చుంగాని యి  
య్యిల నమనస్కయోగము గ్రహింపగరాదు దలంపనేరికిన్

ఏడు సముద్రములనైనను అవతలియొడ్డు నుండి యివతల ఒడ్డునకు సునాయాసముగా నీదవచ్చునట. పర్వతములను గచ్చనరాళ్ళుగా చేసికొని, చేతితో ఆడుకొనవచ్చును. ఆకాశమునంతటను మ్రింగివేయ వచ్చుకాని యీ అమనస్క యోగము, మనస్సులేని, సంకల్పరాహిత్యమైన యీ యోగము మాత్రము ఎవ్వరికిని సాధ్యముగాదు.

ఎవ్వరికీ సాధ్యము గాని యీ మనోలయమునకై ప్రయత్నించనేలయని కొందరు ప్రశ్నించవచ్చును. ఏ పనియైనను చేయగా చేయగా, అభ్యసింపగా అభ్యసింపగా, సాధకులకు సాధ్యమగును. చిన్న చీమలైనను రాళ్ళమీద ప్రాకగా, ప్రాకగా ఆ రాళ్ళు కూడ అరిగి దార్లుగా ఏర్పడునని చెప్పబడియున్నది. అదియుగాక వైరాగ్య వంతులకు సాధ్యముగాని దేదియు నుండదు. ప్రవృత్తి పరులకు, విషయలోలురకు, అసాధ్యమైన, దుర్లభమైనపనియే నివృత్తి పరులకు, జ్ఞానవంతులకు అతిసులభముగా నుండును. అట్టి వారిని గురించియే శ్రీ సీతారామాంజనేయములో నీ చక్కని అనుభవ నీయమైన ఈ క్రింది పద్యము చెప్పబడినది.

గీ॥ చెలువుగం పువ్వులు చీరుటకంటెన్
బొలువుగం కన్గవ మూయుటకంటెన్
నలువగు నీయమనస్క వధంబే
సులభము ! సౌఖ్యము, సూక్ష్మము, వత్సా !

పుష్పముల యొక్క రేకులను విడదీయుటకంటెను, కన్ను యొక్క రెప్పవేయుట కంటెను, నీయమనస్కస్థితియే మనస్సులేని యీ మహాయోగమే సులభమని, సౌఖ్య మని సూక్ష్మమని చెప్పబడుచున్నది.

ఆహా ! ఏమి ఆశ్చర్యములకు ఆశ్చర్యము ! ఆశ్చర్యమే గాదు, ఆనందమైన వార్త కూడను. పట్టుదల, శ్రద్ధ, ఏకాగ్రతతో జయింపజాలని పని యేదియును నుండ జాలదు. కామ,క్రోధ,లోభ,మోహ,మద మాత్సర్యములకు బానిసలైన యోగు లైనను, సన్యాసులైనను, సంసారులుగానే, మహాసంసారసముద్రము నందుబడి కొట్టుకొని మునింగి పోవుచుండిరి.

గృహస్థులైనను, పెద్ద సంసారములోనున్నను, వైరాగ్యముతో నిండి, తమ మనస్సులను దైవార్పణము చేసియున్న అట్టివారు యోగులకు యోగులుగా, తామరాకునంటని నీటి బిందువువలె విలక్షణముగా, ఆదర్శరూపులై జీవించుచుం డిరి. సామాన్యులకు మనస్సును బోధపర్చుకొనుటే కష్టము. మనస్సు సదా దేనినో యొక్క దానిని ఆలోచించుచుండును. అది నదీ ప్రవాహమువలె నిరంతరము ప్రవ హించుచునే యుండును.

పర్వతముల మీద నుండి వచ్చుచున్న నదీ ప్రవాహము నరికట్టుట దుర్లభము గదా! ఐనను ప్రయత్నముచే, పట్టుదలచే, శ్రద్ధవల్లను దుర్లభములైన పనులే, సులభ మైన పనులుగా చేయబడుచున్నవి. మనస్సు అనెడి సుడిగాలియే అనేకమైన రోగము లకు, అవస్థలకు, బాధలకు, భయములకు మూలకారణమై యున్నవి. ఈ మనస్సే అండాండ బ్రహ్మాండములన్నింటిని సృష్టించుచున్నది.

మనస్సును జయించిన వారిదే మోక్షము. మనస్సునకు బానిసలై యున్న వారిదే సంసారము. మనస్సు నెప్పుడును ప్రప్రథమముననే, ప్రారంభ స్థితిలోనే జయించుట చాల సులభము. ఈ స్థితినే గీతలో శ్రీకృష్ణభగవానులు, ఈ క్రింది శ్లోకములలో విపులముగా నుడివిరి.

శ్లో॥ ధ్యాయతో విషయాన్ పుంసః సంగస్తే షూపజాయతే ।
సంగాత్సంజాయతే కామః కామాత్క్రోధోభిజాయతే ॥ (భ.గీ.2-62)

విషయముల చింతించు పురుషునకు వాని యందాసక్తి పుట్టుచున్నది. మరియు ఆసక్తిలో నుండి కామము కలుగుచున్నది. మరియు కామము నుండి క్రోధము పుట్టు చున్నది.

శ్లో॥ క్రోధాద్భవతి సమ్మోహః సమ్మోహాత్స్మృతివిభ్రమః।

స్మృతిభ్రంశాద్బుద్ధినాశో బుద్ధినాశాత్ప్రణశ్యతి ॥ (భ.గీ. 2–63)

క్రోధము నుండి మౌఢ్యముదయించుచున్నది. మౌఢ్యము నుండి స్మృతి భ్రాంతమై పోవుచున్నది. స్మృతిభ్రాంతము నుండి జ్ఞాననాశనమగు చున్నది. మరియు నెవ్వాని జ్ఞానము నశించినదో వాడు మృతప్రాయుడు.

శ్లో॥ నాస్తిబుద్ధిరయుక్తస్య నచాయుక్తస్య భావనా ।

న చా భావయతశ్శాంతి రశాంతస్య కుతస్సుఖమ్ ॥ (భ.గీ. 2–66)

ఎవనికి సమత్వము లేదో వానికి వివేకము లేదు. వానికి భక్తిలేదు. మరియు నెవనికి భక్తిలేదో వానికి శాంతిలేదు. మరియు నెచ్చట శాంతిలేదో అచ్చట సుఖ మెచ్చట నుండి కలుగును ?

ఆశయే బంధము. ఆశలేకున్న వారిదే శాంతి. మోక్షము నిశ్చలమైన మనస్సు గల వారిదే. చిత్తము యొక్క వృత్తులను నిరోధించుటే మోక్షమని చెప్పబడుచున్నది.

నిశ్చలే మోక్ష ఉచ్యతే

మనస్సు స్థిరముగా, ఏకాగ్రముగానున్న శాంతిసుధ నిప్పుడే యిచ్చటనే గ్రోల వచ్చును.

మన ప్రార్థన ధ్యానాదులు, సాధనలన్నియు చంచలముగా నున్న మనస్సును స్థిరముగాచేసి, సంసార సముద్రము నుండి విముక్తి పొందుటకే గదా! మనసును ప్రవృత్తిగా, విషయములవైపు పరుగెత్తించిన సంసార సముద్రములోనికి దారిని చూపి నడి సముద్రములో ముంచివేయును. ఆ మనస్సునే నివృత్తిగా చేసి, పరంజ్యోతిలో లీనము చేసిన బ్రహ్మానందమును చవి చూపును.

ఓ వెర్రి మనసా ! నీ జన్మహక్కు అయినది, శాశ్వతమైనదియగు బ్రహ్మానందము ఆంతర్యముననే, నివృత్తిలోనే అంతర్గర్భితమైయున్నది. గాన వృత్తిరహితముగా, సంకల్పశూన్యముగా నుండి, జ్ఞానామృతమును నిరంతరము గ్రోలెదవుగాక!

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు

ఓం ఓం ఓం

(1932 సం॥)

# 6. బ్రహ్మము - శక్తి

వేదాంత భాషలో బ్రహ్మము, శక్తి అనెడి ఈ రెండు మాటలును నా హృదయ మును సదా ఆకర్షించినవి. వానిని గురించియే నేను చింతించు చుందును. ఇవి ఆకర్షణీయములైన మాటలేగాక, మానవ జీవితమునకు ఆధారము, గమ్యస్థానములై యున్నవి.

ఇతరులకు బ్రహ్మము, శక్తి గురించి వినుటకు, చదువుటకు విసుగు కల్గిన కలుగువచ్చునుగాని, నాకు మాత్రము పరమ పావనమైన, అత్యుత్కృష్టమైన, ప్రాణ తుల్యమైన ఈ రెండు చిన్నమాటలను గురించియు సదా ధ్యానించుచు ఏదో ఒకటి వ్రాయవలయుననియే నుండును. ఇప్పుడు నేను వ్రాయబోయెడి భావనలు, ముఖ్య ముగా జిజ్ఞాసువుల ఆత్మోన్నత్యమును, ఆధ్యాత్మిక వృద్ధిని కోరుచు వ్రాయదలచితిని.

బ్రహ్మమును చూడజాలము. శక్తిని చూడగలము. శక్తిని దర్శించిన బ్రహ్మమును దర్శించినట్లే. ఏలయన శక్తి బ్రహ్మముయొక్క అంశమేయై యున్నది. శక్తిని ధ్యానిం చుచు అద్దానిని వెంబడించిన అదియే పూర్ణ బ్రహ్మమును నేర్పును. సామాన్యమైన చిన్న ఉదాహరణలను తీసికొని బ్రహ్మమును, శక్తిని విమర్శించిన, బ్రహ్మమునకు శక్తికి మధ్యనున్న అవినాభావ సంబంధమును సునాయాసముగా బోధపరచుకొన గలము.

ప్రథమమున మన ముందుగాన వచ్చుచున్న సముద్రమును తీసికొందము. సముద్రము పరబ్రహ్మ స్వరూపము. కెరటములు బుద్బుదములు. వ్యక్తమైన నామ రూపములవలె శక్తిస్వరూపములు. చిన్న అలను చూచినవారు సముద్రమునంతను చూచినట్లే గదా ! ఐనను సముద్రమునంతను ఒకేసారి భౌతిక నేత్రములతో చూడ జాలము. అటులనే పరబ్రహ్మ స్వరూపమును ఈభౌతిక నేత్రములు చూడజాలవు. ఐనను సృష్టి అంతయు పరబ్రహ్మచేతనే, ఆ దివ్యశక్తిచేతనే ఆవరింపబడి నింపబడి యున్నది. మరియొక ఉదాహరణగా సూర్యుని తీసికొందము. సూర్యుడు బ్రహ్మము. ఆయన కిరణములు శక్తి స్వరూపములు. కెరటములు సముద్రమునుండియే వచ్చు చున్నట్లు, కిరణములన్నియు సూర్యుని నుండియే వచ్చుచున్నవి. కిరణములను వెంబడించిన సూర్యుని చేరెదము.

బ్రహ్మము, శక్తి వేదాంతపదములుగాన వేదాంతులకే అవసరము, ఇతరులకు అనవసరమని తలచుట అవివేకము. ఎంత ప్రవృత్తి పరునకైనను, అవివేకికైనను, తనకు తెలియకపోయిన పోవుగాక, బ్రహ్మము, శక్తియే తనకాధారమైయున్నవి. నేనిప్పుడు వ్రాయుచుండ బ్రహ్మము యొక్క శక్తివలననే నేను వ్రాయగలుగుచున్నాను. ఈ హస్తములలో కదలుచున్నది ఆశక్తియే ! మనస్సులో ఆలోచించుచున్నది ఆశక్తియే.

ప్రియపాఠకా! నాలోనేకాదు, ఇది చదువుచున్న నీలోనో? నీ నేత్రములలో ప్రకాశించుచున్నది ఆ దివ్య శక్తియేగదా! నీలో చదువుచున్నదియు ఆ అద్వితీయమైన

మహాశక్తియేగద. నీలోని ప్రతిచలనము ఆ శక్తియే. ఆ శక్తియొక్క ఆధారము చేతనే నీవు కదలుచు, మెదలుచు, ఆడుచు,పాడుచు, నీపనిపాట్లు చేయుచు జీవింపగలుగు చుంటివి.

కాని ఆ దివ్యశక్తిని నీవు గుర్తించుచుంటివా? గుర్తించినచో నీ జీవితము ఆనందముతో నిండి శక్తివంతముగా నుండును. నీకు ఆధారమైన శక్తిని గుర్తింప కున్న నీ జీవితము నిస్సారముగా చింతలతో, తాపత్రయములతో, బాధలతో నిండి యుండును.

నీవు ఆలోచించినను, ఆలోచింపకున్నను, ఆశక్తి అహర్నిశలు నీలో పనిచేయు చునే యున్నది. నీలో నాలోనే గాదు, లోకములో అందరిలోను వ్యక్తమగుచున్నది. ఏ పనియు, ఏకదలికయు, ఏ చలనమును లేక శరీరము స్థిరముగా నున్నప్పుడు, మనస్సు ఏకాగ్రతగా నున్నపుడు గూడ నీలో ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా, చివరకు నీ స్వప్న, సుషుప్తి అవస్థలలో పనిచేయుచున్నది ఆ శక్తి ప్రభావమేగదా! ఆ దివ్య శక్తిలేకున్న నీవు ఒక క్షణమైనను జీవింపజాలవు. నీకు సర్వకాల సర్వావస్థల యందును, సర్వాధారమైన ఆ మహాశక్తిని మరచి జీవచ్ఛవమువలె నుండెదవేల ? లెమ్ము, మేల్కొనుము! నీలో వ్యక్తమైయున్న, నీలో ప్రకాశించుచున్న, నీలో చూచుచూ, వినుచు, కదలుచు, ఆలోచించుచున్న శక్తిని గుర్తించుటకు ఇదియే సమయము. ఏతత్ క్షణము నందు, నీ జీవితాధారమైన దివ్యశక్తి గుర్తింపని యెడల, అస్థిరమైన భవిష్యత్తు నందు, దీపము ఆరిపోయిన తరువాత అంధకారములో ఎటుల గుర్తించగలవు?

ఆ దివ్యశక్తి మానవుల నేత్రములలోనేగాక, పుష్పముల హృదయములలోను, పక్షుల కంఠారవములలోను, జంతువుల కదలికలోను, నక్షత్రముల ప్రకాశములోను, చంద్ర,సూర్య గోళము లన్నింటిలోను ప్రకాశించుచున్నది, వేయి మాటలేల ? నీలో వ్యక్తమైయున్న శక్తినిప్పుడే ధ్యానించుము. మనస్సు నాశక్తిలో లీనము చేయుము. ఈ బ్రహ్మాండమైన శక్తినంతను, అవాఙ్మానస గోచరమైన, పరిపూర్ణమైన పరబ్రహ్మము నందు లీనము చేయుము.

బుద్బుదము కెరటమునందును, కెరటము సముద్రమునందును, సహజముగా లీనమగునట్లు, నీ మనస్సును శక్తియందును, శక్తిని బ్రహ్మమందును లీనముచేసి, మానవ జన్మకు ఆధారము గమ్యస్థానము అయిన పూర్ణశాంతిని బడయుము.

ఓం తత్ సత్ ఓం

( 1933 సం॥ )

బంధమోక్షములు మనః కల్పితములు. మంచిచెడ్డలు దేహజగత్తులు అన్నీ ఊహాజనితములే. ఇటువంటి ద్వంద్వములలో విహరించుట మనోలక్షణము.

# 7. దైవమును పొందుట కెంత కాలము పట్టును ?

జన్మలన్నింటిలో మానవజన్మయే ఉత్కృష్టమైనదని చెప్పబడెను. దుర్లభమైన ఈ మానవజన్మ దైవమును పొందుటకే ఈయబడినదని గూడ మహనీయులచేతను, మత గ్రంథములచేతను వక్కాణింపబడెను.

కాని దైవ సంభూతుడైన మానవుడు–దైవమును పొందుటకై ఉత్తమమైన మానవ జన్మను పొందియు, దైవపరితాపనతో నిండియుండి, తన జన్మకు ఆధారమైన దైవ మును తెలిసికొనుటకు బదులు, ఒక్క దైవమును తప్ప, అమూల్యమైన వాని నన్నిటి ని తెలిసికొనుటకై తన జీవితము నంతటిని అర్పించి పాటుబడుచుండును.

ప్రపంచములో "ప్రవృత్తి, నివృత్తి" యని అందరకు విదితమైన రెండు మార్గ ములు గలవు. నివృత్తి మార్గము ఆధ్యాత్మిక చింత గలిగిన వారికే తెలియును. గాని ప్రవృత్తి మార్గము సామాన్య జనులందరకును తెలియును. నివృత్తి మార్గము చాల ఇరుకుగాను, రాళ్ళురప్పలు, తుప్పలు, ముండ్లు మొదలగు వానితో నిండి నిర్జనముగా, ఏకాంతముగా నుండును. ఇక ప్రవృత్తిమార్గమా ? చాల విశాలముగాను, ఆహ్లాదకర ముగాను, జనముతో క్రిక్కిరిసి యుండును.

దైవమును పొందుట కెంతకాలముపట్టునో–నివృత్తి మార్గాను సారులైనవారే ఆలోచించెదరు. దైవమును పొందుట కనేక జన్మలు కావలెనని కొందరు చెప్పియుం డిరి. నివృత్తిపరుడై, సత్యమార్గమున నడచిన ఈ ఒక్క జన్మలోనే దైవమును పొంద వచ్చునని మరికొందరు చెప్పిరి. కొందరు యోగిపుంగవులు సాధనసంపత్తియు యోగాభ్యాసము చేసిన పండ్రెండు సంవత్సరములలో దైవమును పొందవచ్చుననిరి. కొందరు ఋషీశ్వరులు ఆరు సంవత్సరములనియు, మరికొందరు అనుభవపరులు ఒక్క సంవత్సరము పట్టుదలగా కృషిచేయుచు, ధ్యానధారణ, సమాధుల నభ్యసించిన దైవమును పొందవచ్చుననియు చెప్పిరి. కొందరు బ్రహ్మవేత్తలు పాలుపండ్లు తీసి కొనుచు, కఠినమైన దీక్షవహించి, నిరంతరము కృషిచేసిన, ఆరునెలలలో సమాధిని పొందగలరని నుడివియుండిరి. మరికొందరు మూడునెలలనియు, ఒకనెలయని, పక్షమురోజులలో దైవమును పొందవచ్చునని చెప్పియుండిరి.

ఇక శ్రీరామకృష్ణులు, మూడురోజులు మాత్రమే మానవుడు నివృత్తుడై, బిడ్డతల్లికై రోదనచేయునట్లు, తానుగూడ దైవమునకై విలపించుచు పాటుపడిన దైవమును తప్పక పొందవచ్చునని, వారి స్వానుభవముతో నుడివి యుండిరి. ఇంకను కొందరు సమాధిస్థితి ననుభవించిన పురుషులు, మునిపుంగవులు, దైవమును ఏడు ఘడియ లలో పొందవచ్చుననియు, మరికొందరు ఒక్కఘడియలోనే పొందవచ్చుననియు చెప్పియుండిరి.

అనేక జన్మలలో పొందలేమన్న దైవమును ఒక్కఘడియలోనే పొందగలమనెడి స్థితి వరకు వచ్చుట మహానందకరమే. ఈ సమస్యనింకను పరిశీలింతము. గృహస్థ

లకు ఆదర్శపురుషుడైన శ్రీ జనకమహారాజు దైవమునెంతలో పొందగలనని శ్రీఅష్టా వక్రమునీంద్రుని ప్రశ్నింపగా, "గుఱ్ఱమునెక్కుటకు రికాబులో కాలుబెట్టి, గుఱ్ఱము వీపు మీదకెగురు నంతకాలములో దైవమును పొందవచ్చు" నని ఘంటా పథముగా చెప్పియుండెను. ఆహా! ఎంత ఆనందకరమైన వార్త ! ఇంకను కొందరనుభవపరులు కనుమూసి తెరచునంతలో, ఒకరెప్పపాటు కాలములో దైవమును పొందవచ్చునని నుడివియుండిరి. మరికొందరాత్మజ్ఞులు మెఱపు మెఱయునంతకాలములోనే పరమాత్మను పొందవచ్చుననిరి.

పరమేశ్వరుడు లేక పరమాత్మ, పరిపూర్ణమైనది, స్వచ్ఛమైనది, హెచ్చుతగ్గులు లేనిది, దానిని పొందుటకు జన్మలు, క్షణములుకావలెనా? ఆత్మనేదియైన బంధించి యున్నదా? ఆత్మను గ్రహించుటకు కాలపరిమితి ఏల ? పూర్ణముగా, స్వచ్ఛముగా నున్నది-ఎప్పుడును పూర్ణముగాను, స్వచ్ఛముగానేయున్నది. ఆత్మనెద్దియును,ఎన్న డును బంధింపలేదు. ఆత్మ సదా పూర్ణము. ఇప్పుడును, ఎప్పుడును పరిపూర్ణముగానే అఖండముగానే కోటిసూర్య ప్రకాశమానమైన తేజస్సుతో ప్రకాశించుచున్నది.

మానవుని జన్మహక్కైన యీ దివ్యతేజస్సును ఇప్పుడు, ఇచ్చటనే అనుభవించు టకు బదులుగా మానవుడు మాయకుబానిసయై తన హృదయమునకు హృదయముగా నిరంతరము ప్రకాశించుచున్న దైవత్వమును, జ్యోతిస్వరూపమును మరచి తాను ఎన్ని జన్మలలో, ఎన్ని సంవత్సరములలో, ఎన్నినెలలలో, ఎన్నిరోజులలో, ఎన్నిఘడియ లలో, ఎన్ని నిమిషములలో, క్షణములలో ముక్తినిపొందెదనో అని భ్రమపడుట చాల విచారకరమగు విషయము. తానెప్పుడును బంధరహితుడు; విముక్తుడేగాన పర మాత్మను పొందుటకెంత కాలము పట్టుననెడి ప్రశ్నయే అసందర్భమైనది. పరమేశ్వ రుని ఇప్పుడే, ఇచ్చటనే, యీక్షణమునందే పొందవచ్చును. ఆగుడు! పరబ్రహ్మమును, మీరును రెండుగాదు. ఒక్కటే ! ఉన్నదొక్కటే! పాపబంధరహితమైనది. సదాశుద్ధ మైనది. అద్దానిని గుర్తించినవారు మహత్తరమైన శాంతిసుధనిప్పుడే గ్రోలుచున్న అవతారమూర్తులుగా ప్రకాశించుచుండిరి. అట్టి మహనీయులకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

( 1934 సం॥ )

✦ సమస్త కర్మలకు కారకుడు, అధ్యక్షుడు ఆ భగవంతుడే. ఆయన యందే సర్వమును అర్పణ చేయవలయును.

# 8. రెండు ప్రపంచములు

సామాన్యమానవుడు, మనము చూచెడిది, వినెడిది తాకెడిది, అఘ్రాణించెడిది, స్ఫురించెడిది, మనము జీవించుచున్నది ఒకే ప్రపంచమైయుండ, రెండవ ప్రపంచము ఎచ్చట నుండి వచ్చెనని శంకించును. ప్రపంచమన్నను, లోకమన్నను ఒక్కటియే! మన శాస్త్రములలో, రెండు లోకములేగాక, పదునాల్గు లోకములున్నవని గూడ చెప్పబడి యున్నవి.

సామాన్యముగా స్థూల ప్రపంచమని, సూక్ష్మ ప్రపంచమని–అనగా మానసిక ప్రపంచమని, కారణ ప్రపంచమని మూడు ప్రపంచములున్నవని గూడ తత్త్వవేత్తలు నుడివిరి. ఇప్పుడు మనకు కావలసినది రెండు ప్రపంచముల గురించి మాత్రమే! ఈ మధ్యనేలనో నన్నెవ్వరు చూచుటకు వచ్చినను, "వీరు, అనగా నాముందర కూర్చుండి యున్నవారు నా ప్రపంచములో నుండిరా; లేక ఇతర ప్రపంచములో నుండిరా" అని తలవని తలంపుగా నన్ను ప్రశ్నించుచుండుట నాకే ఆశ్చర్యము గలుగు చుండును.

వారు నా ప్రపంచములో నున్న, నేను చెప్పెడిది కొంచెమైనను బోధపరచుకొన గలరు. వారు మరొక ప్రపంచములో జీవించుచున్న–నేను చెప్పిన మాటలు, బోధలు అగమ్య గోచరముగా నుండునుగదా! మన ఆధ్యాత్మిక వృద్ధికి తోడ్పడుటకు మన మిప్పుడు ద్వివిధ ప్రపంచములను విమర్శింతము.

1. ఆత్మ ప్రపంచము

2. అనాత్మ ప్రపంచము

1. ఆత్మ ప్రపంచము, సర్వకాల సర్వావస్థల యందును, పరిపూర్ణముగా సచ్చిదానంద స్వరూపముతోనిండి, కోటి సూర్య దివ్యతేజస్సుతో ప్రకాశించుచుండును. అది అద్వితీయము, అఖండము, అభిన్నము, అచ్చట విశ్వప్రేమ, విశ్వశాంతి విరా జిల్లుచుండును. ఆత్మ అద్వితీయము. రెండవది లేనిది. గాన యెటుజూచినను ఆత్మయే! అందరును ఆత్మ స్వరూపులే! 'ఏకమేవాద్వితీయం బ్రహ్మ' బ్రహ్మ స్వరూపము రెండుగాకుండ ఒకటిగానే ప్రకాశించుచున్నది.

ఓం తద్బ్రహ్మ, ఓం తద్వాయుః ఓం తదాత్మా
ఓం తత్సత్యం, ఓం తత్సర్వం, ఓం తత్పురోన్నమః
అంతశ్చరతి భూతేషు, గుహాయాం విశ్వమూర్తిషు,
త్వంయజ్ఞస్త్వం, వషట్కారస్త్వ మింద్రస్త్వం
రుద్రస్త్వం, విష్ణుస్త్వం, బ్రహ్మత్వం, ప్రజాపతిః
త్వం తదాప ఆపో జ్యోతీరసోమృతం బ్రహ్మభూర్భువస్సువరోం॥

నీవే బ్రహ్మవు, నీవే వాయువు, నీవే ఆత్మవు, నీవే సత్యము. నీవే సర్వము, నీవే ఆది, అంతర్యమున బాహ్యమున వెలుంగుచున్నది నీవే. విశ్వతేజస్సుగా, సర్వహృదయములయందు, ప్రకాశించుచున్నది నీవే యజ్ఞము నీవే. యజ్ఞముచేయువాడవు నీవే! ఇంద్రుడవు నీవే ! రుద్రుడవు నీవే, నీవే విష్ణువు, నీవే బ్రహ్మవు. నీవే ప్రజాపతివి. నీవుగాని దెద్దియులేదు. ఆంతర్యమున వెలుగు జ్యోతివి నీవే! అమృతతుల్యమైన బ్రహ్మ స్వరూపమునీవే. ఇటులనే ఉపనిషత్తులన్నియు, అద్వైత గ్రంథరాజములన్నియు, ఆత్మ ప్రపంచము గురించియే, ఏకగ్రీవముగా ఘోషించుచున్నవి.

2. అనాత్మ ప్రపంచము గురించి విమర్శింతుము.

చూచెడిదంతయు భేదమే !

వినెడిదంతయు భేదమే !

తాకెడిదంతయు భేదమే !

ఆఘ్రాణించెడిదంతయు భేదమే !

స్ఫురించెడిదంతయు భేదమే !

ఈ అనాత్మ ప్రపంచములో, అహంకారము చక్రవర్తిగావుండి, అజ్ఞానమనెడి సింహాసనము నధిష్ఠించినదై కామ, క్రోధ,మోహ,లోభ,మద మాత్సర్యము లనెడి మంత్రుల సహాయముతో, రాజ్యపరిపాలన చేయుచున్నవి. ఇది రాక్షస పరిపాలననియే చెప్పవలసి యుండును. ఇచ్చట ఏపనియు లేనివారి మెదడులో పిశాచములు, అసూయ, దంభము మొదలైన దుర్గుణములతో నిండి, నిరంతరము నాట్యమాడు చుండును. అనాత్మ ప్రపంచములో అంతయు బాధయే, దుఃఖమే ! జబ్బులకు, అశాంతికి ఆటపట్టై యుండును. ఇచ్చట స్థూలమైన, అనిత్యము, అశాశ్వతమైన శరీరపూజయే సదా జరుగుచుండును. క్షణభంగురములైన నామరూపములే పూజింపబడుచుండును. 'ఆత్మస్తుతి పరనింద' తన్ను తాను పొగడుకొనుట, ఇతరులను నిందించుటయే, ఈ అనాత్మ ప్రపంచములో ప్రాముఖ్యతను వహించియుండును. దీని గమ్యస్థానము నరకమే! అద్వితీయమైన, అభిన్నమైన (విడదీయుటకు వీలుగాని) రెండుగానట్టి ఒకే ఆత్మ స్వరూపములో, భిన్నత్వమును, భేదభావనను ఆరోపించుచు, నానాత్వమును, అనగా అనేకమైనవాటి నెవ్వడు చూచుచున్నాడో వాని శిరస్సు వెయ్యి ముక్కలగునని ఆత్మవిదులు చెప్పియుండిరి.

భేదభావనయే నరకము

అభేద భావనయే స్వర్గము

జ్ఞానేనహీనాః పశుభిస్సమానాః

జ్ఞానములేనివారు పశువులతో సమానులని శాస్త్రములు చెప్పుచున్నవి. అహంకార, మమకారములకు బానిసలై, నీది, నాది అనెడి భేదభావనతో నిండియున్న

వారికి, ఆత్మ ప్రపంచము గురించి చేయుబోధలు అగ్రాహ్యములుగదా! సామాన్యమైన చిన్న ఉదాహరణగా–మన ఆశ్రమములో నున్న పశువులన్నింటినీ–ఎద్దులను, ఆవులను, దూడలను రప్పించి, వానికి యంతగట్టిగా, గాంభీర్యముగా, విపులముగా బోధచేసినను, మనబోధలు వానిచెవుల కెక్కవుగదా! ఒక మోపుగడ్డితీసుకొని వచ్చి వాని ముందు వడవేసినట్లైన మన బోధలన్నియు విడచి, మనకేసి యైనను చూడకుండ ఆ గడ్డిని తినుటకు ప్రారంభించును.

నేను చెప్పెడి మాటలు కొందరకు కఠినముగా, కష్టముగా తోచినను, దుర్లభమైన మానవ జన్మను బడసియు, ఇటులనే పశుప్రపంచములో జ్ఞానవాసనయైన లేకుండ, అమూల్యమైన కాలమును వ్యర్థపుచ్చుచున్న వారిని గూడ మనము నిత్యము చూచుచునే యుంటిమి. అనాత్మప్రపంచములో దైవమును మరచి, జీవించుచున్న ప్రవృత్తి పరులను గురించియే భక్త చింతామణిలో కవిపుంగవుడు చక్కనైన యీక్రింది పద్యమును వ్రాసెను.

మ. మనుజుండై పశువౌటకంటెంబశు జన్మంబెచ్చు, నీవెట్లు దా
నిని బుట్టించితివట్లు చేయునది; హా! నిర్భాగ్యతనీ జ్ఞాన మె
ల్లను వ్యత్యస్తముజేసి, నీ విధుల నుల్లంఘించెదన్ నేను; దం
డన కర్హుండను, బ్రోవవే నను దయనీ; సద్భక్త చింతామణీ.

ఈపై పద్యములో మానవుడు తన దుస్థితిని గ్రహించి, తనను కాపాడుమని దైవమును ప్రార్థించుచున్నందుకు మనము కొంత ఆనందించవలసియున్నది. ఇక అనాత్మ ప్రపంచములో తమ దుస్థితినైనను గ్రహించక పైగా తాము చేయు అహంకార మమకార పూరితమైన స్వార్థపుపనులే గొప్పపనులని వాదించెడి మూర్ఖ శిఖామణులకు బ్రహ్మదేవుడైనను బోధించి వారి ప్రవృత్తి మనస్సులను మార్చజాలడు గదా!

ఆత్మ ప్రపంచములో ఆత్మయే దైవము. అనాత్మ ప్రపంచములో అజ్ఞానము, అహంకారము దైవము. ఆత్మ ప్రపంచములో నీవే, నేను అనెడి భావనముండును. అనాత్మ ప్రపంచములో నేను, నాది అనెడి భావన యుండును. ఆత్మ ప్రపంచములో అంతయు అభేదముగా గోచరించును.

"తత్త్వమసి; అదియే నీవు" అనెడి మహావాక్యమే ఆత్మ ప్రపంచమునకు గమ్యస్థానము. దంభము, దర్పము, భేదము, స్వార్థమే అనాత్మ ప్రపంచమునకు ఆధారమై గమ్యస్థానమై యున్నవి. ఆత్మ ప్రపంచములోని మానవులు లోకమునంతను తమ గృహముగా భావించుదురు. అనాత్మ ప్రపంచములో నున్నవారు తమ స్థూలదేహమునే తమ సర్వప్రపంచముగా భావించి పూజించుచుందురు. ఆత్మప్రపంచమునకు విశ్వప్రేమయే ధర్మచట్టము. లోకకళ్యాణమే గమ్యస్థానము. అనాత్మ ప్రపంచమునకు భేద భావనలు, పోరాటములు, యుద్ధములు, ఆధారములైయుండి మానవ కోటిని

అధోగతిపాలు చేయుచున్నవి. అనాత్మలలోగూడ ఆత్మను, నానాత్వములో ఏకత్వ మును, భేదములో గూడ అభేదమను గాంచెడి వారే బ్రహ్మవిదులు.

ఏకోవశీ సర్వ భూతాంతరాత్మా !
ఏకంరూపం బహుధాయః కరోతి ।
తమాత్మస్థం యే నుపశ్యన్తి ధీరాః।
తేషాం శాంతి శ్శాశ్వతీ నేతరేషామ్ ॥

అన్ని భూతములలో ఒకే రూపమును, ఒకే ఆత్మను, ఎవ్వరు దర్శించుచున్నారో వారిదే నిత్యశాంతి, మోక్షమనియు, నానాత్వమును చూచెడి దుర్బరులకు ముక్తి లేదనియు, మరలమరల ఉపనిషత్తులు చెప్పుచున్నవి. అన్ని జన్మలలో ఉత్తమమైన మానవ జన్మను బడయగల్గినందులకైనను, మనమందరమును సదా ఆత్మ ప్రపంచ మునందే జీవించుచు మానవజన్మకు గమ్యస్థానమైన బ్రహ్మసాక్షాత్కారమును బడయు దముగాక !

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు !
ఓం సర్వేషాం శాంతిర్భవతు !!
ఓం సర్వేషాం పూర్ణం భవతు !!!

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు
( 1935 సం॥ )

- సూర్యకిరణములు సూర్యుని నుండి వేరై ప్రత్యేకముగా నుండనట్లే, తలంపులు, కర్మలు ఆత్మకు వేరై ప్రత్యేకముగా నుండవు. మరియు కిరణములు సూర్యుడెట్లు కాదో అట్లే తలంపులు, కర్మలు మాత్రమే ఆత్మకాదు.
- సమాధిని అందలి బ్రహ్మానందానుభవమును అందరి శ్రేయస్సు కొరకు ఉపయోగించవలయును.

# 9. తత్త్వమసి - అది నీవే

అహంకర్తృత్వాభిమానముచే విమోహితుడవై చరించు ఓ మానవుడా! ఓ యీశ్వరత్వమా! లెమ్ము ! భ్రమప్రాయమైనట్టి నీ అనాది నిద్రనుండి మేల్కొనుము. భూతభవిష్యద్వర్తమానముల యందలి దైవత్వము నీవేయని గ్రహింపుము. ఆది మధ్యాంత శూన్యమైనట్టి ఈశ్వరత్వము నీవే యగుటచే నీవీశ్వరుడ వగుట కన్న అన్య మార్గములేదు. "న అన్యః పంథా అయనాయ విద్యతే" నీవు సచ్చిదానంద స్వరూపడవు. సత్యముఒక్కటియే. "ఏకమేవాద్వితీయం బ్రహ్మ." ఆ సత్యము ఈశ్వరత్వమును రెండును నీవే. ఇవిరెండును ఒక్కటియే.

అనంత ప్రభాభాసమానమైనట్టి నీ వైభవమును నీవు ప్రత్యక్ష భూత మొనర్చు కొనుము. అనుశ్రుతముగా వచ్చు నీ దైవత్వమును నిర్ధారణ చేసికొనుటకు ఇప్పటికే చాలాకాలాతీతమైనది. లెమ్ము ! కార్యోన్ముఖుడవు గమ్ము. "ఉత్తిష్ఠత ! జాగ్రత ప్రాప్య వరాన్నిభోధత."

ఓ ధన్యుడా ! ఎవడును ఆ ఈశ్వరత్వమును పొందుటకు ప్రత్యేకముగ ప్రయత్నింప పనిలేదు. ఏలయన ఆ ఈశ్వరుడవే నీవు. నీవే ఆ ఈశ్వరుడవు. జీవాత్మ పరమాత్మలు రెండు. అవి అభేదైక్య సంబంధముకలవి. కాన ఈశ్వరత్వము తక్క ఇతరమగు దాని నిచ్చగింపకుము. నీవు జననమరణ దుఃఖరహితుడవు. నీ స్వభావము వృద్ధి క్షయములు లేనిది. అందుచే నితరమగు దానిని వాంఛింపకుము. నీచే త్యజింప బడునదిగాని, పొందబడునదిగాని యేదియును లేదు. అణ్వాది బ్రహ్మ పర్యంతము గల సమస్తము నీవైభవమునందు నిండి నిబిడీకృతమైయున్నది. ఈశ్వరత్వ మున పరిచ్ఛిన్న ప్రయత్నముల కతీతుడవగుము. నిత్యమైసత్యమై నిర్వికల్పమై అవాఙ్మానస గోచరమై సహస్ర ఖరకరులమాడ్కి అఖండజ్యోతిస్వరూపమై వెలుగొందు నట్టిదేదియో అది నీవై యున్నావు. గాన ఈశ్వరుడవగుట కన్న నితరమగుటకు అపేక్షింపకుము.

జ్యోతులకెల్ల పరంజ్యోతివైనట్టి నీవింకను అధికతేజోవైభవముల కేల ప్రాకు లాడెదవు? అవిరామధ్యానము చేతను రిక్త ప్రార్థనలచేతను లజ్జపడుటలేదా? నీవే అద్వితీయుడవై యుండ ఎవరికొరకు నీ ధ్యానాదికముల నర్పణ చేసెదవు? సర్వము నీవైయుండ సర్వము నీయందుండ ఇంకెవరిని సందర్శింప నభిలషించుచున్నావు? భగవంతుని పొందుటకు గాని, భగవంతుడవగుటకు గాని యెప్పుడును ధ్యానింప కుము. ఏలయన నీవు శాశ్వతుడవు. సత్య స్వరూపుడవు. నిత్యుడవు, నిశ్చలుడవు ఇన్నియేల ? నీ వనిర్వాచ్యమహాశక్తి స్వరూపుడవు. కాన నీ ఈశ్వరత్వమును గ్రహించి అనుభవపూర్వకముగా ఆనందించి మౌనముగాను, ప్రశాంతముగా నుండుము. "నిశ్శబ్దో బ్రహ్మ ఉచ్యతే" ఇదియే నీకు మోక్షము నిచ్చు నిజమైన ధ్యానము.

ఓ మహత్తర మగు దివ్యతేజఃపుంజమా! అహంకార జ్వరపీడితమైన నీ తను

భావమునకు తిలోదయకములనిమ్ము. నీ ప్రాపంచిక విషయ సౌఖ్యాదికముల బోనాడుము. ఆశాపాశాదుల నావలకి తరిమివేయుము. విషయ వాంఛాపంచకమునకు సాక్షీభూతుడవగుము. నిశ్చలముగాను, శాంతియుతముగా నుండి నీ జన్మ హక్కును స్థిరీకరించుకొనుము.

ఆ ఈశ్వరత్వమే నీవని గ్రహించినప్పుడు నీవు భ్రమ ప్రాయములైనట్టి మానసిక, వాచిక, కాయికాది ప్రాపంచిక భావముల కతీతుడ వగుదువు. బుద్బుదప్రాయమైనట్టి చర్మ చక్షుర్గోచరమగు నీబాహ్య ప్రకృతి యంతయు అపారానంద పారావారమున అంతరించును.

ఓ ప్రియుతముడా ! ఇది నీవు పఠించునపుడు ఒక్కసారిగ 'తత్వమసి–అదినీవే' యని గ్రహించి నిశ్శబ్దానంద లబ్దవైభవమును ఎలుగెత్తి చాటుము.

అదిగో సందర్శింపుము ! నీ విశ్వప్రేమోచ్ఛ్వాసమున ప్రత్యక్షాప్రత్యక్షములు విలీనమగుచున్నవి. నీవు తత్వమస్యాది గంభీర మహోపశాంతివి. బ్రహ్మానంద భరితుడవగుము.

జీవో బ్రహ్మైవనాపరః

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

( 1936 సం॥ )

# 10. ఆశాపాశములనెడి ఉచ్చులలో

ప్రియమైన పాఠకా ! నీవు ఆశయనెడి ఉచ్చులో శరీరమనెడి జ్ఞప్తితో జీవితమనెడి చెట్టునుండి వ్రేలాడు చుంటివా? లేక క్షీరసాగరమున విహరించు రాజహంసవలె నీలోనున్న దైవామృతమును గ్రోలుచు బ్రహ్మానందము ననుభవించు చుంటివా?

బ్రహ్మానందమన నేమి ? 'బ్రహ్మానందం పరమ సుఖద'మని చదువుట చాలసులభము గదా ? బ్రహ్మానందము ననుభవించెడి మహనీయులు ఎచ్చటనో కోటికొకరు అరుదైయుందురు గదా ?

కావున వారందరును ఆశయనెడి త్రాటిచే అజ్ఞానమనెడి యుచ్చులలోబడి జీవితమనెడి చెట్టునకు ప్రపంచమనెడి వనములో వ్రేలాడు చుండుట ఎంత విచార కరమైన విషయము ! నేను వ్రాయుచున్నది కొందరి సున్నితమైన కర్ణములకు కఠోరముగా తోచినను అది సత్యమే. సత్యమెప్పుడును కఠినముగనే యుండును. అది పరమాన్నమువలె తియ్యగ నుండదు. అసత్యమో ? అది అతి మాధుర్యముగ నుండును. ప్రవృత్తిపరులు దానినే హృదయపూర్వకముగ ఆహ్వానించెదరు. సత్య మార్గము చాల ఇరుకుగ ముండ్లతో నిండియుండుననియు దాని నధిగమించెడివారు ఎచ్చటనోగాని కానరారని మహనీయులు నుడివి యుండిరి. ఇప్పుడు మనము ప్రపంచమనెడి మహారణ్యములో ప్రవేశించి పైన చెప్పినట్టి వృక్షములకు వ్రేలాడుచున్న దురదృష్టవంతులైన మానవులగతిని పరిశీలింతము.

గమనించుడు ! ప్రతి వృక్షమున మనుజులు వ్రేలాడుచునే యుండిరి. అందు ధనికులు,పేదలు, విద్యావంతులు, విద్యాహీనులు, శక్తిమంతులు, అశక్తిపరులు– వారు, వీరననేల ఆశాపాశములచే కట్టబడిన వారందరును ఆ తోటలో ఏదో ఒక చెట్టు కొమ్మకు వ్రేలాడుచునే యుండిరి. ఆశ ఎంత గొప్పదైనను చిన్నదైనను, చివరకు సాధువులను సన్యాసులను గూడ విడువదు. ఆశ గల్గిన వారందరు వారెవ్వరైనను ఉచ్చులలో ఆ వృక్షమునకు వ్రేలాడుచునేయుండిరి.

చూడుడు ! కొందరు ధనవంతులు, సంస్కర్తలు, మాటలచే దైవమును మోసపుచ్చ ప్రయత్నించినవారు, తమలో దూలములంతటి లోపములుంచుకొని ఇతరుల నేత్రములందలి నలుసులను తీయ ప్రయత్నించువారు, ప్రేమ శూన్యులై సారము లేని పొల్లుమాటలు చెప్పువారు, ప్రవృత్తి పరులు, విషయలంపటులు, రకరకముల త్రాళ్ళచే కట్టబడి ఉచ్చులలో వ్రేలాడు చుండిరి.

వారి వారి ఆశలనుబట్టి కొందరు బంగారు ఉచ్చులలోను, వెండి ఉచ్చులలోను, ఇత్తడి, రాగి ఉచ్చులలోను, సామాన్యులు కొబ్బరి, జనపనార ఉచ్చులలోను బిగించ బడి వేలాడుచున్నారు. ఆశ అనెడి ఉచ్చుయొక్క త్రాడు బంగారు తీగెతో చేసిన మాత్రమున బంధించ కుండునా? అవి ఏ లోహముతో తయారైనను సమముగ మెడను బిగించి బంధించును. చిరకాలమునుండి ఆ ఉచ్చులతో బంధింపబడినవారి

గతి ఏమి ? మీరే గాంచుడు. ధన సంపాదనతో అంతు, దరిలేని సంసార తాపత్రయములలో వారి రక్తమాంసములు ఆర్చుకొని పోయెను.

ఇక క్రొత్తగ ఆశ యనెడి ఉచ్చులలో బంధింపబడినవారి దీనావస్థ చాల జాలి కరము. వారి ప్రాణము పోకుండగనే మనము చేయగల్గిన సహాయము మిగిలియున్న వారికైనను వెంటనే అందజేయవలయును. వారిని మనము ప్రేమతో శాంతినిలయములకు శాంతిననుభవించుటకు రమ్మని ఆహ్వానించినను వారు ఆశాపాశములచే కట్టబడి యున్నందున, పాపము, వానిని త్రెంపుకొని మనవద్దకు రాజాలరు. కనుక మనమే వారి చెంతకు వెళ్ళి వారిని ఆ ఉచ్చులనుండి విడిపించవలెను.

ఆహా ! మాయ యొక్క గట్టిదనము, అంధకారము ఎంత ప్రబలమైనదనగా కొందరు ఆ ఉచ్చులలోనే నరకబాధల ననుభవించుచుండినను వానినే ప్రేమించుచు, తమ్ము అందుండి తప్పించవలదనెడి మూఢులు కూడ లోకములో నుండుట విచార కరము. వీరి అవస్థలిటులుండ కఠినహృదయులైన ధనపిశాచారాధకులు ఏవిధముగ నైన నాలుగు డబ్బులు ప్రోగుచేసికొనుటే జీవితపరమావధియని, వారి తెలివితేటల నుపయోగించి అందరి మనసుల నాకర్షించెడి క్రొత్త క్రొత్త వ్యాపారములనెడి రక రకముల ఉచ్చులు తయారు చేయుచు అమాయకులైన, జనులకు అమ్మజూపు చుండిరి.

ఆహా ! లోకమంతయు ఆశచేతనే బంధింపబడియున్నదని మహనీయులు చెప్పినదెంత సత్యముగదా ! ఇంకను ప్రపంచములో అనేక జీవితములను పరీక్షించి నచో ఈవిధమైన ఆశయనెడి ఉచ్చులలో వారు తగుల్కొనుటయేగాక ఇతరులను లాగెడివారేగాని విడిపించెడి దీనదయాపరులెచ్చటను కానరారు. అట్టి ధన్యజీవులు అసలే లేరని చెప్పుటకు వీలులేదు. అసలే లేకున్న ప్రపంచమింకను అంధకారములో పూర్తిగా నిండియుండును. కాని అట్టి జీవన్ముక్తులు చాల అరుదు. ఇక ఆరూఢులో, వారిని వ్రేళ్ళమీద లెక్కించ వచ్చును.

ఇప్పుడు మనకు కావలసినది ఇతరులను ఖండించుట, విమర్శించుటకాదు. మనము నిర్వృత్తులమై మన ఆంతర్యపుటాలోచనలను, మాటలను, పనులను ఎప్పటికప్పుడు నిష్పక్షపాతముగా, కఠినముగ పరిశీలించుకొనుచు దీపము ఆరిపోవక ముందే అనగా ఈ శరీరములనుండి ప్రాణములు పోకుండగనే మన ఉచ్చుల నుండి విముక్తుల మగుటకు ప్రయత్నించవలెను.

## రెండే ప్రశ్నలు

1. ఉచ్చులలో బిగించబడి జీవిత వృక్షముల నుండి వ్రేలాడు చుంటిమా? లేక రాజహంసవలె నిరంతర 'సోహం' భావనతో బ్రహ్మానందము ననుభవించుచుంటిమా?

2. నిద్రపోయెడివారి నెవ్వరైనను మేల్కొల్పగలరు. కాని మెలకువగ నుండి నిద్రపోవుచున్నట్లు నటించెడి వారి నెవ్వరు మేల్కొల్పగలరు? విషమును అమృతమని

వాదించెడివారి కెవ్వరు నచ్చచెప్పగలరు ?

ప్రియమైన పాఠకులారా ! ఇప్పుడైనను మీ ఆంతర్య జీవితములను పరీక్షించు కొని యదార్థమును గ్రహించి వెంటనే మేల్కొనుడు. నేను వ్రాయుచున్నది. కఠినముగ కన్పించినను మీ శాంతిని కోరియే ఇంతగా వ్రాయుచుంటిని.

దైవము ఆశాపాశములనెడి ఉచ్చులలో చిక్కుకొని యున్నవారి కందరకు ముక్తిని ప్రసాదించుగాక.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం తత్సత్ ఓం

( 1937 సం॥ )

- భగవంతుని మరచుట అసాధ్యము. ఏలననగా మన ఉనికే ఆయన యందు, ఆయన యందే మన ఉనికి.
- తాను ఏ కొరతలేని సంపూర్ణుడనని గ్రహించినచో, పిమ్మట ఏదైన చేయ వచ్చును, మానవచ్చును.
- అహంకారమే అన్ని అనర్థములకు మూలకారణము. దాని నుండియే కామము, మోహము, క్రోధము కలుగును.

# 11. ప్రజ్ఞానం బ్రహ్మ

ఈ తెలివి అల్పమైనది. మహత్తరమైనది, అఖండమైన బ్రహ్మగా నెటుల కాగలదు?

నీటిబుడగ సముద్రమెటుల కాగలదు ? చిన్న కిరణము సూర్యునిగా నెటుల పరిణమించగలదు ? అతి అల్పమైన చిన్న అణువు బ్రహ్మాండమైన బ్రహ్మస్వరూప ముగా నెటుల ప్రకాశించగలదు? ఈ సమస్య విపరీతముగా గానవచ్చును. కాని అనుభవములో నీటిబుడగ సముద్రము నందు విలీనమగుచుండ సముద్రముగానే యున్నది.

కిరణము సూర్యుని చేరుచుండ సూర్యుని గానేయుండును. అణువు బ్రహ్మాండ ములో లీనమైనప్పుడు బ్రహ్మాండమే మిగిలియున్నది. ఖండమైన ఈ శరీరములో వెలుంగుచున్న యీ తెలివియే సోహం భావనను తైలధారవలె అనుసరించిన అఖండ సచ్చిదానంద స్వరూపములో లీనము చేయుచున్నది.

అందుచేతనే నీ తెలివి "తత్వమస్యాది లక్ష్యం" అని జీవన్ముక్తులు నుడివి యుండిరి. "తత్వమసి" అదియే నీవు అనెడి భావనతో, తెలివియే నేను అనెడి ధ్యానముతో, శ్రవణ, మనన, నిధిధ్యాసల సహాయముతో స్థిరము చేయవలసియున్నది.

తోటపల్లి ఆశ్రమములో గుహలోనికి ప్రవేశించనున్నపుడే 'ప్రజ్ఞానం బ్రహ్మ' "తెలివియే నీవు"అని వ్రాయబడి యున్నది. ఆఎఱుక జ్ఞప్తితో గుహలో ప్రవే శించిన అచ్చట అంతా తేజస్సుగానే గానవచ్చును.

ఆ దివ్య తేజస్సు అనాదినుండి అంతమువరకు, ఇప్పుడప్పుడనక, నిరంతరము వెలుంగుచున్నది గాన, ఆ తేజస్సుననుభవించినవారు, జాగ్రదవస్థలోనే గాక నిద్రా వస్థలో గూడ మెలుకువతో స్వస్వరూపానందమును అనుభవించుచునే యున్నారు.

మీలో వ్యక్తమైయున్న తెలివిని, ఆ దివ్యతేజస్సును మరచుటే మృత్యువు. ఆ తేజస్సు ననుభవించుటయే అమృతమయ జీవితము. పరమసుఖప్రదమైన ఆ బ్రహ్మానంద తేజస్సును నిరంతరము అనుభవింపుచు మన జీవితములను సార్థకము చేసుకొందము గాక !

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

ఓం తత్ సత్ ఓం

( 1938 సం॥ )

# 12. రెండు తరగతుల మానవులు

ఆశయా బద్ధ్యతే లోకః

ప్రపంచములో సాధారణముగా రెండు తరగతుల మానవులను మనము చూచు చుందుము.

1. ప్రవృత్తి పరులు
2. నివృత్తి పరులు

ప్రపంచమంతయు మాయచేగూడి ప్రవృత్తి పరులతో నిండియున్నది. నివృత్తి పరులెచ్చటనో లక్షకొక్కరుగలరని చెప్పవలెను. సముద్రపు తీరమున జాలరులు, తమ వలలతో వేలానవేల చేపలను పట్టుచుందురు. ఆ చేపలలో ఒకటి రెండు మాత్రమే బయటపడి మరల సముద్రమును చేరుచుండును. వలలోనున్న కొదువ చేపలన్నియు మృత్యువునే చేరుచుండును.

అటులనే ప్రవృత్తిపరుల జీవితములు మాయ యనెడి వలలో చిక్కుబడిన మత్స్యములవలె తమకు తామే బంధించబడి మృత్యువును చేరుచుండును. వలలో చిక్కిన మత్స్యములు కొన్ని బయటపడుటకు కొట్టుకొననైన కొట్టుకొనవు. అందు కొన్ని మాత్రమే బయటపడుటకు ప్రయత్నించును. ప్రయత్నించిన వానిలో గూడ ఒకటి రెండు మాత్రమే విముక్తిని బడయుచున్నవి.

శ్రీకృష్ణభగవానులు గీతలో వేలానవేల మనుష్యులలో కొలది మంది మాత్రమే మోక్షమునకై ప్రయత్నించు చుండిరనియు, ఆ ప్రయత్నించెడి వారందరిలో ఒకరిద్దరు మాత్రమే తన్ను చేరుచుండిరనియు నుడివియుండిరి.

శ్లో॥ మనుష్యాణాం సహస్రేషు కశ్చిద్యతతి సిద్ధయే ।
యతతామపి సిద్ధానాం కశ్చిన్మాం వేత్తి తత్త్వతః॥ 7-3

ప్రవృత్తి పరుడు పుట్టుచు, చచ్చుచు, కర్మ ఫలితముల ననుభవించుచు అధోగతి చేరుచుండును. ప్రవృత్తి పరుని జీవితము విషాదకరము. కామక్రోధ,లోభమోహ, మదమాత్సర్యములతో నిండియుండి సదా ఇతరుల తప్పులనే వెదకుచుండును. అతని ఆలోచనలు, సంకల్పములు, కోరికలు, తలమీదనున్న వెంట్రుకలవలె, ఆకాశ ములోని నక్షత్రములవలె సముద్రములోని కెరటముల వలె లెక్కకు మీరి యుండును.

ఇక నివృత్తి పరుడు చావుపుట్టుకలులేని శాశ్వత స్థానమును చేరి జన్మరాహిత్య మును బడయును. అతని సంకల్పములు, మండుచున్న అగ్నిలోచల్లదనము లేనట్లును సూర్యునిలో చీకటి లేనట్లును సంకల్పశూన్యముగా నుండును. నివృత్తి పరునికి గూడ బాహ్యమున ఏదైనను సంకల్పముండినట్లు గానవచ్చినను, ఆ సంకల్పము కాలిపోయిన త్రాడు-ఆకారమునకు మాత్రమే త్రాడుగా కనిపించుచు-కట్టుటకు ఎటుల నిరుపయోగమో,అటులనే నివృత్తి పరుని సంకల్పములు అతనిని బంధింప

జాలవు. ఆలోచలనన్నింటికి మూలకారణము ఆశయే ! ఆశచేతనే, అజ్ఞానమువల్లనే తన స్వస్వరూపమును అనగా దైవమును మరచుట జరుగుచున్నది.

శ్రీ శంకరునివంటి మహనీయులు–

ఆశయా బద్ధ్యతే లోక; కర్మణా బహు చింతయా

ఆయుఃక్షీణం న జానాతి తస్మాత్ జాగ్రత్త ! జాగ్రత్త !

అని నొక్కి చెప్పినను ఈ సందేశము నూటికి తొంబది తొమ్మిది మందికి వినబడ కుండుట విచారకరము. ఈ స్థితినే క్రీస్తు ప్రభువు కండ్లుండియు గ్రుడ్డిగా నుండిరనియు, చెవులుండియు వినలేక యుండి రనియు వర్ణించి చెప్పిరి. ఇప్పుడు మీ శరీరములున్నచోట మనస్సుల నుంచితిరో లేదో మీరే అంతర్య హృదయములను, భావనలను పరిశీలించి తెలిసికొనుడు! అందుచేతనే మనము శరీరములున్నచోటనే వుండి యుండలేదని, మన మనస్సులున్నచోట ఉందుమని పెద్దలు చెప్పియుండిరి. దేనినైనను సాధ్యము చేసికొనవచ్చును గాని, మనస్సును స్వాధీనము చేయుట, జయించుట దుర్లభమని అనుభవనీయులు అనేక రీతులుగా అనేకమైన ఉదాహరణ ములతో చెప్పియుండిరి.

శ్రీ సీతారామాంజనేయ సంవాదములో బహు విపులముగా చెప్పబడిన ఈ క్రింది పద్యమును చూడుడు :

చ. అలయకసప్తవారిధుల నావలి కీవలి కొక్కరీతిగా
గలయంగ నీదవచ్చును నగంబుల నచ్చన గుండ్లుగాగరం
బులంగొని యాడవచ్చు నభమున్ గబళింపగ వచ్చుగానియి
య్యల నమనస్కయోగము గ్రహింపగరాదు దలంపనేరికిన్.

ఈ యమనస్క యోగమును గ్రహించుట మిగుల కష్టసాధ్యము. కొంచెమైనను నాయాసము నొందక సప్తసముద్రముల నీవలిదరి నుండి యావలిదరివరకు నీ దిన నీదవచ్చును. కుల పర్వతముల నచ్చన కాయలుగాజేసి యాడవచ్చును. ఆకాశము నైనను మ్రింగవచ్చును. కాని యీ యోగమును మాత్రము పరిశుద్ధచిత్తులు కాని వారలు గ్రహింపనే గ్రహింపలేరు.

అనగా ఎంతయో యత్నము చేతగాని సాధ్యముగాని మనోజయము జితేంద్రి యులకు మాత్రమే సాధ్యమని భావము, ముఖ్యముగా ప్రవృత్తిపరులకు అసాధ్యమైనదే నివృత్తి పరులకు సులభము, సౌఖ్యము, సూక్ష్మమని గూడ చెప్పబడి యున్నది.

చెలువుగం బువ్వులు చీరుట కంటెన్
బొలుపుగం గన్గన మూయుట కంటెన్
నలువగు నీ యమనస్క పథంబే
సులబము సౌఖ్యము సూక్ష్మము వత్సా !

ఆత్మానాత్మ వివేకముగల బుద్ధిమంతులకు పూవుల రేకులను చీల్చుటకంటెను, కన్నులను మూయుట కంటెను, యీ యమనస్క యోగమును గ్రహించుటయే మిగుల సులభము. ఆనందకరము, సూక్ష్మమైనది.

నివృత్తి పరుడు, సాధువుంగవుడైన జడభరతుడు చనిపోయెడి సమయమందు, తాను ప్రేమతో పెంచిన లేడియేమైపోవునో అన్న సంకల్పముచే మరల రెండు జన్మలెత్తవలసి వచ్చెనుగదా !

ఇక పరిమితిలేని కోరికలు, కక్షలు, ఈర్ష్య, ద్వేషము, ఆత్మస్తుతి, పరనిందలతో జీవించెడి ప్రవృత్తి మానవులు ఎన్ని కోటానకోట్ల జన్మలెత్తవలెనో మీరే యూహించి తెలిసికొనుడు. అట్టివారికి మోక్షమెన్నటికైన గలదా యని అనుమానము గలుగ వచ్చును.

నేడుగాకున్న రేపైనను, కోటి సంవత్సరములకైనను ఎప్పటికైనను అందరును తమ గమ్యస్థానమగు దైవమును చేరుదురు. గాని ఈలోగా కోటి సంవత్సరములలో, అనేకమైన జన్మలెత్తి అంధకారములో, శరీర జ్ఞప్తిలో, భేదబాధలతో నిండి అవస్థలు పడుచుగడుపనేల? నేడే మనది రేపు మనదికాదు గాన, నేడే, యీ ప్రస్తుత క్షణము నందే మన మనస్సులను పూర్తిగా దైవమున కర్పించి తరించ ప్రయత్నించెదముగాక! దైవము మీ అందరను సదా శాంతితో బ్రోచుగాక !

లోకా స్సమస్తా స్సుఖినో భవంతు !

ఓం శాంతిః శ్శాంతిః శ్శాంతిః

( 1939 సం॥ )

# 13. శాంతి

శ్రీ శాంతి ఆశ్రమము ధర్మమును,విశ్వప్రేమను, శాంతిని వ్యాపింపచేయుటకు, శాంతిని కోరువారికి ఆశ్రయమిచ్చుటకు, చాల సంవత్సరముల క్రితము, దైవ ప్రేరణచే స్థాపితమయ్యెను.

శాంతియన్నను, ధర్మమన్నను, ప్రేమయన్నను, దైవమన్నను ఒక్కటియే!

శాంత్యో యమాత్మా

ఆత్మయే శాంతి – శాంతియే ఆత్మ. శాంతము లేక సౌఖ్యములేదు.

జీవితమునకు శాంతియే ఆధారము. అదియే గమ్యస్థానము. శాంతిని ఉచ్ఛ్వాస నిశ్వాసలలో పూరింపుడు.

ప్రతిశ్వాసలో దైవము ననుభవించెడివారి జీవితములే ధన్యమైనవి. లోకములో ప్రతి మానవుడు శాంతినే కోరుచున్నను, ఆశాంతిని అపరోక్షముగ అనుభవించెడు వారు చాల అరుదైయుండుట విచారకరము. శాంతిని గురించి సభలు జరిపి ఉపన్యాస ములిచ్చుట చాలతేలిక. శాంతిని గురించి వ్యాసములు వ్రాయుట బహుసులభము, కాని శాంతిని నిరంతరము అనుభవించుటే చాలదుర్లభము. శాంతి ననుభవించుటకు కోరికలు విడువవలెను. మానవ జీవితగమ్యస్థానమును మరువరాదు.

కోరికయే బంధము.

కోరికలు వదలుటయే మోక్షమునకు సులభమార్గము.

ఆశయా బద్ధ్యతే లోకః

ఆశచేతనే లోకమంతయు బంధింపబడియున్నది. ఆశయె నరకమునకు దారి తీయును. అధర్మ చింతనలు, ఆశలు విడుచుటే, స్వర్గమునకు సులభమార్గము. స్వర్గనరకము లిచ్చుటనేయున్నవి.

ప్రియపాఠకా ! నిమీలితనేత్రుడవై, నీ మనస్సును, హృదయమును ఒక్కసారి పరీక్షించుకొనుము. నీ మనస్సు ఎటుల పరుగెత్తుచున్నదో గాంచుము. నీ మనస్సు ధర్మాచరణపై, దైవమువైపే పరుగెత్తుచున్నచో నీ జీవితము ధన్యవంతము. విషయ వాసనలు, నామరూపముల వెంట పరుగెత్తుచున్నచో నీ జీవితము భూభారము.

కం॥ వాసనలే సంసారము
వాసన లణగుటయె ముక్తి బడయుటయంచు నీ
వాసన లణచి యథాస్థితి
గాసిలగాక యుండువాడె ఘనుడౌ ధాత్రిన్ ॥

అని అష్టావక్రమహాముని వేదసారమంతను చిన్న పద్యములో నుడివి యుండెను. ఆశచే పరిమితిలేని కోరికలతో నిండియున్న వారిని చూచి, పిశాచములు అట్టివారిచుట్టును తిరుగుచుండునట. ఏ కోరికలు లేక స్వార్థరహితముగ నుండువారి

సేవ చేయుటకు దేవతలు వారి చెంతనే సదావేచియుందురట. దుష్టవాంఛలే నిజమైన శత్రువులు ధర్మయుతమైన కోరికలే నిజమైన మిత్రులు. మాయను, కోరికలను జయించువారు చాల అరుదు. కోరిక ముఖ్యముగ చెడుకోరిక, యెట్టివారి నైనను బంధములో, బురదలో పడవేయుచుండును.

ఒక మహనీయుడు అన్ని కోరికలను విడిచి ఆదర్శవంతమైన జీవితమును గడుపుచుండుట గాంచి, దేవతలు గూడ ఆశ్చర్యపడుచుండిరట. సైతాను, వాని అనుచరులు ఎంతగా ప్రయత్నించినను, అతని ఆదర్శనీయమైన జీవితమును పాడు చేయజాలక, యమధర్మరాజుతో తమకు భూలోకములో ప్రస్తుతము పనిలేదని చెప్పగా ఈవ్యక్తి యొక్క భావి జీవితమును తన దివ్య దృష్టిచే చూచి, దీర్ఘముగా ఆలోచించి, ఇంక అతనిని గురించి మీరు ఏ ప్రయత్నమును చేయనవసరము లేదు. అతడు తన మిత్రుల సలహాలతో ఒక ఆశ్రమమును స్థాపించుటకు ప్రయత్నించు చుండెను. ఆ ఆశ్రమస్థాపనమే అతని పతనమునకు దారితీయునని చెప్పెనట. ఆశ్రమము స్థాపించుట సులభమేగాని, దానిని సక్రమముగ, ఆదర్శవంతముగ నడిపించుట, నిష్కామ సేవ చేయించుట చాల దుర్లభము. మాయా ప్రభావముచే, ఈ కాలములో ప్రతి సాధకుడును ఒక ఆశ్రమము స్థాపించవలెననియు, తాను గూడ ఒకపీఠాధిపతి కావలెననియు కోరుచుండును. తదుపరి నెమ్మదిగా ఒక గురుకుల పాఠశాలనో,లేక పత్రికనో స్థాపించ వలెనని సంకల్పించును. ఇంకను అనేక సదుపాయములను కోరును. ఇటులనే కోరికలనేక కష్టములను, బంధములను తమకు తెలియకుండగనే సాధకుల హృదయములలో నివాసమేర్పరచుకొని వృద్ధియగుచుండును. ఇక తమ ఆశ్రమ పోషణకు పట్టరానివారి పాదములు పట్టుచు, యాచన చేయవలసియుండును.

'కౌపీన సంరక్షణార్థం అయం పటాటోపః' అని చెప్పబడినట్లు ఆశ్రమ సంసార మహాసముద్రములో మునిగి యుండును. నారదుడు, దేవేంద్రాదులు గూడ మాయను జయింపజాలరైరి. పెదవులతో 'శాంతి, శాంతి' యని ఉచ్చరించుచున్నను, హృదయ ములు అశాంతిచే, పరిమితి లేని కోరికలచే నిండియుండును.

ఓ ఆశాపిశాచమా! మా దిక్కు మాలిన అవస్థలను గాంచి
కనికరించి మమ్ము కోర్కెలనుండి దూరముగా నుండుటకు
తోడ్పడుము. ప్రేమతో మమ్ము విడిచిపొమ్ము.
తమ్ము తాము తెలిసికొనగల్గిన వారికి శాంతిగలదు.

ఇతరులను విమర్శించుచు విలువైన కాలమును వ్యర్థపుచ్చవలదు. నిన్ను నీవు తెలిసికొని, నేడే నీ మానవజీవితమును ధన్యము చేసికొని తరించుము. నిన్ను నీవు తెలిసికొన గల్గినప్పుడే అన్ని కోర్కెలు, ఆశలు, సూర్యుని ముందు మేఘములు పోవునట్లు నిన్ను వదలిపోవును. అప్పుడే పూర్ణశాంతిని పొందగలవు. లోకములో శాంతి స్థాపిత మగును గాక ! ఆ శాంతి మన హృదయములలోనే మొదట స్థాపిత

మగునుగాక !

ఇక వెయ్యి మాటలు,వెయ్యి వ్రాతలు ఏల ? నేడే, ఇప్పుడే శాంతి స్థాపన నీ హృదయములో ప్రతిశ్వాసతో చేయుము.

శాంతియే నీ జన్మ హక్కు, దానిని మరచుటే మృత్యువు. నీ ఉచ్ఛ్వాస నిశ్వాసలో శాంతి స్థాపించుకొనుము. నీవు పూరించుచున్నది శాంతి, నీవు వదలుచున్నది శాంతి. ఉచ్ఛ్వాస, నిశ్వాసలలో శాంతియే ! ఇదియే మంత్రములకు మహామంత్రము. శాంతి ననుభవించుటయే ఉపదేశములకెల్ల గొప్ప ఉపదేశసారము, శాంతిని గుర్తించి తరించుము. ప్రతి శ్వాసతో శాంతిని ననుభవించుచు, మన జీవితములను శాంతి యుతముగా చేసికొని తరించెదము గాక ! ఇప్పుడు శాంతిగీతమును పాడుచు, స్మరించుచు శాంతిలో విలీనమయ్యెదముగాక !

శాంతి మంత్రము

ఆకసంబున శాంతి వెలుగుగాక !
స్వర్గధామమున శాంతి ప్రతిష్ఠిత మగును గాక !
జలమునందు శాంతి సుస్థిరంబగుగాక !
పృథ్వియందు శాంతి కీర్తింపబడునుగాక !
సకల వృక్షలతాగుల్మములయందు శాంతినదము ప్రవహించుగాక !
సమస్త చరాచరములు శాంతితో నింపబడుగాక !
సర్వగృహములలో శాంతి స్థాపన జరుగు గాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి, శ్శాంతిః శ్శాంతిః

( 1940 సం॥ )

# 14. గడియారము ఆగిపోయెను

గడియారము ఆగిపోయెను. ఏ గడియారము ? బైట గడియారమా ? లోపలి గడియారమా ? లోపలిగడియారమే ఆగిపోయిన ఈ వ్యాసము వ్రాయుట ఉండదు గదా! కాన బయట గడియారమే ఆగిపోయెను.

కైలాసములో గడియారము ఆగిపోయెను. ఎందుచేత ఆగిపోయెను ? మామూలుగా, ఆదివారము దానికి "కీ" యిచ్చు చుందును. ఈ ఆదివారము "కీ" ఇచ్చుట మరచినను రెండు రోజులు పైగా తిరిగి రాత్రి 10 గంటలవద్ద ఆగిపోయెను.

ఈ మధ్యను తెల్లవారుఝామున ఒంటిగంట. రెండు గంటల మధ్యప్రతిదినము లేచుచుంటిని, మామూలుగ లేచి టైము చూడగనే 10 గంటలవద్ద గడియారము ఆగిపోయి యుండెను. ఏమి చేయుట? గడియారము ఆగిపోయిన నీకు నష్టమేమి? ఈ బైటగడియారమేగాక నీ హృదయమనెడి గడియారము ఆగిపోయినను నీ ఆత్మకు నష్టములేదు. నీఆత్మకు, స్వస్వరూపమునకు బైట గడియారములు, ఆంతర్యపు గడియారములు ఎందులకు ? ఆహా ! ఈ గడియారములేగదా మానవులను కాలమునకు బానిసలుగచేసి పరుగెత్తించుచున్నవి. గడియారము ఆగిపోవుట మాట అటుంచి కైలాసములో నీకు గడియారమెందులకు ? టైము ప్రకారము ఆఫీసుకు వెళ్లవలెనా? ఆఫీసుకు వెళ్ళుటకు కొన్ని నిముషములు ఆలస్యమయిన నీ యుద్యోగము పోవుననియా ?

ఓ వెఱ్ఱినాయనా ! ఈ గడియారములను పూజించుట మాని కాలమునకు అతీతుడైన ఆ పరంధాముని పూజించుచు తరించుము. ఆ పరబ్రహ్మ స్వరూపములో గడియారములేగాక భూతభవిష్యద్వర్తమాన కాలములు గూడ లేవుగదా !

నిన్న, మొన్న, నేడు,రేపు, గంటలు,రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు, యుగములు ఇవన్నియు మానవ కల్పితములు. మనస్సే వీటినన్నింటిని సృష్టించు చున్నది. కైలాసములో గడియారము రాత్రి 10 గంటలు వద్ద ఆగియున్నది. ఇప్పుడు 10 గంటలు గాక 2 గంటలై యున్నది. ప్రపంచమంతలో ఇప్పుడు 2గం॥ అయినదని చెప్పజాలముగదా ! కాలచక్రముననుసరించి, ఒక్కొక్క దేశములో ఒక్కొక్క వేళలుండుట గూడ ఆశ్చర్యమే. ఇచ్చట రాత్రిగ నుండి మరి కొన్ని దేశములలో పగలుగ నుండును. హిందూదేశములో రాత్రి 10 గంటలు అయిన అమెరికాలో పగలు 8 గంటలు అగునట. ఏలయనిన జ్యోతిష్కుల లెక్కల ననుసరించి అచ్చటకు, ఇచ్చటకు అనగా అమెరికాలో టైమునకు హిందూదేశములోని టైమునకు పదిగంటలు తేడా యున్నదని నిర్ణయించిరి. సూర్యభగవానుని చుట్టును భూమి తిరుగు చున్నందున సమయముగూడ అన్ని దేశములలో,అందరకును ఒకేరీతిగ నుండక మారుచుండును.

ఇప్పుడు ముఖ్యముగా మనము విమర్శించ వలసినది ఈ గడియారములకు, ఈ కాలమునకు బానిసత్వమును వదలి స్వతంత్రముగా నుండుట యెట్లు అనునది.

వీనికి బానిసవై జీవించెడి వారే, అహంకారముతో నిండి, నిన్న నేను ఆ పనిచేసితిని, నేడు ఈ పని చేయుచుంటిని, రేపు మరియొక పని చేయుదును అని ప్రగల్భములు పల్కుచుందురు. ఆత్మలో నిన్న ఎచ్చట ? నేడెచ్చట ? రేపెచ్చట ? ఆత్మస్వరూపము కాలాతీతముగదా ?

కాని చీకటియు, వెలుతురును కలియనట్లు నీళ్ళు, నూనె కలియనట్లు,ప్రవృత్తి పరులు నివృత్తి పరులును, అజ్ఞానులు జ్ఞానులును ఎన్నటికి కలియజాలరు.

ప్రవృత్తిపరునకు గడియారమే దైవము. తన జీవితమంతయు గడియారము ననుసరించి గడుపుచుండును. నివృత్తిపరుడు బైటగడియారములనే గాక తన ఆంతర్యమున నిరంతరమును పనిచేయుచున్న తన హృదయమనెడి గడియారమును గూడ మరచి కాలాతీతుడై జీవించును.

ప్రియమైన పాఠకులారా ! మీరెన్నో రకరముల చిన్న గడియారములు, పెద్ద గడియారములు చూచియుంటిరి. మీ హృదయమనే గడియారము నెప్పుడైన చూచి యుంటిరా ? ఈ బైటి గడియారములకు “కీ” కొన్నింటికి రోజుకు ఈయవలెను. మరికొన్నింటికి వారమునకొకసారి ఇవ్వవలెను. ఇప్పుడు “కీ” అవసరములేని గడి యారములు కూడ వచ్చుచున్నవి. అనగా మనుజుని కదలికచేతనే గడియారమునకు ఎప్పుడో ఒకప్పుడు “కీ” ఇచ్చుట జరుగుచున్నది. మన ఆంతర్యమున నున్న హృదయ మనెడి గడియారమునకు ఎవ్వరు “కీ” ఇచ్చిరో ఎప్పుడిచ్చిరో ఆ సూక్ష్మమైన సమస్యను మీరెప్పుడైనను ఆలోచించితిరా ?

ఈ హృదయమనెడి గడియారము ఎంత విచిత్రమైనది ! విచిత్రమే గాదు, అత్యద్భుతమైనది కూడను. ఎందుచేతను? ఎందుచేత ననగా నీ హృదయ గడియా రమునకు నిత్యము “కీ” ఈయనవసరము లేదు. ప్రతివారము, నెలకొక్కసారియైనను చివరకు సంవత్సరమున కొక్కమారైనను “కీ” ఇవ్వకుండగనే సదా పనిచేయుచున్నది.

దీనికి “కీ” ఎవరిచ్చిరో, ఎప్పుడిచ్చిరో సాధకులు జిజ్ఞాసులు విచారణ చేయవలసి యున్నది. ఈ “కీ” జన్మించినప్పుడే ఇవ్వబడినదా లేక తత్పూర్వమే యివ్వబడినదా? జన్మ జన్మకు “కీ” ఇవ్వబడుచున్నదా లేక ఆదిలోనే యివ్వబడినదా ? ఎవ్వరిచే యెప్పుడు యెందుకు ఈ హృదయగడియారము నిరంతరము పనిచేయుటకు “కీ” ఇవ్వబడెనో విజ్ఞులైన పాఠకుల యొక్క విచారణకే వదలిపెట్టి అన్ని గడియారముల కును బాహ్యముననున్న ఆంతర్యముననున్న గడియారముల కన్నింటికి ఆధారమైన, ప్రభువైన ఆ సచ్చిదానంద స్వరూపమునకు ధన్యవాదములతో మీ అందరి శాంతిని, లోకశాంతిని కోరుచు ముగించుచుంటిని.

సర్వేజనా స్సుఖినో భవంతు – ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః

( 1941 సం॥ )

# 15. దైవోద్యానవనము

ప్రియ పాఠకా ! దేవుని పూలతోట నెన్నడైనను చూచితివా? అది ఎచ్చట నున్నదందువా ? దైవోద్యానవనము దూరముగా స్వర్గము నందో, ఆకాశమునందో లేదు.

ఈ ప్రపంచమే దైవము యొక్క ఉద్యానవనము, మానవులందరు ఆయన పుష్పములే. కొన్ని పుష్పములు తమోగుణముల వాసన కలిగి యుండును. మరి కొన్ని పుష్పములు వాసనలేకుండును. కొన్ని పుష్పములు దుర్గంధము కలిగించెడివి కూడ కలవు.

నేనొకతూరి కాశ్మీరము వెళ్ళుట తటస్థించినది. అక్కడ ఎన్నియో రకములైన పుష్పములతో నిండియున్న తోటలు కలవు. నీవు గులాబిపూవులతోటకు వెళ్ళిన గులాబి పుష్పముల పరిమళమే నీకు వచ్చును. మల్లెపూల తోటకు వెళ్ళిన ఆ పుష్ప ముల సువాసనలతోనే నిండి యుందువు. చేమంతి పుష్పముల తోటకు వెళ్ళిన వాని సువాసననే అనుభవించెదవు. అటులనే ఏ పుష్పవనమునకు వెళ్ళిన వాని సువాసనయే అనుభవించుట స్వాభావికము గదా !

ఇప్పుడు దైవోద్యానవనమనగా ఈ బ్రహ్మాండమైన సృష్టి. దీనిని విమర్శింతము. ఈ ఉద్యానవనములో ముఖ్యమైనవి మూడు పుష్పములు గలవు. అవి :

1. సర్వ వ్యాపకత్వమనెడి పుష్పము.
2. సర్వ శక్తిమత్వమనెడి పుష్పము.
3. సర్వజ్ఞత అనెడి పుష్పము.

నీవు ఎచ్చటికి వెళ్ళినను యేమూలనున్నను ఈ దివ్యపుష్పముల సువాసన చూడగలవు. ఏలయన ఇవి నిరంతరము వికసించియేయున్నవి. నేత్రములుండియు అంధులైయుండనేల ? నాసికాగ్రమును కలిగియుండియు ఈ దివ్యపుష్పముల నాఘ్రాణించకుండ జీవించనేల ? కండ్లను తెరువుము. ఈ దివ్యపుష్పములను గాంచుము. వీని పరిమళము నాఘ్రాణించుచు జీవితమును ధన్యము చేసికొనవలెను.

నీవెచ్చటనున్నను సర్వవ్యాపకత్వమనెడి పుష్పము నిన్నాహ్వానించుచున్నది. నీ దుర్బలత్వములో సర్వశక్తిమత్వమనెడి పుష్పము నీకు బలమును, తేజస్సు ఇచ్చు టకు కోరుచున్నది. సర్వజ్ఞత అనెడి పుష్పము నీ అజ్ఞానమనెడి అంధకారములో విజ్ఞానమును, వికాసమును నొసంగుటకై వేచియున్నది.

దైవోద్యానవనములో నీవింకను ముందుకు నడువ గల్గిన పెక్కురకములైన శాశ్వత పుష్పములను గాంచగలవు. నీ వెన్నడైనను బదరీనారాయణమునకు వెళ్ళి తివా ? అచట మంచులో ఏ చెట్లు మొలవనిచోట మైళ్ళకొలది ఎటుచూచినను వర్ణనాతీతమైన సుందరమైన పుష్పములే, చిన్నవి, పెద్దవి,సువాసన గలవి, సువాసన

లేనివి, వివిధములైన రంగులలో కనిపించును. వానిని చూడవలయునేగాని వర్ణించ నలవిగాదు.

ప్రాపంచికోద్యాన వనములనే వర్ణింప నలవిగాక స్వయముగ చూడవలసి యుండనిక దైవోద్యానవనమునెవ్వరు వర్ణింపగలరు? దైవపుష్పవనములో శాశ్వత జీవితమనెడి పుష్పము. నిరంతర తేజస్సు అనెడి మరియొక పుష్పము, విశ్వప్రేమ యనెడి యాకర్షణీయమైన వేరొక పెద్ద పుష్పములు గలవు. అహింస అనెడి పుష్ప మును కాంచుము.సత్యమనెడి పుష్పమును వీక్షించుము. వీని నన్నింటిని మించిన పూర్ణశాంతి యనెడి మరొక పుష్పము కలదు. ఇంకనూ బ్రహ్మచర్యము, అస్తేయము, శమము, దమము మొదలైన పుష్పములు దైవమునకు ప్రీతికరములని బ్రహ్మవిదులు నుడివి యుండిరి. ఈ పుష్పములయొక్క పరిమళము ననుభవించుచు వెళ్ళగా, వెళ్ళగా బదరీనాథ్ తరువాత కైలాసము కానవచ్చును. అచట ఒకే ఒక పుష్పము గాన వచ్చును. అది ఏ పుష్పమో తెలియునా ? అదియే దివ్యమైన పరిపూర్ణమైన, బ్రహ్మ భావనముతో పరిమళ మొసంగుచున్న "మౌన పుష్పము" దాని నాఘ్రాణించిన వారు నిశ్శబ్దములో లీనమగుదురు. "నిశ్శబ్దో బ్రహ్మ."

మౌన పుష్పము హృదయకమలమనే పుష్పమును వికసింపచేయును. క్రమ ముగ సహస్రారమునకు చేర్చుచు బ్రహ్మనాడి ద్వారా దైవసాక్షాత్కారమును ప్రస్తుత క్షణమునందే కల్గించుచుండును.

హరిః ఓం తత్సత్ ఓం

( 1942 సం॥ )

# 16. మరపులో మెరుపు

మరుపు అనగా నేమి ? మెరుపు అనగా నేమి ? మరుపును అందరు ఎరుగు దురు. మెరుపును గురించి కోటి మందిలో ఒక్క మహనీయుడే యెరుంగును.

మరపు అనగా నిత్య జీవితములలో ప్రాపంచిక విషయములను మరచుట గాదు. మరుపు అనగా తమలో నిరంతరము ప్రకాశించుచున్న దివ్య జ్యోతిని, ఆత్మ స్వరూపమును మరచి, పశుప్రాయముగా జీవించుటే మరుపు.

ఇక మెరుపు అనగా ఆకాశములో మబ్బుల తాకిడి వలన గల్గెడి తాత్కాలికపు మెరుపు గాదు. మనము తెలిసికొన్నను, లేకున్నను, నిరంతరము కోటి సూర్య ప్రకాశముగా వెలుంగుచున్న ఆత్మతేజమును అనుభవించుటే మెరుపు.

ఆ విధముగ అనుభవించిన మెరుపు మరుపులో గూడ యున్నదో లేదో సూక్ష్మ ముగా గ్రహింపవచ్చును. మెరుపు అనగా ఎట్టిదో పైన వివరింపబడెను. అటులైన ఆ దివ్యతేజస్సు లేని కాలముగాని, స్థలము గాని యెచ్చటున్నది ?

ఆ దివ్య తేజస్సు ఆద్యంతములు లేక సర్వకాల సర్వావస్థల యందును, హెచ్చు తగ్గులు లేక ఒకేరీతిగా మనలో నున్నది. ఆ దివ్య తేజస్సులేని తావు సూదిమొన మోపుటకైనను లేదని పెద్దలు నుడివియుండిరి.

"నేను దైవమును ఒక్క నిమిషమైనను మరువజాలను.

నేను నా స్వ స్వరూపమును ఒక క్షణమైనను విస్మరింపజాలను.

నేను నా ఆత్మజ్యోతిని క్షణములో కోటవవంతు కాలమైనను దర్శింపకుండ జీవించజాల"నని ఒక దైవపిపాసకుడు పలికియుండెను.

పుట్టినది మొదలు గిట్టెడివరకు, సృష్టి ప్రారంభము నుండి ప్రళయము వరకు తమలో మెరయుచున్న స్వయంప్రకాశమగు ఆత్మజ్యోతి ననుభవించెడివారి జీవిత ములు చాల అదృష్టవంతములుగదా !

"అగాధమునుండి నూతనమైన శక్తి
కారు చీకటి నుండి నూతనమైన వెలుతురు
మరుపులో గూడ – మెరుపు వైపే
పరుగెత్తుచుంటి" నని ఒక మహనీయుడు వచించెను.

ఇంతకును ఆశ్చర్యమైన విషయము, తమలో అతి సన్నిహితముగా యుండి తమ ప్రతికదలికకు కారణమైన ఆదివ్యశక్తిని, మెరుపును విడిచి వ్యక్తులు, సంఘ ములు, దేశము, ప్రపంచమంతయు మరుపునకు బానిసలైనవారితోనే నిండియుండుట విచారకరము, చివరకు ఆత్మతత్త్వము గురించి అనగా మెరుపుగురించి ఉపన్యసించెడి వారు గూడ, మరుపు అనెడి భ్రమలో నుండియె ఉపన్యాసము లిచ్చుచుండు టెంత ఆశ్చర్యము ! మనుజుడు మరుపులో జన్మించి, తన జీవనయాత్రనంతయు మరపు

లోనే గడపుచు, తన జన్మహక్కు, గమ్యస్థానము మరుపేయన్నట్లు, సహజమగు తన ఆత్మ తేజస్సును మరచి జీవించుచు, చివరకు మరుపులోనే మరణించుచుండెను.

మానవుడు ఈ మహాంధకారమునుండి బయటపడుట ఎట్లు ? ఈ మరుపు నుండి మెరుపువైపు తిరిగి, దాని ననుభవించుట ఎట్లు ? అది యెచ్చటున్నది ? మెరుపు తనకు అన్యముగా, భిన్నముగా, దూరముగా, ఆకాశమునందో, స్వర్గములోనో నున్నదా ? లేదు ! లేదు ! అది తనలోనే, తన పవిత్ర హృదయకుహరమునందే మరుపు అను గాఢమగు మాయచే కప్పబడియున్నది. మేఘములో ఉరుములు, మెరుపులు, యున్నట్లు గాఢమైన మరుపులోనే గాంభీర్యమైన మెరుపు ఇమిడియున్నది.

లెండు ! మేల్కొనుడు ! ఖండములో అఖండమును, అనిత్యములో నిత్యమును, మార్పులో మార్పురహితమైన స్వరూపమును దర్శించుడు. మరుపు శాశ్వతమైనది కాదు. మరుపునకు ఆవలనున్న తేజస్సు శాశ్వతము. "లేనిది ఉండబోదు. ఉన్నది, శాశ్వతమైనది లేకపోదు."

మరుపులోనే మెరుపు అనెడి గాంభీర్యమైన సత్యము, మానవునకు ఆనంద మును, నూతనశక్తినొసంగు చున్నది. మరుపే నిజస్వభావముగాదు. తన నిజ స్వభావము, జన్మహక్కు మెరుపే- ఆ దివ్యతేజస్సే స్వస్వరూపానందము!

"జీవితాధిక్యత యెన్నడును మరుపులో లేదనియు, మరుపు వచ్చినను, మరుపును మరుపుగా తెలుసుకొని మెరుపుననుభవించుటలోనే యున్నదని" ఒక అనుభవనీయుడు వక్కాణించి యుండెను.

పసిబిడ్డ అనేకమార్లు పడకుండ నడచుట నేర్చుకొనజాలడు. పడిన పసిపాప అటులనే నేలమీదనే యెప్పటికి పడియుండబోడుగదా; వెంటనే లేచి మరల నడువ ప్రయత్నించును. పడినప్పుడెల్లను మరల నడువ ప్రయత్నించుటచేతనే, ఎన్నటికి పడని నడకను నేర్చుకొనుచుండిరి. ఈ అనుభవమును, మనము పసిబిడ్డలకు బోధించి నేర్పజాలము.

అటులనే మానవుడు అజ్ఞతచే, మరుపుచే ఆవరింపబడినవాడై, పడరాని అవస్థ లను, యమయాతనలను పడుచు, మరుపులో నుండియే మెరుపునకై ప్రాకులాడును. ప్రయత్నించగా ప్రయత్నించగా, స్వాత్మ విచారముచేతను, అపరోక్షానుభవముచేతను, చివరకు మరుపులో దాగియున్న మెరుపును గుర్తించి, స్థిరమైన, శాశ్వతమైన అమృత పదవిని పొందగలడు.

ఆహా; ఏమి ఆనందమైన వార్త ! ఎంతటి ప్రాణతుల్యమైన సందేశము; ఎంత జీవకళ నొసంగెడి మాహావాక్యము.

మరుపులో మెరుపు

మరుపు మిథ్య. తాత్కాలికపుటావరణ మాత్రమే; కనుక నిత్యమై, శాశ్వతమైన మెరుపుచే నిండియున్నఆత్మ తేజస్సును ప్రత్యక్షము చేసికొందుముగాక; అది యెప్పుడో,

ఎక్కడనోగాదు. ఇప్పుడే, ఇక్కడనే, మెరుపు ననుభవించుట కిదియే తావు. ఇదే సమయము.

ఇక భ్రమయననేల ? మరుపులేల ? అంతయు సచ్చిదానంద స్వరూపమే; మెరుపులకు మెరుపై వెలుంగుచున్న దివ్యజ్యోతి స్వరూపమే;అట నిర్వికల్ప స్థితియే, పూర్ణ సమాధి స్థితియే ! దాని పరిణామమే నిర్వాణము.

ఆత్మసోదరీ సోదరులారా ! మీరు అమృత స్వరూపులు, మీగాఢ తమస్సునుండి మేల్కొని, జీవన్మృత స్థితినుండి, జీవన్ముక్త స్థితి ననుభవింప ప్రయత్నింపుడు, ఇక నంతయు పరిపూర్ణము. బ్రహ్మానందమే;మరుపునకు స్వస్తి ! మెరుపునకు స్వాగతము.

ఉదయం 6-00

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 24-2-43 )

- మానవుడొక పూస. అట్టి పూసలు అసంఖ్యాకములు. ఆత్మ వానిని కలుపు సూత్రము. (దారము). మన దృష్టిని ఆ సూత్రమునందే నిలుపవలయును.
- ప్రార్థించుటకు, ధ్యానించుటకు సమయము దొరకుట లేదని చింతింప నక్కర్లేదు. ఏలననగా భగవంతుడే సదా మన ద్వారా పని చేయుచున్నాడు. అంతమాత్రము గ్రహించిన చాలును.

# 17. పరిపూర్ణత

పరిపూర్ణత నెవరు వర్ణింప గలరు ?

పరిపూర్ణత గురించి ఎవరు ప్రశంసింప గలరు ?

పరిపూర్ణత గురించి ఎవరు వ్రాయగలరు ?

పరిపూర్ణత గురించి పరిపూర్ణులే వర్ణింపజాలనప్పుడు సామాన్యులెట్లు ప్రశంసింప గలరు? దానిని ఎట్లు వివరింపగలరు ?

పరిపూర్ణత యొక్క పేరు తలంచినంత మాత్రముననే శుక్లయజుర్వేద మహా వాక్యమైన శాంతిమంత్రము జ్ఞప్తికి వచ్చుచున్నది. ఈ చిన్న మంత్రమునైనను మనము బోధపరచు కొనుటకు ప్రయత్నించిన కొంతవరకు పరిపూర్ణతను గురించి తెలిసి కొన్నట్లే భావింపవచ్చును.

హరిః ఓం పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణ ముదచ్యతే

పూర్ణస్య పూర్ణ మాదాయ పూర్ణమేవావశిష్యతే...

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

తా. సమస్తము పరిపూర్ణమైన బ్రహ్మమే. ఒక పాదమునుండి పూర్ణముగ నున్నట్లు కనబడు మాయాకార్యమైన జగత్తు నతిక్రమించుచు బ్రహ్మము పూర్ణముగా నున్నది. ఉపాధులు నశింపగా కూటస్థ చైతన్యమే పరిపూర్ణ బ్రహ్మమై శేషించుచున్నది.. అది పరిపూర్ణము, అఖండము, అద్వితీయమైనది. అద్వితీయమైన పరిపూర్ణముతో ఖండమైన నామరూపములన్నియు అండాండ, పిండాండ, బ్రహ్మాండములు సర్వమును, అపారమైన సముద్రములో కెరటములు, అలలు, బుద్బుదములు అన్నియును విలీనమగుచున్నట్లు, సర్వ నామరూపములు ఆ పరిపూర్ణ బ్రహ్మతో విలీనమైపోవు చున్నవి. అఖండ పరిపూర్ణము ముందు ఖండమైన ఈ ప్రపంచములు, ఈ గోళము లన్నియు సముద్రమునందలి నీటిబుడగలవలె అత్యల్పముగా నుండి విలీనమగును.

ఇంకను వేదసారమైన ఉపనిషత్తులు పరిపూర్ణతను గురించి చెప్పుచున్న ఈ క్రింది వాక్యమును విపులముగా బోధపరచుకొందుము.

ఆత్మై వాధస్తాత్ ఆత్మోపరిస్తాత్

ఆత్మా పశ్చాత్ ఆత్మా పురస్తాత్ ఆత్మా దక్షిణతః

ఆత్మోత్తరతః ఆత్మైవేదం సర్వం ॥

తా. పరిపూర్ణమైన ఆత్మయే క్రిందుగా నున్నది. మీదనున్నది,వెనుక నున్నది, ఆత్మయే ముందుగా నున్నది. దక్షిణమున నున్నది, ఉత్తరమున నున్నది. ఈ జగమంతయు ఆత్మయే. ఆత్మకన్న నితరమేమియులేదు. ఆత్మకును, మనకును, గల అవినాభావ సంబంధమును తెలిసికొనుటకు మరియొక శ్లోకమును పరిశీలింతుము.

శ్లో॥ స్వయంబ్రహ్మ,స్వయం విష్ణుః, స్వయమింద్రః,

స్వయం శివః, స్వయమిదం సర్వం, స్వ స్మదన్యంనకించన॥

తా. పరిపూర్ణుడగు తానే బ్రహ్మము, తానే విష్ణువు, తానే ఇంద్రుడు, తానే శివుడు, తానే ఈ సమస్తమైన విశ్వమును, సర్వపరిపూర్ణమగు తనఆత్మకంటె ఇతరమై ఏ కొంచమైనను లేదు. అనుభవజ్ఞానములేని సాధకునికి ఈ శ్లోకములను పఠించుట నిస్సారమైన చెరుకుపిప్పిని నమలుచున్నట్లే యుండును. కనుక పరిపూర్ణమును బోధపరచుకొనుటకు అపరోక్షానుభవమే ముఖ్యావసరము.

మానవుడు పూర్ణముచే ఆవరింపబడియు, పరిపూర్ణత యొక్క స్వరూపంబై యుండియు, మాయయొక్క ప్రభావముచే తన జన్మహక్కైన దివ్యతేజస్సును మరుగు పరచుకొని పాంధునివలె స్వకల్పితమైన అంధకారముచే చింతలు, బాధలు,రోగములు, కక్షలు అను ఊబిలోపడి దిగబడి అహర్నిశములు బాధపడుచుండెను. తన స్థూల శరీరము ఆపాదమస్తకము, ప్రత్యణువునందును పరిపూర్ణత్వమే నిండియున్నదనెడు సత్యమును గ్రహించిన క్షణమునందే ఆ బాధ నుండి తొలగి పరిపూర్ణానందమును పొందగలడు.

ఆ పరిపూర్ణమే తన నేత్రములతో చూచుచు తన కర్ణముతో వినుచున్నది. తన మనస్సులో ఆలోచించుచు, తన శ్వాసలో ఉచ్ఛ్వాస నిశ్వాసములుగా ఆడుచున్నది. వేదములును, అనుభవజ్ఞులును ఆ పరిపూర్ణము ఈ శరీరమనెడి మందిరములో శ్వాసకు శ్వాసగా వెలుగుచున్నదని మరల మరల నొక్కి చెప్పిరి.

కనుక ప్రియ ఆత్మీయులారా ! ఇక వ్రాతలు,మాటలేల? మన మాశ్వాసను వెంబడించి పరిపూర్ణములో విలీనమగుటకు ప్రయత్నింతము.

సర్వం ఖల్విదం బ్రహ్మ । తజ్జలానితి శాంత ఉపాసీత

ఈ జగమంతయు బ్రహ్మమేగాన ఈ పరిపూర్ణతను మనోవికారములు లేనివారమై ఉపాసించుదము.

ఓం తత్సత్ ఓం

కైలాసము

ఉదయం 8-30

( 19-6-44 )

✦ ఏదైనను చెప్పదలచుకొనిన యెడల అంతరాత్మ నుండి సూటిగ చెప్పవల యును. ఆ అంతరాత్మ ఇచ్చు వెలుగు సహాయమున మలినములను, పాపము లను క్షాళనము చేసుకొనవలయును.

# 18. అణువులో బ్రహ్మాండము

అణువులో బ్రహ్మాండమనెడి యీ వ్యాసము యొక్క నామమును స్మరించినంత మాత్రముననే నూతనశక్తి కలుగుచున్నది. ఇట్టి మహావాక్యములను వినినంత మాత్రముననే ఆనందము శక్తి తృప్తి కలుగుచుండ ఇక వీని సారాంశమును భావించి అనుభవించిన ఎంతటి ఆత్మశక్తి అపరోక్షజ్ఞానము కలుగునో అనుభవపరులకే తెలియగలదు. విమర్శకుడెవ్వడైన అణువులో బ్రహ్మాండమెట్లు ఇమిడి యుండగలదు! బ్రహ్మాండములో అణువు ఉండునన్నది సమంజసముగా నుండునని వచింపవచ్చును. అణువు చిన్నవానిలో చాల చిన్నది. కంటికి కనిపించనంత సూక్ష్మముగా నుండును. ఇక బ్రహ్మాండము పెద్దవానిలో పెద్దది. అణువు చాల చిన్నదైనందు వలన మనము స్థూలనేత్రములతో చూడజాలము. చాలపెద్దదై ఆద్యంతములు లేకయున్నందున బ్రహ్మాండమును గూడ మనము చర్మచక్షువులతో చూడజాలము. వాస్తవమునకు బ్రహ్మాండములో అణువులుండు నన్నదే సమంజసమన్నట్లు తోచును. ఏలయన చిన్న వస్తువులు పెద్దవస్తువులో నిమిడియుండుట అనుభవ సిద్ధము, కాని పెద్ద వస్తువు బ్రహ్మాండమైనది పరమాణువులో నెటుల నిమిడి యుండును ?

ఇదియే వేదాంత సమస్య. అద్వైత రహస్యము, బ్రహ్మవేత్తలు మాత్రమే ఈ గూఢార్థమును గ్రహించి ఆనందముతో దైవశక్తితో నిండి యుండెదరు.

అణువులో బ్రహ్మాండము ఇమిడి యుండజాలనిచో శ్రీకృష్ణభగవానుడు మట్టిని తినెనని, తల్లి యశోద నోరు తెరువమనగా ఆయన నోరు తెరచి చూపినప్పుడు అణువణువున నిండియున్న దివ్యశక్తి స్వస్వరూపుడగు కృష్ణుని నోటిలో బ్రహ్మాండ మంతయు ఆమెకు ఎట్లు గానవచ్చెను ? నోటిలో బ్రహ్మాండమంతయు నిమిడియుండ నిక అణువులో మాత్రమేల నిమిడి యుండదు ?

ఈ విశ్వమునంతయు బ్రహ్మమయముగ చూచెడి వారికి అంతయు బ్రహ్మ స్వరూపమే. అతి చిన్న అణువులోను, పరమాణువులోను బ్రహ్మాండమే కానవచ్చును.

ఈ గాంభీర్యమైన సమస్యను బోధపరచు కొనుటకు కొన్ని ఉదాహరణములను తీసికొని ఆలోచింతము. ఎన్ని ఉదాహరణలు తీసుకొని ఎంత తర్కించినను అపరోక్ష జ్ఞానమున్నగాని అనుభవముగా నిది బోధపడదు.

భూమిలోనున్న చిన్న ఇసుక రేణువులలోని అత్యల్పమైనట్టి అణువును తీసికొందము. ఈ అణువులో పృధ్విలేదా ? సూర్యుని కిరణమును తీసికొందము. కిరణములో తేజస్సు లేదా ? ఆ తేజస్సులో సూర్యుడు లేడా ?

మరియొక దృష్టాంతము, మనకంటికి గానవచ్చెడిది తీసుకొందము, సముద్రపు టొడ్డునకు వెళ్ళి ఒక చిన్న నీటిబుడగను పరిశీలింతము. నీటిబుడగలో నిమిడి యున్నదేది? అది దేనిచే నిర్మింపబడెను ? దానికి ఆధారమేది? అందులో నున్నది సముద్ర జలమే గదా ! కనుక ఇసుకరేణువు పృధ్విలో నున్నది. పృధ్వి ఇసుక రేణు

వులో నున్నది. కిరణములో సూర్యుడు కలడు. సూర్యునిలో కిరణము కలదు. నీటి బుడగలో సముద్రము, సముద్రములో నీటిబుడగయు కలదు.

అటులనే మనుజునిలో దైవము కలడు. దైవశక్తిలో మనుజుడు ఇమిడియుండును. అందుచేతనే "నరుడే నారాయణుడు." "జీవుడే దైవము", అని శాస్త్రములు ఘోషించుచున్నవి. బ్రహ్మవిదులు జీవాత్మ పరమాత్మల ఐక్యసంధానమును స్థిరపరచి చెప్పు చుండిరి. కనుక ఎచ్చటనైనను శాశ్వతమైన శాంతి, స్థిరమైన ఆనందము, అఖండమైన శక్తియున్న, అది అణువులో బ్రహ్మాండము ననుభవించుటయందే గలదు.

ప్రియమైన పాఠకా ! ఈ మహత్తరమైన సత్యమును అనుభవించుట కిదియే సమయము. ఇదియేతావు. ఇదియే నీ జన్మహక్కు. తక్కిన దంతయు భ్రమయే, పొల్లు మాత్రమే. త్వరపడుము. ఇప్పుడు మనము అంతర్ముఖులమై, ఆ బ్రహ్మాండమును ఒక్క అణువులోనే గాక ఆపాదమస్తకము నఖశిఖపర్యంతము అనుభవించుటకు ప్రయత్నించుదము. మనలో నిండియున్న యా బ్రహ్మతేజస్సే, బాహ్యమున కూడ పిపీలికాది బ్రహ్మపర్యంతము వ్యాపించి యున్నది.

క॥ ఇందుగలండందు లేడని సందేహము వలదు; చక్రి సర్వోప
గతుం డెందెందు వెదకి చూచిన నందందే గలడు దానవాగ్రణివింటే.

అని ప్రహ్లాదుడు చెప్పిన పద్యము సర్వత్రా బ్రహ్మ భావననే సర్వ వ్యాపకత్వము, సర్వశక్తిత్వము, సర్వజ్ఞత్వమునే నిరూపించు చున్నది. కనుక మనము కూడ అణువు మొదలు బ్రహ్మాండమంతయు వ్యాపించియున్న ఆ దివ్యశక్తిని గుర్తించి ఆ బ్రహ్మ భావనను మనోవాక్కాయములలో ప్రతిక్షణమునను వ్యక్తపరచుచు లోకశాంతికై ఆదర్శ యుతముగ జీవించెదముగాక.

సర్వేజనా స్సుఖినోభవంతు.

కైలాసము

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

( 19-6-45 )

ఉదయం 4-00

- ప్రపంచమంతయు బ్రహ్మమే. పాపులందు, పవిత్ర హృదయములందు సమస్త వస్తువుల యందు భగవంతుని చూడగలుగుటయే మిగుల ఉచ్చస్థితి.
- మానవుడు (జీవాత్మ) తనలోనే ఇమిడియున్న ఆనందమును మరచి, ఇతర స్థలములందు దానిని వెదుకుచు, దుఃఖించుచున్నాడు.

# 19. దివ్య తేజస్సు

భక్తులకే కష్టములు మెండు అనెదరు. ఏ కష్టములు, పరీక్షలు లేని యెడల అందరు భక్తులుగానే యుందురు. ఎన్ని అవస్థలు, పరీక్షలు కల్గినను, దైవపరితాపనతో నిండియున్నవారే నిజమైన భక్తులు.

ఒక భక్తుడొకప్పుడు బంధిఖానాలో నుంచబడెను. నిజమైన భక్తునకు బంధిఖానా యైనను, అంతఃపురమైనను నొక్కటేగదా! చెరచాలదాయనునట్లు, అతడు చీకటి కొట్టులో బంధింపబడెను. అతడు నిజమైన భక్తుడు కనుక చీకటిగదిలో నుంచబడి నను, దైవమును గురించియే పరితపించుచుండెను.

విముక్తి, బంధవిముక్తి అందరకును, ఎప్పటికైనను కల్గును కదా ! అందును సాధకులకు, దైవపిపాసకులకు ముఖ్యముగా కలుగును. నిజమైన భక్తులు ఖైదునుండి గాని, చీకటికొట్టునుండిగాని బయటపడుట కైనను ప్రయత్నింపరు. వారు మాయ నుండి, అజ్ఞానాంధకారము నుండి మాత్రమే బయటపడుటకు, నెచ్చటనున్నను సదా ప్రయత్నింతురు.

మన భక్తునకు ఒకానొక పుణ్యదినమున చీకటి గదిలోనే భగవద్దర్శనమాయెను. దైవమునకై రోదనచేయుచుండ, ఒక మహాదివ్యతేజస్సు తన ముందు గోడమీదనే ప్రత్యక్షమై, క్రమముగా ఆ చీకటి గదియంతయు వ్యాపించి, తనలో ప్రవేశించెనట. ఆ క్షణమునుండి భక్తుని జీవితము మారిపోయెను. బంధింపబడిన ఖైదీ, చీకటిగదిలో చెరబెట్టబడిన భక్తుడు, స్వర్గములో సింహాసనము మీదనున్నట్లే ఆనందింప సాగెను. ఆ దివ్యతేజస్సే ఆతని పరిపూర్ణ ఆనందము, గమ్యస్థానమునై, అతని మనస్సంతయు ఆ తేజస్సునందే విలీనమై, అఖండమైన తృప్తిని పొందుచుండెను.

కొంతకాలమునకు ఆ సాధువైన భక్తుడు బంధ విముక్తిని పొందెను. ఖైదునుండి విముక్తుడైనను, మనస్సు సదా ఆ చీకటిగదిలో గోడమీద ప్రత్యక్షమైన తేజస్సునందే విలీనమై యుండెను. పూర్వజన్మ కర్మచేతనో, దురదృష్టము చేతనో ప్రాపంచికుల సహవాసదోషముననో, ఏ కారణము చేతనో అతడు సంసారములోనికి, సంఘము లోనికి రాగానే ఆ దివ్య తేజస్సు మరుగయ్యెను. అతడు పరితపించుచు, ఎంత వెదకినను ఎచ్చటవెదకినను మరల కనిపించదాయెను. మన భక్తుడు దుఃఖించ సాగెను. దైవ పరితాపనతో హృదయము విలపించసాగెను. ఆ దివ్యతేజస్సు యొక్క పునర్దర్శనమునకై కొట్టుకొన సాగెను. దేశాటన ప్రారంభించెను. కంచి, కాళహస్తి రామేశ్వరము మొదలైన తీర్థయాత్రలు చేసెను. దివ్య తేజస్సు దర్శనమునకై తిరుపతి కొండలు కూడ నెక్కెను. తాను ఖైదులోనుండగా అనుభవించిన దివ్య తేజస్సును మరల దర్శించుట ఎట్లు ? కాశీ, ఋషీకేశమేగాక, హిమాలయము లందలి గంగోత్రి, యమునోత్రి, బదరీ,కేదారము మొదలగు తావులందు ఆ మహాతేజస్సునకై వెదుక ప్రారంభించెను. చివరకు కైలాసము, మానవ సరోవరములందు గూడ ఆ తేజస్సు

నాతడు గాంచలేకపోయెను. తిరిగి తిరిగి నిరాశతో, కాళ్ళు యీడ్చుకొనుచు, అతికష్టము మీద చివరకు గృహము చేరెను. తాను బంధిఖానాలో నున్నపుడు దర్శించిన తేజస్సును ఒక్కమారు దర్శించుటకై పరితాపనతో విలపించసాగెను.

ఒకానొక రోజున అదృష్టముచే ఒక ఆశ్రమమునకు వెళ్ళుట తటస్థించెను. అచ్చట తలనెరసిన ఒక ముసలి సాధువు తపస్సు చేసి కొనుచుండెను. మన భక్తుడు ఆయన చెంతచేరి ధ్యానము చేయసాగెను. కొంత తడవైన తదుపరి, ఆ తపస్వి నేత్రములు తెరువగా మన భక్తుడు తన చెంతనే కూర్చుని యుండుట చూచెను. అప్పుడు వారిరువురకు ఈ క్రింది రీతిగా సంభాషణ జరిగెను.

తపస్వి : నాయనా ! నీవిచ్చటి కెందులకు వచ్చితివి ?

భక్తుడు : తండ్రీ! తమ సందర్శనార్థమై వచ్చియుంటిని.

తపస్వి : నీకేమి కావలెను ?

భక్తుడు : దివ్య జ్యోతిర్దర్శనము

తపస్వి : దివ్య తేజస్సునెన్నడైనను దర్శించితివా ?

భక్తుడు : ఒకానొక దినమున చీకటికొట్టులో దర్శింపగల్గితిని.

తపస్వి : అద్దానిని మరల ఏలమరచితివి ?

భక్తుడు : మాయా ప్రభావముచే

తపస్వి : ఆ దివ్యతేజస్సునకై మరలగట్టి ప్రయత్నము చేసితివా ?

భక్తుడు : కొండలలో, లోయలలో, అడవులలో, గుళ్ళు, గోపురములలో, నిర్జన ప్రదేశములలో యోగులు, మహాపురుషులలో, వివిధమైన తావులందును వెదకి వెదకి వేసారితిని.

తపస్వి : బిడ్డా ! నీవు లోకమంతయు వెదకితివిగాని, ఒక్క తావున మాత్రము వెదుకవైతివి. ఆ అఖండమైన జ్యోతి స్వరూపము, కోటిసూర్యుల తేజస్సుతో ఎచ్చట వెలుంగుచున్నదో ఆ తావునగాక, అన్ని తావులందును వెదకితివి. దానివలన ఏమి ప్రయోజనము ?

భక్తుడు : తండ్రీ ! ఆ తావేదియో సెలవిందు.

తపస్వి : నాయనా ! అది నీలోనే, నీ పవిత్ర హృదయస్థానము నందే నిరంతరము వెలుంగుచున్నది. అట్టి దానిని చూపుతో చూడ ప్రయత్నించక బైట ఎంతవెదకిన నేమి లాభము ?

భక్తుడు : ఓ మునిపుంగవా ! ఈ దిక్కుగానని బిడ్డయందు కరుణయుంచి, ఆదివ్యదర్శనము మరల అనుభవించునట్లు తోడ్పడుడు.

అప్పుడావృద్ధతపస్వి చిరునవ్వుతో నేత్రములను మూసెను. భక్తుడు కూడ అటులనే చేసెను. కొంత సేపటికి అంతయు నిశ్శబ్దముగా మారెను. ఆ పవిత్ర

క్షణములలో మాటలు, భావములు, సర్వము అదృశ్యమయ్యెను. మహోపదేశము నిశ్శబ్దములోనే పూర్తి అయ్యెను.

శిష్యుని ముఖమున చింత, ఆందోళన, తాపత్రయము, పరితాపము లన్నియు మాయమై ఆ స్థానమున ఆనందము, పరిపూర్ణ సంతృప్తి, ప్రకాశయుతమైన నూతన తేజస్సు నిండియుండెను.

ఏ దివ్య తేజస్సును ఆ పవిత్రమైన ఏకాంత స్థలములో గురు సన్నిధిని అనుభ వించెనో, ఆ దివ్యతేజస్సునే అటుపైన గూడ భక్తుడు నిరంతరము అనుభవించ సాగెను. ఆ యాశ్రమమునుండి గోదావరీ తీరమునకు వెళ్ళెను. అచ్చట నదీ ప్రవాహ ములోను, మంచు బిందువులలోను, వృక్షములలోను, నది ఒడ్డున మేయుచున్న గోవులలోను, గోపరులలోను సర్వములోను దివ్య తేజస్సునే గాంచసాగెను.

ఊరిలో ప్రవేశించినను తన్ను ప్రేమించెడి వారిలోను, ద్వేషించెడి వారిలోను, చిన్నవడ్ల గింజలోను, ఉప్పు కణికలోను, ఏదిచూచినను దివ్యతేజస్సునే కాంచసాగెను. దివ్యజ్ఞాన సంపన్నులకు సర్వము దివ్య తేజస్సే. అది పరిపూర్ణము. అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించియున్న ఆ దివ్యతేజస్సు తప్ప యితరమేమి కలదు? ఆ దివ్యతేజోరూపమునకు మన ధన్యవాదములు.

ప్రేమ స్వరూపులారా ! దైవపిపాసకులారా ! ఇప్పుడు మనము కూడ కొంత తడవు నేత్రములను మూసి లోపల, వెలుపల, అన్ని దిశలయందును, సర్వకాల సర్వావస్థల యందు వెలుగుచున్న కోటి సూర్య ప్రకాశమానమైన, ఆ దివ్యతేజస్సును అంతర్గత దృష్టితో దర్శించెదము గాక !

ఓ దివ్యతేజోరూపమా ! లోకములోని జనులందరూ శారీరక భ్రాంతిని విడిచి, నిరంతరము నీ ప్రకాశము ననుభవించెదరు గాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

( 3-10-46 ) ఉదయం 6-00

- అహంకారము తనలో నున్న కొండవంటి దోషములను గమనింపనివ్వక, ఇతరులలో నున్న చిన్న నలుసులనే గోచరింపజేయును.
- సాధనా పరంపరలో చిట్ట చివరిది సహజ సమాధి. ఇట్టి స్థితి యందు సాధ కుడు ఎండు కొబ్బరి నుండి వేరుపడిన కురిడీవలె అన్ని విషయములకు దూరమగును.
- ఆత్మ ఒక మహాసముద్రము. ప్రతిబిందువు ఎంత అల్పమైనను సంపూర్ణమైన సాగరము కంటే భిన్నము కానట్లే జ్ఞాని యొక్క ప్రతి ఆలోచన విశ్వమంతకు చెందిన కర్మగా నగును.

# ౨౦. ఆత్మ విశ్వాసము - ధైర్యము

జీవితయాత్ర విజయవంతము, ఆనందదాయకము కావలెనన్న ఆత్మవిశ్వాసము, ధైర్యము ముఖ్యసాధనములు. మానవుడు భగవంతుని స్వరూపమయ్యెను. సర్వ వ్యాప్తియు, సర్వశక్తియు, సర్వసాక్షియునగు నాతని మూలమున సృజింపబడిన వాడయ్యు మాయయనెడి నూబిలోపడి గాంౘ్రించుచు, సతతము భయభ్రాంతుడై యుండుట ఎంతయు శోచనీయము. నిరంతర వికారపూరితమైన ఈ ప్రపంచమున ఏకైక సత్యస్వరూపియు, మానవుల జన్మహక్కును, నిరాకారుడునగు నాత్మ దైవము కంటె మానవునకు రక్తమాంస మిశ్రమమునందును, నామరూప ఆకారములందును ఎక్కువ విశ్వాసమును, శాంతి రాహిత్యమున జడత్వమునకు లోబడి, ఆత్మానుసంధానము నెరుగక, ఆత్మవిశ్వాసమును,ధైర్యమును వదలుకొనుట మౌఢ్యము యొక్క విధికృత ఫలము.

ఆత్మవిశ్వాసములేని మానవుడు క్రిమివలె ప్రాకులాడుచుండును. ఆత్మవిశ్వాసియో! స్వేచ్ఛగ గగనవిహారము చేయు విహంగమును బోలి యుండును. ఇట్లే స్థూల శరీరమున గాక సూక్ష్మ శరీరమునందలి విశ్వాసము పర్వతములను కదలింప గలదు. ఎమర్సన్‌యోగి మాటల యందెంత సత్యమున్నది? "ప్రతిమానవుడును మూఢుని పాత్రధరించిన భగవంతుడే" అని పలికెను. నీవు సింహమువైయుండి గొఱ్ఱెవలె సంచరించనేల? మానవుని జన్మహక్కు, గర్జించు ధైర్యముగాని, పిరికి యరపుకాదు. మాణిక్యమును మసిపాతకు జుట్టనేల? ఆవగింజంత ఆత్మవిశ్వాసమైనను మహత్తరకార్యములను సాధింపగలదు. అది అంధకారమునుండి కాంతికిని, అసత్యమునుండి సత్యమునకును వ్యక్తులను నడుపగలదు. ఆత్మవిశ్వాసమే మానవుని సంస్కరించును. నరకమును స్వర్గముగా నొనరించి వేయును. ఎవనియందు భగవద్విశ్వాసము కలదో వానియందు ఔన్నతస్వరూపము సదా ఉచ్ఛ్వాసనిశ్వాసముల యందు భగవత్‌సాన్నిధ్యము ననుభవించును. ఆత్మవిశ్వాసమున్న వానికి సర్వార్థములు సిద్ధించును. ఆత్మవిశ్వాసము లేని వాని కేమియు లభింపదు. ఆత్మవిశ్వాసమును, ధైర్యమును వేరుకావు. రెండును ఒక్కటియే. ధైర్యముతో నాత్మవిశ్వాసము, ఆత్మవిశ్వాసముతో ధైర్యమును సదా కలసియే యుండును. అవిరెండును ఏకైకోపాధికి చెందిన దైవశక్తులు.

కనుగొనుడు. ఆత్మవిశ్వాసమను సముద్రమున ధైర్యమను కెరటములు ఎట్లు పుట్టుచున్నవో, అట్లే మానవజీవితముకివి రెండును రెండు నేత్రములు. బాహ్య జగత్తులో కీర్తికొరకు ప్రాకులాడు నెంత ధనికుడైనను, ఎంత పండితుడైనను, ఆత్మవిశ్వాసము, ధైర్యమును లేని మానవుడు అంధకారమున నల్లాడు గ్రుడ్డివాడు, ఆత్మవిశ్వాసి నిర్భయుడు అజేయుడు. మానవుని విశ్వాసము తన మీదనుండవలెను గాని పెరవారి మీదగాదు, బాహ్యవిశ్వాసము నిరాశ్రయము, ఆత్మ విశ్వాసము జీవము. బాహ్యవిశ్వాసము నిరాశ్రయము, బాహ్యవిశ్వాసము మొదట బాగుగ తోచినను కడకు

బాధాకరము. ఆత్మవిశ్వాసమును, ఆత్మావలంబనమును మొదటిలో కష్టతరముగ గనిపించినను కడకు ఆనందమును, విజయమును చేకూర్చును. లోక జీవితమున గడ్డుపరీక్షల యందును, కఠినసమస్యల యందును, ధైర్యము వహించుటకు భగవంతుని యందు తప్పక విశ్వాసముండి తీరవలయును. శతసహస్రానేక మేఘా చ్ఛాదన మాత్రమున ప్రచండ సూర్యునికేమి కొరత ?

అనవసరముగా నిందింపబడినను, బాధింపబడినను, మానవుడు ఆత్మవిశ్వాస మును, ధైర్యమును ప్రదర్శింపగలడా? కృత్రిమ స్నేహితులు మోసగించినప్పుడును, గుండెలలో పొడిచినప్పుడును, విశ్వసించుట ఎట్లు ? ఉపకారమున కపకారమెదు రైన మనకాత్మ విశ్వాసమెట్లుండును ? ఇట్టి సమయమందున గూడ ఆత్మవిశ్వాసము కలిగియుండ వచ్చును. వేయి విధములేల! కాని భగవంతుని గుర్తెరింగినవారు, పూజింపబడినను, సన్మానింపబడినను ఆధ్యాత్మికముగనే యుండగలరు. అవమానము, నష్టము, పేదతనము, శత్రుత్వము, మరణము అన్నిటిని ఓర్చి, ఎవరు నవ్వగలరో వారే నిజముగ భగవత్ స్వరూపులు, ఇట్లే భగవంతునిది బాహ్యలోకము కాదు. సత్యలోకము, అచ్చట పరీక్షా మేఘములును, అవరోధాగాధములును వుండవు. నిరంతరముగ కోటి సూర్యప్రభలు తేజరిల్లుచుండును.

ఇట్లే ఆత్మవిశ్వాసమున కడ్డులేదు. సూర్యుడు చీకటిని పోగొట్టును. బలము బలహీనతను జయించును. అజ్ఞానమను మౌఢ్యమును పారద్రోలును, ఆత్మవిశ్వాసి భగవంతునివలె సంచరించును. ఆత్మవిశ్వాసములేని వారు బ్రతికియున్న శవము వంటివారు. బ్రతికియున్న శవములవైపు చూడుడు. విధివిరామములేక అహం భావముతో అన్నియు తమకే కావలెనను జ్వరతీవ్రతవంటి వేగముతో రక్తమాంస భూయిష్ఠ శరీరమే తామనుకొనుచు ఎండమావులవెంటనెటు పరుగిడుచున్నారో! ఈ ద్విపాదపశువులు భూమాతకు బరువుచేటును, సృష్టికర్తకు సిగ్గుచేటును కాదా?

ఆత్మవిశ్వాసములేనందున తనలోని దైవమును తెలిసికోలేనందున ఎల్లెడలను, ఎల్లరును భయపడుచుందురు. భయము నిస్సహాయస్థితిని, నిస్సహాయత నీరసమును, నీరసము నాశనమును, నాశనము అజ్ఞానమరణమును కల్గించును. ఆత్మవిశ్వాస మునకును, ధైర్యమునకును మూలమై, వెలుగులకు వెలుగై, సూర్యులకు సూర్యుడైన జగత్పితను గుర్తెరింగి ప్రకటించి, మూర్తీభవింపజేయు కాలము దాటిపోవుచున్నది. ఈ దీక్షతో జీవితమును ప్రారంభించిననే మనలను మనముద్ధరించుకొని, కుటుంబ మునకును, దేశమునకును, ప్రపంచమునకును తోడ్పడగలము.

ఒక్కక్షణము ఈ తరుణమందే మనము కనులుమూసికొని ఆత్మవిశ్వాసము నకును, ధైర్యమునకును మూలమగు వెలుగును, అంతరాత్మను ధ్యానింతముగాక! ఇట్టి ఆత్మవిశ్వాస ధైర్యములను మనోవాక్కాయకర్మలచేత మనము ప్రదర్శింతుము గాక. వర్ణభేదములు, జాతిభేదములు మరచి మనము దేవుని బిడ్డలందరి యోగక్షేమ ముల కొరకును ప్రార్థింతుముగాక! ప్రాచ్యదేశకుల మతభేదములును, పాశ్చాత్య

ప్రపంచ సంఘభేదములును విశ్వశాంతికిని, అంతర్జాతీయ సుహృద్భావమునకును, భగవంతునిలో నైక్యమైపోవుగాక.

శాంతి సమాజము

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 21-12-1947 )

- శాంతి ప్రతివారి జన్మహక్కు. నిరంతరము ఉచ్ఛ్వాస నిశ్వాసములలో శాంతిని అనుభవించగలిగిన వారు భగవత్ సాక్షాత్కారమును పొందగలరు.
- మత మనగా భగవదారాధన. ఈ సమస్తమైన చరాచర ప్రపంచ మంతయు భగవంతుడే. జ్ఞానికి అతడు తన జీవితమంతా ఈ సమస్తమును ప్రేమించుట, ఆరాధించుటలో నిండియుండును కనుక మతము, జీవితము ఒక్కటే.
- పరబ్రహ్మము సముద్రము వంటిది. వాక్కున కతీతము. మౌనమునందు మాత్రమే అనుభవైక వేద్యము.

# 21. మహాత్ముని స్థిరాస్తి

స్థిరమైన ఆస్తి యెద్ది ? సామాన్యులు భూములు, ఇండ్లు, తోటలు మొదలైనవే స్థిరాస్తులని తలచెదరు. కొందరు లోభులు ఇనుపపెట్టెలలో దాచిన ధనము, బ్యాంకు లలో నుంచిన ధనమే స్థిరాస్తియని కూడ భావించెదరు. మరికొందరు వస్తువాహన ములు, తమకున్న జవహరీ, తమ స్త్రీలు ధరించు బంగారపు వస్తువులు, వజ్రములు, మణులు వగైరాలే స్థిరమైన ఆస్తియని తలంచుచుందురు.

ఇవియే నిజముగ స్థిరమైన శాశ్వతమైన ఆస్తులైన మన మహాత్ముడు కడు నిరుపేద గదా ! మహాత్ముని ఆస్తి అంతయు తుపాకీ గుండ్లు కడుపులోనికి చొచ్చు కున్నపుడు రక్తసిక్తమైన గావంచా ఒకటియేగదా ! చివరకు ఆయన కళ్ళజోడు కూడ ఎవ్వరో మూర్ఖులు అపహరించిరి. ఆయన పాదరక్షలలో గూడ ఒక్క దానిని కొంత కాలము తీసుకొని పోయిరి.

క్రైస్తును సిలువకు నెక్కించి కొరత వేసినప్పుడు ఆయన ధరించియున్న అంగీని చీట్లువేసి ఆయనను హింసించిన సిపాయిలే తీసుకొనిరి. క్రైస్తుయొక్క ఆస్తిగూడ ఆయన ధరించిన రక్తసిక్తమైన అంగీ ఒక్కటే గదా !

అయినను క్రైస్తు నిరుపేదయా ! లోకములో క్రైస్తుకంటె ధనవంతుడెవ్వడు? అటులనే మహాత్మునికి ఉన్న ఆస్తిఅంతయు రక్తపాతమైన గావంచా, చిన్న దుప్పటి మూడుకోతుల ప్రతిమ, పాదరక్షలు, కండ్లజోడు, చిన్నగడియారము, దేశీయమైన కలము, సిరాబుడ్డి మొదలైన చిన్నవస్తువులన్నియు చాల తక్కువ ఖరీదుగదా! మహా త్మునికంటె ఈ లోకములో ధనవంతు లెవ్వరు? ఆయనే కోటీశ్వరులకు కోటీశ్వరుడు. రాజులకు రారాజు. చక్రవర్తులకు చక్రవర్తి.

మూడుకోతుల ప్రతిమ గాంధీజీ జీవితమునకు చాల సన్నిహితముగా నుండెడిది. ఏలయన ఒక్కకోతి కండ్లు మూసుకొని యుండెను. రెండవది నోరు తన చేతులతో మూసికొనెను. మూడవది తన చెవులను మూసికొనెను. కండ్లుమూసి కొన్నది నేను పాపమును చూడననియు, నోరుమూసి కొన్న కోతి నేను పాపపుమాటలు మాట్లాడననియు, ఒరుల నిందించ ననియు, చెవులు మూసికొనియున్న మర్కటము ఇతరుల గురించి తప్పు మాటలు, నిందారోపణలు విననని సాధకులందరకు బోధ చేయు చున్నది.

ప్రశ్న : మహాత్ముని స్థిరాస్తి ఏది ?

జవాబు : సత్యము – అహింస

రాజులు మారినను,రాజ్యములు నశించినను ప్రపంచమున కంతకు శాశ్వత ముగ ఆధారమైయున్న సత్యము, అహింసలే మహాత్ముని స్థిరమైన, శాశ్వతమైన ఆస్తులుగా ఉన్నవి.

నేడు ఫిబ్రవరి 12వ దినము. మహాత్ముని భౌతిక శరీరము గతించి 14 రోజు లయ్యెను. నేడాయన అస్థికలు దేశములో అన్ని పుణ్యనదుల యందు, సాగరములందు కలుపబడుచున్నవి. మహాత్ముని అస్థికలు ఒక్క హిందూదేశమునకే చెందియున్నవా? ఆయన లోకైకపురుషుడు. ఆయన అస్థికలను లోకములో ఉన్న పుణ్యతీర్థము లన్నింటిలో అన్ని సముద్రములలో గూడ కలుపుట ఉచితము గదా!

మహాత్ముడు జీవించి యుండగ తన అనుచరులు ఆచరింపజాలని పనిని, మహాత్ముడే భౌతికశరీరమును విడువకముందు ప్రత్యక్షముగా చేసి ప్రపంచమును వీడెను. ఆపనియెద్ది ? శ్రీగాంధీమహాత్ముని స్థిరాస్తి, శాశ్వతమైన ఆస్తిని, తుప్పు పట్టని ఆస్తిని, దొంగలపహరింపజాలని ఆస్తిని, ఎన్నటికీ నశించని, హెచ్చుతగ్గులు లేని ఆస్తిని ఆయన జ్ఞానధనమును లోకములో ప్రతివ్యక్తికి ప్రతి జీవికి కూడ అర్పించియే వెడలెను.

అది ఎద్ది ? అదియే దివ్యమైన శ్రీ గాంధీ మహాత్ముని దివ్య మంత్రము రామ మంత్రము.

ప్రణవ నిలయ మంత్రం ప్రాణ నిర్వాణ మంత్రమ్

ప్రకృతి పురుష మంత్రం బ్రహ్మ రుద్రేంద్ర మంత్రమ్

ప్రకట దురిత రాగ ద్వేష నిర్నాశ మంత్రమ్

రఘుపతి నిజమంత్రం రామ రామేతి మంత్రమ్

ప్రార్థనకు వెడలు సమయమందు తుపాకీ గుండు పొత్తికడుపులోనకు వెళ్ళి నప్పుడు శరీరమును వీడకముందు ఆయన మరణశాసనముగా లోక సంగ్రహార్థమై వచించిన చివరమాటలు "హేరామా" "హేరామా" గదా!

రాముని దివ్యనామమునకు "హే" యని యేల కల్పితిరని కొందరు శంకించి, మహాత్ముడు తన్ను జంపుచున్న కిరాతకునిలో గూడ రామునే దర్శించుచు 'హే' రామా నీవే నన్ను తీసికొనిపోవుచుంటివా? అని భావించి యుండవచ్చును.

శ్రీ గాంధీ మహాత్మునివంటి మహనీయులకు లోకమంతయు రామమయమే గదా! ప్రతివ్యక్తియు రాముని ఆకారమే గదా!

"అంతా రామమయం బీజగమంతా రామమయం" అనెడి మహాత్ములను సిలువ కెక్కించినను, తుపాకిగుండ్లచే కొట్టబడినను వివిధ క్లిష్ట పరిస్థితులలోగూడ రామునే దర్శించుచు వారి యనుభవమును వ్యక్తపరచెదరు.

ఇప్పుడు మనకు కావలసినది శ్రీగాంధీ మహాత్ముని యొక్క స్థిరాస్తి. శాశ్వతమైన ఆస్తి, లోకశాంతిని కలిగించెడి ఆస్తి. చిరస్మరణీయమై, అందరకు అవసరమైన ఆస్తి అదియే రామ మంత్రము. ఏ రామమంత్రము తుదిదశలో మహాత్ముని తుది పలుకులుగా మానవకోటికి అర్పించబడినదో ఆ మహామంత్రమే దేశోద్ధరణకు, లోకశాంతికి తోడ్పడెడి బీజాక్షరయుత మంత్రము.

కాని మానవులు, ముఖ్యముగా సామాన్యులు భ్రమచే నామరూపముల వెంటనే పరుగెత్తుచు భౌతిక శరీరమునే వెంబడించెదరు గాని నామరూపరహితమైన, నిత్యమైన, శాశ్వతమైన, పరిపూర్ణమైన దివ్యమంత్రమును వెంబడించ జాలరు.

శ్రీ గాంధీజీ భౌతికశరీరమును దహనము చేయురోజున వెంబడించిన లక్ష లాది ప్రజలను చూడుడు. వారి అపారమైన భక్తి, ప్రేమలకు ఆనందమే గాని ఈ లక్షల కొలది జనులలో ఎంతమంది మహాత్ముని స్థిరాస్తిని, శాశ్వతమైన ఆస్తిని ఆయన మానవకోటికి కానుకగా అర్పించిన తుదిమాటలను మహామంత్రమును అనుసరించుచు వెంబడించు చున్నారో మన మాలోచించవలసి యున్నది. ఎవరంతట వారే తమ జీవితములను పరీక్షించుకొని యదార్థమైన సత్యమును గ్రహించవలెను. విజ్ఞాన శాస్త్రము పదార్థము క్షీణించదనియు,(Matter is undestructable)ఏ శబ్దము మాయకాజాలదనియు (No sound is lost) మరియు ప్రతిశబ్దము దాని తావునే చేరుచున్నదని (and every vibration is registered) బోధించుచున్నది.

అటుపైన 'హేరామ' 'హేరామ' లేక 'ఓరామ' 'ఓరామ' అన్న మహావాక్యము లెచటికి వెళ్ళెను ? ఏమయ్యెనో అని మన మిప్పుడు ఆలోచించవలసి యున్నదికదా!

అవి గాలిలో మాయమై పోయినవా ? శబ్దము అటుల మాయము కాజాల దనియే గదా విజ్ఞాన శాస్త్రము చెప్పుచున్నది.

పూర్వము శుకమహర్షి తనను విడిచి వెళ్ళుచున్నపుడు శుకునితండ్రి యగు వ్యాసుడు. 'శుకా!శుకా యని పిలువగా పర్వతములు వృక్షములు కూడ శుకమహర్షి సన్నిధిని వ్యక్తపరచుచు జవాబొసంగెనని పురాణములలో చదివి యుంటిమి.

శుకునివలె గాంధీమహాత్ముడు జీవన్ముక్తుడు, మృత్యువును జయించిన వాడు, అమృతతుల్యుడు గాన ఆయన మహాజీవితము స్థిరాస్థిరమైన ప్రపంచమంతలో మిళితమై పోయెను. ఆయన మహావాక్యములు ముఖ్యముగా తుది మహామంత్రము గాంధీ మహాత్ముని సన్నిహితులైన వారిలో, ఆయన అడుగు జాడలలో నడచెడి వారిలో, సత్యము, అహింసలే ఆధారము చేసికొని జీవించెడి వారిలో కలసిపోయెను. ఒక్క వ్యక్తులలో నననేల చరాచర ప్రపంచమంతలో విలీనమయ్యెను.

ఆత్మ సోదరీ సోదర స్వరూపులారా ! గాంధీ మహాత్ముని అనుచరులారా ! మీకు నిజమైనభక్తి, ప్రేమలు శ్రీమహాత్ముని యందున్నచో మీ నేత్రములను తెరువుడు, మేల్కొనుడు, మహాత్ముని దివ్యతేజస్సు మీయందే ప్రవేశించెను. ఇదిగో ఆయన మహామంత్రము. అది మీ హృదయమున స్పందించుచున్నది. మీ ఉచ్ఛ్వాస, నిశ్వాసల యందే ఆడుచున్నది.

"శ్రీ గాంధీ మహాత్మునికి ఇప్పుడు వేరే శరీరము లేదు. నా శరీరమే ఆయన శరీరము. ఆయన నాలోనే సత్యము, అహింసను వ్యక్తపరచుచుండెను" అని ఆనంద ముతో నూతనశక్తితో కంఠమెత్తి పాడుడు.

అదిగో గాంధీమహాత్ముడు మీ నేత్రములలో చూచుచుండెను. మీ చేతులతో పనిచేయుచుండెను. మీలో కదలుచు నడచుచుండెను. మీలో ఆలోచించు చుండెను. శ్రీ గాంధీ మహాత్ముని మహామంత్రము ఈ జగమంతట ప్రవేశించి ప్రత్యణువులో నిండి నిబిడీకృతమై యున్నది.

వినుడు, సముద్రపుటలలతో రామగీతమును, చూడుడు! ఆకాశమున నక్షత్ర ములు రాముని గీర్తించుచున్నవి. మారుతములలో కూడా రామశబ్దమే. పక్షులు మహాత్ముని రామ గీతమును పాడుచున్నవి. పసిబిడ్డలలో రాముడు. యవ్వనులలో రాముడు. ముదుసలులలో రాముడు. రాముడు కానిదెద్ది? పర్వతములలో, వృక్షము లలో, లతలలో సర్వము రాముడే అంతయు రామమయమే.

రామభక్తుల కిన్ని మాటలేల !గాంధీ మహాత్ముడు మౌనధారి. ఓగాంధీ భక్తులారా! సత్యాగ్రహులారా ! అహింసా వ్రతులారా ! రండు, రండు.

శ్రీ గాంధీ మహాత్ముని పేరున ఈ దినమున మన ఆంతర్య తేజస్సును మరుగు చేయుచున్న స్వార్థమును అహంకారమును, కించిదజ్ఞత్వ సూచకములైన గుణము లన్నింటిని వదలి పెట్టి మహాత్ముని పేరైనను స్మరించుటకు అర్హులమై యుండుటకు ప్రయత్నము చేయుదుముగాక.

శ్రీ మహాత్ముని దివ్యశక్తి, అఖండమైనశక్తి, అపారమైన సత్యము, అహింస, విశ్వ ప్రేమలే మన అందరిలో ఇప్పుడే గాక యెప్పటికిని స్థిరస్థాయిగ విలసిల్లుగాక! శ్రీమహాత్ముని దివ్యజ్యోతి స్వరూపమునకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు
ఓం శాంతి శ్శాంతిః శ్శాంతిః
హరిః ఓమ్ తత్సత్ ఓం.
( 12-2-48 )

- భ్రమలు చాలించి, ఎండమావుల వెనుక పరుగిడక, రజ్జు సర్పభ్రాంతికి స్వస్తి చెప్పినచో, ఆ పరమాత్మకు మించి వెలుపల గాని, ప్రత్యేకమైనది గాని మరి ఏమీ లేదని తెలియును.
- ప్రార్థనలు, ధ్యానములు, ఉపవాసములు, మంత్రోచ్చారణములతో భగవంతుని సాధింపగలమను భ్రమను విడిచి, ఆయనను శరణుజొచ్చి మౌనమును పాటింపవలయును.
- లౌకిక విషయములను దూరముగా నుంచి దైవ ప్రార్థనలు చేయవలెనను కొనుట ఒక్క ఆదివారమునాడు మాత్రమే జరుగనేల? ప్రతి దినము ఒక తేజోవంతమైన ఆదివారముగ, ప్రార్థనలతో, శాంతి విరామముతో ఆనంద ముగా నుందుముగాక !

# 22. స్వప్నములో సమాధి

ఇవి ఉపవాస దినములు, నేడు తొమ్మిదవ రోజు. పని హెచ్చుగనున్నది. భక్తులు వచ్చుచు వెళ్ళుచుండిరి. అయినను మనసు పరిపూర్ణమునే కోరుచున్నది. ఇక ఉపవాసము ఒక్కరోజే యున్నది. ఏలయన పదిరోజులే ఉపవసింపవలెనని తలంచితిని. ఈ తొమ్మిది రోజులు వ్యర్థముగ వెళ్ళిపోయేనే, ఉపవాసముచే పొంద వలసిన దానినంతయు పొందలేదే, ఇంకను నివృత్తిగ గడిపి నిరంతర నిత్యశాంతి నేల అనుభవించుట లేదని నేటి దినమును ప్రారంభించితిని.

స్నానమైన తరువాత మేడమీదకి వెళ్ళితిని. చల్లని గాలివీచుచుండ దైవశక్తి చేతనే గాలి వీచుచున్నది గదా యని ఆనందించితిని. సూర్యరశ్మిలో దైవము ననుభ వింప తలంచితిని కాని కొంచెము మబ్బుగా నుండెను. పక్షులు స్వేచ్ఛగా పాడుచుండ దైవత్వము ననుభవించితిని.

ఎటుగాంచినను దైవత్వమే వ్యక్తమగుచున్నందున పనులలో మునిగి మనుష్యుల సంపర్కములో నుండుట అయిష్టమై మనస్సు తీవ్రముగా ధ్యానము చేయుటకు కోరెను. క్రిందకువచ్చి పరుండి ధ్యానముచేయ ప్రారంభించితిని. శరీరము బరు వెక్కెను. మనస్సు లీనమయ్యెను. అటులెంత కాలము గడచెనో తెలియదు. నేను లేచిన తరువాత గడియారమునుబట్టి చూడగా చాలగంటలైనట్లు తెలియవచ్చెను.

ఆ నిశ్శబ్దములో అనుభవించుచున్న శాంతి నెట్లు వర్ణింపగలను ? అంతయు పూర్ణశాంతిగ నున్నది. జడముగా విశ్రమించియున్న ఈ శరీరమును చూచితివి. అది కదలుట లేదు. మెదలుటలేదు. పాషండమువలె చలనము లేకుండ పడియున్నది. ఇది స్వప్నమా ! లేక సమాధియా ! యనెడి భ్రమ కలిగెను. అటులనే విశ్రమించి యున్న శరీరమును గాంచుచు కొంతతడవు గడపితిని.

మరల స్వప్నావస్థ ప్రారంభించెను. అప్పుడు లేచివెళ్ళి మేన బట్టలు ధరించితిని. మనుష్యులు వచ్చిరి. కాని మాట్లాడలేదు. వ్రాతపరికరములున్న మేజా వద్దకు వెళ్ళితిని. కాని వ్రాయబుద్ధి పుట్టలేదు. ఈమారు మరల అరుగుమీద ధ్యానము చేయుచు పరుంటిని. ఆంతర్యమున బాహ్యమున అంతటను తేజస్సే. అందరిలో తేజస్సు, దివ్యతేజస్సు ననుభవించుచు కొంతసేపటికి మేల్కాంచితిని. స్వప్నము నుండి జాగ్రదవస్థకు వచ్చినను మనస్సు నివృత్తిగానే యున్నది. తేజస్సునే అనుభవించు చున్నది. దేనిని వినుటకుగాని, చదువుటకుగాని, వ్రాయుటకుగాని, మాట్లాడుటకు గాని, ఎవ్వరినీ చూచుటకుగాని కోరిక పుట్టలేదు. కాని నేను అనుభవించిన యిట్టి దివ్యానందమును ఆశ్రమ భక్తుల శాంతిని కోరుచు అయిష్టముగా నున్నను, ఇప్పుడైనా స్వప్న సమాధి నుండి మేల్కొని ఈ వ్యాసము వ్రాయుచుంటని. మనము అనుభవించెడిది వృద్ధి కావలయుననన్న దానిని ఇతరులతో పంచుకొనుటయే దగ్గర మార్గము.

మనము ఆనందముగా నుండవలయునన్న ఇతరులను ఆనందింపచేయ ప్రయత్నించుటయే సులభమైన మార్గము. కనుక మీ జన్మహక్కయిన దైవతేజస్సును, ఆంతర్య జ్యోతిని మీరు గూడ ఇప్పుడే ఇచ్చటనే నివృత్తులై అపరోక్షముగ అనుభవించుచు నాతో ఆనందమును పంచుకొనుడు.

సర్వమును దహించగల్గిన అన్ని నామరూపములను ఆహుతి చేసికొనగల్గిన జాగ్రత్త, స్వప్న, సుషుప్త్యవస్థలలో గూడ మనలో ప్రకాశించుచున్న కోటిసూర్యప్రకాశమానమైన దివ్యతేజస్సునకు, అట్టి తేజస్సును అనుభవించు సమాధి స్థితికి ధన్యవాదములు.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు

( తోటపల్లి 23-9-49 )

ఉదయం 12-00

- మనకు అజ్ఞాతమైన దైవసంపత్తు గలదు. సకాలమున నది అనుగ్రహింపబడును. (తన్నిమిత్తము) భగవంతునిపై ఆధారపడుట నేర్చుకొనవలయును.
- అజ్ఞానులు, దుర్మార్గులు క్రూరముగ హానిచేసిననూ, నలిపి త్రొక్కి వేయబడినను పరిమళమునిచ్చు గులాబివలె ఉపకరించవలయును.
- మనస్సునకు నిజముగా ఒకటే విచారము, కష్టము. అది ఆత్మ తన సహజ స్వభావమును మరచుటయే.

# 23. ప్రాతః కాల నివేదన

నేడు ప్రాతఃకాలమునందు నా ప్రార్థనా సమయమున కైలాసములో వరండాలో కూర్చొని ఫిడేలు మీద 'బ్రహ్మానందము' 'హరేరామ' 'రఘుపతి రాఘవ' నాకు వచ్చి నట్లు వాయించుచు తరువాత

ఎవరున్నారు ! నను బ్రోచే వారెవరున్నారు ?

అనెడి ఎప్పుడో చిన్నతనమున విసినట్టి కృతియొక్క భావము జ్ఞప్తికి వచ్చి ఫిడేలు మీద వాయించసాగితిని. అది వాయించుచుండ ఏలనో హఠాత్తుగా పరవశత్వం కలిగి నేత్రముల నుండి ఆనందబాష్పములు బొటబొటా కారసాగెను. మనము నిరంతరము దైవసన్నిధి యందుండియున్నను, ఆహా! దైవకృప ఎప్పుడు ఏ రీతిగ మనయందు ప్రసరింపబడునో మనకు తెలియదుగదా!

ఎవరున్నారు నను బ్రోచే వారెవరున్నారు ?

అనెడి ఆ రెండు చిన్నవాక్యములను నిమీలిత నేత్రుడనై ఎడతెరపి లేకుండ అటులనే చాలసేపు వాయించుచుంటిని. ఆనందబాష్పములు అటులనే కారుచుండెను.

ఒక్కమారు కండ్లుతెరువ ఒక గ్రద్ద ఆకసమునందు స్వేచ్ఛగా, ఆనందముగా దాని రెక్కలనైననూ కదల్చకుండ ఎగురుచు అది నాతో "ఓ సాధూ! చూడుము! నే నెవ్వరిలో ఎగురుచుంటినో. నన్ను బ్రోచేవాడు నాలోపలను వెలుపలను మీదను క్రిందను చుట్టును నిండియున్నాడు. నేను ఆ దివ్యశక్తి వలననే ఎగురుచుంటిని" అని చెప్పుచున్నట్లు తోచి దాని ఉపదేశమును గ్రహించి మరియు హెచ్చుగ ఆనందింప సాగితిని.

అటు పిమ్మట కొన్ని చిన్ని పక్షులు దగ్గరనేయున్న వేపచెట్టు మీద వ్రాలి వాని సంగీతమును నా సంగీముతో కలిపి పాడసాగెను. ఆ చిన్న పక్షులు నాకిట్లు ఉపదేశింప సాగెను.

"ఓ సాధూ! మనలను బ్రోచేవాడు మనలోనే యున్నాడు. అతడే మనలో పాడు చుండెను. అతడే నీకును మాకును గూడ ఆహారము నొసంగు చుండెను. అతడే నిన్ను,మమ్ము, ఈ విశ్వమునంతను కంటికి రెప్ప పోలికను అహర్నిశములు బ్రోచుచు కాపాడుచుండ ఇక బ్రోచేవారెవరున్నారని పాడెదవేల ?"

ఆహా !దైవమెంత కృపామయుడు! ఆయన ఈ చిన్న పక్షుల రూపమున దర్శనోప దేశముల నొసంగెను. ఈకైలాసము ఈ చల్లని ప్రకృతి సర్వము దైవమయమయ్యెను.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 25-6-50 ) ఉదయం 5-00

# 24. మానవుడు స్వతంత్రుడా ? లేక అస్వతంత్రుడా ?

సృష్టి ఆదినుండియు ఈ క్లిష్ట సమస్యను తత్త్వవేత్తలు, శాస్త్రజ్ఞులు, విజ్ఞులు, అహర్నిశములు పరిశీలించుచు తర్కించు చుండిరి. కొందరు మనుజుడు స్వతంత్రు డనిరి. మరికొందరు అస్వతంత్రుడనిరి.

మనుజుడు కొంతవరకే స్వతంత్రుడని మరికొందరనిరి. చిన్న చీమనైన సృష్టింప లేనివాడు, చివరకు దైవశక్తిలేక, స్వశక్తి చేత గడ్డిపరకనైన కదల్పజాలనివాడు స్వతంత్రు డెటులగునని మరికొందరు నుడివిరి.

మనుజుడు తన శరీర విషయములో స్వతంత్రుడేయని చెప్పవచ్చును. ఏలనన, తన శరీరమును, తన యిష్టము వచ్చినట్లు తాను చేయవచ్చును గదా ! తన గృహ ములో గూడ తాను యజమానిగా నున్న కొంతవరకు స్వతంత్రుడే. లేక ఇంటి యొక్క యాజమాన్యము భార్యచేతిలోనున్న పురుషుడేదైన అవకతవక పని స్వతంత్రించి చేయబోయిన భార్య అతని మీద అధికారము చేయవచ్చును.

మనోజయము కల్గినచోట స్వాతంత్ర్యమున్నది. మానవుడు తనచుట్టును చిన్న గీతను గీచికొని మనోజయము కల్గియున్న ఆ గీతలో స్వతంత్రుడే యని చెప్పవచ్చును. వేల కొలది కోరికలతో నిండి వివిధ ఆశాపాశములచే నీడ్వబడుచున్న మనుజుడు ఎచటనున్నను ఎంతచిన్న గీత గీచుకొని స్వార్థముగా జీవించుచున్నను తాను అస్వతంత్రుడే.

మనోజయము గల్గినవాడే స్వతంత్రుడు.

మనస్సునకు బానిసయైనవాడు అస్వతంత్రుడే.

ఇంతకును మానవునకు తన సృష్టికర్తతో, దైవముతోనెంత దగ్గర సంబంధము, అవినాభావ సంబంధమున్న అంత స్వతంత్రుడుగా నుండును. దైవమునకు తానెంత దూరముగా నున్న తన సృష్టికర్తను మరచి, విషయలోలుడై ఆశాపాశము లనెడి యురులలో బిగించబడియున్న అంత హెచ్చుగ అస్వతంత్రుడై జీవించుచుండును.

ఒక చిన్న ఉదాహరణమును మనమిప్పుడు తీసికొని పరిశీలించిన ఈ కఠినమైన సమస్యను చాల సులభముగా బోధపరచుకొనవచ్చును. నేనిప్పుడు కైలాసాశ్రమములో నివృత్తిగా, శాంతిగా నాకాలమును గడుపుచుంటిని. తలవని తలంపుగా ఆశ్రమ వృద్ధిని గోరుచు నన్ను ప్రేమించెడి ఒక జనని రూ. 200/- నిరుపేదలు, రోగులు నగువారి సేవకై వినియోగింపుమని నన్ను నమ్మి పంపెను. ఈ రెండు వందల రూపాయలను ఆమె ఉద్దేశ్యము మేరకు ఏ విధముగా ఖర్చు చేయుటకైన నేను స్వతంత్రుడను కదా ! ఏ దిక్కులేక ఆ పూటకు తిండిలేని నిరుపేదలకు, వస్త్రహీనులై చలిచే వణకుచున్న వారికి, రోగులకు తిండి బట్ట మందు ఇచ్చి, వారిని ఆదరించు టకు నేను స్వతంత్రుడుడనే.

ఏ పనిచేయుటకైన రెండువందలు చేతిలో నున్నవి. ఈ రెండు వందల పై నాకు అంతవరకు స్వాతంత్ర్యమున్నదిగదా, కాని ఈరెండు వందలు పంపిన జనని కున్న కొదువ ఆస్తిని కూడ నా యిష్టము వచ్చినట్లు చేయుటకు నాకెంత మాత్రము హక్కుగాని స్వాతంత్ర్యము గాని లేదుగదా! ఆమెకు లక్షల కొలది ధనముండవచ్చును. దానిని మాత్రము నేను తాకజాలను.

ఇచ్చట శాస్త్ర సమ్మతమైన, కఠినమైన, సరియైన, ధర్మమైన చట్ట మొకటి గలదు. అదియేదియన, ఎవ్వరేవిత్తులు చల్లిన ఆ ఫలితమును వారే అనుభవింప వలెను. నీకివ్వబడిన ఏ పనిలోనైన నీవు నీ శక్తిసామర్థ్యములను దుర్వినియోగము జేసిన నీకర్మను నీవే అనుభవించ వలసియుండును.

అటులనే యీ రెండు వందలను నేను దుర్వినియోగముజేసిన నిక మరల డబ్బు రాకుండుట, నేను జేసిన కర్మ ననుభవించుట జరుగును. నాకప్పగించిన రెండువందలను నేను సద్వినియోగము జేసిన నన్ను నమ్మిన జనని, మిగిలిన ఆస్తి నంతను నాకు అప్పజెప్పవచ్చును. అటులనే దైవము మనకు కొన్ని బాధ్యతలను, కొంత స్వాతంత్ర్యమును నిచ్చి వదలి పెట్టియుండెను. ఆయన ప్రేమతో మనకిచ్చిన స్వాతంత్ర్యమును సద్వినియోగము జేసిన దైవము యొక్క ఆస్తికంతకును మనము హక్కు దారులమై యుందుము. దైవము యొక్క ఆస్తి సచ్చిదానంద రూపము, సర్వ వ్యాపకము, సర్వజ్ఞత, సర్వశక్తియే. కావున మనకివ్వబడిన దుర్లభమైన మానవ జన్మను మానవవిధులను దుర్వినియోగము చేసితిమేని మరల మరల పుట్టుచు-గిట్టుచు సంసార సాగరములోబడి దారితెన్నులు లేక అధోగతి పాలయ్యెదము.

ప్రశ్న : మనుజుడు స్వతంత్రుడా ? లేక అస్వతంత్రుడా ?

జవాబు : బ్రహ్మ సాక్షాత్కారము బడసిన మానవుడు, దైవానుభవము కల్గిన నరుడు స్వతంత్రుడే. అద్వితీయమైన తన స్వరూపమును బంధించెడిది భిన్నముగా నెచ్చటను లేదు. తక్కిన వారందరు కామ,క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్యములకు బానిసలైయున్నవారందరును అజ్ఞానము, అహంకారము, మమతలతో నిండియున్న వారందరు అస్వతంత్రులే, బానిసలే.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు
ఓం ! ఓం ! ఓం !
( కైలాసము )
23-6-50 ఉదయం 5-00

✦ "నీవు శరీరము కావు. శరీరము నీదియు కాదు నీవు శుద్ధచైతన్యము మాత్రమే కావున స్వేచ్ఛగను, ఆనందముగను ఉండుము." అను అష్టావక్రగీత ప్రబోధ మును అనుభవించగలిగినచో చాలును.

# 25. నిశ్శబ్దో బ్రహ్మ

నిశ్శబ్దమే బ్రహ్మమైయుండ, ఈ ఆలోచనలేల ? ఈ వ్రాయుట లెందుకు? ఆలోచనలు, భావములు లేకుండ వ్రాయుట ఎట్లు జరుగును? నిశ్శబ్దతను గురించి ఆలోచించినను ఆలోచన ఆలోచనయే గదా ! సంకెళ్ళు బంగారముతో చేయబడి నను, సంకెళ్ళు సంకెళ్ళే గదా !

అన్నివిధములైన ఆలోచనలకు అతీతులైయున్నవారే స్థితప్రజ్ఞులు, జీవన్ముక్తులు, కాని స్థిత ప్రజ్ఞత్వము నొంది, జీవన్ముక్తిని పొందుట యెంత దుర్లభము? ఆలోచించుట చాల తేలిక ఆలోచించ కుండుట కష్టము. ప్రతి మానవుడు సహజముగా ఆలోచనలు లేక సకంల్పములతో నిండియుండును. అన్ని సంకల్పములకు అతీతులై యున్న వారే మహనీయులు, శాంతి, శక్తి, బ్రహ్మానందమంతయు వారి సొత్తే.

ప్రాతఃకాలమున లేవగానే నేడు ఏ సంకల్పములు, ఏ వ్రాతలు లేకుండ పరి పూర్ణముగ గుడపవలెనని నిశ్చయించితిని. సంకల్పమే మాటగా, చేతగా వ్యక్తమగును గదా! అందుచే నేడు విలువైన కాలమును ఉత్తరములు వ్రాయుట వగైరా పనులతో వ్యర్థపుచ్చరాదని తలంచి, నేటిదినము జీవితములో గడిపిన దినములన్నిటి కంటె పరమోత్కృష్టమైన శాంతిదినమున గడిపెదనుగాక, యని నా దినచర్య పుస్తకమును తలవని తలపుగా తీసి వ్రాసితిని.

అప్పుడు ఆఫీసుగదిలో ఎదురుగానున్న గోడమీద పెద్ద అక్షరములతో "నిశ్శబ్దో బ్రహ్మ" అనెడి మహావాక్యము నన్నాకర్షించగా, ఏమియు వ్రాయరాదని తలంచియు, వాసనాబలిమిచేతనో, కర్మచేతనో యీడ్వబడి యీ వ్యాసము నిప్పుడు వ్రాయుచుం టిని. ఇంతలో నిద్రించుచున్న వారిని లేపుటకు కొట్టబడుచున్న ఘంటానాదము వినబడుచున్నది. అదియేమి? కాకులు అరచుచున్నవి. సముద్రము ఘోషించు చున్నది. ఇట్లు వ్రాయుచుండ ఈ కలము శబ్దము చేయుచున్నది. ఈ శబ్దములన్నియు ఏమిటి? అన్నింటికంటే, ఆలోచనలు నదీప్రవాహము వలె ఆంతర్యము నుండి వచ్చుచున్నవి. నిశ్శబ్దమునుండియే యివన్నియు ఉత్పన్నమగుచున్నవా?

"నిశ్శబ్దోబ్రహ్మ" శబ్దరహితమైనది, చలనరహిత మైనది, సంకల్ప వికల్ప శూన్య మైనదే బ్రహ్మము. నా చిన్నతనములో "నిశ్శబ్దముయొక్క వాక్కు" అనెడి చిన్న పొత్త మును చదివినట్లు ఇప్పుడు జ్ఞాపకము వచ్చుచున్నది. ఇదియు మరొక సంకల్పమే కదా?

నిశ్శబ్దములో శబ్దమెటులుండును? నిశ్శబ్దమునుండి వాక్కు ఎటుల వచ్చును? ఇదియే అంతర్గర్భితమైన, ఆశ్చర్యమైన సత్యము, సముద్రమునుండియే శబ్దముతో కూడి యున్న కెరటములు వచ్చుచున్నవి. నిశ్శబ్దమునుండియే ఈ బ్రహ్మాండమైన సృష్టి అంతయు వచ్చియుండెను. ఈ ప్రకృతి యంతయు మూలపురుషుని సంకల్ప మాత్రముననే బహిర్గతమగుచున్నది.

పక్షుల కిలకిలా రావములైనను, పసిపిల్లల యేడ్పులైనను, విరోధుల తిట్లయినను, ఆప్తుల సానుభూతి వాక్యములైనను,చిన్న చీమ నడచు శబ్దమునుండి భీకరమైన ప్రళయ గర్జన వరకు, సర్వము పరిపూర్ణమైన నిశ్శబ్దము నుండియే వచ్చుచుండెను.

ఇంతకును ముఖ్యమైన విషయమేదియన శబ్దమునకు ఆధారమైన నిశ్శబ్దమును, ఆదిని పరిపూర్ణ సద్వస్తువును మానవులు మరచుట చేతే అన్నిబాధలకు, చింతలకు, జీవితావస్తలకు మూలకారణమై యున్నదను సత్యమును ఎంత త్వరలో గ్రహించిన, జీవితాభివృద్ధికి అంతమంచిది. ఈ అఖండమైన నిశ్శబ్దములో తమ అంతర్య ఆలోచనల యొక్క శబ్దమును గూడ అంతర్ముఖులై వీక్షించ గల్గినవారే ధన్యులు.

ఆత్మీయులారా ! మీ మనోతటాకములో కోరికలనెడి అలలు లేకుండచేసి, సంకల్పరహిత మనస్సులతో, శబ్దముల కతీతమైన నిశ్శబ్దములో ధ్యానించుచు, మన జన్మహక్కైన నిశ్శబ్దబ్రహ్మమును పొందుటే మీ గమ్యస్థానము, నా గమ్యస్థానము దైవపుబిడ్డలగు మానవులందరి గమ్యస్థానము.

నిశ్శబ్దో బ్రహ్మ

శబ్దరహితమైన, పరిపూర్ణమైన ఓ పరబ్రహ్మ స్వరూపమా ! నీకు మా ధన్యవాదములు.

హరి ఓం తత్‌సత్ ఓం

( 11-7-50 )

ఉదయం 5-00

# 26. ఒక్క తడవు నవ్వుము

నేటి ఉదయమున "ఒక్క తడవు నవ్వుము" అనెడి చిన్న ఇంగ్లీషు పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది. నా భావములను వ్రాయుటకు ముందు ఆ పద్య భావమును మీకు తెలుపనిందు.

గీ॥ నవ్వు మొకమారు నీవటుల్ నవ్వునెడల
మరియొకరు నవ్వుదురు క్షణమాత్రముననె
వెళ్ళు నీరీతి నవ్వులు మైళ్ళ కొలది
జీవితము ధన్యమగు నవ్వుచేత నెపుడు.

కనుక మనమందరము నవ్వుదము. ప్రియపాఠకా! నీవు నవ్వు చుంటివా! నవ్వుట కూడ అంతతేలికకాదు. నవ్వుట యనగా పెదవులతో గాదు. హృదయమంత టితో నవ్వవలెను. హృదయము చింతలచే, తాపత్రయములచే తినివేయబడుచుండ సహజముగా నవ్వు ఎటులవచ్చును? మనుజుడు కృత్రిమముగా నవ్వుట నేర్చుకొన వచ్చును గాని యది నవ్వుగాదు. మోసముతో కూడియున్న యేడుపే యగును. సముద్రతరంగములవలె తనలో నిముడ్చుకొనలేక హృదయ పూర్వకముగా పొరలి ప్రవహించెడి నవ్వే నవ్వు.

మరొక కవిపుంగవుడు :

"ఏడ్చుచో నీవొకండవే యేడ్వగలవు
నవ్వు నీతోడ లోకమంతయును నవ్వు"

అని చెప్పియుండెను. ఏలయన ఈ లోకములో కావలసినంత దుఃఖమున్నది. దానికి అవసరమైనదిప్పుడు నీ వ్యక్తిగతమైన చిన్న చిన్న చింతలు, లేనిపోని తాపత్రయ ములుకాదు. నీ ఆనందమును, నీ నవ్వునే, దుఃఖముతో నిండి యున్న ప్రపంచము నీ నుండి కోరుచున్నది.

కైలాసగిరియందు ఏకాంతముగా ప్రాతఃకాలముననే చీకటిలో కొంత తడవు కూర్చుండి యుంటిని. ఏలనో హృదయము బరువుగానే యుండెను. హృదయములో దైవము నివసించియుండ బరువేల? అప్పుడు "ఒక తడవు నవ్వుము" అను పద్యము జ్ఞప్తికి వచ్చెను. చీకటిలో దీపము వెలిగించితిని. చీకటి పారిపోయెను. ఆ దీపము నవ్వసాగెను. అప్పుడు నేను కూడ నవ్వనారంభించితిని. నేను నవ్విన మరొకరు నవ్వెదరని, అటులనే మైళ్ళకొలది నవ్వులు వ్యాపించునని చిన్న పద్యము వ్రాయబడెను గదా!

ఇచ్చట నేను నవ్వు చుంటిని. నాతో నవ్వుటకెవరును లేరే అని ఆలోచించ సాగితిని. అంతలో చిన్న ఎలుక వచ్చి వేరుసెనగకాయలు పరపరలాడించుచు నవ్వసాగెను. బల్లులు చిన్నవి, పెద్దవి మేము కూడ నవ్వు చుంటిమని పలుక

సాగెను. అప్పుడు పక్షులు తమ కిలకిలారవములతో నవ్వుచు పాడసాగెను. అప్పుడు బాలభానుని కిరణచిహ్నములు గాన వచ్చుచు ప్రకృతి అంతయు శోభాయమాన ముగా మాతో నవ్వుచున్నటులుండెను.

ఈ మీ నవ్వులు తీసికొని లోకములో రోగములతో, బాధలతో, దుఃఖములతో, తాపత్రయములతో నిండియున్న వారికి పంచుదునని చెప్పుచు చల్లని గాలిని ప్రస రింపచేయుచు, వాయుదేవుడు నవ్వుటయేగాక, మా నవ్వులను మెల్ల కొలది తీసికొని వెళ్ళి అంతను శాంతిని వ్యాపింప జేయు తన మహావేగముతో పరుగెత్త సాగెను.

మరికొంత తడవునకు సూర్యుడు సముద్రగర్భము నుండి చిరునవ్వుతో ప్రత్యక్ష మయ్యెను. ప్రియపాఠకులారా ! మీ నిద్రావస్థలను విడిచి మీ నేత్రములను తెరచి చూడుడు. సూర్యుడెటుల ప్రపంచము నంతటిని తన నవ్వుతో నింపుచున్నాడో! మీరు కూడ సూర్యునితో కలసి హృదయపూర్వకముగా నవ్వరేల ?

మతమనగా పొడుగుముఖములతో చింతగా నుండుటకాదు. నిజమైన మతము నిర్మలమైన నవ్వులోనే యున్నది. "ఆనందో౽బ్రహ్మ." ఆనందమే పరబ్రహ్మ స్వరూపము. రండు ! రండు! మాతో కలసి నవ్వుడు ! దివ్యతేజస్సుతో కూడి మన నవ్వే సర్వ దుఃఖములను పారద్రోలి బ్రహ్మానందములో ముంచివేయును.

నేను నవ్వుచుంటిని. కైలాసము నవ్వుచున్నది. మీరును నవ్వుటకిదియే సమ యము. సర్వరోగ నివారణియగు నవ్వును మీరు కూడ ఎప్పుడో గాక ఇప్పుడే ఈ వ్యాసమును చదువుచుండగనే హాయిగా నవ్వుడు ! అది మీ హృదయములను, మీ గృహములనేగాక సంఘములను, దేశమును పునీతమొనర్చుచు లోకశాంతికిని తోడ్ప డును.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

కైలాసము

( 16-8-50 )

# 27. రైలుబండిని ఆపుచేయుట

ఈ మధ్యను శ్రీశాంత్యాశ్రమాభివృద్ధిని కోరుచు ఒక బ్రహ్మాండమైన శాంతి సమావేశము విశాఖపట్నము హిందీ రీడింగ్ రూము భవనములో చేయబడెను. ఆ సభలో అనేకులు ప్రసిద్ధికెక్కిన ప్రవక్తలు చక్కనైన అనుభవనీయమైన విషయములను గూర్చి చర్చించిరి.

ఎవ్వరెవ్వరు ఏమి చెప్పుచున్నను బోధించుచున్న గ్రంధములలో వ్రాసియున్న దైనను అనుభవమైన అంశము ఏదియైన నున్నచో అది చెప్పినను సరియే, చివరకు పసిబాలునిచే వచించబడినదైనను సరియే, అద్దానిని ఆంతర్యమున గ్రహించి ఆచరణలో పెట్టుటకే నా మనస్సు చిన్నతనమునందే కాక ఇప్పుడు గూడ కోరుచుండును.

ఆ రోజున గంభీరోపన్యాసములలో అనుభవజ్ఞులైన ఉపన్యాసకులొకరు మనశ్శ క్తుల గురించి, మనోజయముచే చేయగల్గిన మహత్తుల గురించి ఉపన్యసించుచు బొంబాయి రాజధానిలో ఒక యోగిపుంగవుడు గంటకు అరువదిమైళ్ళ మహావేగ ముతో వెళ్ళుచున్న రైలుబండిని ఆయన ఒక్కక్షణములో ఆపివేయగలడనియు, పెక్కు మార్లతడట్లే ఆపివేసినట్లు చెప్పెను.

అప్పుడు నేను అరువదిమైళ్ళ వేగముతో వెళ్ళెడి మెయిలుబండి మాట అటుంచి, ఆరుమైళ్ళ వేగముతో వెళ్ళెడి రహదారీబోటువలెనో, లేక ఒంటెద్దుబండివలె వెళ్ళు చున్న గూడ్సుబండినైనను నేను ఆపజాలనుగదా యని ఆలోచించపసాగితిని. మనస్సు మనకు తెలియకుండ కూడ లిప్తకాలములో అనేకాలోచనలు చేయుచుండును. ఈ మెయిలుబండ్లను, గూడ్సు బండ్లను నేను ఆపజాలనందుకు విచారించలేదు. అట్టి సంకల్పమైనను నాలోలేదు. కాని గంటకు ఆరువేలమైళ్ళు కాదు, గంటకు అరువది వేల మైళ్ళు అననేల, కోటిమైళ్ళ వాయువేగముతో కూడ పరుగెత్తుచున్న మనస్సును అరికట్టెడువారే, ఆపెడివారే, జయించెడివారే మహనీయులుగదా! అని తలపోయ సాగితిని.

రైలుబళ్ళను ఆపుట అసాధ్యమనియు కల్ల అనియు చెప్పుటలేదు. మనోజయము కల్గినవారు చేయజాలని పనేదియు ఈ లోకములో లేదు. వారికి అన్నియు సాధ్యములే. కాని మానవులచేతిలో తయారైన ఇట్టి యంత్రములను ఆపుట కంటె ఆపవలసిన మనస్సును నిరోధించినచో ఎంతబలము, ఎంత ఆనందము, నూతనశక్తియు కల్గును. రెండెద్దుల బండ్లను, మోటారుకార్లను ఛాతీమీద ఎక్కించుకొనుట, పాషాణములను గూడ ఛాతీమీద సమ్మెట్లచే బ్రద్దలు కొట్టించుకొనుట, గాజుపెంకులను విషమును గూడ మ్రింగుట, మహత్తరమైన సామాన్య మానవుల కలవిగాని మహత్తులను చాలమంది చేయుచుండుట వినుటయేగాక మనము చూచియు గూడనుంటిమి. ఈ మహత్తులన్నియు చాల గొప్పవి, కొనియాడదగినవే. అయినను అన్నింటికంటెను

గొప్ప మహత్తు, మహత్తులకు మహత్తయినది మనోజయమే. సంకల్పరాహిత్యమే, వృత్తి శూన్యతయే. మనోజయమే మానవ జన్మకు గమ్యస్థానము, పరమావధియై యున్నది. దానిని జయింపగల్గినవారు మాత్రమే జన్మరహితులగుదురు.

రైలుబండ్లను ఆపగల్గినను ఆపజాలకున్నను, విషమును మ్రింగినను మ్రింగ జాలకున్నను, మనకు ఒక్కటే. కాని మనస్సును ఆపజాలకున్న, మనోనిగ్రహము లేకున్నచో అది అనేకమైన అవస్థలు, చింతలు, బాధలకు మూలకారణమై యుండును. ఆపవలసిన దానిని ఆపవలెను. అది మనోవేగము, మ్రింగవలసిన దానిని మ్రింగవలెను. అది అహంకారము. రైలుబండ్లను ఆపుట తేలిక, విషము మ్రింగుట కూడ అభ్యాసముచే సులభము. కాని చంచలమైన మర్కటమువంటి మనస్సును నిరోధించుట, నానా అనర్ధకములు, చింతలు,కల్గించుచున్న అహంకారమును మ్రింగుట ఎక్కడనో కోటికి ఒక్కరికి జీవన్ముక్తులకు మాత్రమే సాధ్యమగును. కొదువ వారందరు మాయ యొక్క ప్రభావముచే ఆ ప్రవాహములో పడి మహత్తులవెంట పరుగెత్తుచు, దారితెన్ను కానజాలక కొట్టుకొని పోవుచుండుట చాల విచారకరమైన యంశము. అనేకులు సాధకులకు, యోగాభ్యాసము చేయు వారికి, మనము కూడ రైలుబండ్లను ఆపగల్గిన, విషము మొదలైనవి మ్రింగ గల మహత్తులను బడయగల్గిన ఎంత బాగుండునని ప్రబలమైన సంకల్పము, కోరిక, ఆశ. ఈపై మహత్తులను చేయువారిని చూచినప్పుడు, వానిని గురించి విన్నప్పుడు భ్రమించుట మానవ స్వభావము.

ప్రియమైన పాఠకులారా ! విలువైన కాలమును ఇంకను మాటలచే వ్యర్ధము చేయక ఈ వ్యాసము యొక్క సారాంశమును రెండు చిన్న వాక్యములలో చెప్పుటకు ప్రయత్నించుచుంటిని. ఈ రోజులలో ఆపవలసినది, జయించ వలసినది ఒక్కటే యున్నది. అది మనస్సే, మ్రింగవలసినది ఒక్కటేగలదు. అది అహంకారమే, మీ మనస్సులను అన్నివైపులా పరుగెత్తనీయక దైవమువైపు మళ్ళించి అహంకారమును రూపుమాపినవారే జన్మరహితులు, జీవన్ముక్తులు. అట్టి మహనీయులకు నా ధన్యవాదములు.

లోకాస్సమస్తా సుఖినోభవంతు; ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 13-8-51 ఉదయం 5-00 )

- నీవే ఆత్మవు. తేజోమయమైన సూర్యుడవు. కష్టములను దట్టమైన మేఘములు (అప్పుడప్పుడు) వచ్చినను తదుపరి అదృశ్యమైపోవును.

- ప్రస్తుత క్షణమును వృధా చేయవద్దు. భగవంతుని శరణుజొచ్చి, ఆయనతో తాదాత్మ్యము నొందుటకు ప్రయత్నింపుము. (అప్పుడే ఈ క్షణము సద్వినియోగ మయినట్లు చెప్పగలము.)

# 28. గీతా సముద్రము

శ్రీరామకృష్ణ పరమహంస, ఈ లోకములో అందరును పిచ్చివారేయని చెప్పి యుండెను. "మనిషికొక పిచ్చి మహిలోవేమా" అని శ్రీ వేమన యోగి కూడ నుడివి యుండెను. ఈ పిచ్చి మనుజుని అంతఃకరణ స్థితిని అనుసరించి, అనేకరీతులుగా, వివిధమైన నామరూపములలో నుండును.

ఈ రోజులలో నేను సముద్రతీరముననే వసించుటచేతను, కైలాస ఆశ్రమము నుండి సముద్రమును మూడు ప్రక్కలను గాంచుచుండుట చేతను, "పిడుగునకు బియ్యమునకు ఒకే మంత్రము" అన్నట్లు, ప్రతి దానికిని సముద్రమునే ఉదాహరణగా తీసికొను చుండును. ఈ పిచ్చి నాకు ఆనందము నిచ్చుచుండును. ఎవని పిచ్చి వానికి ఆనందము గదా !

"గీత" అఖండమైన మహాసముద్రము వంటిది.

ప్రశ్న : గీతలో ఉన్న పదునెనిమిది అధ్యాయములో ?

జవాబు : ఈ అధ్యాయములన్నియు ప్రపంచములో ఉన్న సముద్రములవలె, హిందూ మహాసముద్రము, శాంతి మహాసముద్రము (పసిఫిక్ సముద్రము) మొదలగు వివిధ సముద్రముల వంటివి.

ప్రశ్న : ఇక గీతాశ్లోకములో ?

జవాబు : ఈ శ్లోకములన్నియు సముద్రములో నున్న కెరటముల వంటివి. ఒక్కొక్క కెరటము గీతాసముద్రము యొక్క గాంభీర్యమైన భావములనే వ్యక్తపరచు చున్నది.

సముద్రజలములో నదులన్నియు ఇమిడియున్నట్లు, గీతలో అన్ని శాస్త్రములును, అన్నిబోధలును, అన్ని విధములగు అభ్యాస విధానములును ఇమిడియున్నవి. సముద్ర గర్భములోనున్న మహారహస్య నిధుల నన్నింటిని గ్రహించుట దుర్లభమైనట్లు, గీతా గర్భమున నున్న అంతర్భావములను, గూఢార్థములను గ్రహించుటకూడ కడుదుర్ల భమే ! ప్రపంచము జన్మించినది మొదలు, జడ ప్రపంచమునందలి రహస్యములను తెలిసికొనుటకే శాస్త్రపరిశోధకులు నిరంతరము ప్రయత్నించుచున్నారు. ఎంత పరిశీ లించినను, ఇంకను కనిపెట్టవలసినదే హెచ్చుగా మిగిలియున్నట్లు కన్పట్టు చున్నది. అటులనే భగవద్గీత విషయములో కూడ పండితోత్తములు, శాస్త్రవేత్తలు, జ్ఞానులు, భక్తులు, పెద్దలు, పిన్నలు గీత చెప్పబడినప్పటినుండియు, దాని తత్త్వమును విమ ర్శించి తెలిసికొనుటకు ప్రయత్నము చేయుచునే యున్నారు. ఎంత శోధించినను, ఇంతవరకు తెలిసికొన్న దానికంటె ఇకముందు తెలిసికొనవలసినదే హెచ్చుగా నున్నట్లు కనిపించు చున్నది.

అనేక దేశములలో పండితోత్తములు కొందరు భగవద్గీతను వివిధమైన తమ

భాషలలోనికి తర్జుమాచేసికొనియున్నారు. మరికొందరు ఈ గ్రంథమును చిన్నపుస్త కములుగా, అంగుళము సైజులో గూడ, అచ్చువేయించుకొని తమ కోటుజేబులలో, హృదయములకు దగ్గరగా నిరంతరము ఉంచుకొనుచున్నారు.

సామాన్య భక్తులందరు, దేశమంతట నిత్యము గీతాపారాయణ చేయుచుండుట మనము అన్నిచోట్లను చూచుచునే యున్నాము. కొందరు ప్రతిదినము గీతనంతను పారాయణచేయు చుందురు. మరికొందరు ఒక్క అధ్యాయమైనను పారాయణ చేయకుండ భోజనము చేయరు. అనేకములయిన పని తొందరలలో నున్నవారును, ఉద్యోగములు చేయుచున్న వారును కూడ చివరకు ఒక్క గీతా శ్లోకమైనను పారాయణచేయక, యే దినచర్యను ప్రారంభించరు.

గీతాశాస్త్రములో లేని రహస్యములు ఎచ్చటను లేవు. అది భక్తులకు భక్తిని బోధించుచున్నది; యోగులకు యోగమును నేర్పుచున్నది; గృహస్థులకు గృహస్థ ధర్మములను చెప్పుచున్నది; జ్ఞానులకు జ్ఞానమును బోధించుచున్నది; భయపడువార లకు నిర్భయత్వమును, ధీరత్వమును ఇచ్చుచున్నది. ముముక్షువులకు మోక్షము నొసంగుచున్నది. బాలబాలికలకు ఒక కధవలెను, యౌవనులకు వారి జీవితయాత్ర లను ఆదర్శమార్గములలో నడుపుటకు జ్యోతిగా మార్గదర్శియై వెలుగుచున్నది. ముసలివారికి తత్త్వోపదేశము నొసంగుచున్నది. మానవుని, జీవన్ముక్తునిగా చేయుటకు దివ్యమైన మార్గమును చూపుచున్నది.

ప్రశ్న : ఇక మనకు కావలసిన దేమియున్నది ?

జవాబు : దాని ననుభవించుటయే ! గీతాసారమును, గీతామృతమును గోలుటయే కాని గీతాసారము ననుభవించుట, వ్రాయునంత, చెప్పునంత సులభ ముగా నుండదు.

గీతను గురించి విననివారు ఏ దేశములోను వుండరనియే చెప్పవచ్చును. సముద్రమును గురించి విననివారు, చూడనివారుందురా? ఏ మారుమూలలోనో ఎవరో ఉండిన నుండవచ్చును. కాని ఆనందదాయకమగు విషయమేమన, ఈ గీతా సముద్రమున ఈదులాడువారు భారత దేశములోనే గాక అన్ని దేశములలోను, హిందూమతస్థులలోనే గాక సర్వమతస్థులలోను పెక్కుమంది గలరు.

సముద్రమును గురించి చదువుట వేరు. సముద్రమును చూచుట వేరు. సముద్రము గురించి వినుట వేరు. సముద్రములోదిగి ఆనందముగా స్నానము చేయుట వేరు. అఖండమైన సచ్చిదానంద సముద్రములో, ఖండమైన మనస్సులను విలీనము చేయుట అన్నిటికంటెను కష్టము. అటులనే గీతను గురించి విన్నవారు గలరు. భగవద్గీత పుస్తకమును చూచినవారు గలరు. ఇట్టి వారందరిలో గీతను నిత్యము పారాయణ చేయుచున్నవారే ధన్యులు. అందలి ధర్మములను నిత్యము అనుష్ఠానములో పెట్టువారు అంతకంటె ధన్యులు. గీతాసముద్రములో అహర్నిశము

మునిగితేలుచు, గీతాసారమును గ్రోలుచు, ఆదర్శ జీవితములను గడుపుచున్నవారికే నిత్యశాంతి చేకూరును. అట్టివారికే బ్రహ్మానంద సుఖము చవిచూచు భాగ్యము కలుగును.

అనుభవములో పెట్టజాలని శాస్త్రములన్నియు, దినచర్యలో ఉపయోగింపజాలని బోధలన్నియు మెదడునకు బరువేగాని శాంతిని, ఆనందము నీయజాలవు. సర్వవిద్యలలో బాగుగ పాండిత్యము సంపాదించియు, అనుభవములో పెట్టజాలని మనుజుని, మంచి గంధము చెక్కలయొక్క సువాసనను గ్రహింపజాలక, వాని బరువును మాత్రమే మోయుచున్న గార్ధభముతో చక్కగా పోల్చి చెప్పియుండిరి.

గీతాసారమగు శాంతిని దినచర్యలో అహర్నిశము అనుభవించుట మనయందరకును ముఖ్యకర్తవ్యము. మన హృదయములలోను, గృహములలోను ఉన్నశాంతియుతమగు ప్రేమ, సర్వజాతులందు, సర్వదేశములందు సామరస్యమును, అభివృద్ధిని గలిగించుగాక ! గీతలో అన్ని అధ్యాయములను కంఠస్తముగా వల్లించగలిగినంత మాత్రముచే ఎవరును తృప్తిచెందరాదు. “భగవద్గీతయందు చెప్పబడిన గూఢమైన బోధలను, మహోపదేశములను ఎంతవరకు నా దినచర్యలో, పనులలో, మాటలలో, ఆలోచనలలో అనుష్ఠించుచున్నాను?” అనియే ప్రతి వ్యక్తియు తరచు ఆత్మపరీక్ష చేసికొనుచు, ప్రశ్నించుకొనుచుండవలెను.

శ్రీరామకృష్ణ పరమహంస, గీతాసారమునంతయు ఒకచిన్న మాటలోనుడివియుండిరి. ‘గీత’ ‘గీత’ ‘గీత’ అని సాధకులు నిరంతరము జపము చేయుచున్న గీత అనెడి మాటయే ‘త్యాగి’ ‘త్యాగి’ ‘త్యాగి’ గా మారి గీతాసారము బోధించుచున్నదనిరి. ధనమును దైవమును కూడ ఒకేసారి యెవ్వరును కొలువజాలరనియు, “ధనవంతుడు పరలోక రాజ్యములో ప్రవేశించుటకంటె సూదిబెజ్జములో ఒంటెదూరుట తేలిక” యని శ్రీ యేసు క్రీస్తు నుడివియుండెను. గీతాసారమైన త్యాగమే, భక్తులకైనను, యోగులకైనను, జ్ఞానులకైనను మూలధారముగను, పునాదిగను నున్నది.

శ్లో॥ త్రివిధం నరక స్యేదం ద్వారం నాశనమాత్మనః ।
కామః క్రోధస్తథాలోభస్తస్మాదేతత్త్రయంత్సజేత్ ॥

నరకమునకు – కామ,క్రోధ,లోభములను మూడు దారులుగలవని శ్రీకృష్ణ భగవానులు గీతలో పై శ్లోకమునందు నుడివియుండిరి. ఇవి ఆత్మను అధోగతికి సర్వదా ఈడ్చుకొని పోవుచున్నవి. ఈ ద్వారములను ప్రవేశించిన మనుజుడు అధోగతిని తప్పకచేరును. కనుక ఈ మూడింటిని త్యజించుటకు నిరంతరము సాధనచేయుట ముఖ్యకర్తవ్యము.

ఏ మనుజుడు తన హృదయములో కోరికలనన్నింటిని వదలి, నిజతత్త్వమును గుర్తెరిగి దానిలోనే తృప్తిపొందుచుండునో, ఎవరి హృదయములోనికి, నదులన్నియు సముద్రములోనికి ప్రవహించుచున్నట్లు, కోరికలన్నియు ప్రవేశించినను స్థిరచిత్తుడై,

లేశమైన చలనములేక సముద్రమువలె పరిపూర్ణుడై యుండునో, అట్టి ఆత్మ విదుడే స్థిత ప్రజ్ఞుడని భగవద్గీతలోని సాంఖ్యయోగమునందలి ఈ క్రింది శ్లోకములో చెప్పబడి యున్నది.

శ్లో॥ ఆపూర్వ మాణమచల ప్రతిష్టం
సముద్రమాపః ప్రవిశంతి యద్వత్ ।
తద్వత్కామాయం ప్రవిశంతి సర్వే
సశాంతి మాప్నోతి నకామకామీ ॥

కనుక, నిష్కామముగా ఎవరికి విధించబడిన పనులను వారి స్వధర్మము ననుసరించి హృదయపూర్వకముగా, స్వలాభము కోరక మనఃపూర్వకముగ, ఈశ్వరార్పణ బుద్ధితో ఎవరు చేయుదురో, వారే శాంతిని పొందుదురు.

శ్లో॥ నహికశ్చిత్ క్షణమపి జాతు తిష్ఠత్య కర్మకృత్ ।
కార్యతే హ్యావశః కర్మసర్వః ప్రకృతిజైర్గుణైః ॥

శ్లో॥ కర్మణ్య కర్మ యః పశ్యేదకర్మణి చ కర్మయః
సబుద్ధిమాన్మను ష్యేషు సయుక్తః కృత్స్న కర్మకృత్ ॥

ఏదో ఒక కర్మచేయకుండ ఎవ్వరును ఒక్కక్షణమైనను ఉండజాలరు; గాన వారు చేయు కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూచువారు మనుష్యులలో బుద్ధి మంతులని శ్రీకృష్ణభగవానులు పై శ్లోకములలో వ్యక్తపరచిరి.

శ్లో॥ అద్వేష్టా సర్వభూతానాం మైత్రః కరుణ ఏవచ ।
నిర్మమో నిరహంకారః నమదుఃఖ సుఖః క్షమీ ।
సంతుష్టః సతతం యోగీ యతాత్మా దృఢనిశ్చయః।
మయ్యర్పిత మనోబుద్ధిర్యోమేభక్తః సమేప్రియః॥

సుఖదుఃఖములలో, కలిమిలేములలో, శీతోష్ణములలో, మానావమానములలో సమచిత్తముతో, అచంచలమైన మనస్సు కలిగియుండువాడే శ్రీకృష్ణ పరమాత్మకు అత్యంత ప్రియుడనియు, పైన వ్రాయబడిన శ్లోకములలో గీత స్పష్టముగా బోధించు చున్నది. ఇటులనే గీతా శ్లోకములను ఒక్కొక్క దానిని మనము విమర్శించిన, గీతా సముద్రమునకు అంతు ఆదియు కనిపించక, దరిలేకుండ ఈ వ్యాసము పెరుగును. గాన మనము గీతాసారమునే గ్రోలుచు తృప్తిని పొందెదముగాక !

గీతనంతను నిత్యము పారాయణచేయుట ఎంత సులభమో క్లిష్ట పరిస్థితులలో సమత్వమును, శాంతిని వ్యక్తపరచుట అంత కష్టము. ఏ పరీక్షలు లేని యెడల అందరును వేదాంతులే! ఈ పరీక్షలవలననే మనకు శమదమాదులున్నదియు లేనిదియు, అందరిలో దైవమును గాంచగలిగినది లేనిది నిర్ధారణ యగును. ఉపకారికి

అపకారముచేయు వారిలో కూడ దైవమును గాంచుటకు గీతాతత్త్వమును అనభవింప వలెను. సర్వములో, అన్ని నామరూపములలో దైవమునే దర్శించవలెనని పఠించుట సులభము. కాని ఒక విషసర్పము దగ్గరకు చేరినప్పుడు భయముతో వణుకుచు, దానిని కర్రతో చంపుటకు బదులు, విషపురుగులో కూడ నిత్యమైన సత్ పదార్ధమునే గాంచుటకు గీతానుభవము ముఖ్యావసరము. అటులనే గీతాపారాయణులు, గీతా మృతమును వారి మనోవాక్కాయకర్మలలో వ్యక్తపరచుచు తాము అట్లు జీవించు చుంటిమో లేదో యని ఎవరి జీవితములు వారు స్వీయపరీక్ష సదా చేసికొనుచుండ వలెను.

శ్లో॥ పత్రం పుష్పం ఫలంతోయంయోమే భక్త్యా ప్రయచ్ఛతి ।
తదహం భక్త్యుపహృతమశ్నామి ప్రయతాత్మనః॥

"శ్రీకృష్ణార్పణమస్తు అని భక్తితో ఒక ఆకుగాని, పువ్వుగాని, పండుగాని, నీటిని గాని ఎవరు నాకు నిర్మల మనస్సుతో అర్పించుచున్నారో వానిని స్వీకరించెదను" అని శ్రీకృష్ణుడభయమిచ్చెను. కావున భగవంతునికి అర్పించుటకు నిర్మలమైన మన హృదయకమలముచాలును. మనము చేయు కార్యముల ఫలములనన్నింటిని శ్రీకృష్ణు నకు అర్పించి, ఆపరమాత్మనే సర్వమందును గాంచుచు, ఆయననే తమగతిగా, శరణ్యముగా, గమ్యస్థానముగా జేసికొని, మానవులందరి సేవయే (మానవసేవయే మాధవసేవ) శ్రీ పరమేశ్వర సేవగా నెంచుచు, జీవించెడి వారి జీవితములే ధన్యవంత ములు.

శ్రీకైలాసాశ్రమములో ఒకచోట యిట్లు వ్రాయబడి యున్నది. "సముద్రము ప్రార్థించుచున్నది ఓ మనుజుడా ! నీవేల ప్రార్థించవు ?" ప్రతికెరటమును ఒక ప్రార్ధనయే; అట్టిరీతిగా ప్రతి ఆలోచనయు ఒక ప్రార్ధనగా దైవమునకు అర్పించెడి వారి జీవితములు ఆదర్శనీయములు, ఈ మౌనపు దినములలో, గీతాసారమును పారాయణ చేయు పుస్తకముల నుండి మాత్రమేగాక, నిరంతరమును, అహర్నిశము లందును, సముద్రనాదమునందును అనుభవించుచుండుట నాకెంతయో వర్ణనా తీతమైన ఆనందము నొసంగు చుండును. గీతాసముద్రము నాకు బోధించుచున్న భావములను క్లుప్తముగా మీతో చెప్ప కోరుచున్నాను.

1. సముద్రమంతయు ఒక్కటియేయైనను దానిని స్థలభేదములను బట్టి అనేక నామములతో మనము పిలుచుచున్నట్లు, బ్రహ్మము ఒక్కటియేయైనను దానినే అనేకులు, అనేకములైన నామములతో పిలుచు చుందురు.

2. అన్ని నదులును సముద్రములోపలనే ప్రవేశించుచున్నట్లు, అన్ని మతము లను ఒకే నిత్యమైన సత్పదార్థమును కనుగొనుటకే ప్రయత్నము చేయుచు, గమ్య స్థానమును చేరుచున్నవి.

3. సముద్రము అఖండముగ, అపారముగానున్నను నిరంతరము దానియందు

కెరటములు లేచుచు, ఆడుచు, మరల అందేలీనమగుచున్నట్లు, పరబ్రహ్మములో, విశ్వము–సృష్టి, స్థితి, లయములను పొందుచున్నది. ఏ కెరటమునకా కెరటము వేరుగా పుట్టుచు ప్రకృతి ధర్మము ననుసరించి వర్తించుచు, మరల సముద్రములో లీనమగుచున్నట్లు, మనుజులు వేరువేరు వ్యక్తులుగ ఉద్భవించి జీవించుచు, అంత్యమున ఆపరబ్రహ్మము నందే లయము నొందుచున్నారు. ఈ అభేదజ్ఞానము అనుభవ యుతముగా గలవారికే శాశ్వతశాంతి కలుగుచున్నది.

4. కెరటములు నిరంతరము చేయుచున్న చలనమునకు, ఏ ఫలితమును కోరనట్లు, మానవులు తాము చేయుచున్న విద్యుక్తకర్మలకు గూడ ఫలితమును కోరకుండ శ్రీకృష్ణార్పణ బుద్ధితో చేయుటయే మనశ్శాంతికి ముఖ్యావసరము. కెరటములు వాటి హృదయానందము కొరకే సముద్రగర్భమునుండి ఆనందముతో వచ్చుచు మరల అందేలీనమగుచున్నట్లు మనము చూచుచుంటిమి. అటులనే ఎనుబదినాలుగు లక్షల జీవరాసులును అప్రయత్నముగా దైవమునుండి వ్యక్తమై, మరల ఆ పరాత్పరుని యందే లీనమగుటకు, సదా ప్రయత్నమును చేయుచున్నవి. భగవద్గీత అందులకు చక్కని మార్గమును చూపుచున్నది.

5. అన్నిటికంటెను ముఖ్యమైనవిషయమేమన, అలలులేని సముద్రము, సంకల్ప రహితమైన మనస్సునుబోలి నిర్వికల్పమును బోధించుచున్నది.

6. సముద్రగర్భమున ఎంతలోతునకు పోయిన అంత ఎక్కువ నాణ్యమైన ముత్య ములును, రత్నములును లభించునో అటులనే సాధకుడు ప్రవృత్తిని విడచి, నివృత్తి పరుడైన కొలది యెన్నియో అమూల్యమైన శాంతి ముత్యములను, జ్ఞానరత్నములను, తన హృదయములోనే గాంచగలడు.

7. కెరటమునకు సముద్రమే ఆధారమైనట్లు, జీవునకు పరబ్రహ్మయే ఆధారమై యున్నదనెడి సత్యమును సూక్ష్మముగా మనము గీతాశాస్త్రమునుండి గ్రహింపవలెను.

8. సముద్రజలము యొక్క రుచిని గ్రహించుటకు అందలి ఒక బిందువును రుచి చూచిన చాలును. అటులనే గీతారసాస్వాదనము చేయుటకు ఒక్క శ్లోకము యొక్క భావమును అనుభవముగా గ్రహించిన చాలును.

9. సముద్రతీరమున ఎక్కువహోరు ఉండును. గాని లోతునకు వెళ్ళిన నిశ్శబ్ద ముగా ఉండును. అటులనే ప్రార్థన ధ్యానాదుల ప్రథమ స్థితులలో మనస్సు చంచల ముగా నున్నను, సమాధిస్థితిని పొందునప్పుడు నిశ్చలమై గీతాసారమగు ఆనంద మును గ్రోలుచుందుము.

10. మానవుని పరమావధియగు బ్రహ్మానందము వ్యక్తిగతమగు జీవనమందు గల విషయానుభవముచే చేకూరదు. బుద్బుదమందు గలనీటి బిందువులను సేకరించిన దప్పికతీరదు కదా ! శాశ్వతమైన బ్రహ్మానందము ఆ వ్యక్తి పరబ్రహ్మమను సముద్రమునందు ఐక్య సంధాన మగుట వలననే గలుగును.

11. ఎన్నిమారులు, ఎన్ని రీతులుగా చెప్పినను తనివి తీరని సముద్రసందేశ మేమన, కెరటము సముద్రము నుండియే యుద్భవించి, సముద్రమునందే గాన వచ్చుచు, మరల ఆ సముద్రమందే లీనమగు చున్నట్లు, ఈ బ్రహ్మాండమైన సృష్టి యంతయు అవ్యక్తమైన పరబ్రహ్మము నుండియే యుద్భవించుచు, ఆ సచ్చిదానంద స్వరూపమునందే కన్పట్టుచు, చివరకు ఆ దివ్య తేజస్సు నందే లీనమగుచున్నది.

12. అప్పుడిప్పుడు మాత్రమేగాక, సముద్రము నిరంతరము,'సోహం, సోహం' 'అదియేనేను' 'అదియే నేను' 'ఓం, ఓం,ఓం' అని అనుచు ప్రణవ గానము చేయు చున్నది. అటులనే మనుజుడు తనలో నిరంతరము సహజముగా నున్న అజపగాయ త్రిని, "సోహం" భావమును ఉచ్ఛ్వాస నిశ్వాసలతో అహర్నిశము అనుభవించవలెను. అదియే మానవజన్మ పరమావధి. అదియే గీతాసారము.

ప్రియమైన గీతారహస్యాన్వేషకులారా ! గీతా మహత్వ వర్ణనమందు, ఉపనిషత్తు లన్నియు గోవులనియు, గీతామృతము క్షీరమనియు, క్షీరమును పిండువాడు గోపా లుడైన శ్రీకృష్ణుడనియు, ఆ క్షీరమును గ్రోలెడువాడు ఆవుదూడవంటి అర్జునుడనియు చెప్పబడియున్నది. మనమందరమును అర్జునునివలె, గీతామృతమును నిరంతర మును గ్రోలుచు, శ్రీకృష్ణ పరమాత్మలో లీనమయ్యెదముగాక !

గీతా సముద్రము నాకు నిరంతరము బోధించు యీ గీతాసారమును మీ అందరితో పంచుకొనుటకు సావకాశమిచ్చి నందులకు ఆనందము. గీతామృతము అన్ని దేశములలోను, అన్ని మతముల వారికిని, నిజమైన శాంతి పిపాసకుల కందర కును పూర్ణశాంతిని ఎల్లప్పుడును చేకూర్చుగాక !

ఓం సర్వేషాం స్వస్తిర్భవతు

ఓం సర్వేషాం శాంతిర్భవతు

ఓం సర్వేషాం పూర్ణంభవతు

ఓం సర్వేషాం మంగళం భవతు.

ఓం, శాంతి, శ్శాంతి, శ్శాంతిః

( శ్రీ కైలాసము 27-11-51 )

✦ భగవద్దర్శనమైన వెనుక అంతయు ప్రేమ, సమృద్ధి, క్షమలతో నిండిపోవును. ఇక ద్వేషము వంటి భావములు ఏ మాత్రము మిగలవు.

# 29. రోగులకు - ఆరోగ్య సందేశము

ఆహా ! లోకమంతయు రోగమయమై ఉన్నదా యన్నట్లు ఎటుచూచినను అనారోగ్యమే. తనలో జబ్బు, ఇంటిలో జబ్బు వీధిలో జబ్బు, చుట్టుప్రక్కల బంధు జనులలో జబ్బు విరోధులనుకున్న వారిలో జబ్బు రోగమెవ్వరిని విడిచి పెట్టుచున్నట్లు లేదు.

దానికి పేదలు, ధనికులు, విద్యావంతులు, విద్యావిహీనులు, చివరకు అందరకు వైద్యసహాయము చేయు డాక్టర్లను కూడ ఏదో ఒక సమయమందు ఏదోయొక రోగము పట్టుకొనుచునే యున్నది. దానికి తరతమ భావమేలేదు.

అవతారపురుషుడైన శ్రీరామకృష్ణులు మనుజుని శరీరమును అద్దె ఇంటితో సరిపోల్చెను. రోగమును ఇంటికి చెల్లించెడి అద్దె అని చెప్పెను. అద్దె ప్రతిమాసమున నివ్వనిచో సంవత్సరమునకు ఒక్క మారైననూ నియ్యవలెనుగదా! అద్దె కొంపలో నున్నవారు అద్దె ఇచ్చుట తప్పునా ? ప్రతివారి నుండియు తప్పనిసరిగ అద్దె వసూలు చేయబడును. ఈ క్రూరరోగములు మహనీయులను, అవతారపురుషులనే పట్టుకొను చుండ ఇక సామాన్యుల గురించి చెప్పనేల ?

శ్రీరామకృష్ణులు రాచపుండుచే చాలకాలము బాధపడిరి. సహజసమాధి కలిగి, లోకోత్తరపురుషుండని, జీవన్ముక్తుండని ప్రసిద్ధికెక్కిన శ్రీరమణ మహర్షులు కూడ అవసానకాలమందు ఏదో రుగ్మతచే బాధపడుచుండ నిపుణులైన వైద్యులు శస్త్రచికిత్స వగైరా సేవలు చేసిరని వింటిమి. కాని అవతారమూర్తులయిన మహాపురుషులు రోగములచే బాధపడిరని వ్రాయుట పొరపాటు. ఏలయన వారి భౌతికదేహమును రోగముపట్టుకొని యున్నను, వారు మాత్రము రోగమునకు అతీతులుగనే యుండి యుందురు. సామాన్యులకు మాత్రము అందరివలె వారును బాధపడుచున్నట్లు గానవచ్చినను వారి మనస్సులు తద్గతమై పరమాత్మలో లీనమై యుండును.

రోగము అజ్ఞానిని, జ్ఞానిని, జీవన్మృతుని, జవన్ముక్తుని గూడ సమముగ పట్టు కొని ఆవరించి యున్నట్లు స్థూలనేత్రములకు కన్పించుచున్నను, అజ్ఞాని తన రోగమును సోపానముగ చేసికొని దాని క్రిందబడి నశించుచుండును. ఇక జ్ఞానియో! ఆ రోగమునే ఒక సోపానముగ చేసికొని నిచ్చెనమెట్లుగా నధిరోహించుచు తన జన్మకు గమ్యస్థానమైన అంతర్గత పరమాత్మలో లీనమై జీవన్ముక్తిని పొందుచుండును.

రోగులకారోగ్య సందేశమనెడి వార్త రోగులందరకు అమృతతుల్యముగా నుండును గదా ! ఆరోగ్యమును కోరని రోగియుండునా ? ఆరోగ్యమును పొందుటకై తనకు ప్రాణతుల్యమైన తన కష్టార్జితమైన ధనమునంతటిని ఖర్చుపెట్టుచుండును. పిల్లికి భిక్షము పెట్టని లోభులు గూడ ఆరోగ్యమును పొందుటకై ప్రాణప్రదముగ దాచిన ధనమును జలమువలె లేక గడ్డిపరకవలె వ్యయపరచుట ఆశ్చర్యమైన విష యము. ఒక్క రోగము వచ్చిన కొందరికి వేలుఖర్చు అగును. రోగులు ధనికులైన

కొలది పెద్దడాక్టర్లు, విలువైన మందులకు వారి విలువైన ధనము ఖర్చు పెట్టబడు చుండును.

పుట్టినది మొదలు గిట్టెడి వరకు బ్రహ్మసాక్షాత్కార మనుభవించెడి మహనీయుల నెక్కడనో కోటికి ఒక్కరిని తప్పవిడిచి, రోగము విశ్వజనీనమై వారువీరనక ప్రతివారిని పీడించు చున్నదని మనమింతవరకు విమర్శించితిమి.

ఇక గమనించదగిన దేదియైననున్నచో అది అసలు ఈ రోగము లన్నింటికి మూలకారణ మెచ్చట నున్నదో మొదట తెలిసికొనుట. సహజమైన అనారోగ్యమునకు సరియైన చికిత్సచేసి ఆరోగ్యమును పొందవచ్చును. ఏదో ఒక కారణము లేకుండ వ్యాధి రాదుగదా ! తన జబ్బునకు కారణము తెలిసికొనిన రోగి ఇకముందు జబ్బు రాకుండ జాగ్రత్తగా నుండుటకు యత్నించును. ప్రతిరోగమునకు ఏదో ఒక మూల కారణము మనుజుని జీవితములోనే యుండవలెను. వ్రణము యొక్క ఆదిని తెలిసి కొన్నప్పుడే దానిని అంకురముతో తీసివేయవచ్చును. గాని దానిని పూలరేకులతో, బంగారు రేకులతో కప్పిన ఏమి లాభము ? లోపలనున్న దుష్టఖండమును క్రుళ్ళిన చీము, నెత్తురులను తొలగించి శుభ్రపరచిననే గాయము పూర్తిగా మానును.

రోగుల కారోగ్య సందేశమనెడి ఈ ముఖ్య వ్యాసమును మనము అనుభవములో పెట్టుకొనుటకు కొన్ని సామాన్యపుటుదాహరణలు తీసికొని పరిశీలించుట ముఖ్యము. రోగకారణమునకు ఒకటి మనస్సు. రెండుకడుపు, ఒకరోగి అజీర్తి విరోచనములతో బాధపడుటకు అతడే కారణము గదా ! అట్లే శిరోవేదనైనను, కడుపునొప్పియైనను, తన జబ్బుకు తానే కారణమని వెర్రిమానవుడు తెలిసికొనుటకు బదులు దేవతలను, దయ్యములను తన రోగ నివారణకై పూజించుచుండుట గొప్ప భ్రమయే ! మానవుని అస్వాభావికమైన జీవితము కుత్రిమ నడవడియే. క్రమపద్ధతిలేని ఆహార విహారములే అతని రోగమునకు మూలకారణము. తన కర్మచే, తన జబ్బును తానే తెచ్చుకొని తానుజల్లిన విత్తనముల ఫలితమునే తాననుభవించు చుంటినని గ్రహించి తగ్గించుకొను విధానమును చూడవలెనుగాని ఇంకను కర్మను హెచ్చించెడి పనులను చేయుచు అశాంతిని తెచ్చుకొన గూడదు. ఎవరు చల్లిన విత్తనముల ఫలితమును వారే అనుభవించవలసి యున్నది. ఇది మార్చుటకు వీలులేని కఠినమైన దైవచట్టము.

'నీలో నున్నదానినే బాహ్యముగా గాంచెదవు' అనెడి మరియొక చట్టము. పచ్చ కామెర్లచే బాధపడువారికి లోకమంతయు పచ్చగనే కానవచ్చునట్లు, అంధులకు లోకమంతయు అంధకారముగనే తోచును. కామ,క్రోధ,లోభ,మోహ,మద,మాత్సర్య ములకు బానిసలైయున్న రోగులకు లోకములో నున్న చికిత్సలన్నియు చేసినను ఇసుమంతయు లాభములేదని చెప్పుటకు చాల విచారముగనున్నది. అధిక భోజన ప్రియులకు అజీర్ణవ్యాధికి ఎన్నిరకముల మందులిచ్చినను ఏమి లాభము? వీనికి మనోనియమము, జిహ్వేంద్రియ నిగ్రహములే సరియైన చికిత్సలు.

రోగికి ప్రేమయే ఆరోగ్య సూత్రము. కక్షగాదు. రోగికి శాంతి, నిర్మలానంద

ములే ఆరోగ్య విధానము. అశాంతి, అసూయ, కృత్రిమానందములుగాదు. రోగి ముఖ్యముగా గమనించతగ్గది తనకు హాని కలిగించెడివారిలో కూడ దైవమును గాంచుటే ఆరోగ్యమునకు, బ్రహ్మ సాక్షాత్కారమునకు అత్యంతమైన దగ్గర మార్గము.

ప్రియమైన ఆత్మసోదరా ! సోదరీ ! దేహ, మనముల ఆరోగ్యమును ఇప్పుడే, ఇచ్చటనే పొందవలయునని యున్నదా ? అటులైన మీ అంతర్నేత్రములను తెరచి మీ శరీరములో కాలిగోరు మొదలు శిరస్సు వరకు ఆపాదమస్తకము నిండియున్న దివ్యతేజస్సును గాంచుడు. సర్వములో మీ ప్రత్యక్ష దైవమును గాంచుడు. ఈ సత్య మును స్థిరముచేయగల్గినవారికి తామే గాక సర్వప్రాణికోటియు ఆరోగ్య ప్రదముగ, సర్వ ప్రకృతియు ఆనంద నిలయముగ కన్పించును.

ఆత్మీయులారా !

సూర్యుని ముందు మేఘములు పటాపంచలై పారిపోవుచున్నట్లు మీరనుభవించు చున్నది దివ్యతేజస్సు ముందు అన్ని రోగములు అవి చిన్నవైనను, జీర్ణించినవైనను భీతితో మిమ్ము విడిచి వెడలిపోవు చున్నవి.

అఖండమైన దివ్య తేజస్సే, అపారమైన విశ్వప్రేమయే, శాశ్వతమైన పూర్ణ శాంతియే "రోగుల కారోగ్య సందేశము" "ప్రాణప్రదమైన సంజీవిని."

సత్యం ! సుందరం ! శివం !

కైలాసము

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 6-7-52 ) ఉదయం 5-00

- ప్రస్తుత క్షణమును వృధాచేయవద్దు. భగవంతుని శరణుజొచ్చి, ఆయనతో తాదాత్మ్యము నొందుటకు ప్రయత్నింపుము. (అప్పుడే ఈ క్షణము సద్వినియోగ మయినట్లు చెప్పగలము.)
- పరమాత్మ ఇచటను, అచటను, అంతటనూ ఉన్నాడు. ఆయన శాశ్వతముగా మనతో ఐక్యమయ్యే ఉన్నాడు. అని తెలుసుకొనుటే దైవ సాక్షాత్కారము.
- భగవంతుని ప్రతిబింబమైన మానవుడు దేహాత్మ బుద్ధిని వదిలి, కోరికలను విడిచిన యెడల తన సహజ స్వరూపమును తిరిగి పొందును.

# ౩౦. అహం బ్రహ్మాస్మి

అహం బ్రహ్మాస్మి మంత్రోయం జన్మపాప వినాశయేత్
అహం బ్రహ్మాస్మి మంత్రోయం భేదబుద్ధిం వినాశయేత్
అహం బ్రహ్మాస్మి మంత్రోయం దోషకోటి వినాశయేత్
అహం బ్రహ్మాస్మి మంత్రోయం జ్ఞానానందం ప్రయచ్ఛతి.

తా. "అహం బ్రహ్మాస్మి" అను మంత్రము సమస్త కర్మలను నశింప చేయుగాక! ఆ మంత్రోపానమున జీవేశ్వర భేదబుద్ధినశించి జన్మరాహిత్య మగునుగాక ! ఆ మంత్రోపాసనమున, సమస్తము బ్రహ్మమని తోచి సమత్వము కలుగునుగాక ! అహం బ్రహ్మాస్మి యను నీ మంత్రము కోటి దోషములను నశింపచేసి, జ్ఞానానంద స్వరూపకైవల్యము చేకూర్చునుగాక !

బ్రహ్మాండమైనభావన కల్గిన ఈ పై శ్లోకమును, నేను చిన్నతనములోనే వల్లించెడి అదృష్టము కలిగెను. దీనిని శ్లోకమని చెప్పవీలు లేదు. మంత్రములకు మహామంత్ర మనియే చెప్పవలసి యున్నది. వేదములు నాలుగని అందరకు తెలిసియున్నదే ! నాలుగు వేదములలో నాలుగు మహావాక్యములున్నవి. అహం బ్రహ్మాస్మి యనెడి మంత్రము అధర్వణ వేదము యొక్క మహామంత్రముగా నున్నది.

మహా మంత్రముల యొక్క విపులార్థమును గ్రహించుటే నిజమైన తత్త్వ విచారణ. మహావాక్యములను విమర్శనా పూర్వకముగా గ్రహించి అనుభవములో పెట్టగల్గిన వారినే జీవన్ముక్తులుగా భావింపవలసి యున్నది.

అయినా మహావాక్య విచారణ అంత తేలికయైనపని గాదు. చాల దుర్లభమైన కఠినమైనపని. అయినను మనస్సునకు, బుద్ధికి పట్టుబడినంత వరకు తేటమాటలతో వివరించుటకు ప్రయత్నించెదము.

అహం : నేను
బ్రహ్మ : బ్రహ్మను
అస్మి : అగుచున్నాను.

ఉన్నదొక్కటే అయివుండగా, నీవు ఎక్కడ ! బ్రహ్మ ఎక్కడ ! అగుచుండుట ఏమి ? ఏది అగుచున్నదని శంకరాచార్యులు చెప్పుచుండెను. ఉన్నదొక్కటే యైనను, ఆ బ్రహ్మ స్వరూపమును నిరూపించుటకు, స్థిరముచేయుటకు, అనుభవములో పెట్టుకొనుటకు సహాయమైన పరికరములను, మాటలను మనముపయోగింప వలసి వచ్చుచున్నది.

సత్యమై, నిత్యమై, పరిపూర్ణమై, అఖండమై, అద్వితీయమైన ఆ బ్రహ్మపదార్ధ మును మాటలచే నిరూపణ చేసినంత మాత్రమున, అది ఎన్నటికిని రెండుగాగాని, అనేకముగాగాని మారజాలదు. అద్వితీయమునకు, నానాత్వము లేక భిన్నత్వము ఎన్నటికిని కలుగదు.

సూర్యభగవానుని ఏఏ రీతిగా, ఎచ్చటెచ్చటి నుండి ఏ ఏ పరిసరముల ద్వారా చూచుటకు ప్రయత్నించినను, సూర్యుడు – సూర్యుడే! ఒక్కడే! ఎన్ని తావుల, ఎన్ని విధములుగా ప్రతిబింబించినను, సూర్యునికి భిన్నత్వము కలుగుచుండుట లేదుగదా!

అటులనే బ్రహ్మస్వరూపము కూడ అద్వితీయము పరిపూర్ణమై, అనాదిగా, అవాఙ్మానసగోచరమై నిరంతరము ప్రకాశించుచున్నది.

ఇక అహం అనెడిది ఏది ?

బ్రహ్మ అనెడిది ఏది ?

అస్మి అనెడిది ఏది ?

అహం అనెడిది, బ్రహ్మ అనెడిది, అస్మి=అగుచున్నాను అనెడి ఈ అక్షరముల సంపుటి అంతయు ఆ సత్ పదార్థంశమే. సూర్యుడు ఒక్కడే అద్వితీయ ప్రకాశవంతుడై యుండ నేను సూర్యుడను అని చెప్పనేల? సూర్యుడు సూర్యుడే. అటులనే బ్రహ్మ పదార్థము అద్వితీయమై, అన్నిట నొక్కటిగా వెలుగుచుండియు, నేను బ్రహ్మనగు చున్నాను అని చెప్పనేల ?

నీవు సదా బ్రహ్మస్వరూపుండవే ! అనాది నుండి అంత్యము వరకు, అన్యమైనది ఎన్నడును, ఎచ్చటను అయి యుండలేదు. కనుక నీవే ఆ సత్ పదార్థము. ఆ సచ్చి దానంద స్వరూపుడవు.

పరిపూర్ణములో అద్వితీయమైన స్వరూపమును అనుభవించుచు, మౌనముగా నుండుటకు బదులు, నేను బ్రహ్మను అగుచున్నాను అని స్మరించుట కూడ కించజ్ఞ త్వమే ! కాని సాధకులు స్వస్వరూపమును, బ్రహ్మానుభవమును స్థిరపరచుటకు, నిట్టి విచారణ, మననము, సహకారిగా నున్నందున ఆచరింపదగినది.

కొదువ మూడు మహావాక్యములును ఈ సత్యమునే నిరూపించుచున్నవి; స్థిరము చేయుచున్నవి.

"ప్రజ్ఞానం బ్రహ్మ"

ఏ ప్రజ్ఞ–మనలో తెలివిగ గలదో, ఆ తెలివియే, చైతన్యమే, బ్రహ్మ స్వరూపముగా నున్నది.

'అయమాత్మా బ్రహ్మ'

నేనే ఆ బ్రహ్మమును, నాలోని ఆత్మయే ఆ బ్రహ్మస్వరూపముగా వెలుంగుచున్నది.

తత్త్వమసి

అదే నీవు–అదియే నీవుగా నున్నావు.

ఉన్నదొక్కటే నిత్యమైన, పరిపూర్ణమైన సద్వస్తువు.

ఆ అద్వితీయమైన సత్ పదార్థమే నీవు.

అనుభవశూన్యులకు ఈ మాటలన్నియు చిలుకపలుకువలె నుండును. అనుభవనీయులకు ఈ చిన్నమాటలే, అద్వైతానుభవము నిచ్చును.

'అహంబ్రహ్మాస్మి' మంత్రము నిప్పుడు, అనుభవముగా మన జీవితములలో సహకరించెడి లాగున విచారణ చేయ ప్రయత్నించెదము. ఈ వ్యాసము స్థితప్రజ్ఞు లకు అవసరములేదు. ఇక జిజ్ఞాసువులకు, దైవపరితాపనాపరులకు సహకారిగా నుండును.

ప్రతి మనుజునిలో 'సోహం' అనెడి అజపగాయత్రి మహామంత్రము, అహర్నిశలు జరుగుచునే యున్నది. ఆ మహామంత్రమును మనము ప్రయత్నము చేసి, స్మరింపనవసరములేకుండగనే, సహజముగ రోజునకు 21,600 మార్లు శ్వాసలో ఆడుచున్నదని తత్త్వజ్ఞులు, యోగారూఢులు అనుభవముగా పరిశీలించి స్థిరముచేసి యుండిరి.

ఆత్మీయులారా ! ఒక్కసారి కండ్లుమూసి 'సోహం'ను గమనింపుడు. మీ ఉచ్ఛ్వాస నిశ్వాసలను పరిక్షించుడు.

ఉచ్ఛ్వాసలో – సో

నిశ్శ్వాసలో – హం

ఉచ్ఛ్వాస్వలో – అ

నిశ్శ్వాసలో – హం

ఉచ్ఛ్వాసలో – బ్ర

నిశ్శ్వాసలో – హ్మా

ఉచ్ఛ్వాసలో – అ

నిశ్శ్వాసలో – స్మి

మనమిప్పుడు మన ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలలో నీ అహం బ్రహ్మాస్మి మంత్రమును కలిపి గమనించిన బ్రహ్మానుభవమున కెంతయో సహకారిగా నుండును.

మొదటి శ్వాసతో "అ"ను పూరింపుడు. నిశ్వాసలో "హం" అని వదలుడు. మరల "బ్ర" పూరింపుడు. "హ్మా" వదలుడు. తరువాత శ్వాసతో "అ" పూరింపుడు "స్మి" అగుచున్నాను అను భావనతో వదలడు.

"అహం బ్రహ్మాస్మి"

నేను బ్రహ్మనగుచున్నాను. నేను సదా బ్రహ్మగానే ఉంటున్నాను. నా ప్రతి శ్వాసయు బ్రహ్మమయమే! ఈవిధమైన భావనలో అహం బ్రహ్మాస్మి మంత్రమును, మీ ఉచ్ఛ్వాస నిశ్శ్వాసలలో జాగ్రత్తగ గమనించుచు, ధ్యానము చేయుడు. అట్లు చేయగా, చివరకు నీ బీజాక్షరములను, శ్వాసను గూడ మరచి, అఖండమైన దివ్య తేజస్సులో విలీనమగుడు!

ఈ అహం బ్రహ్మాస్మి మంత్ర ధ్యానముచే జన్మపాపములు, భేదబుద్ధి వినాశము, దోషములు నశింపబడుటే గాక జ్ఞానానందము, శుద్ధ బ్రహ్మానందము సిద్ధించునని, ఈ వ్యాసము ప్రారంభములోనే సూచించబడినది.

ఆత్మస్వరూపా ! ఇట్టి అనుభవనీయమైన మహావాక్య విచారణ గురుముఖముగా తెలిసికొని ఆచరించవలసినదేగాని, కాగితముల మీద వ్రాయుటకు సాధ్యముకాదని కొందరు పెద్దలు చెప్పెదరు. అయినను నేను అనుభవించెడి ఆనందమునంతను నా సొంతమునకే గాక, మీ అందరితో పంచుకొనవలెనను ఉత్సాహమే, కైలాసములో ఏకాంతముగా, నిశ్శబ్దముతో బ్రహ్మభావననుభవించుచు నన్నీ వ్యాసము వ్రాయ పురి కొల్పుచున్నది.

ఇక ఈ వ్రాతలు గూడ మరచి, మనమిప్పుడే అహం బ్రహ్మాస్మి మహామంత్ర సారము ననుభవించుటకు ప్రయత్నింతము.

'అహం' అనెడి నీటిబుడగను, 'బ్రహ్మ' యనెడి అఖండమైన సచ్చిదానంద సముద్రములో విలీనము చేయుదము.

'అహం' అనెడి ఘటాకాశమును 'బ్రహ్మ' అనెడి మహదాకాశములో కలుపుదము. అప్పుడు ఆ పరిపూర్ణ స్థితిలో 'అస్మి' అగు చున్నాను. కలుపవలసినది గూడ నేమియులేదు. నీటిబుడగ సముద్రములోనే యున్నది. కిరణము సూర్యునిలోనే ప్రకాశించుచున్నది. ఘటాకాశము మహదాకాశముతో ఎల్లప్పుడును నిండియున్నది.

జీవ ఏవ సదా బ్రహ్మ

స్వయం బ్రహ్మ సనాతనః

తా. జీవుడెల్లప్పుడు బ్రహ్మమయి యున్నాడు. తాను అనాది సిద్ధమైనవాడు. అహం కృతిలేనివాడు. బ్రహ్మమే తాను.

హరి ఓం తత్ సత్ ఓం

లోకాసమస్తా స్సుఖినోభవంతు

శ్రీ కైలాసము

(4-3-52)

ఉదయం 5-00

# 31. అపరోక్షానుభవము

అపరోక్షానుభవమనెడి గూఢమైన గొప్పవిషయమును గ్రహించుటకు ముందు, అపరోక్షమనగా నేమి ? పరోక్షమనగా నేమియో తెలిసికొనిన చాల సహాయకారిగా నుండును.

అపరోక్షమనగా నీకండ్లతో చూచినదీ, నీ చెవులతో వినినది. నీ మనస్సుతో గ్రహించినది. నీ బుద్ధితో స్థిరము చేసినది. నీ స్వానుభవమునే అపరోక్షానుభవమన బడును. ఇక పరోక్షమనగా ఇతరుల నుండి విన్నది. పుస్తకములో చదివినది. ఉదాహరణము – కాశీ పట్టణము గురించి మనము విని యుండవచ్చును. లేదా గ్రంథములలో చదివియుండవచ్చును. చిత్రపటములలో చూచియుండవచ్చును. ఇదంతయు పరోక్షమైన జ్ఞానమే.మనము ప్రత్యక్షముగా కాశీవెళ్ళి, ఆ వీధులలో తిరిగి శ్రీ విశ్వనాథుని దర్శించినప్పుడే నిజమైన అపరోక్షానుభవ మగును.

ఇట్టి రీతిగనే, దైవమును గూడ మనము పరోక్షముగ, అపరోక్షముగ బోధపరుచు కొనవలసియున్నది. దైవమును పరోక్షజ్ఞానముతో తెలిసినవారు కోటానుకోట్లు జనులు గలరు. కాని అపరోక్షముగా అనుభవించువారు కోటిలోనొక్కరు మాత్రముండి యుండవచ్చునని శాస్త్రములు, ఆత్మవిదులే చెప్పుచుండిరి.

దైవమును గురించి పరోక్షమైన జ్ఞానము శాస్త్రములనుండి, గురువుల నుండి వచ్చుచున్నది. ఇక అపరోక్షమైన జ్ఞానము, ప్రార్థన, ధ్యానాదులనుండి స్వానుభవము నుండియే వచ్చుచున్నది. ఒకటి బాహ్యమునుండి వచ్చుచున్నది. రెండవది ఆంతర్య మునుండి వచ్చుచున్నది. ఒకటి ప్రవృత్తి సహాయమున వచ్చుచున్నది. రెండవది నివృత్తి వలన వచ్చుచున్నది. అనగా వృత్తిరహితముగా నున్నప్పుడే, అపరోక్షాను భవము కలుగుచున్నది.

విజ్ఞుడు, చదువరియైన మానవుడు కూడ మాయచేతనో, మరేకారణముననో, నామరూపములకు బానిసయై, కేవలము పై ఆకారమునకే ప్రాధాన్యతనిచ్చుచు, కొబ్బరి పై పెచ్చునే పూజించుచు, లోపలి కురిడియను సారవంతమైన సత్యమును వదలుచుండెను. తనలోనున్న దివ్య శక్తిని,తేజస్సును స్థిరముచేసికొని దానిననుభ వించుటకు బదులు అస్థిరమైన నీడను పట్టుకొన పరువెత్తుచు, పరోక్షజ్ఞానముతో తృప్తి పడుచుండెను. దాని ఫలితమున అనేక తాపత్రయములకు, చింతలకు, బాధలకు గురియై అధోగతి పాలగుచుండుట విచారకర అంశము. ఉపనిషత్తులను నిత్యపారా యణచేయు చున్నవారు. భగవద్గీతను కంఠతః వల్లించువారు, మహావాక్యములను గురించి విపులముగా నితరులకు చెప్పగల్గినవారు చాలమందిగలరు. కాని వారిలో అపరోక్షముగా వాని సారము ననుభవించి, ఆనందించువారు చాల అరుదు. పాయస మును క్రిందకు, మీదకు, చుట్టును కలుపు గరిటెకు పాయసము యొక్క మధుర మైన రుచి తెలియనట్లు, ఈ పరోక్ష జ్ఞానము కల్గిన వేదాంతులు, పండితులు కూడ

దైవమును గురించి ఎంత వాగ్ధాటిగా బోధలు చేయగల్గినను, సమర్థత కలిగియున్నను అపరోక్షమైన దైవానుభవము లేనియెడల, ప్రాణము పోయిన శరీరమువలె నిస్సార మైన,శక్తిలేని జీవితములనే జీవించుట జరుగుచున్నది.

పంచదారను గురించి ఎంతస్మరించినను, ఎంత చెప్పినను దాని రుచి తెలియదు కదా! దానిని నోటిలో వేసికొని చప్పరించినప్పుడే దాని మాధుర్యమును గ్రహించగలము. అటులనే బ్రహ్మసాక్షాత్కారమునకు అపరోక్షానుభవము చాల ముఖ్యావసరము.

దైవము ఎచ్చటనో మనకు భిన్నముగా స్వర్గమునందో, ఆకశమునందో దాగి యుండలేదు.ఆయన అభిన్నముగా, సర్వాంతర్యామిగా నిరంతరము మన హృద యములలో దివ్యతేజస్సుతో వెలుంగుచుండెను.

అటులైన మానవులు తమకు అతిసన్నిహితముగా, కాదుకాదు, తమలోనే యున్న ఆ దివ్యతేజస్సును ప్రత్యక్షముగా ఏల అనుభవించుటలేదు? దానికి ముఖ్యమైన కారణము మానవుడు పరోక్షజ్ఞానముతోనే కేవలము తృప్తిపడుచుండుట చేత.

జన్మరాహిత్యము పొందవలెనన్న,మనోశాంతి కావలసియున్న, అపరోక్షజ్ఞాన మొక్కటే శరణ్యము. దానిని యింకను విపులముగా అర్ధముచేసికొనుటకు, చిన్నచిన్న దైవవాక్యములను ఉదాహరణగా తీసికొని బోధపరచు కొందము. కైలాసములో ఒక తావున ఈ క్రింది మూడు వాక్యములు వ్రాయబడి యుండెను.

1. నేను దైవములో నుంటిని.
2. దైవము నాలో నుండెను.
3. నేనే దైవము (అహం బ్రహ్మోస్మి)

ఒక్క మొదటి వాక్యమును తీసికొని విమర్శనాపూర్వకముగ దానిని దినచర్యలో ఆచరణలో పెట్టుటకు ప్రయత్నించినను, మానవుడు నూతనమైన శక్తిని, శాంతిని పొందవచ్చును.

'నేను దైవములో నుంటిని.'

దైవము సర్వాంతర్యామి. సర్వవ్యాపకుండై యుండ, నీవు ఆయనలో గాక మరెచ్చట జీవించగలవు? నేనిప్పుడు ఆయనలోనే కూర్చుని, ఆదివ్యశక్తిచేతనే యీ వ్యాసము వ్రాయగల్గుచున్నాను. ప్రియ పాఠకా!నీవిప్పుడు దైవములోనే కూర్చుని యీ వ్యాసమును చదువు చుంటివి. దైవము అణువుమొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించి యుండెను కనుక, నీకండ్లతో చూచెడిది ఆ శక్తియే. నీలో వినెడిది ఆ శక్తియే. ఆలోచించెడిది దదియే. నీలోని ప్రతికదలికయు ఆ దైవశక్తియే. నీలోనిండి యుండి కదలించుచున్నదని గ్రహించుటే నీ ఆత్మ సాక్షాత్కారమార్గము. ఈ యొక్క భావనను అనుభవములో పెట్టుకొన ప్రయత్నించిన, నీవిక దైవము కొరకై పూజ పునస్కారములు, బాహ్యప్రార్ధనలు చేయనవసరములేదు. ఏలనన నీ ఆంతర్య

వీక్షణమునకై దైవము నీ హృదయమందు నిశ్శబ్దముగా వేచియుండెను. ఇక రెండవ వాక్యము.

'దైవము నీలో యుండెను'

దైవశక్తి నీలో ప్రతి అణువునందు నిండి నిబిడీకృతమై యున్నందుననే నీకండ్లలో ఆయన తేజము ప్రకాశించుచుండెను. నీ మనోవాక్కాయకర్మలలో ఆ దివ్యతలంపులే వ్యక్తమగుచున్నవి. ఈ సత్యమును గ్రహించి స్వయముగా అనుభవించుటే అపరోక్షానుభవమైన జ్ఞానము.

ఇక మూడవ వాక్యములో 'నేనే దైవము'

ఈ బ్రహ్మానుభవమునే బ్రహ్మవిధులు. తత్త్వమసి, అహంబ్రహ్మాస్మి, ప్రజ్ఞానం బ్రహ్మ, అయమాత్మా బ్రహ్మేది మహావాక్యములచే బోధించి యుండిరి. ఆ పరిపూర్ణ మైన స్థితిలో వ్రాయుటకు నేనులేను. చదువుటకు మీరులేరు. అంతయు అవాఙ్మానస గోచరమైన బ్రహ్మ స్వరూపమే! బ్రహ్మానుభవమే ! నిశ్శబ్దోబ్రహ్మ! బ్రహ్మస్వరూపమే శబ్దరహితమైనది. కనుక మన మిప్పుడు నిశ్శబ్దములో ఆ బ్రహ్మస్వరూపమును సంకల్పరహితులమై అపరోక్షముగా అనుభవించెదము గాక.

హరి ఓం తత్ సత్ ఓం.

కైలాసము

లోకాస్సమస్తాస్సుఖినోభవంతు

15-8-52

ఉదయం 6-00

# 32. వృద్ధి-నాశనములు

ప్రశ్న : వృద్ధి నాశనములు దేనికి ?

జవాబు : శరీరమునకు

ప్రశ్న : వృద్ధి, నాశనములు లేనిది గలదా ?

జవాబు : అదియే ఆత్మ, సృష్టికంతకు ఆధారమైన మూల ప్రకృతి.

ఆ మూలపురుషుని వృద్ధినాశనముల కతీతమైనట్టి విరాట్ స్వరూపుని తెలిసి కొనుటకే వృద్ధినాశనములతో కూడియున్న యీ దేహమలీయబడెను. కాని మానవుడు అజ్ఞానముచే స్వస్వరూపమును, వృద్ధినాశనము లెరుంగని తన నిజస్థితిని మరచి, క్షణ క్షణము మారుచుండెడి తన దేహమునకే వృద్ధినాశనములు లేకుండ నుండవలయునని అస్థిరమైన శరీరమును పూజించుచుండును.

పుట్టుట గిట్టుట కొరకే. గిట్టుట మరల పుట్టుటకొరకే పుట్టిన దేహము శాశ్వత ముగ ఎటులుండగలదు ? పుట్టుకలేని దొక్కటే. శాశ్వతమైన సద్వస్తువును నమ్మి, దానిని స్థిరముచేసికొని ధ్యానించినపుడె మానవునికి శాంతి కలుగును.

ఎంత శక్తి సామర్థ్యములున్నను ధనము విద్యాధిక్యములున్నను వృద్ధినాశనము లకు మూలమైన శరీరములను ఎన్నిటికిని శాశ్వతముగా నుండునట్లు చేయజాలము. దాని కొరకు ఆశపడి దేహమును పూజించిన వారికి శాంతికి బదులు అశాంతియే మిగులును.

ఏలయన మార్పులో నిత్యశాంతి పూర్ణశాంతిలేదు. అది మార్పులకు అతీతమైన ప్రత్యగాత్మయందు మాత్రమే గలదు. దైవపిపాస, శాంతిని కోరు మానవులీ సత్యమును, ఈ ధర్మసూత్రమును ఎంత త్వరలో గ్రహించిన అంత మంచిది.

జలము మంచుగడ్డనుండియే వచ్చును కాని ఇనుపముక్క నుండి రాదు. ప్రకాశము వజ్రమునుండి గాని, అద్దము నుండిగాని వచ్చునుగాని మసిబొగ్గు నుండి రాదుగదా!

కనుక మానవుడు తన తృష్ణను తీర్చుకొనుటకై ఎండమావులలోని జలమునకై వెదుక కాలయాపనయేగాక వానికి చివరకు మిగిలెడివి నిరాశ దుఃఖములే.

ఆహా ! మాయ యొక్క ప్రభావము ఎంత ప్రబలమైనదో గాని శాస్త్రవేత్తలను, తత్త్వవేత్తలను కూడ క్రింద పడవేయుచున్నది. ప్రవృత్తి పరులను భోగులనేగాక, యోగులను సాధువులనుగూడ తనకు బానిసలుగా చేయుచున్నది. మాయ నిత్యమును అనిత్యముగ, అనిత్యమును నిత్యముగ చూపించి మానవుని తన క్రీనీడ వెంట పరుగెత్తించుచున్నది. మానవుడు మేధానిధియై యుండియు మాయకు దాసుడై తన జీవితమనెడి బండిని గుఱ్ఱము ముందుకట్టి, యాత్రను సాగించుటకు ప్రయత్నించు చుండెను. గుఱ్ఱమును బండిముందు కట్టినప్పుడే కదా ప్రయాణము

సహజముగ సాగును. గుఱ్ఱమును బండి వెనుక కట్టప్రయత్నించుట హాస్యాస్పదమేగాక ధర్మవిరుద్ధ మైనను లోకములో జనులు నూటికి తొంబది మంది అసలు సద్వస్తువును మరచి, అనిత్యమును నిత్యముగా చేసికొని తమ క్రీనీడలను వెంబడించుచు గుఱ్ఱమును బండి వెనుక కట్టి, ప్రపంచమనెడి ఎడారిలో అధోలోకమునకు ప్రయాణము చేయుచుండుట చాల విషాదకరమైన విషయము.

ఇప్పుడైనను మానవుడు తన దుఃస్థితిని గ్రహించి నిత్యానిత్య వివేకము కల్గినవాడై గుఱ్ఱమనే మనస్సును జీవితమనెడి బండివెనుక పెట్టి అధోలోకమునకు వెళ్ళుటకు బదులు, తన మనస్సనే అశ్వమును బండి ముందునేయుంచి తన జన్మహక్కయిన ఊర్ధ్వలోకమునకు ప్రయాణించుట ముఖ్యావసరము.

ఇంతకును వృద్ధినాశనముల కతీతమైన దేహములో నున్న దేహిని శ్రవణ, మనన, నిధి, ధ్యాసములచే స్థిరము చేసికొని ధ్యానించుచు ఆ సద్వస్తువులో లీనమగు టకు ప్రయత్నించవలెను.

వృద్ధినాశనము లెరుంగని దొక్కటే యొక్కటి. అదియే నీ స్వరూపము. అదియే నీవు. తత్త్వమసి-నరుడే నారాయణుడు. జీవోదేవస్సనాతనః- ఆది నుండి ఇంతవరకు ఉన్నదొక్కటే సద్వస్తువు. అదిశాశ్వతమై,స్థిరమై, ఏమార్పుల నెరుంగక నీ దేహములో నీ కొరకై వేచియున్న దేహి !

మన జన్మహక్కైనదియు, సర్వాధారమైన, మానవజన్మయొక్క గమ్యస్థాన మైనదియు నగు ఈ దేహినిప్పుడు ధ్యానించుచు ఆ దివ్యతేజస్సులో ఇప్పుడే ఇక్కడనే విలీనమై శాశ్వత శాంతిని పొందెదము గాక.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 16-6-53 ) ఉదయం 4-00

- సుషుప్తి అవస్థలోను, జాగ్రదవస్థలోను, స్వప్నావస్థలోను చివరకు సమాధిలో కూడ ఆ భగవంతునే అనుభవించుట, ఆయన మహిమతోనే నిండి ఆవరింప బడుటయే (నిజమైన) అదృష్టము.
- మానవుని యందు రెండు తత్త్వములు గలవు. ఇంద్రియములు ఆలంబనముగా గలది పశుతత్త్వము వివేకము ద్వారా పనిచేయునది దైవతత్త్వము, దైవతత్త్వము నంగీకరించి దానితో సహకరించుటే జ్ఞానము.
- ప్రతిక్షణము సద్వినియోగము కావలయును. అందుకొరకు ఆ క్షణములనన్నిం టిని భగవత్సేవయందు వినియోగింపవలయును. అదియే సౌఖ్యమునకు మార్గము.
- తాబేలు ఆపద వచ్చినపుడు తన అవయవములను లోనికి ముడుచుకొనునట్లు, జ్ఞాని కష్టములు కలుగునపుడు తన ఆత్మస్థానము లోనికిపోవును.

# 33. త్రివిధ గురువులు

ప్రపంచములో మూడురకములైన వైద్యులు గలరని శ్రీరామకృష్ణపరమహంస వైద్యులను ఉపమానముగా, గురువులతో పోల్చి చెప్పెను.

మొదటిరకము వైద్యుడు రోగిని పరీక్షించి, "ఫలానా" మందు తీసికొన్న మీ రోగము పోవునని చెప్పి వెళ్ళిపోవును.

రెండవ రకము వైద్యుడు రోగియొక్క ఆరోగ్యమును కోరుచు, రోగియొక్క రోగ కారణమును బాగుగా పరీక్షించుటే గాక, స్వయముగా దగ్గరనుండి మందు నిచ్చును.

ఇక మూడవతరగతి వైద్యుడు రోగియొక్క అవస్త అంతయు క్షుణ్ణముగా గ్రహించి, అతని రోగమునందలి మార్పులను కనిపెట్టుచు, రోగి మందు తీసికొను టకు అశ్రద్ధచేసినను, అనుమానించినను, అవసరమైన రోగిని బలవంతముగా నోరు తెరిపించి మందును గొంతుకలోపోసి త్రాగు వరకు విడువడు.

ఈ రీతిగనే గురువులలో కూడ మూడురకముల వారుందరు. కొందరు గురువు లకు శిష్యులు, సంవత్సరమునకు ఒక్కసారి, అనగా వార్షికము దొరకనున్నప్పుడు మాత్రమే జ్ఞప్తికిరాగా, శిష్యుల గృహములకేగి, తమకు రావలసిన దక్షిణలను, కానుకలను స్వీకరించి వెళ్ళిపోయెదరు.

ఇక రెండవరకపు గురువులు, శిష్యుని శ్రేయస్సు కోరుచు, తాము చెప్పిన మంత్రజపము, ప్రార్థనా ధ్యానాదులు నియమముగా చేయుమని మరల మరల నొక్కి చెప్పుచుందురు.

ఇక మూడవతరగతి గురువులో ! తమ శిష్యుల ఆధ్యాత్మికాభివృద్ధియే తమ ఆత్మాభివృద్ధిగా భావించి, దగ్గరనుండియే, తమ శిష్యులచే నియమముగా అభ్యాసము లను చేయించుచు, వారి దినదినాభివృద్ధికి నిరంతరము పాటుపడుచుందురు. శిష్యుడు నిద్రచే బద్ధకించి సాధన చేయకున్న, గోడకుర్చీ వేయించి యైనను, వాని సోమరితనమును పోగొట్టి, ఆత్మ వికాశమును కల్గించుచు వారి వృద్ధిని చూచి ఆనందించుచుందురు.

మొదటి తరగతి వైద్యులు, గురువులు ఈలోకమంతయు లెక్కకు మీరి నిండి యుండిరి. రెండవ తరగతి వారు కూడ చాలమంది కలరు. ఇక మూడవ తరగతి వారు అరుదు. అట్టి గురువులను పొందియున్న శిష్యుల జీవితము అదృష్టవంతమైనది.

ఇట్టి ఆత్మానుభవము కల్గిన గురువుగారొకరు, తమ శిష్యునికి ఉపదేశమునిచ్చి, ఆత్మజ్ఞానమునంతయు బోధపరచిరట. కొంతకాలమునకు తమ శిష్యుడు అనుభవ మున సర్వభూతములలో ఒకే ఆత్మను వీక్షించుచు, స్థితప్రజ్ఞునిగా, భావించుచున్న దియు లేనిదియు పరీక్షించుటకై మారువేషముతో శిష్యుని చెంతకు వెళ్ళిరట. శిష్యుడు గురువు గారిని ఆనవాలు పట్టలేదు. పల్లెటూరి మనుష్యుడెవరో ఉత్సవమును చూచు

టకు వచ్చెనని తలచెను. ఒక ఉత్సవము వారి దగ్గరగా వెళ్ళుచున్నదట. అప్పుడు ఈ క్రింది సంభాషణ వారిరువురకు జరిగెను.

గురువు : అది ఏమిటి ?

శిష్యుడు : నేడు ఉత్సవదినము గావున రాజుగారు ఊరేగుచుండిరి.

గురువు : రాజుగారెవరు ?

శిష్యుడు : ఆ ఏనుగు మీద కూర్చున్నవారు.

గురువు : ఆ ఏనుగ ఏది ? రాజెవ్వరు ?

శిష్యుడు : నీవు పల్లెటూరి మనుష్యునివలె నుంటివి, నేను చెప్పుచున్నది తెలియుటలేదా? అట్లయిన నీకు అనుభవముగ చూపించెదను చూడుమనుచు, గురువుగారి భుజములమీద నెక్కి ఇట్లు పలుక సాగెను. ఓ వెర్రివాడా! చూడుము! నేను నీపై నుంటిని గాన నేను రాజును. క్రిందనుంటివిగాన నీవు ఏనుగుగా నుంటివి. ఇప్పుడైనను తెలిసినదా ?

గురువు : నీవు చెప్పినట్లే పై నుంటివిగాన నీవురాజువనియు, క్రింద నుంటిని గాన నేను ఏనుగననియు చెప్పుచున్న నీవు. "నేను" అనుచున్నది ఏదియో నాకు తెలియ చెప్పుము.

ఈ తత్త్వవిచారణ వాక్యములు వినగనే శిష్యుని హృదయములో రాయిపడినట్ల యినది గురుమూర్తి, భుజముల నుండి క్రిందకు దుమికి, ఇంత సదసద్వివేకముతో తత్త్వవిచారణ చేయు నాతడు తన గురువేయై యుండవలయునని గ్రహించి, పాదా క్రాంతుడై, తన అపరాధమును క్షమించుమని వేడుకొనెనట.

అప్పుడు గురుమూర్తి వివిధ నామములతో వెలుంగుచున్నది ఒక్కటే సచ్చిదా నంద స్వరూపముగాన, అద్దానిని సర్వకాల సర్వావస్థలలోను దర్శించుచు, ఆత్మభావ నతో జీవించుమని నొక్కిచెప్పి తమ ఆశ్రమమునకు చేరుకొనెను.

ఈ చిన్నకథలో గురుమూర్తికి శిష్యుని యందుండెడి వాత్సల్యమును తెలుపుటే గాక, తత్త్వవిచారణ కూడ అనుభవముగా తెలియచేయు చున్నది. అట్టి అనుభవజ్ఞు లైన గురువులను బడసిన వారి జీవితములు ధన్యవంతములు. దేహవాసనతో, అంధుడు అంధులకు దారిచూపజాలనట్లు, శాస్త్రవాసన లోకవాసన మొదలైన వాసనా త్రయములచే బంధింపబడిన గురువులెంత చదువరులైనను అనుభవముగా తమ శిష్యులకు తోడ్పడ జాలరు.

గురుశిష్యభావమును కూడ మరచి, నిరంతరము ఆత్మానుసంధానము నందు లీనులైయున్న మహనీయులే వారి ఆదర్శజీవితముల ద్వారా తమ శిష్యులకేగాక, దేశాభ్యుదయమునకు లోకశాంతికి గూడ తోడ్పడు అవకాశము కలవారగుదురు.

ప్రియ పాఠకులారా ! ఈ సందర్భమున గురువులకు గురువైన అష్టావక్ర

మునీంద్రుని మహామంత్రము నొక్కదానిని చెప్పి, తదర్ధమును మీతో పంచుకొని ఈ వ్యాసమును ముగించెదను.

గీ॥ వాడు వీడనగానేల "వాడె" "నేను"
నేను వాడను వ్యవహార
మెల్లమాని అఖిల మాత్మ
గాజూచి నీవిల సుఖివిగమ్ము.

ఆత్మవత్సర్వభూతాని

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

కైలాసము

( 4-1-53 )

- భగవత్ సాన్నిధ్యము ఎల్లప్పుడూ ఉండునదే. అయితే మానవుడు దానిని ప్రతి దినము ( ప్రతిక్షణము ) అనుభవింపలేకపోవుటకు కారణము చంచల మగు మనస్సు, దాని యొక్క భ్రాంతి.
- ఆనందమే భగవంతుడు. అహంకారము సమూలముగ నాశనము అయిన హృదయమునందే ఆయన వసించును.
- అసత్యమైనట్టి భ్రాంతిని జ్ఞానాగ్నిలో కాల్చివేయుము. సత్యమును, బ్రహ్మమును గుర్తించి అందులో స్థిరముగా నుండుము.

# 34. అఖండమైన శక్తి

అఖండమైన శక్తినే ఆత్మశక్తి అనియు, దైవశక్తి అనియు, విశ్వశక్తి అనియు, శ్రీరాముడని, శ్రీకృష్ణుడని, అల్లా అని, క్రీస్తు అని అనేకులు వారివారి మత సంప్రదాయముల ననుసరించి వారి మనోపరిపక్వతను బట్టియు, ఆ సద్వస్తువును వివిధ నామములతో పిలుచుచుండిరి.

ఈ వ్యాసములో మనము తెలిసికొనవలసినది ఆ సచ్చిదానందస్వరూపము యొక్క వివిధ నామరూపములను గురించి కాదు. ఆ అఖండమైనశక్తిస్వరూపము ఏ ఏ నామ రూపములతో ఎవ్వరెవ్వరిచే నెటుల పిలువబడి ఆరాధింపబడుచున్నను, అట్టి సద్వస్తువు మనందరి జన్మహక్కయి యున్నదన్న భావమును స్థిరముగ గ్రహించ వలెను. ఆ దివ్యశక్తి, ఆదిశక్తి, ఆత్మశక్తి మీ జన్మహక్కు, నా జన్మహక్కే కాదు, దైవసంతతి అందరి యొక్క జన్మహక్కై వెలుంగుచున్నది.

ప్రశ్న : ఆ బ్రహ్మ వస్తువు ఎచ్చటనున్నది ?

జవాబు : ఆ బ్రహ్మ వస్తువు లేక అఖండశక్తి లేక దివ్య తేజస్సు మనలోనేయుండి హృదయములో కదలుచు, మనస్సులో ఆలోచించుచు, శ్వాసకు శ్వాసగా, అహర్నిశ ములు మన నేత్రములలో ప్రకాశించుచున్నది. ఉన్నదొక్కటే అఖండమైన అద్వితీయ మైన దివ్యశక్తి అనియు, అది మన గమ్యస్థానమును చేర్పగలదనియు తెలిసికొనవలసి యున్నది.

మనకు కావలసినది, తెలిసికొనుటకు మిగిలియున్నది ఆ సత్పదార్థమును, దివ్యతేజస్సును మానవ జీవితములలో ఎవ్వరెవ్వరు, ఏ ఏ రీతిగా దానిని అనుభ వించుచు వ్యక్తపరచు చున్నదియు, ఎవరికి వారే ఆంతర్యమునకు వెళ్ళి పరీక్షించు కొని స్థిరము చేయవలసి యున్నది.

గంగానది గాని, గోదావరిగాని ఉన్నతమైన పర్వతముల నుండి నిరంతరము ప్రవహించుచుండ వాని పవిత్ర జలములను ఏ ఏ సస్యములకు నెవ్వరెవ్వరు ఏ విధముగా ఉపయోగించుకొని అభివృద్ధిచెందుచు దేశ ప్రజల క్షేమమునకు లోక శాంతికి తోడ్పడవలసియున్నదియు ఆయా ప్రాంతజనుల యందే యుండునుగదా! వానితో వరి మొదలగు జీవితాధార వస్తువులను పండించవచ్చును. లేక ముండ్ల పొదలచే అట్టి జలమునకు దగ్గరనున్న భూమిని వ్యర్థము చేయవచ్చును. నది ఒడ్డున నుండి దాహము దాహమని గొంతుకయెండి పోవులాగున లభించిన జల మును గ్రోలక, అరచిన ఏమిలాభము? కనుక సర్వము మనలోనేయున్నది. దానిని మంచిగా ధర్మపథమున వ్యక్తముచేసిన, మన అభివృద్ధియే గాక, పలువురకు సహకరిం చును. చెడును బహిరంగ పరచిన తనకు హానియేగాక, తమ పరిసరవాతావరణ మంతయు కలుషితమగును. అట్టి అమృతతుల్యమైన జలమును ప్రతి మనుజుడు

ఏదో విధముగా ఉపయోగించును. అట్లే తమలోనున్న శక్తిని ఉపయోగించకుండ నెవ్వరు నుండజాలరు.

ప్రవృత్తి పరులీశక్తిని తమ తమ ప్రవృత్తిననుసరించి, దంభాహంకారములతో, అమాయకులైన వారిని హింసించుటకుపయోగించెదరు. నివృత్తి పరులీశక్తిని తమ సత్త్వ ప్రవృత్తి ననుసరించి పరోపకారమునకై వినియోగించెదరు. ఏమి ఆశ్చర్యము! ఒకే నిత్యమైన, పరిపూర్ణమైన, అఖండమైన ఆత్మశక్తి, మానవుని ఔన్నత్యమునకును, అధోగతికిని గూడ దారి చూపుచున్నది. అగ్నితో వంటచేసికొన వచ్చును. చేతిని కాల్చుకొనవచ్చును. ఒకేగొడ్డలితో పుల్లలు చీల్చవచ్చును. శిరస్సును ఖండింపవచ్చును. మానవుడు తన ప్రకృతిననురించి అనగా స్వభావానుగుణముగా ఆ దివ్యశక్తిని స్వర్గము చేరుటకు, నరకములో పడుటకో వాడుచుండెను.

ఆత్మీయులారా ! ఈ వ్యాసమును చదివిన జ్ఞాపకార్థముగా మీలో నున్న ఆదివ్య శక్తిని ప్రేమపూరితమైన ఆలోచనలలో, శాంతియుతమై ఇతరులకు మేలొనగూర్చెడి మాటలలో సద్వినియోగము చేయుచు తరించుడు. విలువైన కాలములో ప్రస్తుత క్షణమునే మన సర్వస్వముగా భావించుచు, అఖండమైన శక్తిని, మన మనోవాక్కాయ ములలో వ్యక్తపరచుచు, ఆ సచ్చిదానందస్వరూపుని వివిధనామరూపములలో ఆరాధించుచు లోకశాంతికి తోడ్పడెదరు గాక !

లోకా సమస్తా స్సుఖినోభవంతు.

కైలాసము

ఓం ఓం ఓం.

( 4-1-53 )

- దిట్టమైన పునాది లేకపోవుటచే తత్త్వవేత్తలు, ఆరాధకులు కూడ కొన్ని సమయ ములందు విచారములు, భయభ్రాంతులు వంటి క్షణికములగు చిన్న కష్టము లకు లోనగుదురు.
- ఆత్మ జ్ఞానులకును, భగవత్ సాక్షాత్కారమును పొందిన వారికిని అదృష్టముతో పనిలేదు. వారే అదృష్టరూపులు.
- మనుజుడు అంతర్ముఖుడై జ్యోతులకు జ్యోతియగు సత్యమును గాఢముగా అంతరంగమున ఆలోచించిన యెడల భ్రమకు స్థానమే లేదు.
- ఆత్మ యొక్క మహిమ అంతయు ఆలోచన యందుగాని, క్రియలయందు గాని బహిర్గతము అవకపోయినను, ఆత్మసాక్షాత్కారము నొందిన వారు దానిని ఎన్నటికీ మరువ జాలరు.

# 35. వెఱ్ఱిమానవుడు

నిత్యానిత్య వివేకములేని మానవుని వెర్రిమానవుడనియే చెప్పవలెను. పూర్వజన్మ సుకృతముచే, దుర్లభమైన మానవజన్మను పొందగల్గినందుకైనను ఏది నిత్యమో, ఏది అశాశ్వతమో, ఏది తనకు లాభకారియో, ఏది తనకు హానికరమో కొంచమైనను విచక్షణ లేకుండుటాశ్చర్యము.

వెర్రిమానవుడు, వివేకశూన్యుడై యున్నందున సత్పదార్థమును వదలి, అసత్య మైన నామరూపములనే నిరంతరము పూజించుచుండెను. తన జన్మహక్కైన సచ్చి దానంద స్వరూపమును మరచి, అహర్నిశములు క్రీనీడల వెనుకనే పరుగెత్తుచుండెను. అమృతతుల్యమైన విజ్ఞానము తన లోనే యుండ, దానిని మరచి, విషతుల్యమైన విషయవాంఛలనే సదా కోరుచు దుఃఖసముద్రమున మునుగుచుండెను.

శ్లేష్మములోపడి కొట్టుకొనుచున్న ఈగకును, సంసార సముద్రలోబడి దరిగానక కొట్టుకొనుచున్న వెర్రిమానవుని జీవితమునకును ఇసుమంతయు భేదముగాన వచ్చుట లేదు. మిడుత దీపమును చూచి ఫలమని భ్రమించి ఆ జ్యోతియందుపడి కాలిపోవుచున్నది. ఇక మానవుడు విషయసుఖములు తనకు హానికరములని తెలిసియు, అగ్నిలో చేతిని పెట్టినచో కాలునని యెరింగియు, మరల మరల అగ్ని యందే తన చేతిని పెట్టుచు పడరాని బాధలు పడుచుండెను. అట్టివాడు వెర్రిమాన వుడేగదా !

ఇక ఈ వెర్రిమానవుని ఎవ్వరైనను నీకు ఆస్తి ఎంతయున్నదని అడిగిన అతడు మహదానందముతో పల్లపుభూమి కొంతయున్నదనియు, మెట్టభూమి కొంత యున్న దనియు, ఇంకను భవనములు, వస్తు వాహనములు, బ్యాంకులో తన పేరున ధన మున్నదనియు విర్రవీగుచు చెప్పుచుండును. అవన్నియు అతని ఆస్తులేనా ? మాన వుడు నేడు కండ్లుమూసిన, ఈపై ఆస్తులలో ఏదైనను అతని వెంట వెళ్ళునా ? మొనపోయిన గుండుసూదైనను, చివరకు తన మొలనున్న మొలత్రాడైనను వెంట తీసుకుని పోజాలడు గదా !

ఓ వెర్రి మానవుడా ! ఈనామ రూపములన్నియు సత్యమైన, స్థిరమైన ఆస్తులు కావని యెంతలో గ్రహించెదవు ? నీ జీవితములో ఇంతవరకు తెలిసియో, తెలియకయో బీదసాదల సేవలో వినియోగించిన ధనమే ఎన్నటికైనను నీకు తోడ్ప డును. ఆ ధర్మమే ఈ శరీరముపోయిన తరువాత నీవెంటనంటి వచ్చును. కొదువ ఆస్తులన్నియు నిన్ను బంధించెడివియే సుమా !

ఒక లుబ్ధుడు చాల ఆస్థిపరుడై యుండియు, ఏ దాన ధర్మములు చేయక, అహర్నిశములు దొంగలపహరించెడి ధనమునకై పాటుబడుచునే యుండెను. అట్టి వెర్రిమానవునకు మృత్యువు హఠాత్తుగా వచ్చెనట. యమకింకరులు వానిని తమ లోకమునకు తీసికొని వెళ్ళుటకు ప్రత్యక్షమై, అతని జీవితములో ఎన్నడైనను ఎవ్వరి

కైనను దానధర్మములు చేసేనేమో జ్ఞాపకము తెచ్చుకొనమనగా అతనికి ఏ దాన ధర్మములు ఎవరికి చేసినట్లు జ్ఞాపకము రాదాయెను. కాని ఎప్పుడో ఒక చిన్న చిలగడదుంపను ఆకలితో నున్నవాని కొసంగెనట. అప్పుడు ఆ చిలగడదుంపయే అతని ఎదుట ప్రత్యక్షమయ్యెను.

అతడా దుంపను పట్టుకొన్నట్లు, ఆ దుంపయే అతనిని స్వర్గపుదారిని తీసుకు వెళ్ళుచుండుటకై బయలుదేరుచుండ, మరికొందరు మృతజీవులు అతని ననుసరించి ఒకరి కాళ్ళు ఒకరు పట్టుకొని పైకి వెళ్ళుచుండ ఈ స్వార్ధుడు దుంప సహాయముతో ఆకాశములో వెళ్ళుచు తానేగాక, అనేకులు తన్నుపట్టుకొని వెంబడించుటచూసి, “ఈదుంపనాది, మీరందరు వెళ్ళిపోవు”డని చేతినూపగా, దుంపనుండి పట్టువిడి పోవుటచే, అందరితోపాటు తానుకూడ క్రిందపడి నశించెనట. బ్రతికియున్నప్పుడున్న స్వార్ధము చనిపోయినను విడువదు గదా ! కనుక దీపముండగనే, అనగా బొంది నుండి ప్రాణము పోవకుండగనే, మానవుడు స్వార్ధము నుండి నిస్వార్ధమైన జీవితము నకు మారవలెను.

ఈ విశాలమైన, ప్రశాంతమైన ఆశ్రమములన్నియు నా ఆస్తులేయని తలంచుట లేదు. అన్నియు భక్తవరేణ్యుల ఆస్తులైయున్నవి. నిజమైన ఆస్తి సచ్చిదానంద స్వరూ పమే. ఏ తుపానులు, కరువులు, యుద్ధములు, ఎట్టి అవస్థలు తాకజాలని పరమాత్మ స్వరూపమే మానవుని స్థిరమైన, శాశ్వతమైన, సంపూర్ణమైన ఆస్తిగానున్నదని గ్రహించు టావశ్యకము.

ఓ మానవుడా ! రమ్ము ! రమ్ము ! వజ్రములు నీ ఆస్తియైయుండ, గాజు పెంకు ముక్కలకై వెదకెదవేల ? అమృతము నీ జన్మహక్కై యుండ విషమును గ్రోల కోరెదవేల ? పరిపూర్ణ శాంతి నీ గమ్యస్థానమై యుండ, అశాంతితో నీ జీవితమునంతను వ్యర్థము చేసెదవేల ? తరించుట కిదియే సమయము. ఆత్మ సాక్షాత్కారము పొందుట కిదియేతావు. నేడే నీది, రేపు నీది కాదనెడి సత్యము నీ ప్రత్యక్ష క్షణమునందే గ్రహించి, నిత్యానిత్య వివేకజ్ఞానము కలిగి, వైరాగ్యముతో నిండి, మోక్షాపేక్షతో తరింప ప్రయత్నించెదవు గాక !

లోకాసమస్తా స్సుఖినోభవంతు

తోటపల్లి ( 18-10-50, మధ్యాహ్నం 1-00 )

- సూర్యుడు తన తేజస్సు నెట్లు ప్రసరింప చేయునో అట్లే నీవును నీ ఆనంద మును, ఉత్సాహమును ప్రసరింపచేయుము. విచారదైన్యములను నీలోపలనే ఉంచుకొని ఇతరులను సంతోషపెట్టవలయును.
- మనస్సునకు గొప్పశక్తి గలదు. దానిని చాంచల్యముతో నుండనీయరాదు. అప్పుడే ఊహాతీతమైన శాంతి అలవడును.

# 36. చిరస్మరణీయమైన దినము

నిర్హేతుకముగ, కేవలము దైవకృపచేతనే కాయముతో ప్రారబ్ధమనుభవించెడి రోజులలోనే ఈ చిరస్మరణీయమైన దినము 4-6-1954న ప్రాప్తించెను.

ఈ పరమపావనమైన ఆనంద దినమును ఈ జీవితములో చిరస్మరణీయముగ చేసికొనుటేగాక ఆనాటి నిత్యమైన, అఖండమైన, పరిపూర్ణమైన ఆనందమును దైవ చింతనాపరులగు ఆశ్రమవాసులు, ఆశ్రమ భక్తులతో గూడ పంచుకొనుటకు ఆ రోజు నేననుభవించిన ఆనందమును, ఆ పరమపవిత్రక్షణములను మరల జ్ఞప్తికి తెచ్చుకొని ఇప్పుడు వ్రాయుటకు ప్రయత్నించుచుంటిని.

అవి మండువేసవి రోజులు. తోటపల్లి కొండలలో వేసవి తీవ్రముగనే యుం డును. గుహపైన గదిలో చాలవేడిగా, ఉక్కగా నుండెను. బైటకువచ్చి కూర్చుండగా వేడిగాల్పులు వీచుచుండెను. లోపలకు వెళ్ళుటకు వీలులేక బయట నుండుటకు వీలులేక ఏమిచేయుటకు తోచకుండెను. విసనకర్రతో విసురుకొనుచుండ గాలి కొలిమిదగ్గర కూర్చుండి విసరుకొనుచున్నట్లు అతివేడిగా కొట్టుచుండెను.

లోపల విశ్రమించుటకును, బయట కూర్చుండుటకును గూడ వీలులేక అశాంతిగా నుండి మరల లోపలికే వెళ్ళి ఎటులనో ఆ వేడిగా యున్నగంటలు వెళ్ళ బుచ్చుటకై అచట పరుండుటకు ప్రయత్నించితిని. ఆ యుష్ణములో నిద్రపట్టునా? ఉష్ణమునకు ఉష్ణముగా నున్నవాడు దైవమేగదా ? ఈ ఒక్క సూర్యుని యొక్క వేడిమియే ఇటులున్న ఇక కోటిసూర్యుల తేజస్వరూపము, ఇట్టి సూర్యుల ప్రకాశము నకు మూలకారణమైన ఆ దైవశక్తి యొక్క వేడిమి ఎంత హెచ్చుగా వర్ణనాతీతముగా నుండునో గదా !

దివి సూర్య సహస్రస్య భవేద్యుగపదుత్థితా,

యది భాస్సదృశీ సాస్యాద్భాసస్తస్య మహాత్మనః

అని భగవద్గీతలో చెప్పబడినట్లు ఆలోచించుచు అటులనే కనులను మూసితిని.

ఆ అనిర్హేతుకమైన, వర్ణనాతీతమైన, పరమసుఖదమైన, గుణరహితమైన దివ్య స్థితి ఎటుల వచ్చెనో వ్రాయజాలను. శరీరముతేలిక అయ్యెను. అచట శరీరమేలేదు. ఆంతర్యమున బాహ్యమునతేజస్సే, అంతటను, అన్నివైపులాతేజస్సు, అపుడు ఆంతర్యము, బాహ్యము, చుట్టును అనెడిదియే లేదు. ప్రప్రథమమున తలవని తలంపుగ తటస్థించిన ఆ ఆనందమును పట్టజాలక ఇది కలగనుచుంటినా ! నిజమేనా! ఏమి అదృష్టము ! అనెడి భావన కలిగెను. ఆ దివ్యతేజస్సులో ఆ సంకల్పము గూడ మరుగయ్యెను. అచట వేడియులేదు. శీతలమును లేదు. శరీరమే లేనప్పుడు శీతోష్ణము లెచ్చటుండును? మనసు తాత్కాలికముగా అందు లీనమైయున్నందున భూత, భవిష్యత్, వర్తమానకాలములకు అతీతమై యుండెను. అది జాగ్రదవస్థగాదు. ఏలనన జాగ్రదవస్థలో భరింపరాని ఉష్ణోగ్రతచే బాధపడితిని. అది స్వప్నావస్థయు

గాదు. ఏలయన ప్రత్యక్షముగ దివ్యతేజస్సు వ్యక్తమైయున్నది. అదిసుషుప్తి అవస్థయు గాదు. ఏలయన అచట ఎరుక, తెలివి, ప్రజ్ఞ, స్వానుభవము పరిపూర్ణముగ నుండెను.

విశ్వాతీతము, ద్వంద్వ గుణాతీతము, ఇంద్రియములకు అగ్రాహ్యమైన ఆ బ్రహ్మానందము ననుభవించుచు ఎంతకాలము గడిపితినో చెప్పజాలను. ఆ దివ్య స్థితిలో అనుభవించుటకు "నేను" అనెడిది గూడ మరుగై తాత్కాలికముగా దహింప బడి యుండెను. ఆ దివ్యస్థితిని, పరమ పావనమైన ఆ పవిత్రక్షణములను తలచినంత మాత్రముననే అమితానందముగా నుండెను. అది కేవలము నిర్వికల్పమే. సవికల్ప ముగ పొందిన శాంతిక్షణములు ఎన్నో గలవుగాని, నిర్వికల్పముననుభవించిన క్షణములు చాల అరుదు. అది నిర్హేతుకముగా, కేవలము దైవకృపచే రుచి చూపింపబడిన పరిపూర్ణ స్థితియే.

జ్ఞాతం జ్ఞాతవ్య మధునా దృష్టం ద్రష్టవ్య మద్భుతం
విశ్రాంతోస్మి చిరంశ్రాంతః చిన్మాత్రాన్నాస్తి కించన.

తా. తెలియబడిన బ్రహ్మ తెలియబడెను. చూడవలసిన అద్భుతమును చూచితిని. దానిని గూర్చి మిక్కిలి శ్రమపడితిని, నా శ్రమగట్టెక్కెను. ఇక విశ్రమించె దను. చిన్మాత్రమైన బ్రహ్మము కంటె నితరమేమియులేదు. నేనే బ్రహ్మను. ఆహా! ఏమి ఆశ్చర్యమైన సంగతి !

ఈ పరిపూర్ణమైన స్థితిగురించి పరమరహస్యమైన సూక్ష్మాంశమేమియనగా, ఇట్టి పరిపూర్ణత్వము స్వప్రయత్నములచే సిద్ధించునది కాదు. స్వప్రయత్నములచేతనే వచ్చియున్న, దానికై మరల యత్నించవచ్చును. ప్రాతఃకాలమున, సాయంసమయ ముల, అర్ధరాత్రి నిశీధిలో, ఏకాంతమున ప్రయత్నించితిని. ఎంత ప్రయత్నించినను కొంత మనఃశాంతి కల్గినదని చెప్పవచ్చునుగాని నిర్హేతుకముగా ఆనాడుకల్గిన శరీర, మనో, ప్రపంచాతీతమైన నిర్వికల్పస్థితి మాత్రము అనుభూతము కాలేదు.

ఆ పరిపూర్ణ అమృతతుల్యమైన స్థితిని నా అంతటనేను నా ఇష్టమైనప్పుడు అనుభవించగల్గిన శక్తినే పొందియున్న అద్దానిని క్షణములో కోట్యంశమైనను మరువ కుండ నిరంతరము ఈ నామరూపములను, ఆశ్రమములను, సర్వము మరచి ఆ బ్రహ్మానందములో మునిగియుండెడి వాడనేగదా ! కాని ఆ నిర్వికల్పస్థితి ఏ కారణము చేతనో నిరంతరము అనుభవించగల్గిన స్థితి నాకు లభింపలేదు. అది తాళము వేసిన ఇనుపపెట్టెలో దాచబడినట్లు నానుండి దాచబడినది.

ఈ మధ్య ఎచ్చట ఆ మహాసమాధిని అనుభవించితినో ఆ తావునందే చాల సార్లు వెళ్ళి ప్రయత్నించితిని, తాళముచెవి చేతులో లేనపుడు ఇనుపపెట్టె యొద్ద ఎంతసేపు కూర్చున్న ఏమిలాభము, ఆశ్రమ సంబంధమైనవి, లోకసంబంధమైన వియునగు పాశములు, మతము పేరున నైననేమి, దైవము పేరున నైననేమి అనుభవించవలసిన ప్రారబ్ధముండ వాని ననుభవింపక తప్పదుగదా !

ఇప్పుడు, ఈ రోజులలో అన్ని ప్రయత్నములను, వివిధ సాధనలను మాని 'నిర్హేతుక జాయమాన కరుణా కటాక్షుండవగు ఓ జ్ఞానాందమయ స్వరూపా! నాయిచ్ఛ గాదు' నీయిచ్ఛయే. నీ సంకల్పమే నెరవేరనిమ్ము." అనుచు ఆ సచ్చిదానంద స్వరూపుం డైన ఆ పరిపూర్ణుని నిరంతరము గుర్తించుచు పరిపూర్ణముగా నుండుటకు కోరుచుం టిని, కోరుచుంటినని వ్రాయనేల ?

కోరికయే బంధముగదా ! సంకల్పమాత్ర సంభవమే బంధము, సంకల్పించి నను, ఏ చిన్నిఆలోచన, కోరికవచ్చినను బంధము కలుగుచున్నదని మహనీయులు నుడివియుండిరి. ఆ పరిపూర్ణమునకు ధన్యవాదములు. అద్దానిని ఆ సద్వస్తువును ఆ పరిపూర్ణమును గుర్తించి నిశ్శబ్దముగా నుండుము.

హరిఃఓం

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవా వశిష్యతే ॥

తా. సమస్తము పరిపరిపూర్ణమైన బ్రహ్మమే. ఒక పాదమునుండి పూర్ణముగా నున్నట్లు కనపడుచున్న మాయాకార్యమైన జగత్తు నతిక్రమించుచు బ్రహ్మము పూర్ణ ముగ నున్నది. ఉపాధులు నశింపగ కూటస్థచైతన్యమే పరిపూర్ణబ్రహ్మమై శేషించు చున్నది.

హరిః ఓం తత్సత్ ఓం

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

( 4-6-54 )

- ఈ విశ్వములో విరోధులుకాని, దూషించువారుకాని, హింసించువారు కాని ఎవరును గోచరించుట లేదు. ఏలయన, వారందరూ దైవస్వరూపులే.
- శాశ్వతమైనది, అనంతమైనది, దేశకాల నిమిత్తములకు అతీతమైనది, స్వయం ప్రకాశము, మిక్కిలి కాంతివంతము అయిన తేజస్సును నేనే అయి ఉన్నాను.
- జాగ్రదవస్థయందేగాక, స్వప్న సుషుప్త్యావస్థల యందు కూడ ఏ జ్యోతిర్మయుడు ప్రపంచమునకు సాక్షీభూతుడుగా నున్నాడో, ఆ జ్యోతిర్మయుడే ఈ ప్రకృతి యందంతటను మౌనసాక్షిగా ప్రకాశించుచున్నాడు.
- భగవంతుని శాంతి, ప్రేమ,తేజస్సు అనెడి శక్తి దేహమును ఆక్రమించియున్న పుడు భయముతోడను, ఆత్మరక్షణతోను కూడిన తాను అనెడి పూర్వదశ అంతరించును.
- ఓ బిడ్డా ప్రేమకొరకే భగవంతుని ప్రేమించుట నేర్చుకొనుడు. ప్రతి పనియు ఆయన కొరకే. ఇతర మంతయు అల్లకల్లోలము, అంధకారము, మృత్యువు.

# 37. దైవమును మరుచుట కెంతకాలము పట్టును ?

తరచు నేను వ్రాయు వ్యాసముల పేరులే విపరీతముగా నున్నట్లు తోచుచుం డును. ఈ మధ్యశాంతి పత్రికలో "దైవమును పొందుట కెంతకాలము పట్టును?" అనెడి వ్యాసము అచ్చుపడి యుండెను. ఆ వ్యాసమునకు, ఈ వ్యాసమునకు కొంత సంబంధము కలదు. దైవమును పొందుట కెంతకాలము పట్టునో గ్రహించినచో, దైవమును మరచుట కెంతకాలము పట్టునో గూడ తెలిసికొనవచ్చును. విపరీతముగా తోచుచున్న ఈ విచిత్రమైన సమస్యను విపులముగా తెలిసికొనుటకు ముందు దైవము నకును, మనకునుగల అవినాభావ సంబంధమును తెలిసికొనుట ముఖ్యావసరము.

మననుండి దైవము వేరుగా,దూరముగా, ఏ స్వర్గములోనో యుండెననెడి భావన గలవారికి–స్వర్గమెక్కడో దూరముగా నుండునుగాన, ఆ దైవముననుభవించు టకు చాలకాలము పట్టవచ్చునను కొనువారికి దైవమును మరచుట కెంతకాలము పట్టు ననెడి ప్రశ్నయే లేదుగదా !

ఒక ఉదాహరణము.

మనకు అత్యవసరమైన వస్తువైనను, అది మనకు అందుబాటులో లేనంత దూరములో నున్నదని తెలిసినవారికి, అది ఎంత ప్రియమైన వస్తువైనను, దానిని మరచుటకెంత కాలము పట్టును? అందుబాటులో లేని వస్తువున కాశించిన ఫల మేమి? కావున దానిని త్వరలోనే మరచిపోయెదరు.

ఇక దైవముతనలోనే యుండెననియు, ఆ దివ్యశక్తివలననే మనలోని ప్రతి కదలిక జరుగుచున్నదనియు గ్రహించిన వారికి దైవమును పొందుటకెంతకాలము పట్టును? ఇక తానె దైవము–దైవమే తాను. ఉన్నదొక్కటే అనెడి అద్వైతానుభవము గలిగియున్నవారికి, దైవము ననుభవించుటకు కాలపరిమితి యొక్క నిర్ణయ మనవస రము. అట్టి అనుభవజ్ఞులకు పొందుట, మరచుట యను భేదమే యుండదు. అద్వైతవేదాంతులు, దైవమును ఇప్పుడు, ఇచ్చటనే అననేల ? సర్వకాల సర్వావస్థల యందును ఆ దివ్యతేజస్సును అనుభవించుచున్నారు.

ఇక యిప్పుడు దైవమును మరచుట కెంతకాలము పట్టుననెడి ఈ సమస్యను విమర్శింతము, మీరు కోరుచున్న దైవము ఏగుడిలోనో, గోపురములోనో, కొండ మీదనో యుండెనన్న బేధభావన, భ్రమలో నున్నవారికి, వారి నిత్యజీవితములలో దైవమును ఎంతకాలము మరచినదియు గుర్తుండదు. నిద్రలో, ఆహార, విహార, వినోదములలో మరచెదరు. ఆ ప్రాపంచిక సుఖానందములలో దైవమును మరచి ఎంతకాలమైనదియు కాలప్రసక్తియే యుండదు.

మరల మనస్సులకు తీరని క్లేశము సంభవించినప్పుడు, శరీరము రోగమునకు గురియైనప్పుడు మాత్రము, తమ నుండి వేరుగా నున్నట్లు భావించి ఎంతయో కాలముగా మరచిపోయిన దైవమును హఠాత్తుగా జ్ఞప్తికి తెచ్చుకొని, అపరాధముగా

లెంపలు వేసికొని మరల ఆపదమ్రొక్కులు మ్రొక్కెదరు. అట్టివారికి దైవమును మరచుట కెంతకాలము పట్టుననను ప్రశ్నయే యుండదుగదా! అంతేగాదు, కించిత్ జ్ఞానము కలవారు వారి దినచర్యలోను, వారి కోపతాపములలోను, చింతలు, అవస్థలలోను, దైవమును మరచుచున్నట్లే బాధపడుచున్నారు. గాని కామ,క్రోధ,లోభ, మోహ,మద,మాత్సర్యములకు నిరంతరము బానిసలేయై యున్నచోట దైవమును మరుగు పడుచున్నాడనియే మనము చెప్పవలసియున్నది.

ఇక దైవశక్తిని మరచుట అసాధ్యమనెడి సమస్యను విపులముగా బోధపరచుకొనుటకు, ఈ సృష్టికి ఆధారమై, మనకు ప్రత్యక్షముగా కానవచ్చుచున్న ఈ పంచభూతముల ప్రాముఖ్యమును గూర్చి విమర్శింతము.

పృధ్వి : మన ప్రతి అడుగునకు ఆధారమై, మంచిచెడ్డల విచక్షణ లేక సర్వశక్తులను భరించుచున్న క్షమాభరితయగు భూమిని మరువగలమా ?

జలము : సర్వ జీవకోటికి పిపాసానివృత్త్యార్థమై, భూమిని సస్యశ్యామల మొనర్చుటలో భాగమైన జలశక్తిని మరువగలమా ?

తేజస్సు : ప్రపంచమున కంతకు ఆధారభూతమైన తన దివ్యతేజస్సును, సూర్యభగవానుని ద్వారా ప్రకటితము చేయుచు, సర్వ జీవరాసులను అంధ తమస్సునుండి మేల్కొల్పుచు, కాలమును నియమించుచున్న ఆ దివ్య తేజస్సును మరువగలమా?

అహం వైశ్వానరోభూత్వా ప్రాణినాం దేహమాశ్రితః

ప్రాణాపానసమాయుక్తః పచామ్యన్నం చతుర్విధమ్ ॥ భ.గీ. XV–14

అని శ్రీకృష్ణభగవానుడు సెలవిచ్చినట్లు ప్రాణికోట్ల ఉనికికి ఆధారమైన, ఆ తేజోశక్తికి నమోవాకములు.

వాయువు :

ఈ సృష్టిలో ఉద్భవించిన ప్రతి ప్రాణికి – ఉచ్ఛ్వాస నిశ్వాసల రూపమున, ప్రాణరక్షణచేయుచున్న వాయువును మరువ గలమా ?

ఆకాశము :

ఆంతర్యమున, బాహ్యమున, జాగ్రత్, స్వప్న, సుషుప్తి అవస్థలలోను మనము ఆకాశముచే ఆవరింపబడి యుంటిమి, గాన ఆకాశమునుండి వేరుగానుండుట లేదు, అట్టి ఆకాశమును మరువ గలమా ?

పై నామరూపములతో గూడియుండి మన అంతఃబాహ్య చక్షువులకు ప్రత్యక్ష ప్రమాణముగా కన్పించుచున్న ఈ పంచభూతములను మరచుటయే దుర్లభమైయుండ, ఇక నామరూప రహితమై–ఈ పంచభూతముల ద్వారా సర్వ సృష్టియొక్క ఉనికికి ఆధారమైన ఆ సర్వశక్తి సంపన్నుడు. సర్వజ్ఞుండు, సర్వాంతర్యామియైన దైవశక్తిని మరచుట ఎటులను ? తన్ను తాను ఎటుల మరువగలడు ? "ప్రజ్ఞానం

బ్రహ్మ” ప్రజ్ఞయే తెలివి, తనలో ఆలోచించుచున్నదియే తెలివి. అదియే ప్రజ్ఞ.

ఆద్యంతములు లేనిది, అద్వితీయమైనది, పరిపూర్ణమైనది, సర్వత్రా నిండి యున్నది, సర్వహృదయ నివాసిగా, బ్రహ్మాదిపిపీలిక పర్యంతం వ్యాపించియున్న దాని నెవ్వరు మరువగలరు ?

సూర్యకాంతిలో జీవించుచు, సూర్యుని మరచుట కెంతకాలము పట్టుననెడిదియే, దైవమును మరచుట కెంత కాలము పట్టుననుటకు కూడ వర్తించును.

సర్వసాక్షిస్వరూపుండై, ఆంతర్యమున, బాహ్యమున, పరిపూర్ణముగా నిండి, భక్తుల హృదయములలో ప్రజ్ఞగా, తెలివిగా నిరంతరము ప్రకాశించుచున్న ఆ సచ్చి దానంద స్వరూపునకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

( 28-3-54 ఉదయం 7-00 )

- జ్ఞాని స్తుతులకు, నిందలకు అతీతుడుగా నుండవలయును. విచారమును సంతోషముతోను, చెడును మంచి చేతను జయించవలయును. అట్టి వారికే శాంతి లభించును.
- సర్వము మనలోపల నుండియే వచ్చును. చరమ ముక్తిని లేక అనంతశాంతిని పొందుటకు వ్యక్తమగు ప్రతి వస్తువు, బ్రహ్మాండమగు అంతరంగమున లీనము కానీయవలయును.

# 38. జీవితము యొక్క విలువ

దుర్లభమైన మానవజన్మ యొక్క ఆధిక్యమును విలువను గ్రహించిన వారే కాలము యొక్క విలువను గూడ గ్రహించగలరు. నా కాలము చాలా విలువైనదని, తరచుగ విలువైన కాలమును మాటలలో వ్యర్థము చేయుచున్న వారితో చెప్పుచుం దును. నా కాలమే అననేల, మీ కాలము మాత్రము విలువైనది కాదా ?

జంతుజాలమునకు కాలముయొక్క విలువ తెలియకున్నను, పూర్వజన్మ సుకృతముచే మానవజన్మను పొందిన మానవులకైనను కాలము యొక్క విలువతెలియ కుండ క్షణములు, నిమిషములేగాక రోజులు, వారములు, నెలలు, సంవత్సరములు గూడ వ్యర్థమైన ఆలోచనలతో నిరుపయోగమైన మాటలతో వృథాయగుచుండుట చాల విచారమైన అంశము గదా.

ఈ మధ్యను కొందరు స్త్రీలు విలువైన వస్తువులతో తమ్మలంకరించుకొని ఆశ్రమమునకు వచ్చిరి. మీరు ప్రార్థనచేయుచుంటిరా యని యడుగగా వారు లేదనిరి. వారి ఒడిలోనున్న పిల్లల అవస్థను, భావిస్థితిని ఆలోచించగా నాకు చింత గలిగెను. "తండ్రి హరి చేరుమని యెడి తండ్రి తండ్రి" యని భాగవతము చెప్పు చున్నది. తమ బిడ్డలను దైవోన్ముఖులనుగా చేయువారే నిజమైన తల్లిదండ్రులు, తాము ప్రేమించెడి తమపిల్లల గురించియైనను, తాము ప్రార్థన చేయుచు, తమ పిల్లలచే ప్రార్థన చేయించవలసిన బాధ్యత తల్లిదండ్రులకు లేదా ?

నోరులేని మూగజంతువులు ప్రార్థన చేయుటలేదనిన ఆశ్చర్యములేదు. నోరు కలిగియుండియు, అన్ని జన్మలలో ఉత్తమమైన నరజన్మను పొందిన మానవులు గూడ ప్రార్థనచేయుట లేదనిన అట్టివారినేమనవలెనో? అట్టివారినే రెండుకాళ్ళ జంతువులని విజ్ఞులు నుడివియుండిరి. అమూల్యమైన జీవితములను, ప్రార్థన ధ్యానాదులు చేయుచు తరించుటకు బదులు-గమ్యస్థానమును మరచి జంతువులవలె కాలమును వ్యర్థమును చేయరాదు! ఇట్టివారిని గురించియే భాగవతములో ఈ చక్కనైన క్రింది పద్యము చెప్పబడెను.

గీ॥ చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తినుడువడేని
దయయు సత్యంబు లోనుగా దలంపడేని
కలుగం నేటికిందల్లుల కడుపుచేటు.

"క్షణములను వ్యర్థముచేయువారు జీవితమునంతను వ్యర్థముచేయుదురు" అని మన ఆశ్రమములో చాల చోట్ల వ్రాయబడి యున్నది. ఈ చిన్న వాక్యములో ఎంత గంభీరమైన భావముగలదు; యిట్టి మహావాక్యములను సదా చదివిన, స్మరిం చిన కొంత ఉపయోగము కలుగుటయేగాక, కాలము యొక్క విలువగూడ గ్రహింప నగును.

జరిగిన దానికి విచారించిన లాభములేదు. ఇదివరకు వ్యర్థపుచ్చిన కాలము మనమెంత విచారించినను మరలరాదు. ప్రస్తుతము అమూల్యమైన క్షణములను వ్యర్ధపుచ్చకుండ సద్వినియోగము చేయుడు. ఒలికిపోయిన పాలకై విచారింపక, ఇక ముందైనను పాలనొలికిపోకుండ అనగా-కాలమును వ్యర్థముకానీకుండ సదా ఎన్నిపనులలో నున్నను దైవనామస్మరణ చేయుచు, దినదినాభివృద్ధిని గాంచుచు-దీపము ఆరిపోకమునుపే తరించుటకు అహర్నిశలు ప్రయత్నము చేయవలెను.

"నేడే మనది రేపు మనదికాదు" అని మరియొక వాక్యము ఆశ్రమములో వ్రాయబడి యున్నది. నేడు మనదని ఎట్లు చెప్పగలము ? ఏక్షణమున ఏమి జరుగ నున్నదో మనము చెప్పజాలము గదా ! మృత్యువు మనతో చెప్పియైనను రాదుకదా! కాన ఈక్షణమే మనదని చెప్పవలెను. మానవుని పుణ్యపాపములు మాత్రమతడు చనిపోయిన నతనిని వెంబడించును. కొదువ ఆస్తులన్నిటిని, వస్తువాహనము లన్నిటిని, సిరిసంపదలన్నిటి నిచ్చటనే అనగా ఈ లోకమునందే, యెచ్చటనున్న వాని నచ్చటనే వదలి పెట్టవలసి యుండును. ఎంత లుబ్ధుడైనను మొలనున్న మొలత్రాటినైనను తనవెంట తీసికొని పోజాలడు." అట్టి స్థితిలో తెలివిగల స్త్రీ పురుషాదులందరును అతి ఉత్కృష్టమైన తమ మానవజన్మయొక్క ఆధిక్యమును గ్రహించి ఏదినిత్యమో, సత్యమో, శాశ్వతమో, దేనిని తమ వెంటతీసికొని వెళ్ళగలరో, ఏది శరీరము విడిచినను తమవెంట ననుసరించునో-అద్దానినే, దైవనామామృత మునే, నిరంతరము ప్రార్థన, ధ్యానాదులు చేయుచు గ్రోలుచుండవలెను. ఈ వ్యాసము చదివిన జ్ఞాపకార్ధముగా శాంతిప్రార్థనను వల్లించి సదాస్మరించుచు తరించుడు.

దైవము మీ అందరిని ఆయురారోగ్యములతో నిరంతరము బ్రోచుగాక.

లోకాసమస్తా స్సుఖినోభవంతు.

హరిః ఓం తత్ సత్ ఓం

( 22-10-54 )

ఉదయం 6-00

- సర్వము మనలోపల నుండియే వచ్చును. చరమముక్తిని లేక అనంతశాంతిని పొందుటకు వ్యక్తమగు ప్రతి వస్తువు, బ్రహ్మాండమగు అంతరంగమున లీనము కానీయవలయును.
- ప్రతిక్షణము అమూల్యము. అంతర్జ్యోతి యందు (మనస్సు) లగ్నమైయున్న కాలములో క్షణమైనను వృథా అగుటలేదు.
- ఎవరైనను నిన్ను చంపుటకు రెండు చేతులను నీ మెడకు చుట్టి నులిమిననూ, వాని యందు (ద్వేషముంచక) భగవంతుని మాత్రమే చూడవలయును.

# 39. వ్రణము

ఆశ్రమములో ఈ మధ్యను ఒకవ్యక్తి కంటిమీద కురుపువేసెనని చెప్పెను. అప్పుడు నేను వ్రణము మీద వ్రణము వేయుట ఆశ్చర్యము కాదంటిని.

వ్రణము మీద వ్రణము ఏమిటందురా ? ఈ శరీరమే ఒక పెద్ద వ్రణము వంటిదనియు, దాని మీద అప్పుడప్పుడు చిన్న చిన్న వ్రణములు, వేడిచేతనో, లేక మలిన పదార్ధము చేరుటచేతనో లేచుచుండవచ్చు నంటిని.

చిన్న గజ్జిపుండు మొదలు, పెద్ద రాచపుండు వరకు ఎన్నో విధములైన మహా వ్రణములకు ఈ శరీరము నిలయమై యున్నది గదా ?

కొందరు మహనీయులు ఈ శరీరమును దేవాలయమని చెప్పియుండ, దీనిని వ్రణముగా భావింపనేల ? అని ప్రశ్నింపవచ్చును. యోగులకు దేవాలయమై యుండ వచ్చును. భోగులకు స్వర్గమై యుండవచ్చును. విరాగులకు కర్మభూమిగా నుండ వచ్చును. కాని విమర్శించి చూచిన వ్రణములో నుండెడి చీము, రక్తము మొదలైన మలిన పదార్ధములన్నియు, ఈ శరీరమనెడి పెద్దవ్రణములో నున్నవి. బాహ్యావ్రణముల కంటె ఈ శరీరమనెడి పెద్ద వ్రణము ఏహ్యమైనదేగాక చాల హానికరమైనదని నా అభిప్రాయము.

ఏలయన మామూలు వ్రణములలో చీము, నెత్తురులే యుండును. అవి కడిగి శుభ్రముచేయుచు పుండు మాన్పుటకు సాధ్యమగును. కాని ఈ పెద్ద వ్రణములో శ్లేష్మము, మలము మొదలగు మలిన పదార్ధములేగాక అత్యంత హానికరమైన కామ, క్రోధ,లోభ,మోహ,మద, మాత్సర్యములనెడి తామస గుణములన్నియు అణువణువున నిత్య నూతనముగ మొలకలెత్తుచు (ఎంత సాధకులకైనను) వానిని మొదలంట తీసి పారవేసి శరీరమను వ్రణమును శుభ్రముచేయుట చాలవరకు సాధ్యము కాదనియే చెప్పవలసియున్నది. కావున జ్ఞానదృష్టి కలవారైనను ఈ శరీరమును వ్రణములలో పెద్ద వ్రణముగ భావించి, దీని విషయములో అతి జాగ్రత్తగ నుండవలసి యున్నది.

ఇట్టి వ్రణమునే సర్వముగ భావించుకొనుచు జీవించెడి వారితో లోకమంతయు నిండియున్నది. ఈ వ్రణమును తోముటకు, కడిగి శుభ్రముగా నుంచుటకు నెన్నో రకముల సబ్బులు, వివిధములైన స్నోలు, వాసన నూనెలు, రకరకముల కాస్మెటిక్సు, ఫేస్ పౌడర్లు వాడుచున్నారు. వాటితో ఈ వ్రణమును పూజించుచున్నవారి జీవితముల గురించి విచారించవలసి యున్నది. హిమాలయ ప్రాంతాలలో ఒక యోగి పుంగవు నికి వ్రణము మీద వ్రణము వేయగా, ఆ వ్రణము నుండి చిన్న పురుగులు క్రింద పడిపోవుచుండగ "మీరు చనిపోవుచున్నారా"? అనుచు మరల వానిని తన శరీర వ్రణమునందే యుంచెడి వాడని చదివియుంటిమి అట్టి మహనీయులే శరీరమును వ్రణముగ భావించిన ధన్యజీవులు.

పాశ్చాత్య దేశములలో కూడ దేహిని పూజించుట కంటె దేహమును పూజించుటయే నిరంతరము జరుగుచుండును. ఈ మధ్య ఒక గొప్పతత్త్వవేత్త How to live for ever ? (శాశ్వతముగ జీవించుటఎటులను?) అను ఒక పుస్తకమును వ్రాసెను. ఈ వ్రణమును పట్టుకొని ఎప్పటికిని జీవింపకోరుచున్న వారందరును ఆ పుస్తకమును చదువుచు చాల ఆనందమును పొందుచుండిరి.

ఆ పుస్తకమును వ్రాసిన గ్రంథకర్తయొక్క తండ్రి చనిపోయెను. తాత చని పోయెను. ముత్తాత చనిపోయెను. ఆయన కుటుంబములో కూడ చాలమంది ఇంత వరకు చనిపోయిరి. అయినను ఈయన చనిపోవనసరములేదు. ఈ శరీరము సృష్ట్యంత్యము దాక గూడ దాచుకొనవచ్చునని వ్రాయుట చాల విచిత్రముగ, విపరీత ముగ నుండెను. పంచభూతములతో మిళితమైయున్న యీ మట్టి దేహము శాశ్వత ముగా నుండునన్న ప్రకృతి విరుద్ధముగదా ! నూరు సంవత్సరములుండెడివి స్వాభావిక మైన సాత్విక జీవితములేగదా ! యోగాభ్యాసము చేతను గూడ మరికొన్ని సంవత్సర ములు జీవించెడి లాగున చేయవచ్చును. హిమాలయ ప్రాంతములలో గూడ యోగులు రెండువందలు, మూడువందల సంవత్సరములు జీవించుచున్న వారు గలరని కొందరు చెప్పుచుందురు.

కొన్ని వందల సంవత్సరములకైనను పుట్టినది గిట్టక తప్పదు గదా ! తాత్కాలిక ముగ వచ్చినది ఎప్పటికైనను వెళ్ళిపోవలెనుగదా ! పుట్టుక ఉన్నదానికి చావు, చావు ఉన్నదానికి పుట్టుక తప్పదు.

చావు పుట్టుకలు లేనిది, వృద్ధినాశములు లేనిది ఒక్కటే గలదు. అదియే ఆత్మ. ఆత్మాను సంధానపరులు, బ్రహ్మ విదులైన వారికి ఈ శరీరమును పూజించవలెననెడి మోహము గాని, దీనిని విడువవలెననెడి దుఃఖముగాని ఉండదట అట్టివారే

కల్పపర్యంత ముండుగాక దేహ మిప్పుడే పోవుగాక

వృద్ధి నాశములు లేక వెలుంగుచుండెడి చిన్మాత్ర నేను.

అని కీర్తించి యుండిరి. కనుక ఈ నామరూపములను మరచి ఎప్పటికిని శాశ్వతముగ ఈ 5,6 అడుగుల మట్టి ముద్దలోనే బంధింపబడి యుండవలెననెడు వాంఛను విడిచి నామరూప రహితమైన ఆంతర్య జ్యోతిని స్వస్వరూపానుభవము ననుభవించెడి వారి జీవితములే పరమోత్కృష్టమైనవి.

ఇట్లు వ్రాయుచుంటినని–ఇది వ్రణము వంటిదేగదాయని యెవ్వరును సోమరి తనముచే నిత్యము చేయవలసిన స్నానపానాదులు చేయుటయందును, ఆరోగ్య సూత్రములను పాటించుటయందును విముఖులై యుండరాదు.

శరీరమునకు అశుభ్రతచే సంభవించెడి కొన్ని వ్రణముల వలన అంటు వ్యాధులు వ్యాపించునని వైద్యవేత్తలు చెప్పుచుందురు. గాన వ్రణమును ఎట్లు లోషనుతో కడిగి శుభ్రముగా నుంచవలెనో అట్లే ఈ శరీర వ్రణమును గూడ కామ

క్రోధాది క్రిములనెడి మురికిని చేరనీయక వానికి ఎంత దూరముగా నున్న ఆధ్యాత్మి కాభివృద్ధికి అంత సహాయమగు స్నానసుష్టానములతో మనస్సు శరీరమును శుచిగా శుభ్రతగా నుంచుట గూడ చాలముఖ్యము.

విశ్వమంతటిలో అన్ని ప్రణములకు ఆధారభూతుడై, విశ్వదేహిగ, సర్వసాక్షి స్వరూపముగా ప్రకాశించుచున్న అసచ్చిదానంద స్వరూపమునకు, దేహవాసనను జయించి, దేహిని నిరంతరము సేవించెడి మహనీయులకు ధన్యవాదములు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 27-3-55 )

ఉదయం 5-00

- దివ్యశక్తి స్వశక్తిలోనే ఉన్నదని గ్రహించిన మానవుడు అదియే సర్వత్ర వ్యాపించి యున్న ఆత్మ (శక్తి) యని తెలుసుకొనుము.
- నీవు ఆత్మశక్తియుతుడవై ఉన్నావు కనుక జీవితములో ఒడుదుడుకులు ఎన్ని వచ్చినను, ఎల్లప్పుడు సాక్షీభూతుడవు మాత్రమే అగుచున్నావు.

# 40. అజాత వాదము

నిన్నటి దినము శ్రీవారము ఉపవాసదినమేగాక మౌనదినముగూడను. కైలాస ములో శాంతిగ గడిపితిని. ఉపవాసము పేరున అష్టావక్రగీత అంతయు మొదటి శ్లోకమునుండి చివరిశ్లోకము వరకు చదువవలెనని సంకల్పించి అటులనే దినమం తయు ధ్యానము చేయుచు మధ్య మధ్య మనసునకు చదువవలెనని బుద్ధిపుట్టినపుడు ఒక్కొక్క అధ్యాయమును చదువుచు సాయంసమయమునకు పూర్తి చేసితిని.

అష్టావక్రగీత యొక్క పారాయణ మెన్ని మార్లయినను చేయవచ్చునుగాని, దాని సారమును అనుభవించుట దుర్లభముగదా ! పరిపూర్ణమైన అనుష్ఠానాద్వైతమే అష్టావక్రగీతయొక్క సారాంశము. అష్టావక్రముని జనకునకు సాధన సంపత్తు సమాధి షట్కము మొదలగు ఆచరణయోగ్యమైన ఉపదేశములన్నియు బోధించి చివరకు తన గీతను అజాతవాదముతో ముగించెను.

అష్టావక్రుడే జనకునకు సమాధిస్థితిని, గుర్రపురికాబులో ఒక కాలు పెట్టి రెండవ కాలు గుర్రము మీద వేయునంత అల్పకాలములో తెలియపరచెదనని చెప్పుటే గాక, సమాధిని అపరోక్షముగ రుచిచూపించెను. ఇది వ్యవహారికముగ సమాధిస్థితి అనెడి దొక్కటి యున్నదని తెలియపరచుటకు చెప్పబడియుండ వచ్చును. కాని అజాత వాదములో పరమాత్మ తప్ప మరేదియు ఎన్నడునులేదు. నీవు, నేను అందరు లోకమంతయు మిథ్యయేనట. ఇవన్నియు మనోవికారములే. కేవలము సంకల్పము చేతనే వచ్చినవట. సంకల్పములేకున్న ఏ సృష్టియును లేదు. ఇక మాయ యొక్క ప్రభావమందుమా ! మాయయున్నదని నీవు అంగీకరించినచో ఒకే ఆత్మలో అద్వితీయ మైన స్వరూపములో మాయ ఎచ్చటనున్నది? నీవెప్పుడును బంధింపబడి యుండ లేదు. నీవు నిరంతర ముక్తుడవు గాన నీవు ముక్తికై ఇప్పుడు ప్రయత్నించునవసరము లేదు. సంకల్పమే బంధనమును, మోక్షమును కల్గించుచున్నది. అజాత వాదము సంకల్పనకు అతీతముగా నున్నది.

ఆహా ! అజాత వాదమెంత ఆహ్లాదకరముగా నున్నది? ఇక ప్రార్థనలు, ధ్యాన ములు, ఆసన, ప్రాణాయామములు, యోగాభ్యాసములు, ముద్రలు, మూలబంధము లును అవసరములేదు. సర్వము ఆత్మయే. అదియే అనాది నుండియు పరిపూర్ణమై స్వతంత్రము (స్వేచ్ఛ)గా నున్నది.దానిని తెలిసికొనుటయు, బోధపరచుకొనుట, గుర్తించుటే అజాతవాదము.

దానిని ఎవరు తెలిసికొందురు? ఎవ్వరు దేనిని గుర్తించెదరు? ఈ ప్రశ్నలు మరల సంకల్పమనెడి వలలో చిక్కియున్నవి. గాన ఈ సంకల్పము అనెడి వలకు అజాతవాదుడు అతీతుడుగ నుండును. ఈ స్థితినే బోధపరచుటకు వేదములు కేవలం 'మోక్షాపేక్షో బంధః' అని నుడివియున్నవి. చివరకు ముక్తి కావలెనని కోరుటకూడ బంధమేయట. ఇక చేయునది ఏమి ? మొద్దువలె నిస్పృహగా నుండుటయేనా?

కాదు కాదు. జడ భరతునివలె చైతన్యముతో నిండి సంకల్పరహితుడుగ ప్రకాశించుట. ఈ అజాతవాదములతో ఉదయమే మేల్కాంచితిని. ఒకబల్లి 'నమస్తే' అని పలుక నారంభించినది. ఒక పక్షి మేల్కొల్పు పాడనారంభించెను. సముద్రము ప్రణవగాన ముతో ఉప్పొంగు చుండెను. వాయువు తన శక్తినంతటితో శాంతిగీతికల నాలాపించు చుండెను. అజాతవాద దృష్టితో చూచినవన్నియు మనోసంకల్పములే గదా! మనో సంకల్పములనుడు, మనో వికారములనుడు, ఏవియైన నేమి ?

ఒక చిన్న సంఘటన ఉదయమే జరిగెను. తలుపు గొళ్ళెము తీయుచుండగ కుడిచేతి రెండవవ్రేలు గొళ్ళెములోబడి చిన్నకన్నముపడి రక్తము స్రవించసాగెను. అప్పుడు ఈ స్థితిగూడ అజాతవాదమంటిని. ఏ అజాతవాదము యొక్క భావనమున నున్నను రక్తము ఆగకుండకారుట కన్పించుచునే యుండెను. అజాతవాదునకు జగము మిథ్య అనువానికి, తనకంటె అనగా ఆత్మకంటె ఇతర మేదియు ఎన్నడును ఎచ్చటను లేదను ఆరూఢునకు గూడ నిట్టి కఠినపరీక్ష యుండి యుండునుగదా!

ఈ పరీక్షలన్నింటిలో జయముగ నెగ్గినపుడె అజాతవాదము స్థిరమగుచున్నది. నరుడు నారాయణుడే అని, జీవుడు సనాతనము నుండియు దైవమే అనియు, తన కంటె భిన్నమైనదేదియు లేదనియు అనుభవముగా గ్రహించవలెను.

అజాతవాదనతో నిండియుండి ఈ సాయంత్రమంతయు, ఈ రాత్రియంతయు ఎటుల గడుపనుంటివని ఆంతర్యమునుండి ప్రశ్న వచ్చెను. వెంటనే ఆనందముగా దానికి జవాబు "నీవు సత్యస్వరూపుడవు. పరిపూర్ణుడవు. నీవు చేయుటకేమియులేదు. నీకు సాయంత్రములేదు, రాత్రిలేదు, పగలులేదు. వృద్ధిలేదు, నాశములేదు."

ప్రశ్న : మరి ఏమి చేయుట ?

జవాబు : మెదలకుండ నుండుము.

ప్రశ్న : మెదలుట యనునది యున్నదా ?

జవాబు : అదియుగూడ లేదు.

ప్రశ్న : మరేమి యున్నది ?

జవాబు : మరేమియులేదనుట ఎట్లు ? ఆత్మయున్నదందుమా?

ప్రశ్న : అది పరిపూర్ణమైన దందుమా !

జవాబు : అట్టి స్థితినిగూర్చి ఎవరు చెప్పగలరు ? ఎట్లు చెప్పగలరు ? కనుక మౌనముగా నిశ్శబ్దములో అద్వితీయమైన ఆత్మానుసంధానములో లీనమై అజాత వాదులు అమనస్కులై యుందురు. అట్టి బ్రహ్మ విదులకు నా నమస్కృతులు.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు !

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 25-6-56 ఉదయం 5-00 )

# 41. జ్ఞానాగ్ని

'జ్ఞానాగ్ని' అను పై మూడు అక్షరములు అకార, ఉకార మకారములుగ భావించ వచ్చును. ఏలయన ప్రణవము యొక్క సారాంశమంతయు జ్ఞానాగ్ని యందే యిమిడి యున్నది. లేక జ్ఞానాగ్ని అర్థమంతయు ప్రణవమను మూడక్షరముల యందు యిమిడి యున్నది.

ఇక జ్ఞానాగ్ని యనగా నేదియో తేటమాటలతో సామాన్యులు సహితము తెలిసి కొనుటకై వివరింప ప్రయత్నించెదను. మహనీయులు జ్ఞానము అనేక విధములుగ నున్నదని నుడివియుండిరి. అట్టి జ్ఞానమును రెండు విధములుగ విభజింతుము.

1. పరోక్షజ్ఞానము
2. అపరోక్ష జ్ఞానము

వీనినే ఇంకను తేలిక మాటలలో వాచాజ్ఞానమనియు అనుభవ జ్ఞానమనియు చెప్పుకొనవచ్చును. వాచాజ్ఞానము కల్గిన పండితులు వేద వాక్యములను "అహం బ్రహ్మోస్మి" మొదలగు మహా మంత్రములను సదా పఠించుచు వాని గురించి ఉపన్య సించుటలో వారి కాలమును గడుపుదురు. వారు 'అహం' అను రెండక్షరముల మీద మూడు రోజులు ఉపన్యసించగలరు. ఇక 'అస్మి' అను రెండు అక్షరముల మీద అవసరమైన ఒక పక్షము రోజులు ఉపన్యసించెడి శక్తిమంతులైయుందురు. వారి మేధాశక్తి వాక్చాతుర్యము నిరుపమానము.

మాటలు, మాటలు, మాటలు, వట్టిమాటలు, పొల్లుమాటలైనను, గట్టిమాటలు, గంభీరోపన్యాసములైనను మాటలచే 'బ్రహ్మము' లభించునా? మాటలకతీతమైనదే బ్రహ్మమని విజ్ఞులు నుడివియుండిరి. నిండుకుండలు తొణకవట. వట్టిడబ్బాలు చప్పుడు చేయునట. ఇదియే పరోక్ష,అపరోక్ష జ్ఞానములకు ఉదాహరణము.

ఇక వాచాజ్ఞానము ఈ జ్ఞానములో అగ్నికానరాదు. అనుభవము మరుగై యున్నది. ఈ జ్ఞానాగ్నిలో వేడికి బదులు మంచుగడ్డవంటి చల్లదనమున్నది.

ఇక అనుభవమైన అపరోక్షజ్ఞానాగ్నిలో కోటిసూర్య ప్రకాశమైన దివ్యతేజస్సునే గాంచెదము. ఆ దివ్యతేజస్సులో అహంకారము శూన్యమగును. స్వార్థము దగ్ధమై పోవును. సోమరితనము కాలిపోవును. గుణములన్నియు నశించుచున్నవి. జ్ఞానాగ్ని కామ,క్రోధ,లోభ,మోహ,మద, మాత్సర్యములను నామరూపములు లేకుండ దగ్ధము చేయును. అచట గుణరహితమైన దివ్యతేజస్సులో అంతయు నిశ్శబ్దము. "నిశ్శబ్దో బ్రహ్మ".

మానవుడు దైవాంశసంభూతుడై యుండియు, జ్ఞానాగ్నిని తన జన్మహక్కుగ కల్గియుండియు తన నిజస్థితిని (దైవత్వమును) మరచి మోహాంధకారములోపడి భరింపరాని యమయాతనల ననుభవించుచుండుట చాల విచారము. దివ్యతేజస్సు మరుగై యుండుటచే ఆంతర్యమునుండి పవిత్రమైన ప్రేమ,శక్తి, శాంతి ఉత్పన్నము

లగుటకు బదులు పొగ, దుర్బలత్వము, అశాంతియే వెలుగుచుండుట చాల విషాద కరము.

చైతన్యములేని చిన్న భూతఅద్దమును తీసికొని సూర్యుని ఎదుటపెట్టి దాని ముందు దూదినుంచినచో ఆ దూది కాలిపోవుచున్నది. అటులనే సూర్యతేజస్సు ముందు అన్నియు ఉష్ణముగా చేయబడుచున్నవి.

సూర్యుడు చీకటినంతను పారద్రోలి లోకమునంతను తన దివ్యతేజస్సుతో నింపు చుండెను. అట్టి సూర్యులకు ప్రకాశశక్తి నిచ్చుచున్న దైవశక్తిని కల్గియున్న మానవుడో వాచాజ్ఞానిగ, వంటకములలోని తెడ్డువలె (పదార్థములను కలుపుటే గాని దానికి రుచి తెలియదు గదా) చదువులతో, ఒట్టి మాటలతో తృప్తిపొందెడు వారికి గంటలకొలది గ్రంథచర్చలలో తమ యొక్క ఇతరులయొక్క కాలమును వ్యర్థము చేయుచు జీవించెడివారికి దైవము అగోచరుడు, వాచాజ్ఞానమునకు బానిసలై యున్నవారు ఎన్ని రోజులు ఎన్ని బోధలు చేసినను, వినిపించినను భారమే తప్ప ముక్తిలేదు.

అపరోక్షజ్ఞానమునకు సర్వము బ్రహ్మమయమై గానవచ్చును. అచట ఆంతర్య మున, బాహ్యమునగాని బ్రహ్మము తప్ప మరేదియు కానరాదు. జ్ఞానాగ్నిలో అన్నివైపు లను, అంతయు, అందరిలోను తేజస్సే ! జ్ఞానమనే మహాగ్ని అంధకారమనెడి అజ్ఞానమును వెంబడించి మూలమూలల నున్న చీకటిని గూడ పారద్రోలుచున్నది.

ప్రియమైన ఆత్మ సోదరీ సోదరులారా ! మీ పరమపావనమైన హృదయము లందు జ్ఞానాగ్నిని ప్రజ్జ్వలింపచేయుడు. మాయచే ఆవరింపబడియుండి మిమ్ము బంధించుచున్న దుర్బలత్వములనే త్రాళ్ళను జ్ఞానఖడ్గముచే ఛేదించి దైవపరితాపా గ్నిలో మాడ్చివేయుడు. మీవాచాజ్ఞానమును, విజ్ఞానముగా, ప్రవృత్తిని నివృత్తిగా మార్చుకొని తరించ ప్రయత్నించుడు, గతమును మరచి మీ అజ్ఞానమను గాఢనిద్ర నుండి మేల్కొని మీ ఉచ్ఛ్వాస నిశ్వాసలలో ప్రస్ఫుటమగుచున్న దైవశక్తిని అజపగాయత్రి మహామంత్రములో లీనముచేయుడు.

ప్రియపాఠకా ! దైవపిపాసువులకు జ్ఞానపుదారి అత్యంత సులభము, సౌఖ్యము, సూక్ష్మముగూడను. నిరంతరము నీలో వెలుంగుచున్న దివ్యతేజస్సునకు నీ శ్వాసయే వృత్తిగా వెలుంగుచు నీలో జ్ఞానాగ్నికి ఆధారమగుచున్నదను విషయమును మరువ కుము. మహత్తరమైన నీ దివ్య తేజస్సును, శ్వాసను ఒక్కక్షణమైననూ విడువకుము. మరువకుము.

అపరోక్షజ్ఞానము, విజ్ఞానము తేలిక మాటలకు, బుద్ధిబలమునకు లభించునని నిరసన చేయవలదు. శ్రద్ధతో, పట్టుదలతో నీ శ్వాసను వెంబడించిన, నీ శ్వాసయే నిన్ను హృదయమధ్యమున వెలుంగుచున్న జగత్‌జ్యోతి కడకు తీసికొని వెళ్ళి విడు చును. అప్పుడే సోహం భావనలో విలీనమయ్యెదవు. క్షణములో కోట్యంశపు వంతైనను

దానిని మరువకుము. నిరంతర మనన నిధిధ్యాసలతో జీవింపుము. మన మందరము చూచినను, చూడజాలకున్నను లోకమంతయు దివ్య తేజస్సుతో నిండియున్నది. చూడుము, ఏవైపుగాంచినను అంతయు విజ్ఞానమయమైన దివ్యతేజస్సే. ఈ దివ్య తేజస్సును నిరంతరము అనుభవించుచు లోకకళ్యాణమునకు శాంతికి మన పవిత్ర జీవితముల నర్పించి తరించెదము గాక !

ఓం తత్ సత్ ఓం

( 18-10-57 )

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

- ఎవరైతే తేజస్సులలోకెల్ల తేజస్సైన స్వప్రకాశమగు ఆత్మ యొక్క తేజస్సుపై ఆధారపడి యుందురో వారు ఇక బాహ్యసూర్యుని రాక కొరకు ఎదురు చూడ నక్కరలేదు.
- దైవము తప్ప అన్యమును చూచుట దుర్భలత్వము, అజ్ఞానము, ప్రకృతిని ప్రేమించువారు ధన్యులు.
- చేపల పోరాటమునకు భయపడిన సముద్రుని వలెకాక, నీయొక్క ఆత్మశక్తిని వ్యక్తపరచి, అన్నింటికి అతీతుడవై యుండుము.

# 42. దైవానుభవము

దైవానుభవమే మానవుని జీవితమునకు ఆధారము. పరమావధియే గాక గమ్య స్థానము కూడ అదియే. దైవానుభవములేని జీవితము నూనెలేని దీపము వంటిది. అది కేవలము భూమికి భారము. అట్టి వ్యర్థమైన ప్రవృత్తి జన్మలే భాగవతములోని ఈ క్రింది చక్కనైన పద్యమును జ్ఞప్తికి తెచ్చుచుండును.

గీ॥ చేతులారంగ శివుని పూజింపడేని
నోరు నొవ్వంగ హరికీర్తినుడవడేని
దయయు, సత్యంబు, లోనుగా, తలపడేని
కలుగనేటికి తల్లుల కడుపుచేటు.

దైవమును ప్రార్థించునపుడు, ధ్యానము చేయునపుడు, భజన సమయములలో అనుభవించుట సహజమేగాని నిత్యకర్మానుష్ఠానములలో మునింగి యున్నప్పుడు కూడ అనుభవించుట ముఖ్యావసరము.

నేను ఈ వ్యాసము వ్రాయుటకు ముఖ్యకారణము. నాలో ఉద్భవించిన ప్రశ్న. ఈ ప్రశ్న యొక్క విమర్శయే ఈ వ్యాసరూపముగ పరిణమించినది. నా ఆంతర్య భావన, మథన జనిత ఫలితమే ఈ వ్యాసము.

ప్రశ్న : దైవమును ఏపనియు లేనప్పుడు అనుభవించుట, వ్యక్తపరచుట తేలికయా? లేక తాను చేయవలసిన విధికృతమైన పనులలో నున్నప్పుడు వ్యక్తపర చుట సులభమా ?

ఏ పనియు చేయని వాని మెదడులో దయ్యములు నాట్యమాడు చుండునని అనుభవజ్ఞులు నుడివి యుండిరి. సంకల్పరహితులైన, జీవన్ముక్తుల గురించి మన మిచ్చుట విమర్శించుట లేదు. వారు, శరీర, ప్రపంచముల నధిగమనించి మనో నాశముచేసిన మహనీయులు. అట్టి వారి జీవితములు దేశక్షేమమునకు, మానవాభ్యు దయమునకు, లోకశాంతికి ఆదర్శనీయమైనవి. దైవపరితాపము మానవజన్మకు పునాది వంటిది. అట్టి లోతైన పునాదిని గల్గియున్నవారు నిత్యానిత్య వివేకము గల్గి, సాధనచతుష్టయ సంపత్తిని పొంది మోక్షము నెప్పుడోగాక ఇప్పుడే అనుభవించు చున్నారు.

ఆత్మస్వరూపమే దైవము. మనలో ఏకమై, అద్వితీయమై సర్వత్ర నిండియుండి సర్వము తానేయై యుండ ఇక దైవమును మరచుట ఎట్లు ? ఈ హస్తముతో వ్రాయునదెవ్వరు ? ఈ మనసులో నుండి ఆలోచించునదెవరు ? ఆ దివ్యశక్తియే నాలో వ్రాయుచుండెను. మీలో నుండి చదువుచుండెను. దైవము అనాది నుండియు సర్వకాల సర్వావస్థలయందు అప్రమేయుడై, స్వప్రకాశకుడై విలసిల్లుచుండెను. కనుక మనమెప్పుడు ఏ పనిచేయుచున్నను దైవశక్తిచేతనే ఆయాపనులను చేయుచుంటి

మను సత్యమును, గ్రహించవలెను. దైవములేని క్షణముగాని, ఆ శక్తియుండని తావుగాని సూదిమొన మోపుటకైనను ఆంతర్యమునగాని బాహ్యమునగాని లేదు.

తీవ్రమైన దైవపరితాపనవల్ల దైవానుగ్రహము ప్రాప్తించును, ఆ దైవానుభవము కలిగియున్న మహనీయులు పనిలోనైనను పనిలేనప్పుడైనను దైవమునే అనుభవించు చుందురు. ఇక దైవానుభవము లేనట్టి దురదృష్టవంతులు పనిచేయుచున్నను లేకున్నను దైవము ననుభవింపజాలరు. చివరకు అట్టివారు గుడిలో కూర్చుని ప్రార్థన చేయుచున్నను, భజన జరిగెడి తావులందున్నను ఉపన్యాసములు వినుచున్నను వారి చంచలమైన మనస్సులు అస్థిరమైన నామరూపముల గురించియే ఆలోచించు చుండును. కనుక ఆంతర్యమున, బాహ్యమున సర్వకాల సర్వావస్థలయందును కోటి సూర్యప్రభతో వెలుంగుచున్న దైవమును అనుభవముగా స్థిరముచేయుట ముఖ్యావసరము.

ఆ దివ్యానుభవమును అపరోక్షముగా ఎప్పుడు పొందుదుమో అప్పటి నుండియు పనిలోనైనను, ఏ పనియులేని సమయమునందైనను, ఒంటరిగా నున్నను, జనసమ్మర్ధ ములో నున్నను, మాట్లాడుచున్నను, మౌనముగా నున్నను కలిమిలేములందు, నిందా స్తుతులు యందైనను ఇప్పుడప్పుడనక సర్వకాల సర్వావస్థల యందును దైవాను భూతిని సహజముగానే అనుభవించగలము.

గులాబి పుష్పమునకు సువాసననిచ్చుట ఒక పనియా! పక్షికి పాడుట ఒక పనియా! గాలికి వీచుట ఒక పనియా! సూర్యునకు ప్రకాశమిచ్చుట ఒక పనియా! అగ్నిలో వెచ్చదనము, మంచులో చల్లదనము,రాతికి గట్టిదనము సహజముగ దాని యందే యున్నట్లు మానవునిలో దైవత్వము గూడ సహజముగానే యిమిడియున్నది. మానవులు ఈ సత్యమును ఎంతత్వరలో గ్రహించిన అంతత్వరలో తమజన్మ హక్కయిన దైవతేజస్సును ఆంతర్యానుభవమును, బ్రహ్మసాక్షాత్కారమును ప్రార్థన ధ్యానాదులందేగాక తమ నిత్యకృత్యముల నున్నప్పుడైనను ప్రతిక్షణము నందును అప్రయత్నముగ సహజముగానే వ్యక్తపరచుచుందురు.

నేనిప్పుడీ వ్యాసమును ప్రాతఃకాలములో వ్రాయుచుండ వర్షము హోరుగా కురియుచుండెను. ప్రతి వర్షబిందువు శబ్దములో కూడ దైవశక్తియె అనెడి భావనయే ఎంతో ఆనందము నిచ్చుచున్నది. వర్షమును చూచుచుండ "కష్టములు భూమి మీద దైవమిచ్చెడి వర్షపు బిందువులు" అని ఈ మధ్య ఆశ్రమములో బోర్డుమీద వ్రాయబడిన చక్కని వాక్యము జ్ఞాపకము వచ్చుచున్నది. నా స్వభావములో నేను అనుభవించినది నాకు జ్ఞప్తికి వచ్చినది మీ అందరితో పంచుకొనుటయే నాపని. నేను దేనిని గాని మంచిదైనను, చెడ్డదైనను నా హృదయములో దాచజాలను.

ఈశా వాస్య మిదం సర్వం

అంతా రామమయంబీజగమంతా రామమయం. ఈ మధ్యను తరచు ఉత్తరములు వ్యాసములు వ్రాయుచున్నప్పుడు ఫలాహారము తీసికొనుచున్నప్పుడు దైవానుభవముతో నుండి ఆ దివ్యశక్తిని వ్యక్తపరచుట ఎట్టులను ప్రశ్న ఉదయించును.

అప్పుడు సమాధానముగ–నీలో ఆలోచించెడిది దైవమేయైయుండ, ఆ శక్తియే నీ హస్తములలో కదలుచు వ్రాయుచుండ, ఇక దైవమును మరచితినని భ్రమపడనేల? అనిపించును. ఆ దైవ శక్తిలేనిదే నీ నోరే కదలదు. నమలునది, త్రాగెడిది సర్వము ఆ శక్తియే. నీవు తీసికొనెడి ఆహారమును దైవానుభూతితో తీసికొనుచు ఆ శక్తిని శరీరమందంతయు నింపి జీర్ణింపచేసికొనునది, ఆ దివ్యానుభవమునే నీ మనోవాక్కాయ కర్మములలో వ్యక్తపరచెదవుగాక, అని నా మనస్సునకు నేను చెప్పుచుందును.

ప్రియమైన ఆశ్రమ భక్తులారా ! ఈ నా చిన్న ఆధ్యాత్మికానుభవములను మీరు కూడ నిత్య జీవితములలో ఆహార విహార సమయములందు ఇప్పుడప్పుడనక నిరంతరము వ్యక్తపరచెదరుగాక ! మీలో నాలో సర్వత్రా నిండియున్న స్వయంజ్యోతి స్వరూపుడైన దైవమునకు ప్రణమిల్లెదముగాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 20–10–58 )

ఉదయం 6–00

# 43. ప్రాచీన ఋషులు

సంస్కృత విద్య

ఋషులే ఋషుల గురించి వ్రాయసమర్థులు. సంస్కృత విద్య తెలిసినవారు మాత్రమే సంస్కృత విద్య యొక్క ప్రాముఖ్యమును గురించి వ్రాయగలరు. చెప్ప గలరు. రెండును కానివారు అనగా ఋషులుగాక సంస్కృత విద్యా ప్రవేశములేక ప్రాచీన ఋషులగురించి, సంస్కృత విద్యను గురించి వ్రాయుటకు ప్రయత్నించుట హాస్యాస్పదముగ నుండును. కృత, త్రేత, ద్వాపర యుగములలోని ప్రాచీన ఋషులను తలంచిన అట్టి మహనీయులు ఈ కలియుగమున మచ్చునకైననున్నారా! అనిపిం చును. వశిష్ఠ,గౌతమ,యాజ్ఞవల్క్య, జామదగ్ని, దధీచివంటిమహనీయులీ కలియుగ మున ఎచ్చట నున్నారనిపించును.

ఇక సంస్కృత విద్యనుగూడ పూర్వము నలంద, తక్షశిల మొదలైన ప్రాచీన విశ్వవిద్యాలయములలో బోధించుచుండెడివారు. 'విద్య' యనగా ఆత్మ వికాసమును కలిగించెడిది. అది ఒక్క సంస్కృత విద్యయే.

పూర్వము సంస్కృతవిద్యాజ్ఞానములేని వారిని మానవులుగ పరిగణించెడి వారు కాదు. ఇప్పుడీ నవీనకాలములో సంస్కృతవిద్యకు బదులు (హూణవిద్య) ఆంగ్లేయ విద్యకు ప్రాముఖ్యము వచ్చినది. ఆంగ్లేయభాష వచ్చినవాడే మానవుడు, ఆ భాషరానివాడు పశుప్రాయుడుగ నున్నట్లుగూడ నవనాగరిక పరాయణులు భావించె దరు. ఆంగ్లభాషచదువుకొన్న పండితులు ఆ భాషలో గంభీరముగ ఉపన్యసించుచుండ ఆంగ్లేయభాషరాని సంస్కృత పండితుడు నోరుతెరుచుకొని చూచుచుండుట విషాద కరముగ తోచును. కొందరికి ఆంగ్లభాషయే సర్వముగ కానవచ్చును.

అయినను నిజమైన పరిపూర్ణమైన మానవుడు ఎవ్వరనగా ప్రాచీనఋషి అనియే చెప్పవలసియున్నది. ఋషిత్వమనగా సత్యధర్మపరాయణత్వమున వివేక, వైరాగ్యమున శమదమాది షట్కసంపత్తి మొదలైన సాత్విక గుణములతో మూర్తీభవించి యుండుట.

ఈనాడు ఆంగ్లవేషభాషల ననుసరించుచు ఆహారనియమములను గూడ పాటించక ఆంగ్లభాషలో ఉత్తీర్ణులై గొప్పగొప్ప ఉపన్యాసము లిచ్చుచు ప్రజలను స్థంభీభూతులను చేయగలవారే నవీనఋషులుగ, గొప్పతత్త్వవేత్తలుగ పూజింపబడు చున్నారు. పాశ్చాత్య దేశములలో శాస్త్రవేత్తలు ఋషులుగ పరిగణింపబడుచు, అనేక విధములైన మారణాస్త్రములను ప్రపంచమునంతను రూపుమాప కనిపెట్టుచున్నారు.

ప్రాచీనయుగములలో గూడ నిట్టి మారణాస్త్రములు ఋషులచే కనిపెట్టబడి నవి. అవి దుష్టశక్తులను అణచి ధర్మపరులను కాపాడుటకు మాత్రము వారి దివ్య శక్తిని, అస్త్రములను లోకకళ్యాణమునకై సద్వినియోగము చేయుచుండెడివారు.

నాకీ వ్యాసము వ్రాయుచుండ ప్రాచీన ఋషులును, నవీన ఋషులును ఒకచోట సమావేశమైనచో వారివారి ఆంతర్య, బాహ్యశక్తుల పరస్పర సమన్వయమున

ప్రపంచము శాంతిమయమగును గదా యని తోచుచుండును. ప్రాచీన ఋషి సూర్యునివంటివాడు. అతని వికాసము ఆత్మతేజస్సుతో నిండి స్వార్ధరహిత జీవితములతో నిరంతరము లోకక్షేమము కోరుచు స్వప్రకాశమానముగా వెలుగుచుండును.

ఈకాలపు నవీన ఋషుల ప్రకాశము మిణుగురు పురుగు ప్రకాశము వంటిది. వీరి పరోపకారబుద్ధి, విచక్షణా జ్ఞానము హర్షనీయమైనను అవి వ్యావహారిక జీవిత సాధనములుగ పరిగణింపబడుట విచారకరము. బాహ్యపుచదువులు ఎన్ని చదివినను, ఎన్ని డిగ్రీలు పొందినను ఆత్మ జ్ఞానములేని చదువు, గార్దబము మంచి గంధపుచెక్కల బరువు మోయుటనేగాని వాని వాసన గ్రహించనియట్లు ఎన్ని మారణాస్త్రములను కనిపెట్టినను సాధన సంపత్తి, శాంతి, స్వార్ధరహిత ప్రేమ లేకపోవుటచే నవి పృధ్వికే భారములని చెప్పవలసి యున్నది.

అన్ని జన్మలలో మానవజన్మము మహోత్కృష్టమైనదని మన శాస్త్రములు, మహనీయులు చెప్పు చుండిరి. అట్టి దుర్లభమైన మానవజన్మ లభించినందుకు పరోపకారార్ధ మిదం శరీరం' అను సూక్తికి అనుగుణముగ నిత్యము సత్యమార్గముననుసరించి లోకక్షేమమును కోరు ప్రతివ్యక్తియు ప్రాచీన ఋషిసాంప్రదాయము ననుసరించు వాడే అని నా విశ్వాసము. అట్టి ఋషులను ఒక్క హిమాలయముననే, హిందూ దేశముననే బంధింపనవసరములేదు. అట్టివారేదేశమందున్నను ఎట్టి కులస్థులైననూ అందరూ దైవపు బిడ్డలే. ఏలయన సముద్రమునుండి అలలు, సూర్యుని నుండి కిరణములు ఉత్పన్నములై మరల వాని స్థానమునే చేరుచున్నట్లు మానవకోటి యంతయు ఒక దైవశక్తి నుండి ఉత్పన్నమై మరల ఆ శక్తిలోనే విలీనమగుచున్నది.

ఏ విద్య అట్టి జన్మయొక్క గమ్యస్థానము చేరు మార్గము చెప్పుచున్నదో, ఏ విద్య ఆత్మానుభవమును పొందించుటకు సహకరించునో అదియే శాశ్వతమైన శాంతి నొసంగెడు విద్య.

దంభము, దర్పము, కామ,క్రోధ,లోభ,మోహ,మద, మాత్సర్యములను వృద్ధి చేసెడి పొట్టకూటి విద్యలు నిజమైన విద్యలు గావు. అణకువ, శాంతము, సహనము, ఆత్మశక్తిని కలిగించెడు విద్యలు ప్రాచీనములైనను, నవీనములైనను మానవుని పశుత్వ మునుండి దైవత్వమునకు చేర్చెడి ఆత్మ వివేకముతో కూడిన విద్య చదువుట వలన అవియే సత్యమైన పరిపూర్ణమైన విద్యలు. ప్రాచీనఋషులు వారి ఆత్మానుభవములను ప్రపంచములోని ధనము నంతటిని అర్పించినను అమ్మెడివారుగారు. వారు తమ చెంతకు, లోకశాంతిని అర్ధించి వచ్చెడు ధర్మపరాయణులగు ఆనాటి రాజులకు, ప్రజాక్షేమమునకు తమ అమూల్యములగు సలహాల నిచ్చెడివారు. ఈ కాలపు ఋషులు వారి అనుభవములను, వారు కనిపెట్టిన రహస్యములను ధనమునకు, పేరుప్రతిష్ట లుకు నామరూపముల వెంట పరుగెత్తుచు వ్యర్ధము చేయుట విచారము.

అన్యుల కొరకు జీవించెడి ఋషులే ఋషులు. ఇతరుల ఆత్మాభివృద్ధిని కోరెడి విద్యయే నిజమైన విద్య. "ఈశావాస్యమిదం సర్వం." ఈ జగత్తంతయు ఈశ్వర మయముగ చూడ గలిగిన విద్యయే విద్య. ఆత్మజ్ఞానులగు మన ప్రాచీన ఋషుల సంప్రదాయబద్ధమైనది సంస్కృత విద్య. అట్టి సంస్కృత విద్య జయించుగాక !

మన ప్రాచీన ఋషులు అమరులు. మన ప్రాచీన భాష సంస్కృతము అపరవిద్య.

ఓం శ్శాంతిః శ్శాంతిః శ్శాంతిః

( 18-3-59 )

- ప్రపంచమంతయు ఆశాభంగములతో నిండియున్నది. ఆత్మను నమ్మిన వారికి మాత్రము ఆశాభంగము లేదు.
- యదార్థముగా భగవంతుడే అన్నింటికి కర్త. ఏలననగా అంతయూ ఆయనయే. ఆయన నిత్య పరిపూర్ణుడు. అట్టి వానికి మా ధన్యవాదములు.
- ఆత్మయే అమూల్యమగు నిధి. దాని వలననే సమస్తము కనుగొందుము. మరియు సమస్తము దాని కొరకే కోరబడుచున్నది.

# 44. హృదయ కమలము

కోటానుకోట్ల జనులలో హృదయమనెడి కమలము, తమలోనే యున్నదని తెలిసినవారు చాల అరుదుగదా! తమలో వికసించుచున్న హృదయపద్మమును మరచి, బాహ్యపుష్పముల కొరకు వెతుకు వారు అదృష్టహీనులు.

ప్రప్రథమమున తమలో హృదయపుష్పమున్నదన్న సత్యమునే మరచి యున్నందున ఆ కోమలమైన హృదయకమలము వాడిపోయి ముడుచుకొనిపోయెను. లోకములోగల పుష్పములన్నిటికంటెను, దైవమునకు హృదయకమలమనెడి పుష్పము ప్రీతికరమని మహనీయులు నుడివియుండిరి. అట్టి అమూల్యమైన హృదయ పుష్పమును, దైవమునకు అర్పింపజాలక పామరులు, అమాయకమైన, సుకుమారమైన చిన్న పుష్పములన్నింటిని, నిర్దాక్షిణ్యముగా చెట్లనుండి కోసి దైవమునకు అర్పించుటకు ప్రయత్నించు చుందురు.

ప్రపంచములోనున్న పుష్పములన్నింటిని కోసి తెచ్చి దైవమున కర్పించినను, హృదయమనే పుష్పమును అర్పించని యెడల, ఇసుమంతయు లాభముగాని, పుణ్యముగాని లభింపజాలదు. ఆంతర్యనివాసియైన దైవమునకు హృదయమనెడి కమలము నర్పించిన వారిదే పుణ్యమంతయును. అట్టివారు మరేయితర ఐహిక పుష్పమును అర్పించనవసరములేదు. వారు లోకములో వికసించుచున్న పుష్పము లన్నింటితో నిరంతరము దైవపూజ చేయుచున్నట్లే భావించవలెను.

అదియుగాక అమాయకముగా జీవకళలుట్టిపడుచు, ఎవరికిని హానిచేయక, సర్వులకు సువానలిచ్చుచు శోభాయమానముగా పెరుగుచున్న పుష్పములను కోయుటకు మనకేమి హక్కు కలదు? మనలోవలె మొక్కలలో గూడ ప్రాణము లేదా ? అవియు మానవులవలె పుట్టుచు, పెరుగుచు, గిట్టుచున్నవిగదా! మనచెవులుగాని, ముక్కుగాని, కండ్లుగాని, ఎవరైన పెరికినట్లయిన, మనమెంత బాధపడుదుమో ఆలోచింపుడు, నేను చెప్పు భావనలు ప్రవృత్తి పరులకు విపరీతముగా తోచవచ్చును. కాని సున్నితమైన హృదయము, కోమలమైన మనస్సు కలిగినవారికి, సర్వములో దైవమును గాంచెడి ప్రేమహృదయులకు నా భావనలు విపరీతముగా తోచుటకు బదులు స్వాభావికముగనే తోచును.

బాలురముగా నున్నపుడు, పసితనపు చేష్టలు చేయుదుము. హృదయకమలము వికసించిన కొలదియు, సర్వములో దైవమును గాంచెడి అనుభవము కలిగినప్పటి నుండియు, చీమలో,దోమలో,చిన్న పువ్వులో, చివరకు గడ్డిపరకలో గూడ దైవమహిమ, దైవశక్తి, దైవసాన్నిధ్యమే గానవచ్చును. ఒకానొకప్పుడు నేను కూడ ఎవ్వరికైనను యిచ్చుటకు, అప్పుడప్పుడు పువ్వులు కోయుచుండువాడనని చెప్పుటకు సిగ్గుపడు చున్నాను. ఒక మహానుభావుని జీవితములో జరిగిన చిన్న సంఘటన, సంభాషణ నేను చదివినప్పటి నుండియు, నా హస్తమెన్నడును వానిని కోయుటకు, త్రుంచుటకు

పుష్పములవైపు వెళ్ళదాయెను. పుష్పముల సౌందర్యము చూచినప్పుడు ఒక చెయ్యియే గాక, ఈసారి రెండు హస్తములను జోడించి, తలవని తలంపుగా నమస్కరించుటకు ముందుకు వెళ్లుచుందును.

బెర్నార్డుషా అను నాతడు గొప్ప కవీశ్వరుడు, ఆయనకు పుష్పముల యందు చాలప్రీతి. ఆయనకు గొప్ప పూలతోటకూడ నుండెడిది. పాశ్చాత్య దేశములలోను, మన దేశములోను గూడ, కొన్ని ప్రదేశములందు కొమ్మలతో నున్న పుష్పములను కోసి "వేసు"లలోను, గాజు సీసాలలోను నీళ్లుపోసి, వానిని అందుంచి శృంగారమునకై వ్రాతబల్లల మీద నుంచుచు తమగదుల నలంకరించుకొనుట అలవాటై యున్నది. బెర్నార్డుషాకు గొప్ప పుష్పవనమున్నప్పటికి, వారి గదిలో ఒక కొమ్మ అయినను, ఒక పుష్పమైనను వారి బల్లమీద లేకుండుట చూచి ఒక సోదరీమణి ఆశ్చర్యముతో వారితో నిట్లనెనట :

"అయ్యా కొన్ని అందమైన పుష్పములు గలిగిన కొమ్మలు కోసి మీ బల్లమీద నుంచినచో, ఎంత శృంగారముగా నుండునుగదా !" అని అడుగగా, ఆయన "సోదరీ! ప్రతీ చోటును దైవము యొక్క ఆకారమే అదియు మనవలె ఒక జీవమే ఒక బిడ్డవంటిదే. నీవు నీ బిడ్డల శిరస్సులను తృంచి, నీ ఆనందము కొరకు సీసా లలో నీ బల్లమీద నుంచెదవా ?" అని అడిగెనట. అప్పటినుండియు ఈ పైన వ్రాయబడిన అనుభవనీయమైన విషయమును చదివినప్పటినుండియు, ఈనా హస్త ములు, ఏ పుష్పములు కోయుటకును సాహసించుటలేదు. ఇంతియేగాక ఇతరులెవ్వ రైనను, నిర్దాక్షిణ్యముగా పుష్పములను కొమ్మలను త్రుంచు చుండుట చూచిన నా మనస్సున కెంతయో బాధగా నుండును.

భక్తులైన స్త్రీలు గూడ పుష్పములలో దైవము ప్రకాశించుచుండు ననెడి అనుభవ జ్ఞానములేక, వానిని కొమ్మలతో సహితముగా కోసి, వారి తలలో పెట్టుకొనుచుందురు. ఆ కోమలమైన పూవులు, హృదయరహితమైన మానవుని హస్తస్పర్శ తగులగానే వాడి పోవును. ఒక్కొక్క భక్తురాలు సంచిపట్టుకొని వాటివద్దకు వెళ్లి వేలానవేల పుష్పములు నిర్దాక్షణ్యముగా తృంచివేసి తన సంచి నింపుచుండ, అమాయకమైన ఎన్ని శాఖల తలలు ఆసంచిలో పడుచున్నవో గదా అని నేను బాధ పడుచుందును. ఈ సందర్భములో పుష్ప విలాపములో చిన్న పద్యము జ్ఞప్తికి వచ్చుచున్నది.

బుద్ధ దేవుని భూమిలో పుట్టినావు
సహజమగు ప్రేమనీలోను చచ్చెనేమి ?
అందమును హత్యజేసెడి హంతకుండ
మైలపడిపోయెనోయి ! నీ మనుజ జన్మ
పూజలేకున్న బాబు నీకు పుణ్యమాయె
కోయబోకుము మాలేత కుత్తుకలను.

హృదయమునకు "జాలి–అంతఃకరణ" అనునవి అంకురించిన కొలదియు, దైవసన్నిధిని సర్వములో దర్శించు చున్నపుడే, నేను వ్రాసినట్లు, మనచెవులను గాని, పండ్లనుగాని పీకుటకు ఎవరికిని ఏవిధముగా హక్కులేదో, అటులనే మనకు గూడ అమాయకమైన పుష్పములను చెట్లనుండి వేరుచేసి, త్రుంచి పారవేయుటకు హక్కు లేదు. అతిగూఢమైన, ఔన్నత్యమైన ఇట్టి ప్రేమభావనలు మనకు ఆత్మానుభవము కలిగినప్పుడే అన్నింటియందును దైవ ప్రకాశమును చూడగల్గినపుడే అనుభవము కలుగుచుండును.

మానసికారాధనయే ఆరాధనలలోకెల్ల గొప్పపూజ.

మానసికపూజ యొక్క ఆధిక్యమును బోధించుటకు, భారతములో ఒక చక్క నైన దృష్టాంతముతో కథ రూఢిగా చెప్పబడెను.

అర్జునుడు తాను ప్రతిదినము తట్టలకొలది పుష్పములను తెప్పించి పూజ చేయుచుంటినని తలచుచు, భీముడు ఏ పూజయు చేయని తిండిపోతని గర్వపడు చుండెడివాడట. సర్వజ్ఞుండైన శ్రీకృష్ణపరమాత్మ అతనికి గర్వభంగము చేయుటకు ఒకనాడు కొండలలోనికి అర్జునుని తీసికొనివెళ్ళి అచ్చట కొన్ని తట్టల కొలది వడలిన పుష్పములను చూపెనట. అచ్చటనే కొండల ఎత్తున పడియున్న పుష్పములన్నియు భీమసేనుని మానసికారాధన పుష్పములని కృష్ణుడు బదులు చెప్పగా అర్జునుడు తాను పుష్పములతో చేసిన బాహ్య పూజలకు సిగ్గుపడెనట.

పసిబిడ్డలు ప్రారంభ స్థితిలో ఒకటిరెండు పూవులు కోసి దైవమును పూజించుట తప్పుకాదు. వారి బాల్యావస్థను బట్టి అట్టిపని పిల్లల భక్తికి తోడ్పడవచ్చును. కాని విజ్ఞులైన వారుగూడ, సర్వము తెలిసియున్నట్లు ప్రసంగించుచు, ప్రేమశూన్యమైన మనస్సులతో, పూజ పేరున అందమైన చెట్లనన్నింటిని బోడిగా చేయుట పుణ్యము నకు బదులు పాపహేతువనియే చెప్పవలసియుండును.

ఇదివరలో నేనుకూడ అప్పుడప్పుడు పువ్వులు కోసిన రోజులలో పువ్వులను కోయుటకు నాచేతిని చాచగా, ఆ పుష్పములు నాతో "నీవు నా తల్లినుండి, అనగా చెట్టునుండి, నన్ను వేరు చేసెదవా? నన్ను త్రుంచి వేసిన ఒక్క నిమిషములో వాడి పోయెదను గదా ! నా తల్లి వద్దనే నన్నుంచినచో ఎంతోమనోహరముగా నుండి, నీకు కమ్మని సువాసనను వెదజల్లుదును గదా !" అని జాలిగా ఆ పుష్పము నాతో దీనముతో చెప్పుకొనుచున్నట్టుండ, నేను బిడియముచే, త్రెంపుటకు ముందుకు చాచిన హస్తమును తక్షణమే వెనుకకులాగుకొనెడి వాడను.

దైవ వాక్కును పుష్పములలో, పసిపిల్లలలో, నక్షత్రముల కాంతిలో, చివరకు సముద్రపు కెరటములలో, అన్ని శబ్దములలో వినెడివారి జీవితములే ధన్యమైనవి. సర్వహృదయనివాసియైన దైవమునకు హృదయకమలమునే అర్పించిన వారి జీవిత

ములు ఆదర్శనీయమైనవి. అట్టి మహనీయులకు ధన్యవాదములు. అట్టి ఆత్మవేత్తల అడుగుజాడలలో మనము కూడ సదా నడచుచు, సర్వములో దైవమును దర్శించుచు తరించెదము గాక !

లోక స్సమస్తా స్సుఖినోభవంతు

ఓం శాంతి, శ్శాంతి, శ్శాంతిః

( 19-10-60 )

- మనకు అత్యంతప్రియతముడు (భగవంతుడు) మనలోనే యున్నాడని పవిత్రము, పరిశుద్ధము అయిన హృదయమున నిశ్శబ్దములో తెలియగలదు.
- శ్రీరామచంద్రుని బల్లెము గ్రుచ్చుకొనిన మండూకము నాకు రక్షకుడవగు నీవే బాధించినపుడు, ఇక నేనెవరితో మొర పెట్టుకొనగలను అనెను. అంతటి దృఢభక్తి, సహనము మనకు కలుగుగాక !
- మన మాటలు ఉరుములుగా, భావములు మెరుపులుగా లోక కళ్యాణమునకు తోడ్పడునట్లు చేయగలుగుటయే భాగ్యము.

# 45. శబ్దము నుండి - నిశ్శబ్దమునకు

ప్రశ్న : మనుజుడు తన ఆనందమును శబ్దమునుండి పొంద ప్రయత్నించు చుండెనా ? లేక, నిశ్శబ్దమునుండి అనుభవింప ప్రయత్నించు చుండెనా !

జవాబు : సామాన్యమనుజుడు ఎచ్చట చూచినను శబ్దమువైపే పరుగెత్తుచుం డును. కొందరు ప్రవృత్తి పరులు నిశ్శబ్దములో ఏమిచేయుటకు తెలియక పిచ్చిపట్టి నట్లుందురు.

ప్రశ్న : నిజమైన ఆనందము-బ్రహ్మానంద మెచ్చట నున్నది ?

జవాబు : ఖండమైన శబ్దములో, అఖండమైన బ్రహ్మానందమెటుల నుండును? కావున బ్రహ్మానందము నిశ్శబ్దమునందే గలదు. నిశ్శబ్దమన్నను, పరిపూర్ణమన్నను, అద్వితీయమైన బ్రహ్మమన్నను, అచలమన్నను, అమనస్కమన్నను అన్నియు ఒక్కటియే!

వాల్తేరు ఆశ్రమము సముద్రతీరముననే యుండుటచే అంతయు శబ్దమయమై యున్నది. అది దేవాశ్రమమై యున్నందున, వచ్చెడిపోయెడి వారు చేయు శబ్దములు, బాలబాలికలు చేయు శబ్దములు, జాలరుల గోల, ఎవ్వరూ లేనప్పుడు ఏ శబ్దము లేనప్పుడు సముద్ర ఘోష! పగటిపూటగాని, రాత్రివేళగాని మానవుల నుండి వచ్చెడి శబ్దములను తగ్గింప వచ్చునుగాని, అహర్నిశములు సముద్రతరంగముల నుండి వచ్చు చున్న శబ్దముల నెటుల తగ్గించుట ? ఈ శబ్దము నెవ్వరు లేకుండ ఆపగలరు?

అట్టి పలురకముల శబ్దమయమై యున్న వాల్తేరు ఆశ్రమమునుండి ఈ మధ్య తోటపల్లి ఆశ్రమమునకు వచ్చితిమి. దారిలో ప్రయాణము చేయుచున్నప్పుడు బండ్ల శబ్దము, కార్ల శబ్దముల గురించి వ్రాయకనే అందరూ ఊహించు కొనవచ్చును.

వివిధ శబ్దములచే చుట్టంబడి, చిట్టచివరకు, శిరోవేదనతో తోటపల్లి ఆశ్రమము చేరగలిగితిమి. ఇచ్చటంతయు నిశ్శబ్దమే; ఈ నిశ్శబ్దములో, మా బడలిక అంతయు మాయమయ్యెను. ఏమి చక్కని శాంతిమయ వాతావరణము ? ఎంతటి నిశ్శబ్దత, ఆంతర్యమున బాహ్యమున, అన్నివైపుల శాంతి, నిశ్శబ్దమే, ఈ నిశ్శబ్దములో తన్మయు లమై అటులనె కూర్చుని యుంటిమి.

అప్పుడొక చిన్నపక్షి, వ్యాకహో 'నా ప్రభువెచ్చట'నని, దైవ పిపాసతో దీనాలాపము చేయ ప్రారంభించెను. శబ్దములలోనైనను, నిశ్శబ్దములోనైనను, ప్రభువు కొరకు (దైవము) పరితపించెడి వారదృష్టవంతులుగదా ! ఈ నిశ్శబ్దములో, ఆ పక్షియొక్క దీనాలాపన, ప్రభువుకొరకై విలపించెడి శబ్దము తప్ప మరే శబ్దమును వినవచ్చుటలేదు.

అదిగో వినుడు ! దివ్యమైన పక్షి మరల మరల దైవపిపాసతో, యెట్టి పాషాణ హృదయములనైన కరగించెడి లాగున 'ప్రభువెచ్చట, నా ప్రభువైచ్చట'నని విలపిం చుచు వెదకుచున్నది.

ప్రియ పాఠకులారా ! ఆ చిన్నపక్షికి ప్రభువెచ్చట నుండెనో ఎవరు చెప్పగలరు? ఎవరు సహాయము చేయగలరు ! మీరు ప్రభువును చూసితిరా? మీకు దైవదర్శన మయ్యెనా ! అంధుడు, మరియొక అంధునకెట్లు దారిని చూపగలడు? రండు! తోటపల్లి ఆశ్రమము దర్శించుటకిదే స్వాగతము. నిశ్శబ్దమనగ నెటులుండునో గ్రహించుటకు, మా పిప్పిహ పక్షియొక్క దైవపరితాపనాపూరితమైన విలాపమును వినుటకైనను, ఆశ్రమమును దర్శింపుడు; నిశ్శబ్దములోనికి మరొకమారు మీకు స్వాగతము.

ఈ పిప్పియ పక్షులు ఎచ్చటినుండియో వచ్చి వేసవికాలమున కొన్ని మాస ములు మాత్రమే యిచ్చట నివసించును. చాల సంవత్సరముల క్రిందట హిమాలయ ముల నుండి వచ్చిన ఒక సాధు పుంగవుడు ఈ పక్షుల విలాపము (ప్యూకహా ప్యూ=ప్రభువు–కహా=ఎక్కడ) యొక్క అర్థమును వివరించగా విని చాల ఆనందమయ్యెను. అవి ఆశ్రమమంతయు వృక్షములలో తిరుగుచు నిరంతరము ప్యూకహా అని అరచుచునే యుండును.

దైవమునకై బాహ్యమున వెదకుదమా ! లేక ఆంతర్యమున హృదయ కుహర మందు నిశ్శబ్దములో వెదకుదమా ! మాటలలో అవాఙ్మానసగోచరుడైన ప్రభువును పొంద ప్రయత్నింతుమా ! లేక, నిశ్శబ్దముతో సంకల్పరాహిత్యమైన స్థితిలో అనుభవింప ప్రయత్నించుదమా ! అట్టి స్థితిని మన మనుభవించినప్పుడే నిరంతరము పరితపించెడి చిన్న పక్షులకు గూడ ప్రభువు మీలోనే యున్నాడని చెప్పనర్హులమగుదుము.

'నిశ్శబ్దో బ్రహ్మ' యని అనుభవపరులు నుడివియుండిరి. కనుక సాధకులు, బాహ్యశబ్దములనన్నింటిని జయించినను, ఆంతర్య శబ్దములను గూడ జయించ వలెను. తేలికయైనను, కష్టమైనను 'కష్టేఫలీ' కష్టపడిన వారిదే ఫలితము అని పెద్దలు చెప్పుదురు గదా !

చేతినాడి ఆడుచుండెను. హృదయము కొట్టు కొనుచుండెను. శ్వాస అహర్నిశలు ఉచ్ఛ్వాస నిశ్శ్వాసములలో రేచక పూరకములుగా ఆడుచున్నది. ఈ నాడికి, హృదయ మునకు, చివరికి శ్వాసకు గూడ అతీతులైన వారిదే మోక్షము. అచంచలమైన, శబ్ద రహితమైన ఆ పరిపూర్ణమును పొందెడివారు. సూక్ష్మమైన సోహం భావనకు గూడ అతీతులై యుండవలెను.

ప్రశ్న : ఇక అచ్చట మనకు మిగిలి యున్నదేమి?

జవాబు : నిశ్శబ్దమే !

"నిశ్శబ్దో బ్రహ్మ"
లోకాసమస్తా స్సుఖినోభవంతు ( తోటపల్లి )
ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః – 10-2-61 ఉదయం 6-00

# 46. అద్భుతము

ప్రశ్న : అద్భుతమైన వస్తువేది ?

సమా : పరబ్రహ్మ స్వరూపమే.

ప్రశ్న : ఎందుచేత ?

సమా : అది కోటిసూర్య ప్రకాశవంతమైనది. దానిని మించిన వస్తువు మరొక్కటి అన్యధాలేదుగాన, అద్వితీయమైన పరబ్రహ్మమే, అద్భుతమైన వస్తువులకు, మూలముగా, అద్భుతముగా ప్రకాశించుచున్నది.

జ్ఞాతం జ్ఞాతవ్య మధునా

ఇప్పుడు తెలిసికొన దగినది, తెలియబడెను.

ప్రశ్న : అది యెద్ది ?

సమా : అది పరమాత్మయే.

ప్రశ్న : ఎటుల తెలియబడెను ?

సమా : శ్రవణ, మనన, నిధి ధ్యాసలచే.

ప్రశ్న : శ్రవణ, మనన, నిధి ధ్యాసలు దేనిగురించి ? యెటులను ?

సమా : 'జీవోదేవః సనాతన' అనాది నుండియు జీవుడేదైవమని గురుముఖమున విన్న సత్యమును, మననము చేయుచు, అద్దానిని అనుభవములో నుంచుకొనవలెను.

ద్రష్టం ద్రష్టవ్య మద్భుతం

చూడదగినది చూడబడెను. ఎంత ఆశ్చర్యము ?

ప్రశ్న : చూడదగినదెద్ది ?

సమా : పరబ్రహ్మ స్వరూపమే.

ప్రశ్న : అది నేత్రములతో చూచుటకు సాధ్యమా ?

సమా : అసాధ్యముగాని, సూక్ష్మ దృష్టిచే, జ్ఞాన చక్షువుచే, ఆ పరబ్రహ్మ స్వరూపము దర్శింపబడెను; లేక గ్రహించబడెను.

విశ్రాంతోస్మి, చిరం శ్రాంతం

చిరకాలమునుండి శ్రమపడుచున్న నేను ఇప్పుడు బడలిక తీరినవాడనుగుచుంటిని.

ప్రశ్న : చిరకాలమునుండి ఏల శ్రమపడుచుంటివి ?

సమా : ఆత్మ తనకంటె వేరుగా నున్నదనెడు భేదభావనచేత.

ప్రశ్న : అప్పుడు అన్ని అవస్థలుపోయి, విశ్రమించుట ఎటుల కలిగెను ?

సమా : సర్వము పరమాత్మయే, తానే అనెడి అనుభవము కలిగెనుకాన.

చిన్మాత్రాన్నాస్తికించన

చిన్మాత్రమైన, అఖండ సచ్చిదానంద స్వరూపంబైన బ్రహ్మకంటె అన్యమైన దెద్దియును, ఎప్పుడును, ఎచ్చటను లేదు.

ప్రశ్న : పరబ్రహ్మము తప్ప మరెద్దియు అన్యమైనది లేనప్పుడు ఈ జగత్తు అంతయు ఏమి ?

సమా : ఇది అంతయు పరబ్రహ్మ స్వరూపమే. నీటిబుడగ, సముద్రము నుండియే వచ్చి, మరల అందే విలీనమవుచున్నట్లు, ఈ సృష్టి అంతయు మాయచే గల్పింపబడి, విజ్ఞానమందే లీనమగుచున్నది.

ఈ బ్రహ్మానుభవ శ్లోకము, శ్రీశాంతి ఆశ్రమమున ఆఫీసుగదిలో నేను కూర్చుండి వ్రాసికొనెడి బల్లముందుగా, ఒక గోడమీద, పెద్ద అక్షరములతో వ్రాయబడి యుం డెను. ఇప్పుడే ఈ శ్లోకమునంతను, మరల స్మరించుచు, దీని సారాంశమును అనుభ వించుటకు ప్రయత్నింతము.

ఇది సామవేదమునుండి వచ్చిన అనుభవనీయమైన శ్లోకము.

శ్లో॥ జ్ఞాతం జ్ఞాతవ్య మధునా దృష్టం ద్రష్టవ్య మద్భుతం
విశ్రాంతో స్మిచిరం శ్రాంతః చిన్మాత్రా న్నాస్తి కించన.

తా. ఇప్పుడు తెలియదగిన బ్రహ్మము తెలియబడెను. దానిని గూర్చి నేను మిక్కిలి శ్రమపడితిని. నాశ్రమ యిప్పుడు గట్టెక్కెను. ఇక విశ్రమించెదను. చిన్మాత్ర మైన బ్రహ్మకన్న నితరమేమియును లేదు. నేనే యా బ్రహ్మమును ఆహా ! ఏమి ఆశ్చర్యమైన సంగతి.

ఇవి కేవలము బ్రహ్మానుభవముచే గలిగిన యుత్సాహకరమైన, మరల, మరల మననము చేయవలసిన అనుభవనీయమైన వాక్యములు, తరించుటకు ఒక్క శ్లోకముచాలును. దాహము తీర్చుకొనుటకు గోదావరి నదిలో జలము నంతను త్రాగ నవసరములేదు. గాన మీకు పూర్ణశాంతి కావలసిన, మీ అవస్థలన్నింటి నుం డియు విముక్తి పొందవలెనన్న, దేహవాసన, శాస్త్రవాసన, లోకవాసనలకు దూరముగా నుండి నిరంతరము బ్రహ్మానుభవమును గ్రోలవలెను; అని యున్న ఈ చిన్న శ్లోక మును కంఠతావల్లించి అతిగోప్యమైన, సర్వవేదాంత సారమును, మీరు సదా మననము చేయుచు నిది ధ్యాసలతో తరించుడు.

హరి ఓం తత్ సత్ ఓం
శ్రీ కైలాసము
9-3-62 ఉదయం 5-00

# 47. మతియే గతి

మతియేగతి యను నమ్మకమున్నచో సూర్యుని ధ్యానింతము. మనస్సును మనము చూడజాలముగాని, సూర్యుని చూడగలముగదా ! మనమనస్సే సూర్యుడను కొందము. ఆ సూర్యుని నుండి వచ్చుచున్న వివిధ కిరణములే పరిమితిలేని మన ఆలోచనలుగా భావింతము.

దివ్యతేజస్సుతో వెలుంగుచున్న సూర్యుని గాంచుడు. ఆ దివ్యకాంతి నుండి వెలువడుచున్న అపరిమితమైన ఆ కిరణములనుగాంచుడు. సూర్యుడే మన మనస్సనియు, ఆ కిరణములే మన ఆలోచనలను భావన ఎంత ఆనందమును, బలము, మతియేగతియు నొసంగుచున్నది ?

మనము సూర్యునిలోనే నడచుచుంటిమని, మనలో సూర్యుడే మాట్లాడుచుండెనని, మన నేత్రములద్వారా సూర్యతేజస్సే ప్రకాశించుచున్నదని, మన ఆలోచనలన్నియు సూర్యకిరణములుగా అన్ని దిశలకు వెళ్లుచు, సోదర మానవ హృదయములలో పాతుకొనియున్న అజ్ఞానాంధకారమును ప్రారద్రోలకాంక్షించుట కంటె ఆనందమైన మార్గము, మరియొకటి గలదా ?

ఆత్మీయులారా ! మీ మనస్సులను నేటినుండి సూర్యబింబములుగా చేసికొనుటకు ప్రయత్నించుడు. మీ ప్రతి ఆలోచనను తేజోవంతమైన సూర్యకిరణములుగా ప్రసరింపజేయుచు, తోటి మానవలోకమునకు మార్గదర్శకులుగా నుండ ప్రయత్నింపుడు. తమ మనస్సులను సూర్యునిగా చేసుకొని, తమ ఆలోచనలను సూర్యకిరణములుగా చేసుకొనగల్గిన వారి స్థితి పరిపూర్ణ శాంతి, నూతన శక్తియుతమై, జ్ఞానతేజస్సుతో నిండియుండును. ఇక సూర్యభగవానుని ఉనికినే మరచి, తమ మనస్సులను నరకకూపములుగా చేసికొని, తమ ఆలోచనలకు తామే బానిసలై, అంధకారములో జీవించుచున్నవారి గతి స్థితి గురించి చెప్పవలసినదేమున్నది ?

"మతియే గతి" ఒక బాటసారి అరణ్యములో ఒంటరిగా ప్రయాణము చేయుచు, దాహముచే పీడింపబడుచుండ ఒకచెట్టుక్రింద విశ్రమించెను. ఆకలిగొన్నవాడగుటచే పంచభక్ష్య పరమాన్నములున్న నెంత బాగుండునను కొన్నంతనే, అవన్నియు ముందు కనిపించెను. అవన్నియు తృప్తిగా భుజించి, తరువాత సుఖముగా నిద్రించుటకు మంచి శయ్యను, అదియు అమరగా, తరువాత నొక్కొక్కటిగా భవనము, శరీర సౌఖ్యమునకు స్త్రీలు, సేవకులు వగైరాలను కోరగా, అవన్నియు తక్షణమే ఆతని ఎదుట ప్రత్యక్షమయ్యెనట. పని లేనివాని మెదడులో, మనోజయము లేనివాని మెదడులో సైతాను నాట్యమాడు చుండునట. అట్లే మన బాటసారి పై సౌఖ్యములతో తృప్తిపడక తాను విశ్రమించినది కల్పవృక్షమని తెలియక ఆ అరణ్యములో ఏదైనను

పెద్దపులివచ్చి మ్రింగివేయునేమోయని తలంచగనే, పెద్దపులి వచ్చి అతనిని కబళించి వేసెనట. ఈ చిన్న కథ "మతియేగతి" యనెడి సత్యమును తేటమాటలతో తెలియ పరచుచున్నది.

అన్నియు మనస్సు నుండియే ఉత్పన్నమగుచున్నవి. ఆరోగ్యవంతులు మనస్సునకు బానిసలై, తమకులేని జబ్బులున్నవని భ్రమపడుచు, రోగములను కొనితెచ్చుకొని, దుర్భరమైన వేదనలను పొందుచు, మంచముపట్టి, చివరకు కొందరు మృత్యువు నోటబడుచుండిరి. ఇక జబ్బులున్నవారు కొందరు మనోజయము కలిగి "మతియే గతి" కావున తమ మనస్సులను ఆరోగ్యమను దివ్యశక్తి కర్పించి, తమ శరీరములను దివ్యతేజస్సుతో నింపుకొని తమను పట్టుకొన్న దీర్ఘరోగములను కూడ పారద్రోలి ఆరోగ్యవంతులై, చిరకాలము జీవించియున్నవారిని గూడ మనము చూచుచుంటిమి. ఆహా ! అంతయు మనఃకల్పిత ప్రభావమే కదా ! కనుక ఆరోగ్యానారోగ్యములకు, ధైర్యాధైర్యములకు, బంధమోక్షములకు,సర్వగుణములకు మూలకారణమైనట్టి మనస్సును జయించుట ఎట్లు ? మనస్సు అగ్నిహోత్రము వంటిది. దాని వేడిమిచే ఊరంతయు కాల్చివేయవచ్చును. ఆ వేడిమిచేతనే అన్నము, పిండివంటలు మొదలైనవి చేసికొని చక్కగా భుజింపనువచ్చును.

ఓ మనస్సా ! నీవు మానవులను అధోగతికి తీసికొని వెళ్ళుచుంటివా? లేక మావనజన్మకు ఆధారమును, గమ్యస్థానమునైన దైవత్వము వైపునకు తీసికొని పోవు చుంటివా? అయ్యో ! మనము మాయచే మనస్సును బంధించనేల ? మనస్సుదే తప్పుఅననేల ? మనస్సు మన నుండి విలక్షణముగానే యున్నది. మనస్సునకు మించిన శక్తి మరియొకటున్నది. అది అంతర్గతమైన ఆత్మశక్తియే. మనము ప్రతిక్షణము దానిని ఏమరకుండ జ్ఞప్తియందుంచుకొన్నచో మనస్సు, బుద్ధి అననేల, సర్వేంద్రియ సంచలనము అందు విలుప్తమైపోవుచున్నది. అట్టి దివ్యశక్తి మానవుని సొంతమైయుండ దానిని మరచి,చంచలమైన మనస్సును పట్టుకొని, అది తీసికొని పోవునట్లెల్ల నరకమునకు, స్వర్గమునకు సంచారము చేయుచుండును. ఒక మనుజుడు సంకెలలచే చీకటికొట్టులో బంధింపబడినను, అతని మనోవృత్తి వలన చేసిన పాపకృత్యములే ఆతని దుఃఖమునకు కారణమగును. అటులనే ఒక మహనీయుడు మనో జయముచే, (ఆత్మను తెలిసికొనిన వారు మనస్సును విస్మరించెదరు.) తపో బలముచే సహజసమాధిస్థితి ననుభవించుచున్న, ఆయన గతజన్మ సుకృతములే కారణము.

వెలచెల్లింపక ఏ వస్తువు లభించదు. కష్టపడకుండ ఫలితము దొరకదు. అందరకును దైవమును పొందవలయుననియే యుండును. కాని వారి మనస్సులు మాత్రము సదా దయ్యముల గురించి ఆలోచించుచుండును. అట్టి వారి తలంపులు,

పనులు స్వార్థపరముగా వారివెంటనంటియే యుండును. ఇక వారు దైవము నెటుల పొందగలరు ?

దైవశాసనముగానిండు ధర్మశాసనమైనదిగానిండు, అది తేలిక మాటలలో "మతియే గతి" యను చిన్న మాటలలో పసిబాలురకు గూడ అర్థమగునట్లు చాటబడు చున్నది. ఏ విత్తనములు చల్లెడువాడు, ఆ విత్తనముల ఫలసాయమునే ప్రోగుచేసికొను టకు సంసిద్ధులై యుండవలయును గదా ! దైవశాసనములు మనకొక విధము గాను, ధనవంతులకు శక్తివంతులకు వేరొక విధముగాను మార్చబడవు. మన మనస్సులే మనగతిని నిర్ణయించుచున్నవిగాన, అట్టి చంచల మనస్సులను సూర్య భగవానుని దివ్యతేజస్సున కర్పించి, ఇతరుల ఆత్మాభివృద్ధికి తోడ్పడులాగున దిన దినాభివృద్ధిని గాంచుచు, లోకశాంతికి ఆధారమగుదము గాక !

లోకాసమస్తా స్సుఖినోభవంతు

( 20-10-63 ఉదయం 9-00)

✧ నీవెవరివో తెలుసుకొనుట అనునది తప్ప, ప్రపంచము నందలి తక్కిన విషయ ములన్నింటిని తెలుసుకొనగోరుచున్నావు. నీవు సంపూర్ణడవైనందున కోరికల కతీతుడవు. అది తెలియుటే శాంతి.

# 48. గొప్ప పని ఏది ?

ప్రతివారికిని ఏదోయొక పని చేయవలయుననియే యుండును. ఎవరికిని సోమరితనముగా నుండవలయునని యుండదు. అట్టివారు అనగా పనియందు అపేక్షలేనివారున్న యెడల వారు చాల అరుదుగా నుందురు.

సోమరితనముచే కొందరు పనియందు విముఖులై యుండవచ్చును. పరిపూర్ణ స్థితిచే గూడ కొందరు పనియందు విరక్తులై యుండవచ్చును. ఏ పనియైనను సరే నిష్కామముగా, ప్రేమతో చేసిన అది గొప్ప పనియే !

చివరకు భంగీపనియైనను, రోడ్డుతుడిచెడి పనియైనను, రాళ్లుబ్రద్దలు కొట్టెడి పనియైనను, నిష్కామముగా ఫలితము కోరకుండచేసిన అది గొప్పపనియే. కాని ఫలితము కోరకుండ నెవరు పనిచేయగలరు ? పనియే ఆరాధననెడి మహోత్కృష్ట మైన భావనతో ఒక్క జ్ఞాని మాత్రమే ఏపనినైనను ఆనందముగా చేయగలడు. మిగి లినవారందరు ఈ పనివలన మనకేమి లాభమువచ్చునని పని ప్రారంభింప కుండ గనే ప్రశ్నించు కొందురు. ఏ పనియైనను అది చిన్నదిగాని, పెద్దదిగాని, ఆ పనిచేయు వాని అభిప్రాయము, అతని ఆలోచనలను, కోరికలను బట్టియే నిర్ణయింపబడవలసి యున్నది.

ఒక దేశపు నియంత లేక అధిపతి లోకములో తనకంటె గొప్ప పనిచేయు వాడెవడును లేడని తలంచవచ్చును. కాని తన పని వలన అమాయకులైన ప్రజలకు హాని జరుగుచున్నచో, అతడు చేయుపని ఎంత గొప్పదైనను అధమమైనదేయగును. అట్టి రీతిగనే కించిజ్జత్వముతో నిండి చేయుచున్న పనులు, దంభాహంకారములతో లోకమంతయు మరమ్మత్తు చేయుచుంటిమని, తమ్ము తాము సంస్కరించుకొనుట మరచి, యితరులను సంస్కరింప బూనుపనులు పాడు పనులుగాక లోకోపకారకము లగునా ?

నిజమైన పనియేదియో, పనిగానిదేదియో గీతలో శ్రీకృష్ణపరమాత్మ చక్కగా చెప్పియుండిరి.

కర్మణ్య కర్మయః పశ్యేదకర్మణి చ కర్మయః
స బుద్ధిమాన్ మనుష్యేషు సయుక్తః కృత్స్న కర్మకృత్ ॥ 4అ. 18 శ్లో॥

కర్మలో అకర్మను, అకర్మలో కర్మను చూచెడివారే మనుష్యులలో ఉత్తములని, నిజమైన పనిచేయువారని, ఆదర్శనీయజీవులై కృతకృత్యులగుదురని నుడివియుండిరి.

పనిచేయుచు చేయుచుండుటలేదను భావముండుట ఎంతకష్టము ? ఏ పని చేయకుండ, గొప్పపనిచేయుటన్నది ఎంతదుర్లభము ? అయినను బ్రహ్మవిదుడు మాత్రమే తాను శరీరముతో పనిచేయుచున్నను దానికి విలక్షణముగా నుండి ఆత్మ

భావనతో నిండియుండును. అట్టివాడు ఏ పనియు చేయనట్లు సామాన్యులకు గాన వచ్చినను, సదా ఆత్మభావనతో నున్నందున గొప్పపనినే చేయుచుండెను.

ఆత్మభావనలేక దైవమును మరచి, నరపశువుగా విలువైన కాలమును వ్యర్థ పరచుచు జీవించువాడు ఏ చిన్నపని చేయుచున్నను కర్మను పోగుచేసికొనుచు కర్మచేత బంధింపబడుచుండెను. కనుక పనులలో గొప్పపని ఆత్మభావనతో నిండి యుండుటే, తన వల్ల ఏ జీవికి హాని అపకారము కలుగకుండుటే గొప్పపని, ప్రేమయే దైవముగాన తాను చేయు పనులన్నిటియందును విశ్వప్రేమను వ్యక్తపరచుటే గొప్పపని.

అహంకార మమకారములకు బానిసలై, శరీరజ్ఞప్తితో నిండి చేయుపని ఎంత గొప్పదైనను అల్పమైనదే, సుహృద్భావముతో, సర్వ మానవాళి శ్రేయమును నిష్కామ ముగా కోరుచు ప్రేమతో చేయు చిన్నపనియైనను చాలగొప్పదే. ఇతరులకు తోడ్పడెడి పని, సర్వములో దైవమును గాంచుచు ప్రేమతో చేయుపని, ఆత్మభావనతో చేయు పనియే గొప్పపని, అదియే జన్మరాహిత్యము నిచ్చెడి, విముక్తిని గల్గించెడిపని, నిస్వార్థ బుద్ధితో చేయుపనియే తన మనశ్శాంతికేగాక, లోక శాంతికి గూడ తోడ్పడను.

హరిఓం తత్సత్ ఓం.

( 28-7-64 )

ఉదయం 6-00

# 49. నీవు దేనిని కోరుచుంటివి ?

నీవు దేనిని కోరినను కోరిక బంధమే. ఆంతర్యమున గాని, బాహ్యమునగాని, నిన్ను బంధించునది నీ కోరిక తప్ప మరేదియు ఎచ్చటను, ఎప్పుడును లేదు. కనుక ఏ కోరికయు లేకుండటయే విముక్తి, మోక్షము, కాని అట్టి వారు చాలఅరుదు. ఏ కోరికయులేని అదృష్టవంతులు కోటికొక్కరుండవచ్చును. వారే జీవన్ముక్తులు, శాంతి ఆనందము వారిసొత్తే, కొదువ వారందరు పొడినేల మీదుంచబడిన మత్స్య ములవలె వివిధములైన కోరికలచే, అశాంతితో గిలగిల కొట్టుకొనుచుండిరి.

మానవుడు మాయచే ఎప్పుడును ఏదోయొక కోరికకు బానిసయై, అది తీరనిచో విలవిలలాడుచు, చీకటినుండి ఇంకను అంధకారములో పడుచుండెను, పుల్లలు పెట్టి మంటచేయుచున్న కొలదీ అగ్నిజ్వాలలు వృద్ధి యగునట్లు, కోరికలు తీర్చిన కొలది అవి ఇంకను బలిష్ఠముగా వృద్ధియగుచునే యుండును. మంట ఆర్పివేయవలె నన్న ఒక్కొక్క కట్టెను తీసివేసినచో కొంత సమయమునకు మంటతగ్గుటేగాక, నిప్పు గూడ ఆరిపోవును, అటులనే మనలో బయలుదేరుచున్న కోరిక నొక్కొక్క దానిని జాగ్రత్తగా గమనించి, మనస్సును నిగ్రహించి, అణిచివేయుటకు సాధనచేయు చున్నచో కొంతకాలమునకు కోరికలు నశించిపోవును. కోరికనణచినిచో అవి నదీప్రవాహమువలె పెరిగిపోవు చుండును. ఒక్కొక్కసారి సముద్రములోని అలలనైన లెక్కింప వచ్చునుగాని, చంచలమైన మనస్సులో నున్న, బయలుదేరు చుండు ఆలోచన లను లెక్కపెట్ట జాలమన్నట్లుండును.

ఒక కోరిక మరియొక కోరికకు, చిన్న కోరిక పెద్ద కోరిక వరకు పెరుగును. ఇటులనే అస్వభావికమైన కోరికలు మనుజుని జీవితమును అశాంతి పరచి అధోగతి పాలు చేయుచుండును. మనుజుడు ఖండమైన కోరికతో తృప్తిని ఎన్నటికిని పొంద జాలడు. తృప్తి ఒక్కదానియందే గలదు. అదియేది ? అదియే మానవుని జన్మహక్కైన స్వస్వరూపము. మానవున కెన్నటికైనను శాశ్వత శాంతి, నిత్యమైన ఆనందముగాని పొందుటకు అదృష్టము కల్గియున్న అది పరిపూర్ణమైన దైవానుభవము నందే గలదు. కనుక...

ఆత్మస్వరూపా ! నీవు దేనిని కోరుచుంటివో అంతర్ముఖుడవై ఒక్కతరి ఆలోచిం చుము. నీవు క్షణభంగురమైన మడిమాన్యములను, వస్తువాహనములను, ధనధాన్య ములు మొదలైన ఐహిక సుఖములను కోరుచుంటివా? లేక శాశ్వతమైన మార్పులేని సచ్చిదానంద స్వరూపమును కోరుచుంటివా ?

విచారకరమైన విషయ మేమన-దైవాకారుడైన మానవుడు, తన జన్మహక్కై, తనలో నిరంతరము ప్రకాశించుచున్న దివ్యతేజస్సును మరచి అంధునివలె బాహ్య

మున చిన్న వెలుతురునకై పరితపించుచుండెను. మరియు హాస్యాస్పదమైన విషయమే మన, మానవుని దుర్బలత్వమే! మన ప్రస్తుత క్షణమున, గతించిన కాలములో జరిగి పోయిన విషయములను గురించియో లేక అస్థిరమైన ముందు రాబోయెడి కాలములో చేయవలసిన పనులను గురించియో ఆలోచించుచు తనకు లభించిన విలువైన కాలమును వ్యర్థముచేయు చుండుటాశ్చర్యము.

సోదరా ! లెమ్ము ! మేల్కొనుము, విషతుల్యమైన చిన్న చిన్న కోరికలకు బానిసవై నీ ప్రస్తుత క్షణమును వృధా చేయకుము. గతించినది మరచిపొమ్ము, భవిష్యత్తును గురించి ఆలోచించకుము, అన్ని కోరికలు జయించి వానికి యజమానివిగా నుండుము ఏ కోరికయు లేకుండ నుండజాలని ఎడల నిత్యమైన సత్యమైన పరిపూర్ణమైన నీ జన్మకు గమ్యస్థానమైన దైవమునే కోరుము.

నీకు జ్ఞానోదయమగుట కిదియే సమయము, ఇదియేతావు. అన్ని కోరికల కతీతమైన ఆత్మ తేజస్సు నీలోనే, నీకొరకై వేచియున్నది. కనుక ఈ ప్రస్తుత క్షణము ననే అంతఃర్ముఖుడవై అద్దాని ననుభవించుచు పూర్ణశాంతి ననుభవించెదవుగాక!

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

( 4-10-65 )

# 50. మఱుపు

నిన్ను నీవెటుల మరువగలవు ?

నీవు దేనినైనను మరువగలవు గాని నిన్నే నీవెటుల మరువగలవు? మరుపు భ్రమయే, మరుపు ఎందయినను గలదుగాని నీ ఆత్మకు మాత్రములేదు. సూర్యునిలో చీకటి యున్నదా ? సూర్యునిలో చీకటి లేనప్పుడు సూర్యులకు సూర్యుండవైన నీలో మరపు అను చీకటి ఎట్లుండ గలదు ?

నీవు స్నేహితులను మరువగలవు. బంధువులను మరువగలవు. చివరకు నీవు ప్రాణతుల్యముగ ప్రేమించుచున్న నీ భార్యను, బిడ్డలను మరువగలవు. దేనినైనను మరువ గలవు గాని ఒక్కదానిని మాత్రము మరచుట సాధ్యముగాదు.

ప్రశ్న : అది ఏది ?

జవాబు : అది నీవే.

నిన్ను నీవెన్నడును మరువజాలవను సత్యమును గ్రహించిన నీ జీవితము శాంత్యానందములతోనే గాక నూతన శక్తితో నిండియుండును.

లెమ్ము. నీ గాఢనిద్రనుండి మేల్కొనుము. మరుపు అనెడి భేదభావన ద్వంద్వము నందే కలదు. అద్వితీయమైన సత్యమునందు మరుపులేదు. అఖండమైన పరిపూర్ణ మైన కోటిసూర్య ప్రకాశము నందు మరుపునకాస్కార మెచ్చటనున్నది? స్వస్వరూప ములో స్వప్రకాశములో వెలుంగుచున్న నిన్ను నీవెట్లు మరువగలవు ?

మరుపునకును, జ్ఞప్తికిని అతీతమైన ఓ దివ్యతేజస్వరూపా ! ఓ సచ్చిదానంద స్వరూపా ! నీకు ధన్యవాదములు.

ఉన్నదొక్కటే గాన తనకు తానే నమస్కరించుకోవలెను. మరపులేని అద్వైత స్దితిని స్ధిరముచేయుట ముఖ్యము. దానిని నిరంతరము అనుభవించుచు మనో వాక్కాయములలో వ్యక్తపరచెడి వారే ధన్యులు.

ఈ మార్పులతో కూడియున్న ప్రపంచములో మార్పున కతీతమైన పూర్ణశాంతి ఎచ్చటనైనను నున్నచో అది మరుపున కతీతమైన పరిపూర్ణమైన దివ్యతేజస్సు నందే గలదు. నీ జన్మహక్కయిన ఆత్మ తేజస్సును నీవు ఎన్నడైనను మరువగలవా? చివరకు నీ జాగ్రత్,స్వప్న,సుషుప్త్యావస్థలలో కూడ నీ సచ్చిదానంద రూపమును మరువజాలవు. జాగ్రదవస్ధలో ఎరుకగా నున్నది, స్వప్నావస్ధలో మనస్సుగ నున్నది. సుషుప్తి అవస్ధలో సాక్షిగా నున్నదియు నీ స్వస్వరూపమే.

అది హెచ్చు,తగ్గులు లేనిది, చావు, పుట్టుకలు లేనిది. విశ్వమునకు అతీతమైనది. ఆకాశము వలె కండ్లకు కన్పించకున్నను నేత్రములకు నేత్రముగ సదా నీలో ప్రకా శించుచున్నది. నీ హృదయములో కొట్టుకొనుచున్నది. నీ శ్వాసలో "సోహం" భావనలో ఆడుచున్నది. నీలో ఆలోచించు చున్నది. పనిచేయుచున్నదియు అదియే. సర్వము

ఆత్మయే. ఆత్మ తప్ప ఎన్నడు, ఎచ్చట భిన్నమైనది, అన్యవస్తువు మరొకటిలేదు. ఏకమై, నిత్యమై, విమలమై, అమలమై, భావాతీతమై, గుణాతీతమై, సర్వజీవులకు సాక్షి స్వరూపమైన ఆ సద్వస్తువునకు నమస్కారము. అనగా నన్ను నేను మరల నమస్కరించు కొనుచుంటిని.

సముద్రములో నీటిబుడగ లీనమైనట్లు దివ్య తేజస్సులో చీకటి లీనమైనట్లు కోటిసూర్య ప్రకాశవంతమైన ఆత్మ తేజస్సులో మరుపు అనెడి భ్రమ శాశ్వతముగ లీనమగుగాక.

లోకా స్సమస్సా సుఖినోభవంతు.

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 6-4-66 మధ్యాహ్నం 1-00 )

- విశ్వమంతటిని భగవంతుని గానో లేక ఆత్మగానో చూడగలిగిన వాడే ఆనందముగా, శాంతిగా జీవింపగలడు. దుష్టునియందు కూడ భగవంతుని చూడవలయును.

# 51. అవ్యక్తము

అవ్యక్తము – అచింత్యము. అచింత్యమైన దానిని గురించి ఎవ్వరేమి వ్రాయ గలరు ? ఆ సద్వస్తువు గురించి ఎవ్వరేమి మాట్లాడగలరు ? అవ్యక్తము గురించి మాట్లాడుటకు ప్రయత్నించుటే కించజ్ఞత్వము. అద్దానిగురించి ఆలోచించుటకైనను అది అచింత్యమని శాస్త్రములు ఘోషించుచున్నవి.

అవ్యక్తము – అచింత్యమైన ఆ పరబ్రహ్మ స్వరూపమును తెలిసికొనుట ఎట్లు? మనోవాక్కాయములకు అతీతమైన ఆ పరమాత్మను గ్రహించుట ఎట్లు ? గుణరహితము భావాతీతమునయిన ఆ పరిపూర్ణమును అనుభవించుట ఎట్లు ? ఇంతకు ఖండమైన మనస్సు అఖండమైన దివ్యతేజస్సు నెట్లు పొందగలదు ? ఆ అఖండ దివ్యతేజస్సు అవ్యక్తమైన సద్వస్తువును, పరిపూర్ణమను నొక్కదానిని మొదట స్థిరము చేయుదము.

అద్వితీయమైన ఆ పరమాత్మనుండి, ఆ మూలవిరాట్టు నుండి ఈ సృష్టి అంతయు ఈ సముద్రము, పర్వతములు, సూర్యుడు, చంద్రుడు, నక్షత్రములు, పృథ్వి, తేజస్సు, వాయువు, ఆకాశము ఇవన్నియు ఎట్లు వచ్చెను ? స్త్రీ పురుషాదులు, జంతుజాలములు, పక్షులు, క్రిమికీటకాదులు, పుష్పములు, బ్రహ్మాండములు, అండాండ ములు ఇవన్నియు ఎటుల కల్గెను ?

ఈ సృష్టియంతయు సంకల్పమేయని మహనీయులు నుడివియుండిరి. అణువు మొదలు బ్రహ్మాండము వరకు సర్వము సంకల్పప్రభావమే. సంకల్పమే సృష్టి, సంకల్పమే బంధము, నిస్సంకల్పమే పరిపూర్ణము. నిస్సంకల్పమే మోక్షమని అనుభవ నీయులు నుడివియుండిరి.

ఈ ఇంద్రజాల ప్రపంచమంతయు మరల ఎట్లు మాయమగు చున్నది? నిస్సం కల్పము చేతనే లేకుండ పోవునని బ్రహ్మవిదులు చెప్పుచుండిరి.

నీవు చూచుచుంటివి గాన ప్రపంచమున్నది. నీవు చూడకున్న ఏమియులేదని మరియొక మహనీయుడు నుడివియుండెను. సంకల్పము, లేక కోరికచేతనే చూచుట, వినుట, తాకుట, మాట్లాడుట, ఆలోచించుట, మొదలైన పనులన్నియు జరుగుచున్నవి. సంకల్పమేలేని యెడల నీవేలేవు. నీవే లేనపుడు ఇక సృష్టి ఎచ్చటనున్నది? అయినచో మరి మిగిలియున్నదేమి ? అవ్యక్తమై, పరిపూర్ణమై, నిత్యమై, శుద్ధమై, అచలమై, అచింత్యమైన సద్వస్తువు మాత్రమే. అద్దానిని మేఘములు సూర్యభగవానుని మరుగు పరచునట్లు సంకల్పము మరుగుచేయుచున్నది. నిస్సంకల్పమే ప్రత్యక్షముగా దానిని వ్యక్తము చేయుచున్నది. కాని నిస్సంకల్పముగా నుండుట ఎంత దుర్లభము. సులభ మైనను, దుర్లభమైనను మోక్షము, పూర్ణశాంతి నిస్సంకల్పము నందే గలవు.

ఈ కఠినమైన గాఢమైన సమస్యను సూక్ష్మముగా బోధపరుచుకొనుటకు సామాన్యమైన చిన్న ఉదాహరణమును గ్రహింతము. అంతము, ఆదియు కానరాక

జలమయమైయున్న సముద్రమును జూడుడు. దానినే అవ్యక్తముగా, అచింత్యముగా పరిపూర్ణమైన సద్వస్తువుగా మూల ప్రకృతిగా భావింపుడు. ఆ సముద్రమునుండియే భీకరమైన తుఫానులు, గంభీరమైన కెరటములు, అలలు, బుద్బుదములు, నురుగు, సర్వము వచ్చుచున్నవి. అద్వితీయమైన సముద్రగర్భము నుండి ఇవన్నియు ఎటుల వచ్చుచున్నవని ప్రశ్నించిన ఎవరు చెప్పగలరు ? ఎటుల వచ్చుచున్నవో మనము చెప్పజాలకున్నను ఈ వివిధ నామరూపములన్నియు మనకు గోచరించుచునే యున్నవి. అటులనే ఈ నామరూపములతో నిండియున్న సృష్టి అంతయు ఎటుల ప్రప్రథమమున వచ్చినదో మనము చెప్పజాలకున్నను సృష్టి మాత్రము ఇప్పుడు మన ముందు ప్రత్యక్షమైయున్నది.

సంకల్పము చేతనో రాపిడిచేతనో కెరటములు సముద్రమునుండి వచ్చుచున్నట్లు అవ్యక్తమైన సద్వస్తువు నుండి గూడ సంకల్పమాత్రమున ఈ సృష్టి అంతయు వచ్చు చున్నది. మనకు మిగిలియున్న ఆనందమైన విషయమేదియన కెరటములు మరల నిస్సంకల్పముచే రాపిడి లేకుండుటచే సముద్రమునందు లీనమగుచున్నట్లు ఈ సృష్టి అంతయు నిస్సంకల్పముచేతనే ఆ పరమాత్మ యందు విలీనమగుచున్నది.

ప్రియమైన పాఠకా! నీవు నీ హృదయాంతరమునకు వెళ్ళి నిశ్శబ్దములో శబ్ద మెట్లు వచ్చుచున్నదో నామరూప రహితమైన అవ్యక్తములో నామరూపములతో గూడి వ్యక్తమైన ఈ ప్రపంచమంతయు నెటుల వచ్చుచున్నదో పరీక్షించుము. సంకల్ప ములకు బానిసవైనచో సృష్టి నిన్ను బంధించుచున్నది. సంకల్పములకు ప్రభువైనచో సృష్టి నిన్ను విముక్తునిగా చేయుచున్నది. సంకల్పమే సృష్టిగాన నిస్సంకల్పివిగా నుండుము. నిస్సంకల్పుడే-ముక్తి,మోక్షము, బ్రహ్మానందము, పూర్ణశాంతియను రాజ్య ముల కధినాధుడు. మనమిప్పుడొక్కతరి నిమీలిత నేత్రులమై మన జన్మహక్కయిన అవ్యక్తమును,అచింత్యమును, పరిపూర్ణమును ధ్యానింతుము. నీటిబుడగ కెరటము తోను, కెరటము సముద్రలోను లీనమైనట్లు సృష్టి జీవునిలోను, జీవుడు పరమాత్మ లోను విలీనమై సంకల్పరాహిత్యమైన పరిపూర్ణమును ఆ కోటి సూర్యదివ్యతేజస్సును నిరంతరము అనుభవించెదము గాక.

కైలాసం

ఓం తత్సత్ ఓం

( 22-5-67 సాయంత్రం 5-00 )

✦ మన సామర్థ్యమును పరీక్షచేయుటకును, మనయొక్క ఆత్మ శక్తిని వృద్ధి పరచుట కును మాత్రమే పరమాత్మ మనకు కష్టసుఖములను కలుగజేయును. అంతే కాని మనపై కసితో కాదు.

# 52. మనుజుడు - అంధుడు

మాయాజాలములో చిక్కియున్న మనుజుడు అంధుడేకాదు. చెవిటివాడు కూడాను.చెవిటివాడే కాదు, మూగవాడు కూడాను, దైవమును చూడజాలని మనుజుడు అంధుడేగదా ! దైవ వాక్కును వినజాలని మనుజుడు చెవిటివాడే కదా ! దైవమును గురించి మాట్లాడని మనుజుడు మూగవాడే కదా !

ప్రశ్న : మానవునకు ఈ నేత్రము లెందుకీయబడెను ?

జవాబు : దైవమును దర్శించుటకే.

ప్రశ్న : చెవులెందుకీయబడెను ?

జవాబు : దైవమును గూర్చి వినుటకే.

ప్రశ్న : నోరెందు కీయబడెను ?

జవాబు : దైవమును గురించి ప్రసంగించుటకే.

అంతేకాదు, ఈ హస్తములు దైవసేవ చేయుటకు, పాదములు దైవము వైపు నడుచుటకే యొసంగబడి యుండెను. కాని, మానవుడు – కఠిన హృదయుడైన మానవుడు, ప్రవృత్తిపరుడైన మానవుడు – కండ్లుండియు గ్రుడ్డివాడయ్యెను. నిత్యమై, సత్యమై, తన జన్మహక్కయిన దైవమును తప్ప మిగిలిన వాని నన్నింటిని చూచుచుండెను.

అటులనే తన చెవులతోడ దైవనామమును, దైవ ప్రసంగములను వినుటకు బదులు, నిస్సారమైన పొల్లుమాటల నన్నింటిని వినుచుండెను. ఇక నోటితోనో, దైవసంభాషణ, దైవనామ స్మరణచేయు క్షణములు చాల అరుదుగ నుండెను. ఎవరు, ఏది, ఎప్పుడు మాట్లాడినను అనిత్యమైన ప్రవృత్తి మాటలనే, అనగా ప్రాపంచిక విషయములనే, మాట్లాడుచుండుట ఈ కాలములో గొప్పవిశేషముగ పరిగణింపబడుచున్నది.

ప్రశ్న : దైవాకారుడైన మనుజుడు–ఆంతర్యమున, బాహ్యమున, తన ప్రత్యణువునందును ఇమిడియున్న దైవశక్తిని మరచి కేవలము అంధుడై చెవిటివానివలె మూగవానివలె ప్రవర్తించుచుండెనా ?

జవాబు : మనుజునకు తన సృష్టికర్తయైన దైవమునందు అనుభవ పూర్వకమైన విశ్వాసము లేకుండుటే మూలకారణము.

సామాన్య మానవులకు దైవము తనకు అన్యముగా, దూరముగ, ఆకాశమునందో, గుడులు గోపురములలోనో పుణ్యతీర్థములయందో, మఠములు గురువులయందో దాగియుండెననియే భ్రమ. మరికొందరికి ప్రార్థించగా–ప్రార్థించగా, ధ్యానించగా ధ్యానించగా, దైవము ఏ స్వర్గమునుండియో దిగివచ్చి వారి హృదయములలో ప్రవేశించునని వెర్రినమ్మకమును గలదు.

దైవము తనకు వేరుగ,దూరముగ నుండెనన్న భేదభావనయే అజ్ఞత. మానవునకు, దైవమునకు మధ్య మాయ తెరగా, అడ్డుగోడగ నిల్చి అహర్నిశములు దైవ సన్నిధిని అనుభవింపనీయకుండ అంధునిగ, బధిరునిగ, జడునిగ చేసి ఆడించుచున్నది. ఆహా! దైవ చిహ్నమై, దైవపుత్రుడు, ఆత్మ స్వరూపుడైన మానవునకు ఎంతటి హీనమైన, దిక్కులేని నిస్సహాయస్థితి వచ్చినది? ప్రియమైన ఆత్మ సోదరులారా ! మీరు ఎన్నడైనను పక్షవాతము వచ్చి కాళ్ళు,చేతులు పడిపోయిన వారిని చూచి యుంటిరా? వారికి అవయవములున్నను వానిని ఇతరులు తాకిన జ్ఞప్తిగాని స్పృహ గాని కలుగదు. కొన్ని వ్యాధులకు సూది గ్రుచ్చినను పాపమా రోగికి తెలియదు. ఆ అవయవముల నుండి చైతన్యమే పోయి యుండును.

అటులనే కొందరు మనుజులు ధనవంతులై, బలవంతులై, విద్యావంతులైనను, వారి అవయవమును దైవసేవలో వినియోగించకుండ ఏ పక్షవాతమునకో అర్పించ బడినట్లు పూర్తిగా విషయ భోగములకు అర్పింపబడి, బ్రతికియుండియు దైవమునకు అంధులై, చెవిటివారై, మూగవారై, నిస్సృహులై జీవన్మృతులుగ నుండుట చాల విచారకర విషయము.

ప్రియమైన ఆత్మీయులారా ! మీ జ్ఞాన నేత్రములను తెరచి గాంచుడు. బాహ్య నేత్రములకు గానవచ్చుచున్న ఈ ప్రకృతి యంతయు దైవమే. ఈ ప్రశాంతమైన గాలిలో దైవశక్తియే, మీకు వినిపించెడి దంతయు దైవశబ్దమే. దైవమే అనంతశబ్దములుగ అనంతరూపముల ప్రత్యక్షమగుచుండెను. ఇన్ని విధములుగ దైవత్వము వ్యక్తమగుచుండగ ఇక దైవమునకై శ్రమపడి వెదుకనేల? గాఢ సుషుప్తి నుండి మేల్కొని మీ చుట్టును ప్రకాశించుచున్న దివ్య తేజస్సును కండ్లతో గాంచుడు. చెవులతో దైవగానము వినుడు. నోటితో హాయిగా స్వేచ్ఛగా దైవనామము నుచ్ఛరించుచు జీవన్ముక్తులగుటకు ప్రయత్నించుడు. మీరు దైవమునెంత మరచి యున్నను ఆయన మీ హృదయనివాసిగ ప్రతి కదలిక యందును వ్యక్తమగుచు, మీరు అంతర్ముఖులై,తననే దర్శించుటకెదురుచూచు చుండెను. దైవము అనాదిగ ఆత్మలకు ఆత్మయై యుండెనను భావనను స్థిరము చేసినచో అదియే మీకు పూర్తి శాంతిని నూతనశక్తి నొసంగును. ఇప్పుడొక్క తరి కండ్లను మూసి సర్వాంతర్యామియు, సచ్చిదానంద స్వరూపుడైన దైవమును ధ్యానింతుము. మరల కండ్లు తెరచినపుడు విశ్వమంతయ సర్వము దైవమయముగనే గాన వచ్చునుగాక.

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

( 2-6-68 సాయంత్రం 6-30 )

# 53. దైవము మేల్కాంచియుండ నేనెటుల నిద్రించగలను ?

నేడేలనో అర్ధరాత్రిలో మెలకువ వచ్చి మరల నిద్రించుటకు ప్రయత్నించినను, నిద్రరాలేదు. ఒకటి,రెండు, మూడుగంటలయ్యెను. అప్పుడీ భావన కలుగుటచే నా భావనలను నిద్రించెడి వారితోను, మేల్కొనియున్న వారితోను పంచుకొనుటకు వ్రాయు చుంటిని.

ఆహా! దైవము మేల్కొనియుండ నేనెటుల నిద్రించగలను అనెడి భావన ఎంత మహత్తరమైనది ? కాని మానవులు మాయ ప్రభావముచే, దైవము సర్వాంతర్యామిగా తమలోనే యున్నను, సర్వవ్యాపకుండై అంతటను వ్యాపించియున్నను, సర్వజ్ఞుండై జాగ్రతస్వప్న సుషుప్త్యవస్థలలో తమను రక్షించుచున్నను, తమ జన్మకు కారకుడై నఖశిఖపర్యంతము నిండి నిబిడీకృతమైయున్న దైవమును జాగ్రదవస్థలోనే గమనించ జాలనప్పుడు, ఇక నిద్రనుమాని, ఈ మహత్తర సత్యమును ఎట్లు తెలిసికొనగలరు? దైవము ననుభవించెడి జీవితములు, ఆ దివ్యశక్తిని ఆంతర్యమున బాహ్యమున గుర్తించెడి జీవితములు, జాగ్రత్ నిద్రావస్థల యందును ఆ భగవంతుని ఉనికిని గమనించెడి జీవితములు, పూర్ణముగా సచ్చిదానంద స్వరూపమును బోలియున్నవి.

ఇక దైవమును మరచిన జీవితములు, అసలు ఆ శక్తి, ఉనికినే గుర్తించజాలని జీవితములను నిస్సారమై, కళావిహీనమై, జలము నుండి పొడినేల మీదపడి గిలగిల కొట్టుకొను మత్స్యముల జీవితములతో పోల్చవచ్చును. అట్టి జీవితములు భూభారమే.

దైవము ఆంతర్యమున, బాహ్యమున, అన్నివైపులను, భూతభవిష్యద్వర్తమాన కాలములలో కోటిసూర్య ప్రకాశమానమై, దివ్యతేజస్సుతో ప్రకాశించుచుండ, దైవ పిపాసకులు కూడ ఈ ఆత్మ తేజస్సును మరచి ఒక్కక్షణమైనను ఎటుల జీవించగల్గు చుండిరో గదా !

అట్టి పరమ పావనస్థితి ననుభవించు బ్రహ్మవిదుడు దైవమును మరచి క్షణ ములో కోట్యంశకాలమైనను జీవించి యుండజాలనని నుడివి యుండెను. వాస్తవ మునకు మరుపే చావు. దైవమును మరచుటే నిజమైన మృత్యువు. మృత్యువనునది యెప్పుడో వచ్చునని, యెచ్చటనో దూరముగా నున్నదని భ్రమించుదురు. అది తమను వెన్నంటి తమలోనే యున్నది. తమ మనస్సే మృత్యువునకు, మోక్షమునకు హేతువు. మనస్సును నశింపచేసినవారే జీవన్ముక్తులు. నిద్రయునగ నెట్టిదో యెరుగని ఆ దివ్య తేజస్సును దర్శించుటకిదియే సమయము. మరుపన నెట్టిదో తెలియని ఆ సచ్చిదానంద స్వరూపమును దర్శించుటకిదియే తావు.

దైవము మేల్కొనియుండ మనమెటుల నిద్రించ గలము ? దైవత్వము ననుభ వించగల వారికి రాత్రియని, నిద్రయనునది యుండునా ?

యానిశాసర్వభూతానాం తస్యాం జాగర్తి సంయమీ

యస్యాం జాగర్తి భూతానిసానిశా పశ్యతోమునేః

కోటిమందిలో నెవ్వరో ఒక్క మహానుభావుడు తప్ప మాయచే ఆవరింపబడి మానవులందరు దైవమును పగలు మరచి నిద్రించు చుండుట చాల విషాదకరము. ఇంత అంధకారయుతమైన ప్రమత్తతకు, అజాగ్రత్తకు కారణమేమి? అసలు మానవునకు సర్వాంతర్యామి యైన దైవమునందు నమ్మకమున్నదో లేదో తెలిసికొనవలసి యున్నది. దైవమును గురించి మాటాడుమని కోరిన గంటలకొలది మాట్లాడును. కాని అనుభవము శూన్యమైనందున, ధ్యానము చేయుచున్నపుడు గూడ నిద్రపోవుచునే యుండెను.గ్రంథ కాలక్షేప సమయములందును, హరి కథలు చెప్పెడి తావు లందును మానవులు కునికిపాట్లు పడుచుండుటకు కారణము భక్తిహీనత, అజ్ఞానయుతమైన ప్రమత్తతయే.

దైవముననుభవించుటకు ఆత్మ సమ్మతించినను దేహము అనగా, చంచలమైన మనస్సు చాల దుర్భలత్వముగా నున్నదని ఒక మహనీయుడు నుడివియుండెను.

ఏ దైవము నేత్రములకు నేత్రమై, మనస్సులకు మనస్సై, శ్వాసకు శ్వాసయై, నిరంతరము మనలో దివ్య తేజస్సుతో వెలుంగు చుండునో, ఆ దివ్యతేజ స్వరూపు నిప్పుడే సన్నిహితముచేసి కొనుటకు, కాదుకాదు, ఆ దివ్యతేజస్సులోనే జీవించుచుంటి మని జ్ఞప్తియందుంచుకొని కృతనిశ్చయులమై, నిద్రవచ్చునపుడు గూడ ఆ దివ్యతేజస్సు లోనే నిద్రింప ప్రయత్నించెదము గాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 18-4-69 )

ఉదయం 5-00

# 54. ఆరిపోవని జ్యోతి

శుభవార్త ! ఆనందకరమగు సందేశము, ఆరని జ్యోతిని గూర్చి శాశ్వతమగు జ్యోతిని గురించి, సనాతనము, అనంతము, సత్యగర్భితమునగు జ్యోతిని గురించి, అన్నింటికంటె విశేషించి తన అస్థిత్వమును నిర్ధారణచేయుటకు వేరొక వెలుతురును కోరని దేదీప్యమానమగు వెలుగును గురించి ఎప్పుడైనను మీరు వినియుంటిరా?

శాశ్వతమైన, ఆరిపోవని దీపమును కూడ చూచితిమని కొందరు చెప్పుచుందురు. కాని వారు తమ చర్మచక్షువులతో దానినెట్లు చూడగల్గుదురు? సొంతములగు నీ కన్నులతో చూచుటకదియేమి యొకవస్తువా ? దానిని గురించి ఎవరు చెప్పగలరు? దాని నెవ్వరర్ధము చేసికొనగలరు ?

అయినను పృధ్వి యందుగల ప్రతివ్యక్తికిని, ఆరని జ్యోతి సామాన్య వారసత్వము, దివ్య జన్మసత్వము, మనమా జ్యోతినెరింగినను ఎరుగక పోయినను, దానిని వర్ణించి చెప్పగల్గినను చెప్పలేకపోయినను, దానిని చూడగల్గినను చూడలేకపోయినను, చివరకు దానిని గురించి చింతించ గల్గినను చింతించలేకపోయినను కూడ నిత్యము మన కన్నులలో మెరయుచు పరిశుద్ధమగు మనహృదయము నిశ్శబ్దములో మౌనముగ దగ్గరను దూరముననను కూడ తన తేజమును వెదజల్లు దివ్యతేజ మొకటి యెల్లప్పుడును కలదనుట అనుభవ వేద్యము.

అట్టి నిర్వాణరహితమగు జ్యోతిలో తాదాత్మ్యము నొందినవాడు ధన్యుడు. ప్రతి పురుషునియందు, ప్రతి స్త్రీయందు వారికాజ్యోతిలో నైక్యమొందుటకు సాయ పడునది, దారిచూపునది, ఏదియొ ఆంతర్యమున నున్నది. మనము శ్రద్ధతో దాని ననుసరించినచో అది మనలను ఉత్తమమైన, పవిత్రమైన ఆత్మజ్యోతిలో లీనము చేయును.

మనకు కలిగినదాని నుపయోగించినచో నది వృద్ధిచెందును. గనుక ఆ జ్యోతిని గుర్తించుట కిప్పుడే శ్వాసానుసరణమును సాధన చేయుదుము. సాధకునకు కావలసినది సాధన. తనకు తెలిసిన కొలది మాత్రమును సాధనచేయుటయే, దానిచే నతడు మెట్టు తరువాత మెట్టునకు, శాంతి, ధన్యత, ప్రకాశము అనువానికి స్థావరమైన పరమునకు గొనిపోబడును.

ఆ జ్యోతి మరగుపడినచో దానిని మన మనుభవించలేము. అది దూరమున నున్నచో దానిని చూడలేము. అది వేరుగనున్నచో దానిని గుర్తించలేము. అందుచే, నిదిగో, అత్యంత సుఖదాయకమగు వార్త. ఆ జ్యోతి శాశ్వతముగ అవినాభావముగ లోపల నుండుటచే ఇప్పుడే, ఇచ్చటనే దానినుభవింప వచ్చును. అది సర్వగతమును, సర్వంసహా సర్వస్వమగుటచే మనము దాని నన్నిప్రదేశములలోను చుట్టుప్రక్కల నంతటను గాంచవచ్చును. భక్తియుతమగు హృదయముతో ప్రకాశించుచున్నందున పరిశుద్ధమగు హృదయ నిశ్శబ్దతలో దానిననుభవింప వచ్చును. అది హృదయమునకు హృదయము, శ్వాసకు శ్వాస, ప్రాణమునకు ప్రాణము, ఆత్మకు ఆత్మ. ఆ జ్యోతి

అంతరంగముననేగాక బాహ్యమున కూడ నున్నది. అది నీ జాగ్రత్స్వప్న సుషుప్తి స్థితులకు సాక్షియైయున్నది. అది భూత, భవిష్యద్వర్తమానములలో సమానముగనే యున్నది. ఆరాధ్యమగు ఓ దివ్యతేజమా! నీవు బాహ్యాంతరములలోను, ఉపరి పృధ్వీతలములలోను వుండి మాతనువులలోని ప్రత్యణువునందును అంతర్గతమయి యున్నావు. నీవిపుడే ఇచటనే యున్నావు. ఇపుడు మాత్రమే గాక నిత్యము నిన్ను తెలిసికొనుటగాక మేము చేయగల్గిన దేమున్నది ? ఋషులును, జ్ఞానులును నిన్ను తెలిసికొని జ్ఞానయుతమగు మౌనములోనికి దొరలిపోయిరి. నీ దివ్యతేజము ముందు మేము కూడ మునులమగుదుము గాక !

ఓం ! ఓం ! ఓం !

పవిత్రమగు శ్వాస సనాతనమగు ప్రాణమునకు ప్రకాశము నిచ్చు దేదీప్యమాన మయిన జ్యోతికి చమురువంటిది. ముముక్షుత్వము అజ్ఞానతిమిరమను మాలిన్య మును భస్మీపటలముచేసి మానవుని విశ్వానందము అతిలోక మహిమయను దివ్యోపరి తలములకు గొనిపోవు ముముక్షకాంతులనీను వత్తివంటిది.

ప్రియ పాఠకులారా ! మనమిదివరకే ఏ దేదీప్యమానమగు తేజముచే నింపబడి, చుట్టబడి, అతిక్రమింపబడి యుంటిమో, ఆ నిర్యాణ రహితమగు జ్యోతి సవికార మయిన ఈ జగత్తులో నేకైక సత్యమగు నీ యవిచ్ఛిన్న జ్యోతిలో మన మిప్పుడును, ఎప్పుడును కూడ నిశ్చితముగ మునిగియున్నాము.

నిర్యాణరహితమగు జ్యోతియే మన జీవితమునకు పట్టుకొమ్మగను, మన అస్థిత్వమును కానందముగను, మన ఆకాంక్షలకు ఆత్మగను పరమావధిగ నుండుగాక!

ఆ జ్యోతియే మన తలంపులలో తలంచునది. మన మాటలలో పలుకునది. మన చేతలలో వ్యక్తమగునది. నిశ్చయముగ ఆ నిర్యాణములేని జ్యోతియందే మనము కదలుచు, పనిచేయుచు, శ్వాసించుచు ఎల్లప్పుడును మన యస్తిత్వమునే కలిగి యున్నాము.

అవిచ్ఛిన్నమగు జ్యోతికే. సనాతనమగు జ్యోతికే, అగ్రాహ్యమగు జ్యోతికే స్వయం ప్రకాశమును, శాశ్వతమును, అనంతమునగు నిర్యాణములేని జ్యోతికే అన్నిప్రణామ ములు. ఆ జ్యోతిని గుర్తించుటయే మన ప్రణామము. ఇపుడును, ఎపుడును కూడ ఆ జ్యోతిని తెలిసియుండుటయే మన నిజమైన ప్రణామము. పరాత్పరునకు నిజమైన యర్పణము, నిర్యాణము లేని జ్యోతి పూర్వ పశ్చిమదేశములలో గల వారందరికిని తన దేదీప్యమానమయిన వెలుంగును ప్రసాదించుగాక !

సర్వేజనా స్సుఖినోభవంతు

ఓం శాంతి శ్శాంతి శ్శాంతిః

( 13-9-70 )

# 55. ముందుకు నడువుము

ఒకానొకప్పుడు పుల్లలమ్ముకొనువాడొకడు ఒక అడవిలోకి కట్టెలు కొట్టుకొనుటకై వెళ్ళెను. అచ్చట అతనికి ఒక పవిత్రమైన బ్రహ్మచారి కనిపించి యిటుల చెప్పెను.

"ఓ మిత్రుడా ! ముందుకు వెళ్ళుము."

ఆనాడు ఇంటికి వెళ్ళిన తరువాత, పుల్లలు కొట్టెడివాడు "బ్రహ్మచారి నన్ను ముందుకు వెళ్ళుమని ఎందుకు చెప్పెను." అని తనను తాను ప్రశ్నించుకొనెను. అటుల కొంతకాలము గడిచెను. ఒకరోజున బ్రహ్మచారి మాటలు జ్ఞప్తికి తెచ్చుకొని తనలో ఇట్లనుకొనెను. "నేడు తప్పక అడవిలోపలికి వెళ్ళెదను". మరునాడు అతడు అడవిలోపలకు చాల దూరము వెళ్ళుటచే, అచ్చటనేకమైన మంచిగంధపు చెట్లను కనుగొని, చాల ఆనందించి, బండ్లకొలది గంధపు చెక్కలు తెచ్చుకొని, వానిని బజారులో అమ్మి చాల ధనవంతుడాయెను.

మరికొంతకాలము గడిచిన తరువాత, మరల ఆ పవిత్రమైన సాధువు "ముందుకు వెళ్ళు" మని చెప్పిన మాటలు జ్ఞాపకము తెచ్చుకొని అతడు ఇంకను దట్టమైన అడవిలో ప్రవేశించి చాలదూరము వెళ్లగా, అచ్చట ఒక నదివొడ్డున వెండిగని నొకదానిని చూడగలిగెను. ఇది అతని స్వప్నముల కన్నిటికి అతీతముగా నుండెను. ఆ గనిలో లభించిన వెండి నంతయు త్రవ్వి బజారులో అమ్మెను. అతడు ఎంత అధికముగా డబ్బు సంపాదించెననగా అతని వద్ద డబ్బు ఎంత వున్నదో అతనికే తెలియకుండెను. మరికొన్ని రోజులు అటులనే గడిచి పోయెన. మరల నొక రోజున అతడీ విధముగా తలంచెను. "బ్రహ్మచారి నన్ను వెండిగనియొద్దనే ఆగమనలేదు. ఇంకను ముందునకే వెళ్ళుమని చెప్పెను." ఆ మర్నాడతడు నది అవతలి ఒడ్డునకు వెళ్లగా అక్కడ బంగారు గనిని గాంచెను. అతడాశ్చర్యముతో "ఆహా ! ఇందుచేతనే ఆ మహానుభావుడు నన్ను సదా ముందుకే వెళ్ళుమనె" నని తలచి, మరల కొన్ని రోజులైన తరువాత, అతడింకను ఉత్సాహముతో, చాలదూరము శ్రమపడి నడువగా, నడువగా, అచ్చట గుట్టలకొలది వజ్రములు, తదితరముల మణులను గాంచెను. వాని నన్నింటిని తీసికొని పోయి, అతడు కుబేరుడంతటి ధనవంతుడాయెను.

అతడంతటితో తృప్తినొందక, తరువాత మరీ దట్టమైన అడవిలో ప్రవేశించి వెళ్ళగా, వెళ్ళగా కాళ్ళునొప్పులు తప్ప మరే నిధులు కనిపించలేదు. కాని ఎదురుగా మంచి ముఖవర్చస్సు గల ఒక సాధువు కనిపించెను. అతనిని సమీపించగా, "నీవెవరవు!" అని ఆ సాధు ప్రశ్నించెను. అతడు సాధువునకు తన కథనంతయు చెప్పగా–అప్పుడా సాధు విట్లనెను.

"నాయనా! నీవు బ్రహ్మచారి చెప్పిన మాటలు పూర్తిగా అర్థము చేసికొనలేదు. చందన,రజిత,హిరణ్య వజ్రాదులు ఇచ్చు స్థితికన్న, మరియొకటి వున్నది దానివల్ల మనిషికి ధర్మార్థ కామ మోక్షములను నాలుగు ప్రయోజనములున్నవి. అందు అర్థ

కామములు నీకు సంపూర్తి అయినవి. ఇక కావలసినది మోక్షము. ఆ మోక్ష మార్గము నకు ఉపదేశము పొందుటకే ఆ బ్రహ్మచారి 'ముందుకు వెళ్ళు'మని చెప్పెను. ఆ మోక్ష మార్గము చూపుటకే నీకు నేను ఎదురైతిని," అని అతనికి మోక్షమార్గముప దేశించెను. ఆ కట్టెలవాడు సర్వోత్కృష్టమైన జీవన్ముక్తిత్వమును పొందెను.

సాధకా ! నీవేమి సాధన చేసినను, ముందుకే వెళ్ళుట నేర్చుకొనిన యెడల, కడపటికి నీవు కోరిన సర్వవస్తువును (దైవమునే)పొందగలవు. నీవు ప్రారంభమున జపము చేసిన ఫలితముగ కొంత ఆనందము కలుగు వచ్చును. దానితో నీ జ్ఞాన జీవితముయొక్క గమ్యస్థానమును చేరితినని భావించకుము. చిన్న చిన్న పనులు, సాధనలు మానవజన్మ గమ్యస్థానము గాదు. సదా ముందుకు వెళ్ళుము. అప్పుడు మాత్రమే స్వార్థరహితమైన సేవను చేయగలవు. విశాల ప్రేమహృదయుడవు కాగలవు. ఫలితము కోరని పనియే నిజమైన ఆరాధన, కఠిన పరీక్షలతో కూడిన సాధనయే, దైవ సాక్షాత్కారమునకు సరియైన, నిజమైన మార్గము.

లోకా స్సమస్తా స్సుఖినోభవంతు.

( 17-3-71 )

# 56. నాకీ యొక్క శ్వాసయే చాలును

ఆధ్యాత్మిక ప్రపంచమున కొన్ని రూఢియైన వచనములున్నవి. అవి సత్యాన్వేష కుల ధార్మికజీవన పురోగమనమునకు అపారముగ తోడ్పడెడివి. ఆత్మయాత్రా పరిణామము ముముక్షువు జీవితములో 'శ్వాస' వహించు గొప్ప పాత్ర. వినుట కింపుగ నుండుటయేగాక, యిది యీ యునికికే మూలాధారమని గ్రహించి అర్థము చేసుకొనువారికి అత్యంత సహాయకారిగ కూడ నుండును. భగవంతుడు 'శ్వాసకే శ్వాస యను మాట' యెంత సత్యము ! ఈ క్రింది వాక్యములు వ్యక్తిగతముగ నా స్వాత్మాభివృద్ధికి, ఆధ్యాత్మిక సంస్కారమునకు అత్యంత సహాయపడినవి :

1. ఈ ఒక్క అడుగే నాకు చాలును.
2. ఈ ఒక్క క్షణమే నాకు చాలును.
3. ఈ ఒక్క శ్వాసయే నాకు చాలును.

1. అడుగు ! నిత్య జీవితములో ఊరకగాని, పనియుండిగాని మనము వేయు ప్రతి యడుగు, మనలను భగవంతుని కడుకు కొనిపోవుచున్నది. ముముక్షువు తన దైవిక జీవితమును తన మొదటి అడుగుతోనే ప్రారంభించి, అది తనను భగవంతుని కడకు ఆతని సర్వోపస్థితిలోనికి గొనిపోవుచున్నదని జ్ఞప్తియందుంచుకొనవలెను.

2. క్షణము ! గతము గతించిపోయినది, భవిష్యత్తు నమ్మదగనది. మనకు చెందినది సూక్ష్మము, అమూల్యమునగు ప్రస్తుత క్షణము మాత్రమే. ఈ అమూల్యమైన క్షణముతో ప్రపంచము నంతను కొనివేయగలము. వ్యక్తుల జీవితములను, జాతుల అదృష్టములను బాగుచేయగలము. పాడు చేయగలము. స్థిరపరుపగలము, మార్చ గలము, మనలను భగవంతుని సర్వశక్తి సంపన్నతలోనికి గొనిపోవగల యీ ప్రస్తుత సూక్ష్మక్షణము యొక్క శక్తిని, మహిమను గుర్తించినవాడు ధన్యుడు.

3. శ్వాస ! ఇప్పుడు మనము సృష్టికిని, సమిష్టికిని కూడ ఆత్మయు, ప్రాణము నకు మహత్తరమైన శక్తిగల సూక్ష్మ శ్వాసను గురించి యాలోచించవచ్చును. శ్వాస వలననే మనము జీవించుచున్నాము. జగత్తంతయు శ్వాసవలననే జీవించు చున్నది. శ్వాసను నియమించినవాడు అన్నింటిని నియమించగలడు. లోపల నున్నదియే వెలుపల నున్నది గనుక, లోపలి శ్వాసను గుర్తించినవాడు, బాహ్యాంతరములలో నున్న భగవంతుని కూడ తెలిసికొనగలడు. అనుక్షణము ఎవరికి జీవితము శ్వాసతో కేంద్రీకరింపబడి, సర్వజ్ఞత్వముతో జీర్ణించునో అతడు ధన్యుడు.

నీ ప్రస్తుత శ్వాస నీపూర్వ శ్వాసలన్నింటికిని, ప్రపంచోత్పత్తి నుండి యున్న శ్వాసలన్నిటికిని 'వారసుడని' నీకుతెలియదా? ఏలయన శ్వాస ఒక్కటే. స్థూలపదార్థమే నశించినప్పుడు, సున్నితమును, సూక్ష్మమునగు శ్వాసయంతకంతము గాని, వినశ్వర ముగాని ఎట్లగును? దేవుడు అంతర్వర్తి యగు తేజము–శ్వాసకు శ్వాస, ప్రాణమునకు ప్రాణము. ఆత్మకు ఆత్మ అయి యున్న బుద్ధికతీతమగు శాంతి, వినశ్వరమగు

దేహము యొక్క క్షణిక నామరూపములతోగాక, నాశనములేని శ్వాసతో తాదాత్మ్యము పొందగల్గిన అరుదగు ధన్యజీవులకు లభించును. దైవ మానవుడు గతమునే గాక, ఒక్క శ్వాసతో వర్తమాన భవిష్యత్తులకు గూడ ప్రాతినిధ్యము వహించుచున్నాడు. అతని శ్వాసలో దేశకాల నిమిత్తములు కూడ నిమిడి యుండును.

అర్ధరాత్రి నిశీధి సమయమున నేనీ పవిత్రమయిన విషయమును గురించి ఆలోచించుచుండ, నాగదిలోనే నిద్రించుచున్న ఆశ్రమ నిర్వాహకుని గురక నాకు విన్పించుచున్నది. సర్వశ్వాస, విశ్వశ్వాసతో అవిభాజ్యమును, శాశ్వతమునగు నైక్యమును తెలిసికొనవలెనను జిజ్ఞాసతో అతని శ్వాసను గమనించుచు అనుసరించితిని. నాలోని శ్వాసకు, అతనిలోని శ్వాసకు, నీలోని శ్వాసకును భేదమేమి? శ్వాస యంతయు, ఇప్పుడు మాత్రమేగాక, ఎల్లప్పుడు నొకటియేగదా! నాడు నేడు, తూర్పు పడమరలలో నుద్భవించిన జ్ఞానుల, మహాత్ముల, రక్షకుల, ప్రవక్తల యందరి జీవితములలో నుండి పనిచేసినదీ శ్వాసయేగదా!

నిశ్చయముగ భౌతిక ప్రపంచమును జయించుటకీ యొక్క శ్వాసయే చాలును. మనము శ్వాస ననుసరించినచో అంతవంతము, అనంతమునగు శ్వాసకడకు గొనిపోవును. లోపలి శ్వాసయే విశ్వశ్వాస యగును. ఇప్పుడు మన హృదయములను ఆనందముతోను, ఆత్మలను శాంతితోను నింపుకొని, 'సోహం' శ్వాస యొక్క శక్తి మహిమలను గురించి ధ్యానింతుము. వ్యక్తా వ్యక్తముల రెంటియందును శ్వాసలకు శ్వాసయయిన దానికి అద్వితీయమైన పరబ్రహ్మమునకే ప్రణామములు.

సర్వేజన స్సుఖినోభవంతు

( 11-5-72 )

# 57. దైవమును మరచుట అసాధ్యము

ఆ.వె. "మేనుగాను, నేను మేను నాకునులేదు,
జీవుడేనుగాను, చిన్మయుండ"
అనెడు తెలివినేను, నటుగానక్షరమైన
జీవితేచ్ఛయేల, జేయవలయు

తా. శిష్యరత్నమా స్థూలమగు నీ దేహంబును, తక్కిన సూక్ష్మకారణంబులనెడు రెండు రెండు దేహంబులును నేనుగాను, ఏకాలమందును నాకు మూడు శరీరములు లేవు. నేను జీవుండను, ప్రతిబింబ చైతన్యుడునుగాను. సదా జ్ఞానస్వరూపుండను, అని పలికెడు తెలివియును నేనుగాను, అక్షర పరబ్రహ్మ స్వరూపుండనుగాను.

మానవులకు దైవమును మరచుట అసాధ్యమైనదన్నవార్త యెంత ఆనందకర మైనది. ఈ చిన్న సమస్యను, వ్యాసము యొక్క సారాంశమును దైవపరితాపముతో నిండి యున్న భక్తవరేణ్యులు, అనుభవముగా గ్రహించిన, వారింక ఆసన ప్రాణాయామములు చేయుచు, దైవమునకై పరితపించ నవసరములేదు. ధ్యానము కూడ చేయనవసరము లేదన్నవార్త, చంచలమైన మనస్సును నిరోధనచేయజాలక, వివిధమైన అవస్థలు పడుచున్న సాధకులకు, ఎంతయో ఆహ్లాదకరమైన వార్తగా నుండును గదా !

భుజించనున్న పిండివంటలను, ముందుగా నుంచుకొని, దానిని వర్ణించుట కంటె, వెంటనే భుజించుటే మంచిదిగాన విషయములోనికి దిగుదము.

ప్రియ పాఠకా ! యిప్పుడే నేను, కైలాసములో బద్రి, కేదార శిఖరములు చుట్టు పచారుచేసి వచ్చుచుండ, నాకు కలిగిన భావనలు మీతో పంచుకొనుటకు, లేక అనుభవించుటకు కోరుచు, నిప్పుడిది వ్రాయుచుంటిని.

మనము నడుచుచుండ, మనలో కదలెడిశక్తి దైవశక్తియేగదా ! ఆ శక్తిలేని ఎడల మనము కదలజాలము. చివరకు గడ్డిపరకయైనను కదలజాలదు. మనతో నడిచెడిది దైవమైయుండ, దైవమును ఎటుల మరువగలము? ఏవైపునకు వెళ్ళినను, ఎచ్చటకు నడిచినను అంతయు దైవమే. దైవము వైపునకే నడచుచుండుటేగాక, మనలో నడిచెడిది, కదలెడిదంతయు దైవమే.

మనలో నడుచుచున్న, లేక కదులుచున్న శక్తిని అటుల ఉంచుదము. మనము నడవనప్పుడు, కదలనప్పుడు ఈ శక్తి ఏమి చేయుచున్నది? అప్పుడు ఈ శక్తి అవ్యక్తమై ప్రకాశించుచున్నది. అంతయు దైవశక్తియే ! దైవము మనలో కదలుచుండ, ఆలోచించు చుండ, అట్టి శక్తి స్వరూపమును, దైవమును ఎట్లు మరువగలము? దైవమును మరచుట అసాధ్యముగదా ! నడువనప్పుడు, ఆలోచించనప్పుడు, నిద్ర పోయెడి సమయమందో అని మీరు ప్రశ్నింపవచ్చును. అప్పుడు ఈ దైవశక్తి మీ

శ్వాస రూపముగా అహర్నిశలు పనిచేయుచున్నది. నీవు మరచుటకు ప్రయత్నించి నను,అది నిన్ను మరువకుండ, స్వప్న, సుషుప్తి అవస్థలలో ప్రతి క్షణము నందును సోహం భావనతో నున్నదొక్కటే. అదియే నేను, తత్త్వమసి, సోహం అస్మి, అనుచుండ మీరు దైవమును మరచుటకు సావకాశమేది? గాఢమైన సుషుప్తి అవస్థలో గూడ మీ స్వస్వరూపమును మరువజాలదన్న వార్త యెంత ఆనందమైనది?

పనులచే, పనులలో దైవధ్యానము చేయజాలకుంటిమని వేలకొలది జనులు సదా చెప్పుచుందురు. ఈ చిన్న వ్యాసములో సారాంశమును గ్రహించిన వందలాది పనులు చేయుచున్నను, మీరు దైవమును ఆనందముతో అనుభవించగలరు. ఏలనన మీలో పనిచేయుచున్న శక్తి, ఉచ్ఛ్వాస నిశ్వాసలలో, శాంతిని 'సోహం' భావనతో పూరించుచున్న శక్తియు ఒకేశక్తి! అదియే అద్వితీయమైన, అఖండమైన దైవశక్తి ఆదిశక్తి. ఇంక వ్రాయుటకేమున్నది? మీలో చూచుచున్నది అది ! వినుచున్నది అది! చదువుచున్నది అది ! ఆలోచించుచున్నది అదియే !

ఆత్మీయులారా ! రండు, మేల్కొనుడు ! పెక్కుమాట లేల ? అమృతతుల్యము లయిన, ఆధ్యాత్మికపు విందును గ్రోలుటకిదియే సమయము. ఈ క్షణమే మనది గాన ఎచ్చట వారచ్చటనేయుండి, తమలో అంతర్యమున, బాహ్యమున, ఆపాదమస్త కము అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించి నిబిడీకృతమై సర్వకాల సర్వావస్థల యందును వెలుంగుచున్న యీ సచ్చిదానందస్వరూపమును మనో వాక్కాయముల యందు వ్యక్తపరచుచు తరించెదముగాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు.

( 11-7-73 )

ఉదయం 8-30

# 58. నిన్ను నీవు సంస్కరించుకొనుట

ఈ ప్రపంచము ఇతరులనుద్ధరించెడి తలంపుగల వారితో నిండియున్నది. ప్రతి వారికిని, ఇతరులను సంస్కరింతుమన్న తలంపేగాని, తమను తాము ఉద్ధరించు కొందమను ఆలోచనలేదు. శ్రీరామతీర్థస్వామి ఈ విధముగా చెప్పిరి.

"సంస్కర్తలు కావలెను. ఇతరులను సంస్కరించువారు కాదు– తమను తాము సంస్కరించుకొనువారే."తనను తాను సంస్కరించు కొనుటలో ఆరంభమైన మతము, ఆత్మసాక్షాత్కారముతో ముగియును.

నిన్ను నీవు తెలిసికొనుము

నీ ఆత్మ సంస్కరణ వల్లనే హృదయాంతర్జ్యోతిని ముఖాముఖిగ కనుగొందువు. ప్రజల నుద్ధరించవలెనని ప్రయత్నించి ప్రయత్నించి విఫలుడనైతిని. ప్రస్తుతము నన్ను నేను సంస్కరింప మొదలిడితిని. కొంత వెలుగును చూచుచున్నాను. ఆదర్శ ప్రాయమైన జీవితమును గడుపుటయే యితరులకు మార్గదర్శమగును. అంతులేని ఉపన్యాసములు ప్రవచనములకన్న త్యాగమయ జీవితము ఆదర్శప్రదము, ఆనంద దాయకము.

ప్రశ్న : మానవుడు ఇతరులకేల ఉపదేశము చేయ ఆతురపడును ?

సమా : ఇతరుల కుపదేశము చేయుట చాల తేలిక గనుక – తన్ను తాను సంస్కరించుకొనుట, తనకు తానుపదేశించుకొనుట కష్టదాయకము. కాన ప్రయాస కరమైన యీ కార్యమును చేయుటకు మానవుడు పూనుకొనడు, నిష్ప్రయోజనము, నిరర్థకమైన పరుల సంస్కరణ ప్రయత్నము విరమించుట వలన అమూల్యమైన కాలము వ్యర్థము గాకుండును.

నీ హృదయ సంస్కరణ వలన అభ్యుదయము సాధింతువు. నీ అంతఃకరణ మున కొంత ప్రకాశము గాంతువు. నీ ఆహార పానీయములతోనే తొలుత సంస్కరణా రంభము గావలెను. ఆత్మోన్నతికి ఆహార నియమము ప్రధానాంగములలో నొకటి గాన, సహజము, నిర్మలము, సామాన్యమైన శాఖాహారమును భుజింపుము. 'నీ ఆహార మెట్టిదో చూచిన నీవెట్టివాడవో తెలుపగలను" అను సామెత యొకటున్నది. ఉద్రేకము కలిగించు నాహారము వర్జింపుము. సహజ స్వభావముతో, ముఖ్యముగ మితత్వముతో జీవించుము. విజయవంతమైన జీవితమునకు మూల మన్నిటను మితముగా నుండుట. అతిని విసర్జించుము.

నీ సంస్కరణకు దినదినమొక మైలురాయిగా భావించి ముందుకు పొమ్ము. ప్రభాతవేళ, శాంతి ప్రార్థనతోగాని, మరే యితర ప్రార్థనలతోగాని పని యారంభిం చుము. సర్వాంతర్యామియైన భగవంతుడంతటను నిండియున్నాడు. గాన నీకు నిర్ణీతమైన బాధ్యతలను రోజంతయు భక్తితో నెరపుచునే యాతని సాక్షాత్కరించు కొనుటకు ప్రయత్నించుము.

సర్వేశ్వరుడు మనతో లేని క్షణములేదు. మనమాతని యందే నివసించుచు, పనులుచేయుచు, కదులుచు, చివరకు ఉచ్ఛ్వాస నిశ్వాసములను తీయుచున్నాము. కృపామయుండైన దైవమును స్మరించుచు పనిముగిసిన పిదప నాతనిలో లీనమగుచు నిద్రింతుముగాక ! ప్రాతఃకాలమున మేల్కొనుచునే అంతటను, అన్నిటను, అందరిలో పరమేశ్వరునే చూచెదనుగాక ! యనెడి పవిత్రభావమును కలిగియుండుటకు నిర్ణయించుకొనుట యెంతటి శుభదాయకము. ఆనందమయమైన భావము.

"ఈశావాస్యమిదం సర్వం." అంతర్యమున, బాహ్యమున ప్రకాశించుచున్న ఈశ్వరునిచే ఈ ప్రపంచమంతయు నిండి నిబిడీకృతమై యున్నది. మాట్లాడుట తప్పనిసరియైనచో, అనవసర ప్రసంగములు చేయక, భగవంతుని గూర్చియే భక్తి ప్రేమలతో మాట్లాడుము. పరనిందలతో, అప్రస్తుత విషయములతో కాలము నెన్నడు వృధాచేయకుము.

'నిరంతరము ప్రార్థింపుము – గాఢముగ ధ్యానింపుము.'

భగవంతుని స్మరించుటయే నీకు ఆనందదాయకమగును గాక ! శబ్దరూప ప్రపంచ మాయననుండియే యుద్భవించినది. కావున ప్రతీ శబ్దమున ఆయన వాక్కునే గుర్తించుటకు ప్రయత్నించుము. నాదరహిత నిశ్శబ్దమే బ్రహ్మ. అనంత శాంతియే, నిశ్శబ్దమే ఆయన. నన్ను సంస్కరించుకొనుట మూలముననే నిజముగా ఇతరులనుద్ధరించుటకు ప్రయత్నించుచున్నాను. ఆదర్శప్రాయము, త్యాగమయమైన నా జీవన విధానము వల్లనే ప్రపంచమును మెరుగు పరచదలచుచున్నాను. వ్యక్తి శాంతియే సామాజిక శాంతికి మూలము, మన మనస్సుల, గృహముల, సంఘముల, దేశముల, తుదకు ప్రపంచమున శాంతి వ్యవస్థాపించి లోకశాంతికి తోడ్పడుదుముగాక !

నా హృదయసంస్కరణతో నా సంస్కారము ప్రారంభించబడుగాక ! తేజోమయుడైన దైవము వైపునకే నా సర్వప్రాణములు నిశ్వాసించుగాక ! లోకశాంతికై నా హృదయం స్పందించుగాక ! ఇతరుల బాగుచేయజాలను గాని నన్ను నేను బాగుచేసుకొని ప్రయత్నము చేయగలను. పవిత్ర హృదయములు భగవంతునికి ప్రియతములు, నిర్మలహృదయులకే శాంతియుండును. వ్యష్టి శాంతియే సమిష్టి శాంతికి, ప్రపంచశాంతికి మూలాధారము.

ప్రియతములారా! ప్రపంచశాంతికై మీరేమి అర్పించుచున్నారు? మీ పవిత్రత, మీ సంస్కారము, వానితోపాటు మిత, ప్రియ భాషిత్వము, నిశ్శబ్దతయే శాంతికి ముఖ్యావశ్యములు. సంస్కరింపబడి, ఆదర్శప్రాయమైన మీ జీవితములు భగవంతునికి సన్నిహితమగుటేకాదు, ఆయనతో తాదాత్మ్యము నొందును.

భగవంతుని బిడ్డలందరికి సుఖప్రదమగునుగాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు – ( 7-3-74 )

# 59. నేను దైవములో ఉంటిని

ఈ సృష్టి అంతయు దైవసృష్టియనియు, యీ జగమంతయు రామమయ మనియు అనేక గ్రంథములలో, అనేక విధములుగా చదువు చుంటిమి. ఈ విధము గానే అనేకమంది మహాత్ములు, అనేక విధములుగా నుడువుచుండిరి.

ఈ విశ్వమంతయు దైవసృష్టి అయినప్పుడు, పరమేశ్వరుని ఎచ్చట భక్తితో వెదకిన అచ్చటనే కనుకొనవచ్చును. దైవము యిచ్చటనుండి అచ్చట లేకుండ యుండక, సర్వవ్యాపకుండైనప్పుడు, నేను దైవములో ఉండక, నేనుగాదు, మానవు లందరు, మానవులేగాదు, యీ సృష్టి అంతయు దైవసృష్టియైనప్పుడు, యీ సృష్టిలో నున్న జీవరాసులన్నియు దైవములోనుండక, మరెవ్వరిలో నుండును ? కాని దీనిని కొందరు అనుభవముగా తెలిసికొనెదరు. కొందరు నోటితో మాత్రము ఈ జగమం తయు 'రామ మయము, దైవము సర్వవ్యాపకుడు' అని ఉచ్చరింతురు.

ఇప్పుడు నేను దైవములోనే వ్రాయుచుంటిని. నడచుచున్న దైవములోనే నడుచు చుంటిని, మాట్లాడుచున్న దైవములోనే ఆలోచించుచుంటిని. ఇక యిది అది అననేల? ఏది చేయుచున్నను, నేను దైవములోనే చేయుచుంటినని జ్ఞప్తికి వచ్చినంత మాత్రము ననే, యెంతయో నూతనశక్తి, ధైర్యముగా నుండును గదా ! ఇక దానిని సర్వకాల సర్వావస్థల యందును 'నేను దైవములో ఉంటిని' అని అనుభవించెడి వారి ఆనందము వర్ణనాతీతము. వర్ణనాతీతమేగాక, అట్టివారి జీవితములు ఎంత శాంతిగా, ఆనంద మయముగా నుండునో అనుభవించెడివారికే తెలియును.

'నేను దైవములోఉంటిని' అనెడి ఈ చిన్న వాక్యమును, ఒక మహామంత్రమువలె స్మరించినట్టి వారికి అంతయు, అన్నివైపులను దైవ తేజస్సుతప్ప వేరేమి కన్పించును? అట్టి వారిదే నిజమైన అనుభవము. అట్టి మహానుభావులకు ప్రణామములు.

దైవము మనకు గూడ అట్టిశక్తిని, అనుభవము నొసంగుగాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

( 2-2-75 )

- కూజాయందు గల ఆకాశము, ఆకూజా పగిలినపుడు దానికి వెలుపలగల మహా ఆకాశమునందెట్లు కలియునో అట్లే శరీరమును విడిచిన ఆత్మ, తన సర్వవ్యాపకత్వ, సర్వశక్తిత్వ, సర్వజ్ఞత్వములందు నిమగ్నమై పోవును.
- శాంతిని ఆపేక్షించు వ్యక్తి మొదట తన అంతరంగమందు మార్పును, దిద్దుబాటు చేసికొనవలయును.

# ౬౦. దైవము సర్వ వ్యాపకుడు

దైవము సర్వవ్యాపకుడు అనెడి ఈ చిన్న వాక్యమును, అనుభవనీయముగా ఆచరణలో నుంచిన ఎంత ఆనందమును, శాంతిని, శక్తినొసంగునో సాధకులైన వారికే అనుభవము.

దైవము సర్వవ్యాపకుడు, సర్వశక్తియుతుడు, మరియు సర్వజ్ఞుడు అనెడి ఈ చిన్ని మాటలు, నా ఆధ్యాత్మిక జీవితములో, ఎంతగా తోడ్పడినవో యీ ఖండమైన చిన్న మాటలలో వ్రాయజాలను. నాకే అననేల ! దైవపరితాపనతో నిండియున్న వారందరకు, భూత, భవిష్యద్వర్తమాన కాలములలో వారి సాధనాభివృద్ధికి తోడ్పడి తీరును.

ఈ చిన్న మూడు వాక్యములే నాకు బ్రహ్మ, విష్ణు మహేశ్వరులవలె గానవచ్చు చుండును. దైవము సర్వవ్యాపి అను నమ్మకము మనకు కల్గిన మనమేపనిచేయు చున్నను, ఎచ్చటెచ్చట తిరుగుచున్నను, దైవముయొక్క సర్వవ్యాపకత్వములోనె యుంటిమనియు, ఆ దివ్యశక్తి అణువు మొదలు బ్రహ్మాండము వరకు వ్యాపించి యున్నందున ప్రపంచము చివరకు వెళ్ళినను ఆ దైవసన్నిధిలోనే యుంటిమన్న సత్యమును మొదట స్థిరముచేయవలెను. ఈ సర్వవ్యాపకత్వమును అంతటను గుర్తించి స్థిరముచేసిన, ఏ పనిచేసినను, పనిచేయకున్నను, జనసమూహములో నున్నను, ఏకాంతముగా నున్నను, సిరిసంపదలచే తులతూగుచున్నను, పేదరికముచే బాధ పడుచున్నను, ముల్లోకములచే పూజింపబడినను, చివరకు కఠినశిక్ష విధించబడినను సర్వవ్యాపకుడైన దైవములో యుంటిమనెడు భావన ఎంత ఆనందమును మనశ్శాంతి నొసంగును.

దైవము – సర్వవ్యాపకుడు, సర్వవ్యాపకుడు, సర్వ వ్యాపకుడు, అని నిరంతరము స్మరించుచున్న, ఇదియే మంత్రములకు మహామంత్రముగా, ఉపదేశములకు ఉపదేశ ముగా సాధకుల అభివృద్ధికి తోడ్పడును.

ప్రియ ఆత్మీయులారా ! మీరు ఏమహానుభావు నొద్దనైనను ఉపదేశమును పొందియుంటిరా ! అటులైన ఈ సర్వవ్యాపకత్వమును ఉపదేశ సారాంశముగా గ్రహించి దైవసన్నిధినిప్పుడే అనుభవించుడు, ఇంతవరకు ఎట్టి ఉపదేశమును పొందని యెడల 'సర్వవ్యాపకత్వము' అనెడి ఈ చిన్నమాటనే, మహామంత్రముగా చేసికొని, మరల మరల స్మరించుచు సర్వత్రా వ్యాపించియున్న ఆ దివ్యశక్తితో తాదాత్మ్యము నొంద ప్రయత్నించుడు మీరు తరించుటకు, గమ్యస్థానము చేరుటకు, దుర్లభమైన మానవజన్మను సార్థకము చేసికొనుటకు యీ చిన్న వాక్యమొకటియు చాలదా ?

నిజముగా కండ్లులేనివారు అంధులుగారు. నేత్రములుండియు, దైవమును చూడజాలనివారే అంధులు. మన నేత్రములు దైవమును సర్వత్రాచూచుటకే ఉపయో గించవలెను. అదిగో చూడుడు! మీ నేత్రము లెటువైపు త్రిప్పి చూచినను దైవము

యొక్క సర్వవ్యాపకత్వమే. ఆ శక్తియే మీలో నుండి మీ నేత్రముల ద్వారా చూచుచున్నది. ఆహా ! సర్వవ్యాపక శక్తి ఎంత మహిమాన్వితము, ఎంత అద్భుతము. గుర్తించుడు ! పదే పదే ధ్యానింపుడు. ఆంతర్య, బాహ్యముల ననుభవింపుడు !

ఆత్మ సోదరీ సోదరులారా ! మాటలోనైనను, పాటలలోనైనను, ప్రార్థనలోనైనను, మౌనములోనైనను, నిద్రలోనైనను, సమాధిలోనైనను "నేను దైవము యొక్క సర్వవ్యాపకత్వములోనే యుంటిని" అని ఆనందముగా కంఠమెత్తి కీర్తించుడు.

సముద్రమునుండి కెరటము వేరుగాలేనట్లు, సూర్యుని నుండి కిరణము వేరుగా లేనట్లు, పృథ్వి నుండి అణువు వేరుగాలేనట్లు పరమాత్మ నుండి జీవాత్మలు వేరైయున్న క్షణము ఇదివరకుగాని, ఇప్పుడుగాని, ఇకముందుగాని నుండబోదు. మీరు సదా పరమాత్మలో జీవాత్మగా ప్రకాశించుచున్నారు. ఈ సత్యము నీ ప్రస్తుత క్షణము నందే గుర్తించి ఆనందముగా నుండుడు; ఇదియే మీ జన్మహక్కు.

లోకాస్సమస్తా స్సుఖినో భవంతు

( 16-2-76 )

# ప్రార్థన

సర్వ వ్యాపకుండవైన హే ప్రభు ! దీనదయాళూ ! సర్వకాల సర్వావస్థల యందును, సర్వములో నిన్నే గుర్తించెడి, నీ దివ్యస్వరూపమును గాంచెడి శక్తిని మా కొసంగుము.

ఈ నేత్రములు నిన్ను తప్ప అన్యమును

చూడకుండుగాక !

ఈ కర్ణములు నీ దివ్య నామామృతమునే సదా

గ్రోలుచుండుగాక !

ఈ వాక్కు నీ దివ్య ప్రభావమునే సదా కీర్తించుగాక !

ఈ మనస్సు నీ గురించియే సదా పరితపించుచు నీ

దివ్య తేజస్సులో విలీనమగుగాక !

నా హృదయము నీ కొరకే కొట్టుకొనుచు,

నీ విశ్వహృదయములో విలీనమగు గాక !

ఓ సర్వశక్తి స్వరూపా ! సర్వాంతర్యామీ !

హే భగవాన్ ! ఈ ఖండమైన శ్వాస, నీ అఖండమైన,

పూర్ణ శ్వాసలో ఏకమై నిర్వికల్పము ననుభవించు గాక !

లోకాస్సమస్తా స్సుఖినోభవంతు

ఓం ఓం ఓం !!!

( 16-2-1976 )